# రాగవైశాఖి

## శృంగార లేఖాకావ్యం

బోయి భీమన్న

ప్రథమ ముద్రణ : 1965
ద్వితీయ ముద్రణ : 1994

హక్కులు రచయితవి

వెల : రూ. 110/-

ప్రతులకు :

1. **భీమన్న సాహితీ నిధి**
ఐ.సి. 85,
ఇర్రం మంజిల్ కాలనీ,
హైదరాబాద్ - 482.

2. **విశాలాంధ్ర పబ్లికేషన్స్**
విజ్ఞాన భవన్, బ్యాంక్ స్ట్రీట్,
అబిడ్స్, హైదరాబాద్.

ముద్రణ :
**పద్మావతీ ఆర్ట్ ప్రింటర్స్,**
1-1-517/బి/1,
న్యూ బాకారం, గాంధీనగర్,
హైదరాబాద్ - 380.
ఫోన్లు : 611413, 600547.

# రాగ వైశాఖి

## శృంగార లేఖా కావ్యం

## రాగవీచిక

''ప్రింటింగుకు ఒక పదిహేను వందలు ఖర్చయ్యే పుస్తకం ఏదైనా ప్రెస్సులో ఇచ్చేయండి!''

ఇది బాపురెడ్డి గారి లేఖ – విశాఖ నుంచి.

లేఖ చూసుకొన్న వెంటనే రాగవైశాఖి వ్రాత ప్రతిని ప్రెస్సులో ఇచ్చేశాను – పదిహేను వందలలో కాదని తెలిసినా, అదనంగా ఎంతైతే అంత సొంతం పెట్టుకొందామన్న ధీమాతో.

''సొంత లాభం కొంత మానుకు పొరుగు వాడికి తోడు పడవోయ్!'' అన్న గురజాడ మహాకవి నిర్దేశానికి సాక్షాత్తు ప్రత్యక్ష నిదర్శనం బాపురెడ్డి. తానూ కవే. తన కావ్యాన్ని ప్రింటు చేద్దామన్న పట్టాభిరామరెడ్డి గారితో భీమన్న గారి కావ్య మేదైనా ప్రింటు చేద్దాం అని చెప్పి, ఒప్పించి నాకు లేఖ వ్రాశాడు బాపురెడ్డి.

కోటు పట్టాభిరామ రెడ్డి విశాఖలో ఇంజనీరు కాంట్రాక్టరు. బాపురెడ్డికి మిత్రుడు. బాపురెడ్డి లాగే ఉదార చరిత్రుడు. ఉన్నంతలో పొరుగు వాళ్ళకు, ముఖ్యంగా మిత్రులకు, తోడ్పడడమే జీవిత లక్ష్యంగా కలవాడు.

ఆ విధంగా ప్రింటయిన ప్రణయ కావ్యం రాగవైశాఖి. ఇందుకు సంబంధించిన వివరాలు నా జీవిత చరిత్రలో చూడవచ్చు.

రాగవైశాఖి ఒక ప్రణయ లేఖా కావ్యం. అక్కడక్కడ పద్యాలూ, గేయాలతో కూడిన వచన కావ్యం. ఇది కోటు పట్టాభిరామరెడ్డిగారికే అంకితం చేశాను.

"He got something to give us" అన్నారట పట్టాభి రామరెడ్డి గారు బాపురెడ్డితో – ఈ కావ్యం చదివిన తరువాత.

పట్టాభిరామరెడ్డి గారిని గురించీ, ఆయన వంశ విశిష్టతను గురించీ, నెల్లూరు జిల్లా లోని ఆయన స్వస్థలమైన సంగం గురించీ ''కావ్య కల్యాణం'' అనే శీర్షిక క్రింద అంకిత చరిత్రలో వర్ణించడం జరిగింది.

## ప్రణయ లేఖల సంపుటి

ఒక అమ్మాయి, ఒక అబ్బాయి. వాళ్ళు ఏదో ఒక సందర్భంలో కలుసుకున్నప్పుడు, ఒకళ్ళ పట్ల ఒకళ్ళకు ఇష్టత ఏర్పడింది. అప్పటి నుంచీ తరచు కలుసుకొనేవాళ్ళు. ఇష్టత ప్రణయంగా వికసించింది. వాళ్ళు తరచు కలుసుకొంటూ వున్నప్పటికీ, ఒకరి కొకరు లేఖలు కూడా వ్రాసుకొనేవాళ్ళు. అవి ఎన్నో జీవిత విషయాలపై చర్చలుగా వుండేవి. ఆ లేఖల సముదాయమే ఈ కావ్యం. అందుకే దీనిని శృంగార లేఖా కావ్యం అన్నాను. ప్రణయ సౌందర్యాల విన్యాసమే శృంగారం కదా!

కళను కళగానే చూడాలి. దానికి వైయక్తిక రాగ ద్వేషాలను ఆపాదించకూడదు. వైయక్తికత వుండదని కాదు – అది విశ్వజనీనంగా వుంటుంది.

రాగవైశాఖిని నేను ప్రారంభించింది 1960లో. తరువాత కొన్ని అసూయలూ, అపోహలూ వల్ల దాని వ్రాత ప్రతి ఒకసారి పోతే మళ్ళీ వ్రాయడం, రెండోసారి పోతే కూడ మళ్ళీ వ్రాయడం జరిగింది. మూడోసారి పోకుండా జాగ్రత్తపడి బెంగుళూరు వెళ్ళి, అక్కడి లాల్ బాగ్ గార్డెన్స్‌లో ఒక నెల రోజుల పాటు కూర్చుని, పూర్తి చేయడం జరిగింది దీన్ని.

అప్పటి నుంచీ ఈ కావ్యం వ్రాతప్రతి లోనే ఎంతోమంది మిత్రులు చదివారు. ప్రశంసించారు. ముద్రించుమంటూ తొందర చేశారు. 1965లో బాపురెడ్డిగారి లేఖ అందే నాటికి ఉన్న పరిస్థితి అది.

ఈలోగా ఈ కావ్యం వ్రాతప్రతికి సోదరి లలిత కొన్ని నకళ్ళు తీసిపెట్టింది. వాటిని జాగ్రత్తగా భద్రపరచడం కూడా జరిగింది. నా కావ్యాలు చాలా వాటికి లలితే నకళ్ళు తీసి పెడుతూ వుండేది.

దీనితో పాటు అదే కాలంలో ప్రారంభించి వ్రాసిన ''అనాది కొస నుంచి అనంతత్వం లోకి'' వచన కవితా సంపుటి అప్పటికే ముద్రించబడింది. ''ఆత్మా,

శరీరమా'' (క్షీరసాగరం) అన్న ఒక మహా నవల ఈనాటికీ ముద్రణ కాలేదు. ''శివాలకలు'' వచన కవితల సంపుటి మరొకటి. ఈ నాలుగు గ్రంథాలకూ మూల తత్వం ఒకటే – ప్రేమ, రసాద్వైతం.

## ప్రశస్తి, ప్రతికూలతా

రాగ వైశాఖి ముద్రణ జరిగి, గ్రంథావిష్కరణ, అంకితోత్సవం సభ నిర్వహించబడి నప్పుడు భాగ్యనగరం లోని మహా కవులూ, విద్వాంసులూ, మంత్రులూ ఎందరో మహనీయులు గ్రంథాన్ని వేనోళ్ళ కీర్తించారు. ప్రపంచ సాహిత్యం లోనే ఈ నవ కావ్యం ఉత్తమోత్తమ మైనట్టి దన్నారు. జాతీయ అంతర్జాతీయ అవార్డు లెన్నో రమణీయమైన ఈ సాహిత్యానికి రావలసి వున్నా యన్నారు.

అయితే, సభలో ఆసీనులై వున్న యువ మిత్రులలో కొందరు అసూయతో రగిలి పోయి, ఆ మర్నాటి నుంచే గ్రంథాన్ని అనేక విధాల దుయ్యబడుతూ పత్రికల కెక్కారు. గ్రంథాన్ని నిషేధించా లన్నారు. గ్రంథకర్తను అరెస్టు చెయ్యా లన్నారు. అసెంబ్లీ లోనూ, కౌన్సిలు లోనూ విమర్శోపన్యాసాలు చేయించారు. 'భారతి' వంటి సాహిత్య పత్రికలలో ఖండన సమీక్షలు వ్రాయించారు. సుమారు రెండు సంవత్సరాల పాటు సాగింది ఈ దుమారం, ఈ సాహితీ విప్లవం.

రాగవైశాఖి గ్రంథాన్ని తాము ప్రత్యేకంగా పండితుల చేత పరిశీలింప చేశామనీ, అందులో శృంగారం ఉన్నప్పటికీ తాత్విక చింతనా, సామాజిక స్పృహా చాలా ఎక్కువగా వున్నాయనీ, ఇది అనేక సమస్యలపై ప్రజలకు కనువిప్పు కలిగించేదిగా వున్నదనీ, కనుక నిషేధించ వలసిన అవసరం లేదని ఆయా పండితులు అభిప్రాయాలు వెలిబుచ్చారంటూ అప్పటి ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డిగారు అసెంబ్లీలో ఒక ప్రకటన చేశారు. ఆ మర్నాటి నుంచీ బ్రహ్మానందరెడ్డిగారినే విమర్శిస్తూ పత్రికలలో వ్రాతలు వచ్చాయి.

'అభిసారిక' సంపాదకుడు రాంషా, డి.ఆర్.కుసుమ, గిడుగు రామమూర్తి మొదలైన సాహితీ దర్శకులు రాగవైశాఖి మహోత్తమమైన రసవత్కావ్య మంటూ తిరగబడి వ్రాసేవరకూ ఆ దుమారం అలానే కొనసాగింది. ఆ తర్వాత విమర్శలు

తగ్గిపోతూ, ప్రశంసలు పెచ్చరిల్లుతూ, రాగ వైశాఖికి సాహిత్య దర్శనాలలో ఒక రసాద్వైత దర్శనంగా శాశ్వత స్థానం సమకూరింది.

అయితే, గ్రంథం నిషేధింప బడగలదేమో నన్న భయం కారణంగా ముద్రిత ప్రతులు ఎవరెవరి చేతుల్లోనో పడి అదృశ్యమై పోయాయి. తుదకు నా సొంతానికి ఒక ప్రతి గూడ లేకపోయింది. మా చెల్లెలు ద్రౌపది కిచ్చిన ప్రతిని తెప్పించుకొని, ఇప్పుడు అదే ప్రతిని పునర్ముద్రణ కోసం ప్రెస్సులో ఇచ్చాను - ఇరవై ఎనిమిది సంవత్సరాల తర్వాత.

ఈ లోగా-

## విద్వాంసుల అభిప్రాయాలు

''అద్భుతమైన, అపూర్వమైన రచన.'' "Raga Vysakhi is the book of the decade. I feel like that" అంటూ ఒక లేఖలో పేర్కొన్నారు డా. బెజవాడ గోపాలరెడ్డి గారు.

''భీమన్న సమగ్ర జీవిత తత్వాన్ని ప్రతిబింబించే రసాద్వైత దర్పణం ఈ మహాకావ్యం'' అంటూ ఆనాడు తనకిచ్చిన ప్రతి చివరి పేజీలో వ్రాసుకొన్నారు మహాకవి బాపురెడ్డిగారు.

సమకాలీన అగ్రశ్రేణి సాహితీ మహిళా రత్నాలు ఇద్దరు రాగ వైశాఖిని మెచ్చుకొన్నారు. ఆ ఇద్దరూ తెన్నేటి హేమలత, వాసిరెడ్డి సీతాదేవి గార్లు.

''రాగ వైశాఖి చదివారా? అది సర్వకాల, సర్వదేశ సుందర సాహిత్య సారం'' అంటూ సహజ కవి మల్లెమాల (సుందర రామరెడ్డి) గారు తమ వద్దకు వచ్చే ప్రతి సహృదయుడికీ చెప్తారు. ప్రతి సభలోనూ రాగ వైశాఖి పేరు స్మరిస్తారు.

''పరమజ్ఞతకు పరాకాష్ఠ రాగవైశాఖి'' అంటూ పేర్కొన్నారు ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖాధిపతి వేటూరి ఆనందమూర్తిగారు - ''యువభారతి'' వారు ప్రతి నెలా రెండవ శనివారం నిర్వహించే సాహితీ కార్యక్రమంలో ప్రసంగిస్తూ. రాగవైశాఖిపై ప్రత్యేకంగా జరిగిన సదస్సు అది,

1990 అక్టోబరులో. రాగవైశాఖి శృంగారంలో సున్నిత భావనలే కానీ పచ్చిదనం లేదన్నారు ఆనందమూర్తి గారు.

''భీమన్న రస సిద్ధుడు. అతడి జోలికి వెళ్ళకండి!'' అన్నారట కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు – తన శిష్యులతో, సదరు కాంట్రవర్సీలో తమ పాత్ర ఎలా వుండాలని అడిగి నప్పుడు.

ఈ విధంగా రాగవైశాఖి గురించి జరిగిన వాదోపవాదాలలో ఉదాహరించదగిన వాక్యాలు, వ్యాఖ్యలు అసంఖ్యాకంగా వున్నై. వీటన్నిటినీ ఇక్కడ పేర్కొంటే అది మళ్ళీ మరొక మహాకావ్యం అవుతుంది.

''రాగ వైశాఖి – ఒక పరిశీలన'' అంటూ శ్రీమతి డి.సరోజినిగారు ఒక పరిశోధక థీసిస్ వ్రాసి సెంట్రల్ యూనివర్సిటీ నుండి ఎమ్.ఫిల్. పట్టా తీసుకొన్నారు. గైడు ఆచార్య కొత్తపల్లి వీరభద్రరావు గారు. ఆచార్య వీరభద్రరావు గారికీ, ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం గారికీ రాగవైశాఖి ప్రాణ తుల్యమైన రసవత్సాహితి.

మిత్రుడు మోదుకూరి జాన్సన్ సినిమా రంగంలో అడుగుపెట్టిన మొదట్లో, తన రచనా వ్యాసంగానికి రాగ వైశాఖి లోని భాషా, శైలీ, భావాలూ తన కెంతో తోడ్పడు తున్నాయని ఆయన నాకు వ్రాసే ప్రతి ఉత్తరం లోనూ పేర్కొనేవాడు.

రాగవైశాఖి కావ్యాన్ని తమ పర్యటనలలో ఎల్లప్పుడూ తమతోనే వుంచుకొనే వారు – ఐ.ఎ.ఎస్. అధికారి ఎల్.మాలకొండయ్య గారు. ఆయన 1971 ప్రాంతంలో తూర్పు గోదావరి జిల్లా కలెక్టరుగా వున్నప్పుడూ, ఆ తర్వాత కొన్ని శాఖలకు కమీషనరుగా వున్నప్పుడూ కూడా నాకు ఎన్నో సన్మానాలు ఆయన ప్రోత్సాహంతో జరిగాయి. మా స్వగ్రామంలో 1971 డిసెంబరులో జరిగిన నా షష్టిపూర్తి మహోత్సవం కూడా అందులో ఒకటి.

మా గ్రామానికి చెందిన శెట్టి బలిజ నాయకుడు, బ్యాంకరు, భూస్వామి అయిన చిట్టూరి నరసింహం గారు – ఆ దారిన పోతున్న మా తమ్ముడు అర్జునుడ్ని ఆపి అన్నారట – ''మీ నాన్న పేరు నిలబెట్ట గలిగిన గొప్ప గ్రంథం రాశాడయ్యా భీమన్న'' అని. నరసింహం గారు ఆ కాలంలో మా నాన్నకు తరచు అప్పులు పెడుతుండే షావుకారు. ఎవరినీ మెచ్చుకొనే తత్వం కాదు. బహు గ్రంథ పాఠకు

డాయన. అటువంటి వాడు బహు పరిశీలనగా మెచ్చు కొన్నాడట రాగ వైశాఖిని.

రాగ వైశాఖిపై అసెంబ్లీలో చర్చ జరిగినప్పుడు ఎంతో మంది శాసన సభ్యులు సాహిత్య ప్రభావితు లైనారు. అందులో విశాఖ మండలానికి చెందిన పాలవెల్లిగా రొకరు. ఆయన గ్రంథాన్ని ఎక్కడో రెట్టింపు ధరకు కొనుక్కొని చాలా వరకూ కంఠస్థం చేశారు. నాకు ఆత్మీయు లైనారు.

ఇలా ఎంతో మంది - ఆనాటి సాంస్కృతిక శాఖా మంత్రి ఎమ్.ఆర్.అప్పారావు, మిత్రులు డా. ఖాను గార్లతో సహా.

ఈ రాగ వైశాఖి రచనా పరంగా ఆధునిక తెలుగు వాఙ్మయ సరళినే ఒక మలుపు తిప్పి రస రంజితం చేసిందనీ, ఎంతో మంది సినిమా రచయితలకూ, నవలా రచయితలకూ మార్గదర్శక మయిందనీ సాహితీ మిత్రు లంటుంటారు ఈ నాటికీ.

## ఎన్నో సిద్ధాంతాలు

రాగ వైశాఖి ఒక మహా కావ్య మనీ, అందులో అనేక జీవిత సిద్ధాంతాలు ప్రతిపాదించ బడి వున్నాయనీ బాపురెడ్డిగారు పేర్కొంటూ ఆనాడే ఒక మంచి పరిశోధక వ్యాసాన్ని తయారు చేశారు. పరిశీలనగా చదివితే ఒక పాతిక సిద్ధాంతా లైనా రాగవైశాఖిలో ప్రతిపాదించబడి వున్నై. అవన్నీ ప్రాథమిక సత్యాలతో కూడిన వినూత్న సిద్ధాంతాలు.

జీవితం రెండు విధాలు. ఒకటి – ఒక క్రమం అంటూ లేకుండా ఇష్టం వచ్చినట్టు సాగిపోయేది. దానిని స్వేచ్ఛా జీవితం అనవచ్చు.

రెండోది – క్రమబద్ధమైన జీవితం. ఒక సిద్ధాంతాన్ని అనుసరించి సాగుతుం దది. క్రమబద్ధ జీవితం సాంఘిక మైనట్టిది. దానిలో శాంతి భద్రత లున్నై. స్వేచ్ఛా జీవితం ప్రమాదాలతో కూడుకొన్నట్టిది. అయితే దానిలో థ్రిల్లు వుంది. సృ జనాత్మకత వుంది.

జీవితం వంటిదే కావ్యం కూడా. ఏ సిద్ధాంతానికీ కట్టుబడకుండా స్వేచ్ఛా జీవితాన్ని అనుసరించి సాగే కావ్యం సహజ సుందరంగా వుంటుంది.

సృజనాత్మకమై వుంటుంది. జీవితాన్ని సమగ్రంగా అర్థం చేసుకొన్న కవి వ్రాసిన స్వేచ్ఛా కావ్యమే నిజమైన కావ్యం.

ఒక సిద్ధాంతాన్ని ఆధారంగా చేసుకొని కొన్ని నియమ నిబంధనలకు కట్టుబడి వ్రాసే కావ్యంలో కొత్తదనం వుండదు.

రాగ వైశాఖిలో ఎన్నో సిద్ధాంతాలు ప్రతిపాదించ బడ్డాయనీ, ముఖ్యంగా రసాద్వైత సిద్ధాంతం అందులో అంతర్వాహినిగా వున్నదనీ చెప్పినప్పుడు – ఈ కావ్యం సిద్ధాంతబద్ధమైన రచనగా పరిగణించకూడదు. రచన స్వేచ్ఛగా సాగిపోతున్నప్పుడు దాని నుంచి యధాలాపంగా ఆయా సిద్ధాంతాలు పుట్టుకొచ్చా యనాలి.

రసాద్వైతం కోసమో, ఇతర సిద్ధాంతాల కోసమో లక్ష్యప్రాయంగా వ్రాసిన కావ్యం కాదిది. స్వేచ్ఛగా కావ్య సృష్టి జరుగుతున్నప్పుడు ఆ సృష్టి నుంచి ఉద్భవించి ఓజోవంతాలైన సత్యాలివి. జీవితం గురించి, కావ్యం గురించి అధ్యయనం చేసినప్పుడు ఈ తేడాలను గుర్తించ వలసి వుంది.

## పరస్పర భక్తి రసాద్వైతం

భారతీయ వేదాంత దర్శనాలలో ఆత్మకూ, పరమాత్మకూ అభేదాన్ని ప్రతిపాదించే అద్వైతం ప్రధాన మైనట్టిది. ఆత్మా, పరమాత్మా వేరు వేరు కాదనీ, ఆ రెండు తత్వాలూ ఒకటే ననీ అద్వైతం చెపుతుంది. అవి రెండూ ఒక్కటి కాదనీ, రెండూ రెండు వేరు వేరు తత్వాలనీ ద్వైతం చెపుతుంది. విశిష్టాద్వైతం, ద్వైతాద్వైతం, శుద్ధాద్వైతం మొదలైన పేర్లతో పిలువబడే వన్నీ ద్వైతంలో భాగాలే.

నేను అద్వైతంలో పుట్టి పెరిగిన వాణ్ణి. ఆత్మా, పరమాత్మా ఒక్కటే అనడంలో ఎలాంటి సందేహమూ లేదు. అవి విత్తనమూ వృక్షమూ లాంటివి. దీపమూ, వెలుగూ లాంటివి. సముద్రమూ, కెరటమూ లాంటివి. అయితే అవి రెండూ సత్యమే అవుతాయి. ఒకటి సత్యమూ, రెండోది అసత్యమూ కావు. ఈ విధమైన చింతనతో నేను అద్వైతాన్ని అంగీకరిస్తూనే, పరమాత్మతో పాటు దాని

వికాస రూపమైన ప్రకృతి కూడా, దాని అసంఖ్యాక రస భావ సౌందర్యాలు కూడా సత్యమే అనే నిర్ణయానికి వచ్చాను. అంటే నాకు పరమాత్మ ఎంత సత్యమో జీవితమూ అంతే సత్యం. కాకపోతే, ఒకటి శాశ్వతం, రెండోది తాత్కాలికం. ఒకటి స్థిరం, రెండోది అస్థిరం. అంతే!

నా రచన లన్నిటికీ జీవితానందమే ప్రాతిపదికగా వుంటున్నది కాబట్టి దాని కొక మంచి పేరు పెట్టుకోవలసిన అవసరం ఏర్పడి, దానిని రసాద్వైతం అన్నాను. నా సిద్ధాంతంలో పరమాత్మ రస స్వరూపి. రసమే పరమాత్మ. రసం అంటే ఏమిటి? రెండు ఆత్మల పరస్పరాకర్షణతో, అన్యోన్యానురాగంతో ఆర్ద్రమైన మనస్సే రసం. మనస్సు రసార్ద్ర మైనప్పుడు, అది పరమాత్మే. ఈ రసాద్వైతం కవితా స్వరూపి. జీవిత ప్రతిష్ఠ. మరీ స్పష్టంగా చెప్పాలంటే – అద్వైతం వైరాగ్య నిష్ఠం అయితే, నా రసాద్వైతం జీవిత నిష్ఠం.

మరొక్క విషయం ఇక్కడ వివరించాలి.

సమాజం నుంచి కుల మతాలను తొలగించా లనీ, నిత్యావసరాల పరంగా మానవు లంతా సమానం గానే చూడబడా లనీ, మరణానంతరం ప్రతి జీవీ పొందేది మోక్షమే ననీ (బ్రహ్మై క్యమేననీ), పునర్జన్మ సిద్ధాంతం తప్పనీ, పరమాత్మలో ఐక్యమైన ఆత్మ తిరిగి అదే వ్యక్తిత్వంతో జన్మించడం సాధ్యం కాదనీ, అన్ని మతాలకు దేవు డొకడే అనడం వాస్తవం కాదనీ, మతాలు చెప్పే దేవుడు ఒక డ్రగ్గు అనీ, ఈ డ్రగ్గును నిషేధిస్తే తప్ప సర్వమానవ సమైక్యం సాధ్యం కాదనీ నేను చెపుతూ వస్తున్నాను. ఇవి సాంఘిక, ఆర్థిక, రాజకీయ రంగాల లోని మానవుల ప్రవర్తనలకు సంబంధించిన నా భావాలు.

## సత్ చిత్ రిరంస

తాను ప్రేమించిన స్త్రీ కోసం పురుషుడూ, పురుషుడి కోసం స్త్రీ, ఎంతటి త్యాగా నికైనా సిద్ధపడే శక్తి ప్రేమకు ఎలా వచ్చింది?

కని పెంచిన తల్లి దండ్రులనూ, బ్రతుకు బహు ముఖాలుగా వికసించడానికి తోడ్పడిన తోబుట్టువులనూ ధిక్కరించి, విసర్జించి పోగల సామర్థ్యం ప్రేమకు ఎక్కడి నుంచి వచ్చింది?

ప్రకృతి పురుష ద్వంద్వ సమాస పరమాత్మ యొక్క నిరంతర రమణం నుంచి వచ్చింది. అట్టి పరమాత్మ యొక్క నిరంతర సిసృక్షే సృష్టి. సృష్టి లోని ప్రతి లవమూ ప్రకృతి పురుష తత్వ నిష్ఠమే. అదే సత్ చిత్ రిరంస. దానినే రసాద్వైతం అన్నాను.

దీనిని స్వప్రయోజక, లౌకిక, సాంసారిక నియమవాలతోనూ, కామనలతోనూ, ఉద్రేకాలతోనూ పోల్చి విమర్శించగూడదు.

ఈ రిరంసా ద్వయమే ఈ కావ్య నాయికా నాయకులు - వైశాఖీ వసంతులు.

ఈ కావ్యంలో పది అధ్యాయా లున్నై. వాటికి శ్రావణ పూర్ణిమ మొదలు వైశాఖ పూర్ణిమ వరకూ గల పూర్ణిమల పేర్లు పెట్టాను. ఇందులోని రసానంద రహస్యాన్ని రసజ్ఞులు ఆస్వాదించ గలరు.

రాగ వైశాఖి, నా తదితర కావ్య కళా శిల్పాలతో పాటు, రస భావ సౌందర్య నిష్ఠ మైనట్టిది. ఇది కేవల ఆనంద సుందర బృందావనం. పరమాత్మ లోని ఆత్మ చైతన్యం బహు ముఖాలుగా వికసించి పరిమళించే, ఫలించి రసబంధురమ్మై ప్రవహించే రామణీయకం ఇది. ఒకే భావ స్రవంతికి ఇవి రెండు శాఖలు. వాస్తవ జీవిత పరిశీలన ద్వారా వీటిని అర్థం చేసుకోవలసి వుంది.

భారతీయ వైదిక చింతనా ఫలితమైన సచ్చిదానంద తత్వాన్ని, ప్రకృతి పురుషుల నిరంతర భగవ ద్భోగ లీలా లౌల్యాన్ని రసవత్ సుందరంగా వర్ణిస్తే - అట్టి వర్ణనను అశ్లీల మంటూ గోల పెట్టిన వాళ్ళ నేమనాలి? వైరాగ్య తత్వానికీ, రాగ జీవిత సౌందర్యానికీ తేడా తెలుసుకొని సుఖ శాంతులతో బ్రతకడం నేర్చుకో మనాలి. అదే అంటున్నాను నేను ఈ రాగ వైశాఖిలో.

## ప్రస్తుతాంశం

ప్రేమకూ, సెక్సుకూ తేడా తెలియని, లోకజ్ఞత లేని కలాల వెంట వరదలుగా పొంగుతున్న ఈ నాటి కవిత్వాన్నీ, నవలలనూ, సాహిత్య విమర్శలనూ, తిలకిస్తూ కలవరం చెందుతున్న నేను - రాగ వైశాఖిని మరొక మారు ప్రజల ముందు

పెట్టాలనే తీవ్ర కాంక్షతో 28 సంవత్సరాల తర్వాత పునర్ముద్రణకు ప్రెస్సులో ఇచ్చాను.

దీని ముద్రణకు అయ్యే ఖర్చు నా తలకు మించినట్టిదనే సత్యం నాకు తెలుసు. ఈ విషయం తెలుసుకొన్న మల్లెమాల సుందర రామరెడ్డి గారు కొంత సహాయం చేస్తామన్నారు. తెలుగు యూనివర్సిటీ వారి సహాయం తప్పకుండా అందగలదన్న ధీమా వుంది.

మొదటి ముద్రణ ముఖ పత్రానికి చిత్రశిల్పి పి.ఆర్.రాజుగారు వేసిన వర్ణ చిత్రం ఆధారంగా ఫిలిం రచయిత్రి, ప్రొడ్యూసరూ అయిన శ్రీకరుణ వేయించిన ఈ ముఖ చిత్రం రసిక జనామోదం పొందగలిగినట్టిది. ఆర్టిస్టు ఏలే లక్ష్మణగారికి కృతజ్ఞతలు.

ఈ అందరికీ, ఇంకా మా ఆవిడ, హైమవతికీ, మా పోస్ట్ గ్రాడ్యుయేట్ అమ్మాయిలు విజయ పల్లవికీ, విజయేందిరకూ కూడా వాళ్ళ సహాయ సహకారాలకు అభినందనలు చెప్పవలసి ఉంది.

పద్మావతీ ఆర్ట్ ప్రింటర్స్ వారికీ, ముఖ్యంగా ప్రెస్ ప్రొప్రైటరు శ్రీనివాస్ గారికి కూడా కృతజ్ఞతలు.

– భీమన్న

# రాగ వైశాఖి

## శ్రావణి

*శ్రీ మంగళ గౌతమీ చి దమలా*
*సీమంత రత్నోదయా*
*ప్రేమారామ విహార రాగ మధుపా !*
*ప్రీమ ద్రమా సుప్రభా !*
*వ్యోమ ప్రాభవ సౌహృద ప్రణవ భా*
*వోజో మతీ ! సాహితీ*
*స్వామీ ! పూర్ణం రసైందవీ రుచిర వై*
*శాఖీ మనో వల్లభా !*

అర్థం కాలేదు కదూ పద్యం?

నా కోసం, నా గురించి, నేను వ్రాసుకొని, పాడుకొంటున్న పద్యం ఇది–నిన్ను చూచిన ఆ సాయంకాలం నుంచీ!

నేను తిరిగిన వనాలలో, గడిపిన తీరాలలో, లతలు, పక్షులు, చల్లని గాలులు, వెన్నెల తరగలు – సమస్తమూ – గొంతెత్తి పాడ గలవు ఈనాడు ఈ పద్యాన్ని, ఎప్పుడు పడితే అప్పుడు!

అంత గాఢతతో, ఉద్వేగంతో, తడవ కొక రాగంతో పాడుకొంటున్నాను దీన్ని! ప్రకృతి సమస్తానికీ కంఠస్థమై పోయిం దందుకే ఈ పద్యం!

పద్యం మళ్ళీ చదువుతున్నావు కదూ?

నీ చూపులు కింజల్కాలే అయినై!

అవి నా కళ్ళకు కాటుక అలద గల్గితే?

నా జీవిత క్షేత్రంలో శృంగార కళా దేవ్యాలయం ఈ పద్యం. ఇందులోని ప్రతి పదమూ ఒక రాగ ప్రియే, ప్రతి అక్షరమూ ఒక ప్రణయ కళే! ప్రతి స్పందనా శ్రీమ దమలా సముప లాలితమే!

రాగ ప్రణయ కళా మనోజ్ఞంగా నా చిన్నప్పటి నుంచీ నిర్మించుకొంటూ వచ్చిన ఈ దివ్యాలయంలో - తనంతట తానుగా ఆవిర్భవించి, సుప్రతిష్ఠ అయిన దేవత ఎవరో తెలుసా?

నా ఆబాల్య సమారాధ్య రాగ దేవత?

నీవు!

నా చూపులు నీపై వాలిన ఆ తొలి క్షణంలో

*రాఖీ పూర్ణిమ ఈ వరానన! శర*
*ద్రాక సుధాపాత్ర మీ*
*రేఖా చిత్రము! రాగ మోహన కళా*
*శ్రీ స్ఫూర్తి ఈ మూర్తి ! వై*
*శాఖీ సుందరి సత్య మీ రమణి ! ఏ*
*సౌఖ్యమ్మో నా కోసమై*
*లేఖా దూతికయై గడించినది ఈ*
*లేమన్! హిమానీ రమన్!*

అనుకొన్నాను - పైకొన్న రసావేశంతో!

శ్రావణ పూర్ణిమ అది!

వైశాఖ పూర్ణిమలా ఎలా కనిపించావో నాకు!

నీకు జ్ఞాపకం ఉంది కదూ - అకాశవాణి పచ్చిక బయల్లో మనం తొలిసారి కలుసుకొన్న ఆ సాయంకాలం?

బయలు నిండా పూల తోటలు

ఎన్నో గులాబీ పువ్వులు

ముళ్ళు గుచ్చుకొని నెత్తురు చిందినా లెక్క చెయ్యక, చిటారు రెమ్మపై విరిసిన పెద్ద ముద్దగులాబీని తుంచుకొని, నాట్య శ్రీ పిలుపు విని, పొదలు దాటి, పచ్చిక బయల్లో అడుగు పెట్టి -

ముఖ మెత్తి చూశాను, ఎదురుగ్గా

పాల వెన్నెలను దోసిలితో ఎత్తి ఎవరో నా ముఖం నిండా కొట్టిన ట్టయి, ఉక్కిరి బిక్కిరై పోయాను ఒక్క క్షణం!

కళ్ళు నలుపుకొని చూశాను మళ్ళీ!

ఎదురుగ్గా – నీ ముఖ చంద్రుడు!

ఆ పచ్చిక బయలే పచ్చని ఆకాశం, గులాబి గుత్తులు నక్షత్రాలు, నీ ముఖబింబం పూర్ణచంద్రుడు!

ఎంతటి మధుర భ్రాంతి!

అదీ మన తొలి కలయిక – ఆకాశవాణి పచ్చిక బయల్లో!

"ఎవరి కండీ పుష్పం?" అన్నాడు నాట్యశ్రీ – పుష్పం కేసి చూస్తూ!

"ఇంకెవరికీ?" అన్నాను నేను – నీ కేసి చూస్తూ!

నా చేతిలో పుష్పంగా విరిసింది నీ చిరునవ్వే!

అర్ధ నారీశ్వరుడు నటరాజు

నారీ నటాంశ నాట్యశ్రీ!

పురుషుడు స్త్రీ పాత్ర ధరించి, స్త్రీ ప్రకృతినే కళామూర్తిగా తీర్చిదిద్దిన ప్రతిభ అతడిది!

శకుంతలగా, సత్యభామగా, చిత్రాంగిగా, చింతామణిగా, మోహినిగా, మధురవాణిగా కనిపిస్తా డతడు నాకు – పంచెకట్టులో కూడా!

అంతటి నారీ నటాంశ కూడ అదృశ్యమై పోయిందా క్షణంలో!

నీవు – నేను!

మరేం లే దక్కడ!

నన్ను నీ వెరుగుదువు!

నిన్ను నీవు తెలుపుకొన్నావు!

వైశాఖి!

ఓహో, ఎంతటి అతిలోక మధుర నామం!

ఆశీతాంశు సమస్త క
ళాశయములు, మాధురిమలు, ఆనందమ్ముల్,
రాశీభూతముగా ఈ
వైశాఖిని చేసి పంపె వాక్పతి నాకై !
ఎంతటి జీవేశ్వర మధుర సుందర భాగ ధేయం !
ఎంతగా మురిసిపోయానో నేను !
ఎవరొ నీవు, ఎవరొ నేను
ఈ అనంత కాలములో !
ఏ వసంత రుచులు గ్రోలి
ఈ తోటను విరిసితిమో !
ఏ రసైక భావనలో
ఏ అలలమొ, ఏ కలలమొ !
రమ్యా రసరాజ్యములో
రాగ దేవతలమైతిమి !
ఎచటి దానవో నీవు !
ఎచటి వాడనో నేను !
ఓహో అని శివుడె మెచ్చ
ఒక పూజనె చేరితి మిట !
నిరంతర వసంతం నా జీవితం !
చైత్రీ సుందరం ఇంతవరకు !
వైశాఖీ సుధా మధురం ఇక మీద ఇది !
వైశాఖీ ! ప్రియసఖీ ! దేవీ !
రోహిణీ ! ఉత్తేజ కారిణీ !
రాగోజ్జ్వల రాజ్యదా ! విద్యా !
స్వాగతం ఆనంద దేవతా !

## 2

దేన్ని తెలుసుకొంటే లోకంలో మరి దేన్నీ తెలుసుకో నక్కర లేదో – ఆ పరమ జ్ఞానమే పరిపూర్ణ బ్రహ్మ.

దేన్ని చూస్తే లోకంలో మరి దేన్ని చూడనక్కర లేదో – ఆ పరమ సౌందర్యమే నీవు!

ఇప్పుడిస్తున్నై నాకు దర్శనం – సత్యం, శివం, సుందరం అన్న పదాలు తను నిజ స్వరూపంతో !

ఇంత వరకు నాకు అవి వట్టి శబ్దాలు !

ఇప్పు డవి నీ చి న్మన శ్శరీరాలు !

అవే నీవు !

నీవు తెలియకుండా నాకు అవెలా తెలుస్తై ? నీవు కనిపించకుండా అవెలా కనిపిస్తై ?

అయితే – వాటిని అసలే ఎరుగనని కాదు.

సత్యాన్ని నా తల్లిలో, శివాన్ని నా చెల్లిలో, సౌందర్యాన్ని నా సహస్రాధిక సహచరీ సహచరులలో దర్శిస్తూనే ఉన్నాను, అనుభవిస్తూనే ఉన్నాను నేను ఆబాల్యంగా.

ఆది నుంచీ ఎరుగుదును నిన్ను

అప్పుడు నా బహుముఖోపజ్ఞవు నీవు !

అప్పుడు నా చూట్టూ, నన్ను పరివేష్టించి ఉన్నావు నీవు. ఆడుతూ, పాడుతూ, నన్ను ఆకర్షిస్తూ, ఆశ్చర్య విభ్రమాలలో ముంచి వేస్తూ !

ఒకొక్క చోట ఒకొక్క అందం నీ వప్పుడు

ఒకొక్క నోట ఒకొక్క రాగం నీ వప్పుడు

అప్పుడు నీవు నాకు అనేకం.

ఆనాటి అనంతకోటి ఆనంద సుందరమూర్తులు ఏక కేంద్రం వైపు ఉపసంహరించుకొని, సర్వ కళా సమగ్ర సుభగమైన ఒకే ఒక నీవు కాగా – ఇప్పుడు నీ చుట్టూ నే నున్నాను అలముకొని !

నా కేంద్రానివి ఇప్పుడు నీవు.

ప్రకృతి రామణీయకం అంతా నీవు నా పరిధి వైనప్పటిది.

ఇప్పుడు బైట నాకే ముంది ?

నిన్ను చూచిన ఆ క్షణం నుంచీ నాకు నీ వొక్కతవే సత్యం. ప్రకృతి నీ ఛాయ.

అంతా నీవు – ఇప్పుడు నాకు.

నీ పెదవుల పై చిరునవ్వు, నీ కన్నులలో ఆ కాంతి, నీ కంఠంలో ఆ ప్రణయనాదం – నన్ను నీకు పరిధిని చేసి, నీ చుట్టూ త్రిప్పుకొంటున్నై నన్ను !

ఇదే జ్ఞానం

ఇదే సౌందర్యం

ఈ సౌందర్య జ్ఞాన సమాద్వైతమే నీవు !

నాకు నీవే విహార పరిధివి !

నాకు నీవే విశ్రాంతి కేంద్రానివి !

## 3

*మధురము నీ తలంపు, మధు*

*మాసము నీ అలరింపు, దేవి ! నీ*

*అధరము నవ్య జీవన సు*

*ధాసవ పాత్రము నాకు ; ఏ కళా*

*పథముల బోవుచుండి ఇటు*

*వచ్చెదవో – పలికించి పొమ్ము నా*

*వ్యధిత హృదంతరంగమున*

*వాడిన కిన్నెర కన్నె కోరికల్!*

ఒకరి కొకరం ఒకే సమయంలో లేఖలు వ్రాసుకోవడం ఎంతటి సమైశ్వర్యం! క్రొత్తవాళ్ళం కాం మనం !

జీవన ప్రవంతికి ఎదురు బొదురు తీరాల వెంట, ఎంతదూరం నుంచి, ఎంతకాలంగా ప్రయాణం చేస్తూ వస్తున్నామో మనం !

ఆకస్మికంగా, ఆ సాయంకాలం అలా కలుసుకొన్నప్పుడు, ఇద్దరం ఒకేసారి దూకేశాం అందులో !

ఒకటై పోయాం ఆత్మ దాకా !

అందుకే ఈ భావైక్యత !

నాకు లాగే - ఎన్నో లేఖలు వ్రాసి చింపేశావు కదూ నీవు ?

ఆ ముక్కలు ఎక్కడ పోశావో !

అవి గులాబి మొక్కలై మొలిచి ఉంటై ఈ పాటికి !

మొగ్గలు కూడ తొడిగి ఉంటై ఈనాటికి

ఈ పువ్వులు నీ చిరునవ్వుల్లా గుబాళిస్తె

ఈ లేఖ లోని గులాబీ రేకలు అవే కావు కద !

ఎన్నిసార్లు ముద్దు పెట్టుకొన్నానో ఈ నీ లేఖను !

ఇందు లోని ప్రతి పదమూ నీ పెదవిలా ఎంత మధురంగా ఉంది !

పలు భాషల లోని రమణీయ పద జాలాన్నంతా శృంగార రసంతో ముద్ద చేసిన ముద్ద గులాబివి నీవు !

నా కోసం ప్రత్యేకంగా సర్వ రసభావ సౌందర్యాలూ, ఆనందాలూ, ఆకాంక్షలూ సమ్మిళితం చేసి సృష్టించబడ్డ పరమ రమణీ మూర్తివి నీవు !

***మృదు మధురమైన బాల్యము మొదలు నన్ను***
***నిజ హృదానంద పీఠిపై నిల్పుకొనుచు***
***ప్రియము గూర్చిన ఎల్ల పూర్ణిమలు కూడి***
***చక్క దిద్దిన పూర్ణ వైశాఖి వీవు !***

అట్టి వైశాఖీ మనో వాల్లభ్య పదవికి నీ అంగీకారం కావాలా ఏం?

నీవు అంగీకరించకపోతే !

ఏమౌతుంది ?

నా ప్రేమ నాది !

నా ఆరాధన నాది !

అందుకు ఎవరి అంగీకారమూ అక్కరలేదు.

ఆ నాడు, ఆ సాయంత్రం, ఆ పచ్చిక బయల్లో - ఆనంద వీణవై నీకు నీవుగా పలుకరించిన ఆ ప్రక్వాణ రాగ క్షణంలో -

ఆ కాకలీ స్వన తరంగాల వెంట, ఆ రమణీయ రూప కాంతుల వెంట, ఆ పరిపూర్ణ వికసిత కుముదినీ పరిమళాల వెంట – సుందర సూక్ష్మ రేఖా రమ్యమూర్తివై నీవు నా హృదయంలో ప్రవేశించిన ఆ మధుర క్షణం నుంచీ – నీవు నా దానవే !

నీ అంగీకారం శరీరం వరకే !

నా ఆరాధన అంతకు మించిన ఆత్మస్థాయి కలది !

పరమాత్మీయ పారాలను చేరిన ఆత్మోపరతి అది !

పూజిస్తున్నా నందుకే తన్మయతతో – నా హృదయ పీఠస్థమై భాసించే నీ సర్వాంగీణ గీర్వాణ సుందరమూర్తిని !

*లావణ్యమ్ముల రాశి, హాసముల ప్రో*
*ల్లాసమ్ము, ఉద్వేగ లీ*
*లా విద్యుత్తు, వినీల కుంతల సమా*
*హ్లాదమ్ము, ఆ జీవనో*
*జ్జీవానందము, తన్మయీభవ గుళు*
*చ్ఛీభూత రూపచ్ఛటల్ !*
*ఈ వైశాఖిని మించు రాగలత లే*
*దీరేడు లోకమ్ములన్ !*

అంటూ పాడుకొంటున్నా నందుకే !

ఈ రాగలత పల్లవించి, పుష్పించి, ఫలించి – నాకు ప్రేయో మధురామూ, లోకానికి శ్రేయో మధురమూ కాగలిగితే !

## 4

వైశాఖీ !

నీ వొక పరమ అనుభూతివి నాకు !

కృష్ణభావంతో రాధ నూహించుకొని – రాధా విహార విపినే రమ తాం మనోమే అని పాడుకొంటూ – గోదావరీ తీర విపినాలలో తిరిగే వాణ్ణి నేను బాల్యంలో.

గంగకు ఉపనది యమున
గోదావరికి శాఖ వైనతేయం

కృష్ణుడు పశులకాపరి, నేనూ పశులకాపరినే చిన్నప్పుడు.

అతడిది యమునా తీరంలో బృందావనం. నాది వైనతేయ తీరంలో రసాల వనం.

కృష్ణ మంత్రాధి దేవత రాధ !

రాధ కృష్ణుడిది.

కృష్ణ భావం నా కెందు కిప్పుడు?

స్వభావం లేనప్పుడు

దృష్టితో చూచినప్పుడు నేనే కృష్ణుడి ననుకోవడంలో విప్రతిపత్తి ఉండకపోవచ్చు.

అయినా -

కృష్ణుడు ఒక వ్యక్తి. రాధ ఒక వ్యక్తి.

నే నొక వ్యక్తిని. నీ వొక వ్యక్తివి.

రాధ కృష్ణుడిది

వైశాఖి నాది.

నేనూ, కృష్ణుడూ ఒక్కటే అయినప్పుడు - నీవూ, రాధా ఒక్కటే కాదా?

వ్యక్తినీ, వ్యక్తి యొక్క అనుభూతినీ నిరూపించి చూపడం కోసమే ఈ పోలిక.

నేను కృష్ణుణ్ణీ కాను. నీవు రాధవూ కావు .

నేను నేనే. నీవు నీవే !

అనుభూతి ఎక్కడా ఒక్కటే. దేశ కాల పాత్రానుగుణంగా అభివ్యక్త మవుతుం దది.

మేఘమూ అదే . వర్షమూ అదే . నదీ సరోవరాది రూపాలు మాత్రం అనంతం.

పురుషుడూ అదే. ప్రకృతీ అదే -

ఈ సహస్రాధిక చరాచర సుందర లీలామూర్తులు నీవు !

నీ కరాపచిత పల్లవ వల్లరులలో, నీ పదాంక విలసన్మధుర స్థలాలలో, నీ యశో ముఖర మత్త ఖగావళులలో, నీ విహార సుందర విపిన వనాలలో, నీతో చెలికారమున్న ప్రతి చోటా, ప్రతి క్షణమూ రమిస్తూనే ఉంటుంది నా మనస్సు నిరంతరంగా.

ఆనంద పారమ్యం నీవు నాకు !

రాగ వైశాఖివై నీవు రాగానే -

పూర్ణ వసంతుణ్ణై నిల్చాను నే నిప్పుడు - ఈ రసాల వనంలో ! ఈ వైనతేయ తీరంలో !

## 5

*బైట సృష్టిలో, లోపల భావమందు*

*వెలయు పరమ పదార్థ వైవిధ్య మెల్ల*

*ఎదద గొనివచ్చి నీ పూజ నిడితి, దేవి !*

*స్వీకరింపుము నను ధన్యు జేయు కొరకు !*

విశ్వం లోని సకల సౌందర్యాలను, సకల మాధుర్యాలను, సకల తేజస్సులను, అమృతాన్ని, ఆనందాన్ని, ఆత్మను - యావత్స్వవంవదనూ సమర్పించేశాను నీకు ఆ తొలి చూపు లోనే.

తొలిచూపు జన్మాంతర సంస్కార చిత్త ప్రవృత్తి జన్యం

మలిచూపు మేధా విలాస విన్యసితం.

అందుకే -

తొలిచూపుది ప్రేమ

మలి చూపుది లోకజ్ఞత.

అందుకే -

క్రొత్తవాళ్ళం కాం మనం !

తొలిసారిగా అల్లంత దూరంలో పరస్పరం చూచుకోగానే, చిరకాలంగా విరహంతో కాలిపోతున్న వాళ్ళం వలె, ఒరిగిపోయాం ఒకరి ఒడిలో ఒకరం ఆత్మికంగా !

నా ప్రణయ పీఠం కోసం అంతవరకు - నేను నే నంటూ - పోటీలు పడుతున్న అసంఖ్యాక సుందర తారామూర్తులు - అరుణోదయంలో వలె - అదృశ్యమై పోయారు నీ రాకతో !

*నీ రాక పూర్ణ వసంత జీవన రాక నాకు !*
*ఒక్క కొమ్మను మించి మరొక్క కొమ్మ*
*రాగ మధురము, పుష్ప భరాలసమ్ము ;*
*రంభ నొకదాని మించి ఊర్వశి ఒకర్తు*
*భువన మోహిని, ఆనంద పూర్ణ కలశి !*

కొమ్మలు-రకరకాల అందమైన లేత, చిగురు, చేవ, పూల, పండ్ల కొమ్మలు - ఊర్వశులు, దేవకన్యలు -

ఎంతో మంది చూశారు, వచ్చారు, కూర్చున్నారు, మీటారు ఇక్కడ, ఈ నా హృదయ వీణను !

ఎన్నడూ ఇంత రాగ లలితంగా, లలిత మధురంగా, మధుర మోహనంగా స్పందించ లే దిది !

నీ చూపుల చిరునవ్వుల్లో చక్కిలిగింతలు పొంది కిలకిల్లాడి పోయిం దిది!

నీ ఆగమ వసంత సౌరభమే దీనికి నవ చైతన్యం అయింది.

మోదుగు మొగ్గల్లాంటి నీ మునివ్రేళ్ళు సోకీ సోకడంతోనే వెల్లి విరిసింది ఆనంద కంఠంతో.

వేయి కోయిళ్ళు ఒక్కసారి అందుకొన్నై స్వాగత గీతం నీకు.

క్రొత్త రాగాలు మెరుపు తీగల్లా నా శరీరం నిండా ప్రాకి, అనుభూతుల్ని పూచి, ఆనందంతో నింపేశై క్షణంలో.

దర్శన మాత్రం లోనే ద్రవింపజేసి, స్పర్శన మాత్రం లోనే అమృత గాన గోదావరిని వరద పొంగించిన రాగలక్ష్మివి నీవు !

సర్వ లాలిత్యాలూ, లాలసలూ, మృదుత్వాలూ, మాధురులూ, వ్రేళ్ళ కొసల దాకా కుట్మలించి స్వాగతం చెపుతున్నై నా ఆత్మకు నీ స్పర్శా స్ఫూర్తిలో !

పంచ ప్రాణాలూ, సహస్రాధిక నాడులూ తంత్రులుగా పట్టి పలికిస్తున్నావు నీవు నా హృదయాన్ని !

పలుకుతున్నాను నేను ప్రతి అణువునూ నీకు శ్రుతి చేసుకొని !

నిరంతరంగా పలికించు నన్ను !

పలకనీ నన్ను నీ ప్రతి భావానికీ రాగం మార్చుకొంటూ, ప్రతి రాగానికీ ప్రాణం కూర్చుకొంటు!

నిన్ను చూచి, సరస్వతిని చూశాను నేను వీణా మండలంలో !
ఆమె నా దోసిట్లోకి విసిరివేసిన ఆపాతమాధుర్యానివి నీవు
ఆలోచనామృతానివి నీవు
వరంగా వచ్చావు నీవు
స్వరంలా ప్రవేశించావు గుండెల్లో
మ్రోయించు అనురాగ రాగాలను !
పలికించు వీణా వైణిక భేదం అదృశ్యమై పోయేదాకా !
నాద బ్రహ్మనే అయేదాకా !
*మూగ వీణను నేను*
*రాగ తాళము నీవు*
*నన్ను నిన్నుస గూర్చ*
*నటరాజు రా నేల ?*
*అందెలను గట్టనేల? మన పైని*
*చిందులను ద్రొక్కనేల ?*

## 6

ఎప్పుడో చూచినట్టే ఉంది నాకీ ప్రదేశం !

అర్ధచంద్రుడికి ముత్యాల గొడుగు పట్టిన ఆ శ్రావణమేఘ శలాక !

ఆ ముందర – విల్లెక్కుపెట్టి, పడమటి కొండల్లో మరుగై పోతున్న పంచ బాణుడు !

ఆ క్రింద – వికసిస్తూ, ముకుళిస్తూ ఉన్న నీలోత్పలాలు, రాజీవాలు !

సంజ చీకటిలో మునిగి, వెన్నెలలో తల లారబోసుకొంటున్న కొబ్బరి మొక్క తోటలు !

చీకటిమూసలో కరిగి పొంగిపడుతున్న ఆ వెండి వెన్నెల మనోజ్ఞ జలపాతం.

నురుగులు గ్రక్కుతున్న ఆ సరస్సు !

సరస్సు నుంచి దూకి, గిరిద్వయం మధ్యగా ఒరసి, క్రిందికి ప్రవహిస్తున్న ఆ కొండవాగు !

వాగుకు ఇరుప్రక్కలా ఆ నిమ్మ, నారింజ, అరటి, చెరకు, మామిడి, పనస, అనాస, దానిమ్మ, పోక తోటలు !

నిద్రలో మేల్కొంటున్న ఆ శుక శారికాదులు !

మెలకువలో నిద్రిస్తున్న ఆ కృష్ణైకాదశీ చంద్ర కళలు !

ఎప్పుడో, ఎక్కడో – అనుభవించినట్టే ఉంది నాకు ఈ అందం అంతా ! ఈ ఆనంద రాజ్యం అంతా !

అవును !

నాకు తెలుసు ఈ ప్రాంతం అంతా – ఇక్కడి ప్రతి అణువూ, ప్రతి అంశమూ, ప్రతి అందమూ !

ఇక్కడి ప్రతి తృణమూ నేను త్రొక్కినదే, ప్రతి పువ్వూ నేను వాసన చూచినదే, ప్రతి పాటా నేను విన్నదే, ప్రతి సరస్సూ నేను ఈత కొట్టినదే !

ఇక్కడి ప్రతి రుచీ నా అనుభవం లోదే !

అయితే –

ఎప్పుడు చూశాను దీన్ని?

ఎప్పుడు, ఎక్కడ అనుభవించాను ఇదంతా ?

జ్ఞాపకం లేదు !

బహుశా – ఈ జన్మలో అయి ఉండదు !

వైనతేయ తీరంలో అమలాదేవి ఒడిలోని నా రసాలిని – కామరూపంలో – ఇక్కడ ఆవిర్భవించ లేదు కదా నా కోసం !

అయి ఉండదు.

జ్ఞాన యుగం లోని అద్భుతాలు విజ్ఞాన యుగంలో సాధ్యం కావు.

జ్ఞానం ఆనందం తోడిది

విజ్ఞానం ఆహారం తోడిది

ఈ ప్రాంతం ఆనంద విక్రీడితం

ఈ సౌందర్యం సనాతనం

ఏ జన్మలో చూశానో దీన్ని !

ఏ ప్రవృత్తిలో అనుభవించానో దీన్ని !

ఏ రూపంలో రమించానో ఈ సుందర సుమనోంతఃపుర రాగ మనో రమలతో !

ఈ పరిచయం ఇప్పటిది కాదు !

కాని –

ఇంత కొత్తగా అలరిస్తున్న దేమిటి నన్ను !

కాక –

నే నెరిగిన నీ సౌందర్యమే – సూర్యకాంతి ప్రిజం నుంచి వలె – నా స్మృతి పథం నుంచి వెలువడి, ఈ మోహనరాంగ లీలను ప్రదర్శిస్తున్నదేమో నా ముందు !

ఎక్కడైనా, ఎప్పుడైనా, ఏ సౌందర్యమైనా అంతేకద !

నిన్నెరిగిన తర్వాత, ఎరగని దేముంటుం దీ సృష్టిలో ?

నీవు తెలిస్తే – సమస్తమూ తెలిసిందే !

నీవు సనాతన జీవన ధర్మధారవు నాలో !

నా చుట్టూ గల ఈ సౌందర్య విలసనం అంతా – నీ ధారాపాత వినిర్గత సుధాతుషార లీలా వికసనమే !

నీవు నాకు చిరపరిచితవు

కనుకనే –

ఈ సృష్టి సమస్తమూ నాకు చిరపరిచితం !

ఇంత దూరమూ నీ శ్రీధామం !

ఇంత దివ్యమా నీ విహార భూమి !

## 7

*వేయకురా – చేయి వీణపై !*

*తీయకురా – ముసుగు నిదురపై !*

*నర నరాలలో*

*నవ రాగాగ్నులు*

*రగిలించకురా !*

*రాజ వైణికా !*

*బిగువు సడలెరా*

*రగిలిన గుండె !*

*పగిలే స్థాయిని*

*పలికించకురా !*

*విరహాగ్నికి నీ*

*వ్రేళుల కొనలే*

*సమిధలు గా నను*

*స్వాహించకురా !*

*కోయిల పాటకు*

*కొండ వాగునకు*

*నాద బ్రహ్మకె*

*నను శ్రుతి చేతువా !*

*పాడలేనా నీ*

*పరమ స్థాయిని !*

*ఉండిపోదు నీ*

*ఉరమున వ్రాలి !*

ఓహో !

మేఘాల మధ్య నుంచి మెరుపు తీగ వలె, సౌధోపరి తలం నుంచి ఎక్కడి దా గాన రస తరంగిణి !

కంఠం నీదే

రాగం నీదే

పాట నాది !

మొన్న ఏదో పత్రికలో ప్రకటించిన నా పాట కదూ అది ?

ఎంత ధన్యుణ్ణి నేను !

ఈ నాడు పాటలు వ్రాయలేని తెలుగువాడే లేడు కదా !

మరి నా పాటే ఎందుకు పాడుతున్నావో నీవు !

ఎంతో కాలంగా నా పాటలే పాడుకొంటున్నావు కదూ !

నే నెవరో తెలియని నాటి నుంచీ కూడ !

ఇది కదా జన్మాంతర ప్రణయవాసనా సుశ్రీ !

ఏమీ తోచక, నిద్రపట్టక, నీ నామజపం చేసుకొంటూ, ఈ అర్ధరాత్రి, ఇంతదూరం నడిచి వచ్చినందుకు – ఎంతటి మధురామృతం లభించింది నాకు !

నీ కంఠంలో కరిగిపోతున్న దది పాట కాదు – నేనే !

హిందోళ రాగంలో నీవు విసిరిన ఆ గానతరంగిణి – ఆనందాందోళికలో తీసుకుపోయింది నన్ను – ఎక్కడికో – నీ హృదయాంతః పురం లోకి !

పరమ పారవశ్యం లోకి !

## 8

ఓహో – ఏమి టివన్నీ !

ఫొటోలు ! ఫొటోలు ! ఫొటోలు !

ఎన్ని ఫొటోలు ! ఎన్ని పోజులు ! ఎన్ని రంగులు ! ఎన్ని రకాలు !

నా గది నీ ఫోటోలతో నిండి, ఒక యువతీ కళాశాలే అయింది !

ఎందుకు పంపించావు వీ టన్నిటినీ ?

ఇందులో దే న్నని ఎంచుకోను ?

తరచు కలుసుకోలేం కనుక, ఒక వారం రోజుల పాటు మా ఊరికి పోయి రావలసి ఉంది కనుక, నీ ఫోటో ఒకటి పంపించు మన్నందుకా నాకీ ఎన్నిక కార్యక్రమం ?

సరే !

ఫొటోల రాశి పైకి దూకింది నా దృష్టి–ధాన్యరాశి పైకి కోడిపుంజు వలె !

ప్రకృతి లోని రసాలూ, రుచులూ అన్నీ కలిసిన సహజ సౌందర్య రాశివి నీవు.

ఈ ఫొటోలు ఎంతటి అమూల్య రత్నాలైనా, నీ అనుకృతులే.

నీవు ఎదుట ఉండగా, నీ ప్రతిమ నాకెందుకు ?

నీవు లోనికి వచ్చిన తర్వాత కూడ, నిన్ను బైటే వెతుకొంటున్నా నేమిటి ?

లోపల నిరీక్షిస్తున్నావు నీవు నా కోసం
నే నింకా బైటే కూర్చున్నాను నీ కోసం !
మానవ స్వభావం ఇంకా ఎంత చీకట్లో దేవులాడుతున్నది !
సరే –
నాకు కావలసిం దొక్క ఫొటో.
ఈ మహారాశిలో ఏ ఒక్కటైనా నీదే కద !
మరి – ఇలా వెతుకుతున్నా నేమిటి !
అవివేకమా ?
నీ సంపూర్ణ సుందరమూర్తి కోసం ప్రయత్నమా !

విద్యుత్తు నుంచి కాంతిని వలె నీ నుంచి ఎంతటి సౌందర్యమైనా పొందవచ్చు.

నిన్ను నిన్నే పొందాలని నా ఆశ !
అందుకే ఈ యజ్ఞం !
కెమెరాకు జీవమే లేదు. జ్ఞాన మెక్కడిది?
అది నిన్నెలా పట్టగలదు ?
కేవల నిర్జీవ సమాజం లాంటి దది !
నీ సౌందర్య ధగద్ధగలకు అది ప్రేలి ముక్కలై పోదా ?
నీ వాస్తవ రూపం లోని సహస్రాంశ కూడ ఇందులో ఏ ఫొటోకి రాలేదు!

గులాబీ మల్లె కాదు, మల్కెల మధుప్రియ కాదు, మధుప్రియ మలయ మారుతం కాదు.

ఈ ప్రకృతి నిండా అందాలే. దేని అందం దానిది.

అన్ని అందాలూ కలిసిన ఒక సమగ్ర సంపూర్ణ సౌందర్యం ఒక్కచోట ఎలా సాధ్యం ?

కొన్ని అందాలు దూరానికి బాగుంటై
కొన్ని దగ్గరగా బాగుంటై
కొన్ని నిజమైన అందాలు కెమెరాకు అందవు
కొన్ని సహజ వికారాలు ఫొటోలో కనిపించవు

కెమెరాది కోణ దృష్టి !

దర్శన, స్పర్శన, ఆస్వాదన, ఆరాధన యోగ్యమైన అందమే అందం నిజంగా.

సంపూర్ణమూ, సమగ్రమూ అయిన అందం నీది !

నీ చిత్తం, నీ మనస్సు, నీ హృదయం, నీ హక్కు, నీ శరీరం – నీ ప్రతి అణువూ, దాని ప్రతి కదలికా ఒక అందమే.

నీ చుట్టూ అందాలు

నీ నిండా అందాలు

అందాల రాశివి నీవు.

ఒక్క అందాన్ని మాత్రం పట్టి చూపగల ఒక్క ఫొటోలో నీ సమస్త సౌందర్యాలను కోరుతున్నాను కదూ నేను ?

వట్టి అవివేకం !

ఏదో ఒక్క అందంతో తృప్తి పడని నావంటి వాళ్ళకు శ్రమ తప్ప సుఖం లేదు. ఆవేదన తప్ప ఆనందం లేదు.

ఇప్పుడేమిటి చెయ్యడం ?

నిన్నే ఒక ప్రతిమగా మార్చి, జేబులో పెట్టుకోనా ?

అప్పుడు నీ వుండవే !

నీవు లేని నాకు నీ బొమ్మ ఎందుకు ?

ఒక్క ఫొటో ఎంచుకోడానికి ఇంత రాద్ధాంతమా – అంటావు కదూ ?

ఫొటో నీ లోని ఒక్క అంశానికి అనుకృతి.

నాకు కావలసింది నీ మొత్తానికి సమ్యక్కృతి !

*మానవ జీవిత మూహా*

*గానం కంటే చిక్కన !*

*మానవ హృదయం కవితా*

*గానం కంటే చక్కన !*

*చిత్తంలో ప్రతి దెబ్బా*

*సుత్తి దెబ్బగా మలచిన*

మానవ మూర్తిని మించి
మహిత శిల్ప మేమున్నది ?
ఏల నాకు చిత్రాలు ?
ఏలా నా కజంతాలు ?
వెన్నెలలో విహరించే
నిన్ను మించి కళ కలదా ?

## 9

వెల్లి విరిసి, విను వీధు లొరిసి ప్రవహిస్తున్నది వైనతేయం !

ఈ మధుశిలపై కూర్చుని, ప్రవాహంలో కాళ్ళాడించు కొంటూ, ఇలా ఎన్ని నిశీధాలు గడిపానో నేను – నా బాల్యం నుంచీ !

పైని – పాలవెల్లి పొంగిన స్వర్ణది !
క్రింద – గోదావరి వరదలో వైనతేయం !
పైని – గోలోకం, రాధ, కృష్ణుడు
క్రింద – తోటలు, పొలాలు, నీవు, నేను !
నా హృదయంలో నీవు !
వీణా మండలం నుంచి ఏదో నాదం !
నా హృదయంలో నుంచి ఏదో గానం !
శ్రావణ నిశీధం !
ఎందుకో మేఘం పట్టలేదు !
పరమేశ్వరి కద్దా గోదావరి !

అనంత రూపాలతో అలరిస్తున్నది – పరమేశ్వరుడైన ఆంధ్ర సాగరుణ్ణి !

అతడు ఆనంద హృదయంతో అందరికీ అన్ని చేతులు చాచి, ఆలింగనం చేసుకొంటున్నాడు, ఆత్మైక్యం ప్రసాదిస్తున్నాడు, అనుక్షణం.

గౌతమి, వసిష్ఠ, ఆ మధ్యలో వైనతేయం – ఈ నదీమూర్తులు ముగ్గురూ నా ఆరాధ్య దేవతలే !

ఆ మధ్యస్థ లంక భూములన్నీ నా విహార వనాలే.

అమలాదేవి కరుణా కటాక్ష భాగధేయాలు ఇవన్నీ

వాటన్నిటి సారభూతమే ఈ నా రసాల వనం.

ఈ వనంలో లేని పుష్పలతలు, ఫలవృక్షాలు, విహంగాలు, సరోవరాలు, సౌందర్యసీమలు మరెక్కడా లేవు లోకంలో.

ఋతుకాంత లారుగురూ కలిసి నర్తిస్తూ ఉంటా రిక్కడ సర్వకాలాల్లోనూ.

నే నొక్కణ్ణీ అనుభవించలేను ఈ సౌందర్యం అంతా !

ఎన్నో రూపాలతో ఎన్నో మాధుర్యాలను ఆస్వాదింప జేస్తూ, రాగలీలవై నన్ను చిన్నప్పటి నుంచీ రంజిస్తున్న వనలక్ష్మివే నీవు !

నా తోట లోని ప్రతి పల్లవమూ, ప్రతి పుష్పమూ, ప్రతి ఫలమూ, ప్రతి మెరుపూ, ప్రతి రుచీ, ప్రతి రవమూ నీ శ్రీపాద రేణు పరిమళ సుభగమే.

ఈ తీర వాసినివే నీవు

నా ఆబాల్య సఖివే నీవు

ఇప్పుడు కూడ ఫొటోగా నా జేబులో, దేవతగా నా హృదయంలో ఉన్నావు నీవు నాతో.

అయినా –

నీ శ్రీధామం భాగ్యనగరంలో !

నా రసాలిని కోనసీమలో !

ఇంతవరకు నీవు నా ఊహవు, వాంఛవు, ప్రకృతి సౌందర్య రాగదేవతవు.

నా కల లన్నీ కళా రూపం దాల్చిన పరమ సుందర వైశాఖివి ఇప్పుడు నీవు !

నీవు వేరు, నేను వేరు ఇప్పుడు !

నా నుంచి విడిపోయిన నేనే నీవు !

నిజానికి మన మధ్య దూరం ఇప్పు డనంతం !

నా సుందర స్వప్నదేవతవు కా విప్పుడు నీవు. ఒక ప్రత్యేక వ్యక్తిత్వం గల మానవ కాంతవు.

మానవ కాంతల కంటే దేవ కాంతలే ప్రణయ సులభలు !

అందుకే ఈ వియోగ దుఃఖం.

శ్రావణ నిశీథమే వైశాఖ మధ్యాహ్నంలా వేగిపోతున్నది !

ఈ విరహాగ్ని ఒక దుర్భరం !

ఇలా ఎంతకాలం ఉండగల నిక్కడ ?

నీ లేఖ అందింది.

అది మరీ అగ్గిపై గుగ్గిలం చల్లింది !

*ఈ కళా మధురానంద లోక మందు*

*నేను చూడని సౌందర్య మేది లేదు ;*

*కాని, నిను చూచినప్పుడె కలిగె నాకు*

*కన్నులకు కాంతి, గనమున కస్మితయును !*

## 10

కన్యాకుమారిలా, ఆ చివర నీవు

హిమవంతుడిలా, ఈ చివర నేను

అంతర్వాహిని అయిన మన ప్రణయ సరస్వతిలో నీ పాద పద్మాల పసుపు పారాణి పరిమళాలు !

నా పాదాలకు ఏత తృహవాస వాసనా వైభవం !

పాదాలతో పాదాలు కలిసి నప్పుడెల్ల, తను లతలపై రాగాంకురాలు మొగ్గ దొడుగుతున్నె !

అవి ముద్ద గులాబీల మొగ్గలై, నిక్కి చూస్తున్నె పైకి మన చేతుల కేసి !

కాళ్ళ దగ్గర కలిసే ఉన్నాం మనం. శరీరాలకే ఈ ఎడబాటు !

అటు నీవు – ఇటు నేను !

ఈ మధ్య దూరం అనంతం

ఆటంకాలు అసంఖ్యాకం

కలవ నివ్వదు లోకం మనల్ని ముఖాల దగ్గర !

ఈ వికాసం, ఈ కాంతి అంతా ఎక్కడిదో దానికేం తెలుసు ?

మన పాదాలు కనిపించవు దానికి !

నీ పాదాలను నా కాళ్ళతో నొక్కే కొలదీ అలా మైకంలో పడిపోతున్నావేమిటి నీవు ?

నీ మైకమే నేను

నా జాగృతిని నీవు

మన మధ్యది ఈ లోకం !

ఈ లోక వ్యవహార మట్టానికి దిగువ – మన పాదాలు మనకే కనిపించడం లేదు !

ఎంతటి స్పర్శా సుఖం !

ఆ సుఖమే ఈ వసంతాలకు మూల బీజం.

తెలీదు లోకానికి మన సంగతి !

మనల్ని విడదీసి ఉంచా ననుకొంటున్న దది.

మనం కలిసే ఉన్నాం పాదాల దగ్గర – పాలకడలి లోతుల్లో !

లక్ష్మీ సరస్వతులు నాకు నీ పాద పద్మాలు

వాటికి సేవా మందిరాలు నా హస్త కమలాలు

నా హస్త కమల సంపుటిలో లక్ష్మీ సరస్వతులు !

నా గుండెలపై తాండవించాలి ఈ జంట !

లక్ష్మిని గుండెల మీదే ఉంచు !

నా జిహ్వాగ్రం వరకూ రానీ సరస్వతిని !

ఇక మేలుకో మైకం నుంచి !

తిరుగు ఇటుకేసి !

ఎంత కాలం ఈ దూరం ?

ఎంత దూరం ఈ కాలం ?

# 11

*పిచ్చివాడ నైతిని !*

*ప్రేమ కామినై, నీకై !*

ఒక్క పిచ్చివాణ్ణే కాదు - నీ కోసం ఏమైనా కాగలను నేను !

గోదావరి నుంచి నా వైనతేయాన్నే తీసుకొచ్చాను భాగ్యనగరానికి నీ కోసం!

నే నెక్కడుంటే అదే నా రసాలిని !

శివగిరి, వైనతేయం, మధుశిల, రసాలిని - అక్కడ నేను !

తూర్పున శివగిరిని ఆనుకొని ఆంజనేయుని కొండ, దాని ప్రక్కదే నీ నివాసం శ్రీధామం !

పడమట పౌరోద్యానం. ఆ ప్రక్కది ఆకాశవాణి.

ప్రతి ఉదయం ఆంజనేయుడికి కొబ్బరికాయ కొట్టి, ప్రసాదం నీ గుండె గుమ్మంలో ఉంచుతూ ఉంది నా మనస్సు.

ఆంజనేయుడు మనస్స్వరూపి. అతడికి కొట్టే కొబ్బరికాయ జగత్స్వరూపి.

ఆత్మ తపస్సులో ఉంది. హృదయం ఆరాధనలో ఉంది. మనస్సు పూజలో ఉంది. శరీరం మాత్రం నీ దర్శనం కోసం తిరుగుతూ ఉంది - వైనతేయ తీరం వెంట - నా రసాలినికీ, నీ శ్రీధామానికీ మధ్య !

ఉదయం ఉషస్సువు నీవు.

బాలసూర్యుని కర కమలాలలో నీ చరణ కమలాలు నా నమస్కృతీ కమల కలికా పరిసేవితాలు !

సాయంత్రం సంధ్యవు నీవు.

పౌరోద్యాన వృక్ష లతాదుల శిరో వేదికలపై రమ్య నృత్యం చేసే రాగలీలవు నీవు !

ఉదయం రాగ జ్యోతివి. మధ్యాహ్నం రాగ ప్రభవు. సాయంత్రం రాగ రమవు నీవు !

సమస్త విశ్వ రాగ రుచులూ రాశీభూతమై వికసించిన రాగవైశాఖివి నీవు !

అదిగో ఆకాశవాణిలో నీ వీణా వాణి !

వింటూ కూర్చున్నా నిక్కడ – ఈ మధుశిలపై, ట్రాన్సిస్టరు పెట్టుకొని !

ఇప్పుడు అహోరాత్రాలు నీవే నాకు !

పుష్పాలు, పరిమళాలు, మధువులు, ఫలాలు, నదులు, నక్షత్రాలు – విశ్వం నిండా విరిసిన ఈ సమస్త సంపదలూ – నా దృష్టికీ, భావానికీ అందిన తక్షణం – నీ పూజలో అర్పితమై పోతున్నై !

ప్రేమించాను నిన్ను
స్వీకరించావు నీవు.
ప్రేమించడమే జీవితం
ప్రేమ విజయమే జీవిత విజయం.
ఇక సాక్షాత్కరించవా, దేవీ ?

*అరవిందమ్ములు చూచునన్ భయము లే ;*
*దాశావకాశమ్ము ని*
*ద్దురలో నున్నది; ప్రేమ చంద్రు కర సిం*
*ధూరాను రాగాను షం*
*గ రుచుల్ గ్రోలి, ప్రఫుల్లవై వెలయు మిం*
*కన్ చైత్ర కాలమ్ము నీ*
*కొర కిం దాగిన, దీ క్షణమ్ము వృథ కా*
*కుండన్ ప్రమోదింపుమా !*

ఈ హృదయ నివేదన నీ మనస్సుకు అందుతున్నదో లేదో !

మామూలు లేఖలు ఎన్ని వ్రాసి ఏం లాభం ?

హృదయాన్నే లేఖగా మడిచి నీ శ్రీధామం లోకి విసిరి వేస్తున్నాను ఈసారి!

*రాగ వాంఛలు రమ్యాక్షరములు కాగ ,*
*రాగ రక్తిమ లేఖన రసము కాగ ,*

*హృదినె లేఖగ మడిచి, నీ పద సరోజ*
*సేవ నర్పింతు ! విప్పి చూచెదవొ, లేదొ !*

*చూచి, అది ఏదొ-స్వప్నవాసుల అనైజ*
*భావ రమణుల పారాణి పాద చిహ్న*
*పంకిలమ్మని - చించి పారైతు వేమొ !*
*కై కొనవొ యేమొ దాని ఏకాంత సేవ !*

*కై కొనియు, అది నేటి లోక స్వభావ*
*మని ఉపేక్షింతువేమొ ! ఏమైనగాని*
*నీ కరుణగోరి నీ చేత నిలిచియున్న*
*లేఖ నేనే సుమా ! విస్మరించవలదు !*

# 12

మన్మధ బాణాల్లా ఉంటారు కొందరు !

సానపట్టిన మన్మధ బాణాల్లా !

చూపులు మరుని తూపులు కావడంలో విశేషం లేదు. ప్రతి సుందరి చూపులూ అవి గురి పెట్టబడ్డ లక్ష్యానికి తూపులే.

ప్రతి సారీ అవి తగలక పోవచ్చు. తగిలినా గాయపరచ లేక పోవచ్చు. అయినా, ఒక క్రమ గమనం కల బాణా లవి.

తామే మన్మధ బాణాలు కొందరు !

ఆపాద మస్తకం వాళ్ళ ఆకారాలే మంచి వాటమైన బాణాల్లా ఉంటై !

మొన దేరిన అలాంటి ఒక్కొక్క బాణం రివ్వుమంటూ -

మనకేసి గురిపెట్ట నక్కర లేదు - మన వంక చూడ నక్కర లేదు - మన ఊహే ఉండ నక్కర లేదు -

అది ఎందుకు ఎటు పోతున్నా సరే - మన గుండెల్లో నుంచే దూసుకు పోతుంది !

చూపులు తూపులైనప్పుడు - వాటిలో కొన్ని తేనేటీగల్లా కుడతై.

మరికొన్ని తలవెంట్రుకకాయలు కురులలో వలె గుండెల్లో చిక్కుకొని ఊడిరావు.

కొన్ని గాయం చేసి పోతై.

కొన్ని చేసిన గాయాలు మానవు.

కాని -

ఆ తూపులతో పాటు విల్లూ, దాని వెనుక గల విలుకత్తే కూడ - ఒక తిరుగులేని మహాస్త్రమై హృదయంలో నాటితే - ఇంకేముంది !

ఒక అరవిందం మోహన మనిపిస్తే, ఒక అశోకం వెర్రెత్తిస్తుంది.

ఒక చూతం ప్రతి నరాన్నీ ఉద్దీపింపజేస్తే, ఒక నవమల్లిక నడిరోడ్డు మీదే శోషిల్ల జేస్తుంది.

ఒక నీలోత్పలం నిశకే నిప్పంటిస్తే, ఒక -

అయిదేనా మన్మథ బాణాలు! అయినా, లక్షల సంఖ్యలో ఉండవా ఒక్కొక్కటీ?

ప్రతిరోజూ, ఎక్కడో ఒకక్కడ, ఏదో ఒక బాణం నాటుతూనే ఉంటుంది నా రొమ్ముల్లో !

ఈ బాణాలు - కత్తుల్లా, కొరడాల్లా, రవ్వల్లా, రాకెట్లలా - మగవాళ్ల గుండెలతో ఇలా ఎందుకు చెలగాట మాడతవో !

నెత్తురు చిందేలా ప్రియురాలు పెదవి కొరికితే - అది గురి చూసి కొట్టిన బాణమే అనవచ్చు.

కానీ -

ఎటుకేసి, ఎందుకోసం పోయే బాణమైనా - నా గుండెల్లో నుంచే దూసుకు పోవడం - ఎంత బాధ !

ఈ బాధ నాకు చిన్నప్పటి నుంచీ ఉన్నదే.

కాని -

ఏ మహా బాణం విసిరాడో ఇప్పుడు నా మీదకు మన్మథుడు !

దూసుకు పోయిన బాణం కాదిది !

బైటికి పోలే దిది !

గుండెల్లో నుంచి ఆత్మ లోకి దిగిపోయిన రాగనిశిత నారాచం ఇది !

నా కోసమే నిర్మించబడి, నాకేసే ఎక్కుపెట్టబడి, సూటిగా నాలోకే దిగిపోయిన అపూర్వ ప్రణయాస్త్రం ఇది !

ఇది జరిగింది శ్రావణ పూర్ణిమ నాడు !

వరలక్ష్మీ వ్రతఫలం చిప్పిలిన రాగరసంతో నింపావు నీవు - ఆ బాణం దిగిన తోరణ గండిని !

నీవే ఆ బాణం !

నీవే ఆ రాగం !

ఆ నాటి నుంచీ పిచ్చివాడిని నేను నీ కోసం !

ఎదురు చూస్తూ కూర్చున్నా నిక్కడ - మధుశిలపై

అదిగో -

అది పూర్ణ చంద్రోదయమా !

రెక్కల గుర్రంపై భాద్రపదివై వస్తున్న నీవా ?

*మహిమీద నీ వొక్క మనిషివే అగుగాక !*

*ఇరుగు పొరుగుల కొక్క ఇంతివే అగుగాక !*

*ఆస్తి, అందము, పదవి - అంతమాత్రమె జగము !*

*నాకు మాత్రము నీవు లోకోత్తర శ్రీవె !*

# భాద్రపది

శ్రావణి నాడు అక్కడ అలా కలుసుకొన్నాం. భాద్రపది నాడు ఇక్కడ ఇలా కూర్చున్నాం !

ఈ లోగా ఎంత వర్షం, ఎన్ని తుఫానులు, ఎంత కల్లోలం !

ఎన్ని మెరుపులు, ఎన్ని పిడుగులు !

స్త్రీ పురుషుల మధ్య సెక్సు మినహా స్నేహం ఉండ దనుకొనే లోకం చిమ్మిన ఎంత బురద !

లోకం చిమ్మేదే బురద ! సెక్సు పవిత్రమే నా దృష్టిలో !

ఎంతో దగ్గరగా కూర్చున్నాం

ఏవేవో కబుర్లు చెప్పావు నీవు

ఏవేవో ప్రశ్నలు వేశావు నన్ను

నా కేమీ తెలియ లే దప్పుడు !

నాకు ఆ క్షణంలో తెలిసిందొక్కటే – నీ సాన్నిధ్య సుఖం !

ఇప్పు డదంతా జ్ఞాపకం వస్తున్నది ! ఒళ్లంతా చెంబేలీ మొగ్గలతో నిండిపోతున్నది !

తగిలీ తగలని ఆ స్పర్శ ఎంత అవ్యక్త మధురం !

ఇంకొంచెం దగ్గరగా జరగాలని ఎన్నిసార్లో యత్నించింది నా ఒళ్లు !

అలా నీ మెరుస్తున్న మెడపై వాలాలని ఎన్నిమార్లో కదిలింది నా చేయి!

ఆ చిరునవ్వుల తేనె మందారాలను ఒక్కసారి – ఒక్కసారి.

నిగ్రహం అంత కఠోరమని అంతవరకు తెలియదు నాకు !

"ఒళ్ళు దగ్గర పెట్టుకొనే ఉన్నారుగా ?" అన్న నీ హెచ్చరిక నవ్వుతూ వచ్చినా, రివ్వునే తగిలింది నా బుద్ధి చెంపపై !

ఓ – అన్నాను కొంచె సర్దుకొని !

నిజాని కది అబద్ధం.

నా ఒళ్ళు నా దగ్గర లేదా క్షణంలో.

నా దగ్గర ఉన్నది నీ ఒళ్ళు !

నా దగ్గరా నీ దగ్గరా ఉన్నది నీ ఒళ్ళే ! నా ఒళ్ళే ఎక్కడా లేకుండా పోయినట్టిది !

చంద్రుడు, వెన్నెల, పొంగి ప్రవహిస్తున్న వైనతేయం, కబుర్లు, శృంగార కళలు, కన్నులలో కాంతులు, కంఠంలో వీణా స్వనాలు, ఏదో స్పందనలు ! ఒడళ్లే లేవు మన కప్పుడు !

ఏదో హాయి !

నిశ్శరీర హృదయ స్థాయి !

కరాంగుళులు గుసగుసల లాడుకొంటున్నై !

ఆత్మలకు చేరుకొంటున్నై వాటి వార్తలు !

గులాబి మొగ్గలు నవ్వుకొంటున్నై సిగ్గుల చెరగులలో !

ఎక్కడున్నాం మనం !

"అమ్మా ! మీకు నా ఆత్మ కావాలా ! శరీరం కావాలా ?"

ఓహో ! ఇక్కడా ఉన్నాం మనం !

ఏం ప్రశ్న అది !

ఎంత కంగారు పడ్డానో నీ ప్రశ్నకు !

అంతటి ఆత్మావిష్కృతి తర్వాత ఇంతటి ప్రాథమిక ప్రశ్న !

అంతటి ఆరాధన తర్వాత ఇంతటి అసంగత మీమాంస !

అవును – అదంతా కేవల భావనా స్వప్న స్వరూపం.

ఇప్పు డిది పచ్చి వాస్తవ జాగృతి !

*స్వప్న మనగా నేమి ? జాగృతి అనగ నేమి ?*
*మనసు మొదటిది, దాని అనుభవమె రెండోది !*
*అనుభవమ్ములు అసంఖ్యాకమ్ము లగు నపుడె*
*ఆనందమై మనకు అపవర్గ రుచిరమా !*

## 14

"ఆత్మ కావాలా? శరీరం కావాలా?" అని కదూ నీ ప్రశ్న ?
"శరీరం వద్దులే" అన్నాను నేను ధీమాగా !
నమ్మలేదు నీవు !
నీ చూపులే చెపుతున్నైగా ?

"నిజం, దేవీ ! ఆత్మకూ, శరీరానికి పోటీ వచ్చినప్పుడు, నేను ఆత్మనే వరిస్తాను. చేతిలో చేయి కూడ వేస్తాను. ఏదీ చేయి ?"

ఇవ్వలేదు నీవు !
ఏం ?
ఏమో ! నా మాట నమ్మలేదు నీవు. నమ్మడం ఇష్టం లేదు నీకు !
"మనకు శరీరాలు వద్దు" అని కూడ అన్నావు కదూ చేయి ఇస్తూ ?
భావ కవుల అమలిన శృంగార భావం నీ దాకా ఎలా వచ్చిందో !
అప్పుడేగా నీ చేతి లోని రేఖలు నేను చూస్త ?
వలరేని విల్లులా ఎంత దివ్యంగా వంగి ఉంది నీ హృదయ రేఖ !
ఎంత తేలిక పడింది నా హృదయం !

అమలిన శృంగార భావం మెంటల్ సెక్సుకు సంబంధించి నట్టిది. అది నీ సహజ ప్రవృత్తి లోది కాదు. అంతే చాలు నాకు.

కొందరు కొమ్మ లుంటారు. బంగారు బొమ్మల్లా ఉంటారు. ఆకర్షిస్తారు. ఆకర్షించ బడతారు. అంతే. మరెందుకూ పనికిరారు పురుషుడికి. ఆలయంలో పూజ లందుకోడానికి మాత్రం పనికివచ్చే ప్రతిమలు వాళ్ళు.

పురుషులలో కూడ ఉంటా రలాంటి వాళ్ళు.

అట్టి వాళ్లతో స్నేహం, సాహచర్యం, సంపర్కం, సంసారం వంటివి బహు కష్టం. తాము సుఖపడరు. మరొకళ్ళని సుఖపెట్టరు వాళ్ళు.

శరీరాలే ప్రధానంగా సాగుతున్న జీవయాత్రలో, అవి అక్కర లేకుండా ఎలా బ్రతకడం !

అన్నం లేకుండా వట్టి సానుభూతితో కడుపు నిండదు.

శరీరాలు కలవకుండా వట్టి మానసిక ప్రేమతో ఆత్మ తృప్తి పడదు.

మనః పరిధిని దాటి, హృదయాన్ని ద్రవింప జేసి, శరీర వీణను మీటి, జీవితాన్ని రాగరంజితం చేసుకో గలిగిందే సమగ్రంగా వికసించిన ప్రేమ.

సెక్సు లేకుండా ప్రేమ ఫలించదు శృంగారంగా.

ప్రేమ లేకపోయినా సెక్సు ఫలిస్తుంది సంసారంగా.

సెక్సు పూర్తిగా శారీరకం. ప్రేమతో కూడినప్పుడు అది అమృతం అవుతుంది అదే శృంగారం.

శంగారం మలినమూ కాదు. అమలినమూ కాదు. అదొక ఆనంద రసానుభూతి. ద్వంద్వాతీత పరమస్థితి అది.

అమలిన శృంగార భావం శారీరక బలహీనతలు కల కేవల భావుకలది. తా చెడ్డ కోతులు వాళ్లు.

మన ఇద్దరమూ సమగ్ర ప్రేమ ప్రవృత్తి కలవాళ్లమే. మన మన హృదయ రేఖలలో మధురమైన ఆ చెరకు విలువంపులు ఉన్నై.

ఇప్పుడు చెప్పనా – నీ ప్రశ్నకు సూటి జవాబు ?

నీ ఆత్మా, నీ శరీరమూ, మొత్తం నీవే కావాలి నాకు !

నీ వొక మధు కలశం.

మధువు ఇచ్చి కలశం దాచు కొంటావా ? ఎందు కది ?

శాశ్వతమైన ఆత్మను ఇచ్చేసి, క్షణ భంగురమైన శరీరాన్ని భద్ర పరచుకోవడం వివేక మేనా ?

అమలినంగా ఉండ వలసింది ఆత్మా ? పెక్కు మాలిన్యాలతో నిర్మించబడ్డ శరీరమా ?

అసంబద్ధమైన ఈ మాలిన్య వాదం ఆర్షం కాదు, ఆప్రాచ్యం.

హృదయ పూర్తిగా, ఆత్మబుద్ధితో చేసిన ఏ పనికీ మాలిన్య దోషం లేదు.

శరీరాన్ని ఇచ్చి, ఆత్మను దాచుకోవచ్చు.

ఆత్మను ఇచ్చి, శరీరాన్ని దాచుకోవడం అసాధ్యం. అనవసరం కూడ.

నీ శరీరం నీది కానప్పుడు పడే పాట్లు అవి.

నీవు సర్వస్వతంత్రురాలవు కదా ! ఏదో ఒకటే ఇవ్వాలనుకొంటే ఆత్మనే ఇవ్వు ! నాకు మాత్రం పూర్ణత కోసం నీ శరీరం కూడా కావాలి !

శరీరాల కలయికతో ఆత్మారాధన సమసిపోతుం దేమో, ఆ తర్వాత మిగిలేది వట్టి నిరానంద నిరుత్సాహక దైనందిన జీవిత విధులే నేమో – అనే భయం కూడ ఉంది కదూ నీకు ?

వాడిపోతానేమో నని గులాబి మొగ్గ వికసించక మానుతున్నదా ?
చచ్చిపోతానేమో నని అరటిచెట్టు గెలవెయ్యక మానుతున్నదా ?
వట్టిపోతానేమో నని మేఘమాల వర్షిం చక మానుతున్నదా ?
వేదనలే జీవితం. అవి తీరడమే మోక్షం.
జీవితం ఒక వేదనా సామూహి.

వేదనలు తీరే కొలదీ జీవితం వికసిస్తుంది. దాని పూర్తి వికాసమే ఆనందబ్రహ్మ.

వేదనలను మధురీకరించి, ఆత్మారాధనలో నీరాజన మవుతుంది – ప్రేమికుల శరీరానుభవం.

త ద్విరుద్ధమయింది పచ్చి సెక్సు.
అది మనది కాదు.

మన ప్రేయసీ ప్రియులం. జీవేశ్వరులం. మన ఐక్యం సమగ్రం. సర్వసంపూర్ణం.

పూర్ణార్పణ ఒక్కటే అర్ధనారీశ్వర వ్రత సిద్ధి !
సామాన్య స్త్రీవి కావు నీవు
అధిగమించు లోక పరిధిని
వికసించు ఆత్మస్థాయిలో
నేను ఉన్నది అక్కడే !
నీ కోసం నిరీక్షిస్తూ !

# 15

జీవితం ఒక నిరంతర ఘర్షణ

అపజయాలు కారాకులుగా రాలిపోతూ, విజయాలు మారాకులుగా మోసులెత్తుతూ, ముందుకు సాగిపోతుంది జీవన లత.

జయాపజయాల నిత్యఘర్షణే ఈ మన యాత్ర.

ఎందుకూ భయం దీన్ని చూచి?

అసలు మనం పుట్టిందే ఒక ఘర్షణ నుంచి.

ఘర్షణ చైతన్య మూలకం

చైతన్యం ఒక స్రవంతి

ఏ భావ తరంగ ఘట్టనా జనిత రూపరేఖలమో మనం–ఈ స్రవంతిలో !

ఏ ఇచ్ఛా చాలిత నాదస్వర కల్పనలమో మనం – ఈ విశ్వ వీణపై !

శివ శక్తులం మనం

మన ప్రణయమే నాదం

మన చుంబనమే బిందువు

తత్ఫలితమే కళ

కళా రూపులం మనం !

శబ్దాల, అర్థాల, రేఖల, రంగుల పరస్పర సంయోగ వియోగాలే మన చరిత్ర.

మన చరిత్రే జీవిత చరిత్ర లోకానికి.

సుఖ దుఃఖాలు, మంచి చెడ్డలు, చీకటి వెలుగులు, నిమ్నోన్నతాలు, ముందు వెనుకలు – ఇవన్నీ ఎడాపెడా కొడుతూ ఉండగా, రెండు శిలల ఒరపిడిలో పుట్టిన స్ఫులింగం వలె పుట్టి, ప్రజ్వలితమై పురోగమిస్తుంది జీవితం.

నది ఒకటే అయినా, నీరు ఒకటి కాదు.

జీవి ఒకటే అయినా, జీవం ఒకటి కాదు.

క్షణక్షణ పరిణామ శీలి ఇది.

జీవి లోని జీవ పురోగమనమే జీవితం.

నిరంతర ఘర్షణా సముపార్జిత విజయమే పురోగమనం.

ఏ భావ స్పందనా రాగ వీచికలమో మనం –

తిరిగి ఆ భావ పయోధిలో లయమై పోవడానికే ఈ నిరంతర ఘర్షణ, నిర్విరామ పురోగతి, నిల్వనివ్వని ఆవేగం, ఆవేదన అంతా !

క్యూలో నిలబడినా, కుమ్ముకొంటూ చొరబడినా, అలసి కూలబడినా, అందకుండా పరుగిడినా –

జీవితం ఒక ఘర్షణ.

ఎందుకూ భయం దీన్ని చూచి ?

క్రొత్త నీటికి చేప ఎదురెక్కేటట్టు, నూతన పరిస్థితుల్లోకి ఉత్సాహంతో దూకేదే పూర్ణజీవి !

ఆత్మనే ఇచ్చిన దానవు –

నీ శరీరం నీ అధీనం లోనే ఉన్నదానవు –

పూర్ణార్పణతో పునీతవు కావడానికి ఎందుకూ భయం ?

# 16

*ఏదో ఒక దీపపు వెలు*

*గేదో ఒక మూల మిణుక కే మానవుడున్*

*నీ దారి తెలియ నేరడు :*

*నా దేవీ ! లేచి రమ్ము నాతో భువికిన్ !*

నా రాగ సరస్వతివి నీవు !

ఈ నా సంగీత సాహిత్యాలు నీ కరుణా కటాక్ష పరిచుంబిత సుందర సుధాకర శిఖరాలే !

నీ విమోహన లోచనాంచల పరీక్షణా కిలికించితాలే నా హృదయ దారుఖండాన్ని సాహితీ వీణగా తీర్చిదిద్ది, శ్రుతి చేసి పలికించినై కోటి కోమల రాగాలను !

నీవు నా రాగ సాహితివి !

నీవు పరమ పవిత్ర కళామూర్తివి ! కేవల దేవతవు నీవు !

నిన్ను నీ దివ్యసుందర ప్రణయాంతఃపురంలో కలుసుకొన్న నేను వట్టి మానవుణ్ణి !

నిత్యం ఆ మహోన్నత శిఖరాగ్రాలపై విహరించలేను నేను.

ముట్టితే మలినమై పోయే, తాకితే కందిపోయే, చూపుకే సురిగిపోయే, ఊహకే ఉరలిపోయే ఆ నీ మంజుమంజుల మందార భూములు నాకు బహు కష్టసాధ్యాలు.

పుష్పోద్యానాలు, పూర్ణజ్యోత్స్నలతో పాటు – వరదలు, బురదలు కూడ ఉండే నా కఠిన భూములే నాకు సమగ్ర సుందరాలు, సులభ గమ్యాలు.

కళా సమున్నత శిఖరోద్యానంలో నీవు నా ఆరాధ్య దేవతవు.

భూమిపై నా జీవిత రసాల వనంలో నీవు నా ప్రేయసివి.

వ్రేళ్ళు ఎక్కడో పైన ఉండి, శాఖలు క్రిందికి విస్తరించి, నా చుట్టూ, నా నిండా వికసించిన రాగలతవు నీవు !

నీ మూలం వీణామండలం

నీ కాండం ఆనందచేతన

నీ శాఖోపశాఖలు, పల్లవ పుష్ప ఫలరసాలు, శుకపిక భ్రమ రాదులు – అన్నీ నా దైనందిన జీవిత సుఖసంతోషాలు !

కళామయీ !

ఆనంద రమా !

వైశాఖీ !

బాగా ఆలోచించుకో !

వెలు గున్నప్పుడు నీ లూ ఉంటై.

నీ కిరణాల కొసలే నా నీడల మొదళ్ళు !

అందుకే అర్థిస్తున్నాను నిన్ను – శిఖరాగ్రం నుంచి హిమానీ కుమారి వలె నా రసాలినికి దిగి రమ్మని !

దివ్యలోకము నుంచి

దిగిరమ్ము నా కేసి,

అవ్యక్తమును డించి

అరుదెంతు నీ కేసి,

ఆ నడుమ కలిసికొని మనము, నవ్య

మానవము నిర్మింతము !

## 17

"అమ్మా !

"మీరు అనుకొన్నదంతా నిజమే.

"ఆనంద వేదనలు, అనురాగ తీవ్రతలు, ఒకరి కోసం ఒకరు పడే తహతహ, చేసుకొనే పూజ – అలాంటి వన్నీ శరీర సంయోగంతో సడలిపోతా యనీ, ఆ తర్వాత మనం కూడ మన ఇరుగు పొరుగు సంసారుల వలె జీవచ్ఛవాల మై పోతామనీ, తగని భయంగా ఉండేది నాకు !

"మన ప్రేమానురాగాలు శాశ్వతంగా ఉండాలి –

"అనుక్షణం ఒకరి కోసం ఒకరు ఆరాటపడుతూ ఉండాలి –

"మన హృదయాలు ఎల్లప్పుడూ నిండుగా ఉండాలి – ప్రేమ సుధ అంచులు పొర్లి ప్రవహిస్తూ ఉండాలి –

"ఇదీ నా కోరిక.

"కథలలో కావ్యాలలో చదవడమే కాని, ప్రేమ అనే దేమిటో తెలీదు నాకు.

"నా చుట్టూ, నాకు తెలిసిన వేలకొలది సంసారాలలో, ఏవో ప్రతిఫలాపేక్షల ఆపేక్షలు తప్ప – ప్రేమ అనేది కనిపించలేదు నాకు.

"ప్రేమ అనేది కామవాంఛకు పర్యాయపదంగా వినబడుతున్నది నేడు. అందుకే, దాని పట్ల ఉన్న గౌరవం పోగా, అసహ్యం కూడ ఏర్పడింది నాకు.

"కాని –

"మిమ్ము చూచిన ఆ క్షణం నా శరీరం నిండా ప్రాకిన విద్యుత్త రంగాలు, మ్రోసిన విపంచికలు - ఆ తర్వాత రేగిన తుఫానులు, ముంచెత్తిన ఉప్పెనలు - ఏదో అపూర్వ అవ్యక్త ఆనంద వేదనకు లోనుచేసినై నన్ను !

"ఎప్పుడూ, ఎవ్వరి తోనూ నాకు నేనుగా మాట్లాడని దాన్ని, మగవాళ్ళు పలకరించినా పలకలేని దాన్ని, సిగ్గుకు రూపకల్పనగా కీర్తి గడించిన దాన్ని నేను - నాకు నేనై మిమ్ము ఎలా పలకరించ గలిగానో ! మీకేసి అలా ఎలా చూడ గలిగానో ! అమ్మో !

"అప్పుడు - అంటే ఆ తర్వాత - అనుకొన్నాను - బహుశా ఇదే, అదేదో కావ్యగత ప్రేమకు తుల్యమైన ఆత్మానుభూతికి నాంది యేమో అని !

"ఈ అనుభూతి కోసం కదా నేను చేసిన తపస్సు అంతా !

"మీ గురించి విని ఉన్నాను నేను. మీ పద్యాలు, పాటలు ఎన్నో పాడి ఉన్నాను నేను. అవి నాకు చక్కిలిగింతలు పెడుతూ ఉండేవి. ఎవరో అజ్ఞాత ప్రియతముడు నా కోసం, నన్ను గురించి వ్రాసినట్టుండేవి. మీ దర్శన భాగ్యం కోసం ఉవ్విళ్ళూరిస్తూనే ఉండేవి అవి.

"ఎంతో మంది రాగదేవతలు మీ కోసం వెర్రెత్తి తిరుగుతా రన్న కథలు కూడ ఎన్నో విన్నాను నేను.

"అలాంటి ప్రపుష్టితో, ప్రాభావిత పరిదృష్టితో తొలిసారి మిమ్ము చూచి, ఏదో తెలియని మధుర బాధకు పాల్పడి, నిద్ర లేక, తిండి సహించక - ఏమీ తోచక వేగిపోతున్న నాకు, మీ తొలి లేఖ ఇచ్చిన ఉపశమనం ఎంతని చెప్పను ?

"రోహిణిలో మృగశిరా ప్రవేశమే అయిం దది !

"అయితే -

"మొదట్లో ఇలాంటి అనుభవాలనే పొంది, ఏవేవో ఆనందాలను ఊహించు కొని, శరిరాలు కలుపుకొన్న ఎంతోమంది స్నేహితురాండ్రను ఎరుగుదును నేను.

"వాళ్ళంతా ఇంచుమించు నా వయస్సు వాళ్ళు. ఈనాడు శవాలు, వట్టి జీవచ్ఛవాలు !

"విరబూచిన తంగేడుల్లాంటి, గులాబీ పొదల్లాంటి, మల్లెదండల్లాంటి, మైసూరు పెయ్యల్లాంటి, వరద గోదావరుల్లాంటి, మెరుపు తీగల్లాంటి సుందర బాలిక లెందరో - కొందరు ముళ్ళ కంపలై పోయారు, కొందరు ఎడారి పిట్టలై పోయారు - కొలది కాలం లోనే !

"ప్రేమ, ఆరాధన, అనుభూతి, ఆనందం - నిత్యనూతనంగా, సుస్థిరంగా ఉండాలంటే అమలిన శృంగారం ఒక్కటే మార్గమనీ, శరీరాన్ని అనాఘ్రుత పుష్పంగా ఉంచుకోక తప్పదనీ నేను అనుకోవడానికి ఇదే కారణం.

"నశించే శరీరమే నశించని ఆత్మను నాశనం చేయవచ్చు దుష్ట స్నేహం వలె !

"ఇంటికి నిప్పంటించు కోవడమే ప్రేమించిన వాడికి శరీరాన్ని ఇవ్వడం తరచు !

"మనకు శరీరాలు వద్దని నేను అన్న దందుకే.

"శరీరం ప్రేమను పైకెత్తి పరమాత్మే కావచ్చు. క్రిందికి లాగి నరక వ్యథే కావచ్చు.

"ఇలాంటిది నా మనస్తత్వం.

"అయినా -

"నా మనస్తత్వంపై నా ఆత్మ దాడి చేస్తూనే ఉంది మొదటి నుంచీ. ఇప్పుడు మీ బలంతో పుంజుకొని, ఓడించి వేసింది నన్ను ! నేను కేవలం నగ్నాత్మను అయినాను మీ ముందు !

"శారీరక సుఖేచ్ఛ కాదు మనది. జన్మజన్మాల సౌహార్దం ఇది. దీన్ని శరీరసంయోగం దివ్యీకరిస్తుందే కానీ, ఎందుకు న్యూనీకరిస్తుంది ?

"అదీ కాక-

"ఆత్మార్పణ చేసుకొని, నా సర్వస్వాన్నీ మీ చేతిలో పెట్టుకొన్న నేను - ఒక్క దమ్మిడీనా మిగుల్చు కొంటాను ? అది కూడ మీ జేబులోనే లేదా ?

"నేనే మీదాన్ని అయినప్పుడు మీది కానిది నాదగ్గర ఏమి ఉండగలదు

ఇక మీ ఇష్టం. మీ ఇష్టమే నేను. మీరే నేను.

ఓహో, దే వీ !

ఎంత బాగుంది నీ లేఖ !

ఏ శరీర సుఖమైనా – ఆ శరీర ధారి మనస్తత్వంపై ఆధారపడి ఉండేదే.

ఏ సుఖమైనా మనస్సు తోడిదే.

మట్టి మూకుడులో ఉన్నా అమృతం అమృతమే. బంగారు గిన్నెలో ఉన్నా విషం విషమే.

సుఖదుఃఖాలు జీవలక్షణం తోడివి. శరీరం తోడివి కావు.

సువర్ణ కలశంలో అమృతానివి నీవు !

నీ కోసమే ఈ నా తపస్సంతా !

## 18

నిజంగానే దిగివస్తావా దేవీ ?

నిజంగానే ఆ దివ్యోన్నత శిఖరాల నుంచి ?

ఈ సాధారణ మానవ జగత్తుకు ? ఈ నా కోసం ?

నీ నిర్ణయం ఆనందంలో ముంచివేసింది నన్ను. ఒళ్లు మరిచి నృత్యం చేశాను నేను – నీ లేఖ చేతపట్టుకొని !

*హృదయమును శృతి చేసి జపించినాను*
*మధుర మధురాజ్యదా రాగ మంత్ర మొకటి ;*
*మంత్ర దేవత మరగి, హేమాద్రి కరగి*
*ఆత్మ వాహిని వైశాఖి అవతరించె !*
*కోటి చైత్రాలు కురులలో గ్రుచ్చుకొని, ని*
*రవధి కానందరాగ రసార్ణవములు*
*ఎడద నిడుకొని, అవతరించినది దేవి*
*శారత జ్యోత్స్న నుండి ప్రజ్ఞాన మట్లు !*

ఓహో !

నిజంగానే వచ్చేశావు నీవు !
నాలోకి వచ్చేశావు నీవు !
నా కంటే ధన్యులిం కెవరున్నారు లోకంలో !

**ఆకాశవాణి నా కర్పించె నిను, విపం**
**చిక చేసి, వికచ కల్పకశాఖి, వైశాఖి !**
**చూపులో కల్యాణ దీప మైతివి నాకు !**
**స్పర్శలో అనుకృత ప్రకృతి వైతివి నాకు !**
**సరస సంతత శుద్ధ చైతన్య శక్తిలో**
**మన మనం తానంద మధుర వీచికలమే !**
**ఒరసికొని, రాపాడి, ఒకరిలో ఒకరమై**
**పరవశిల్లెద మేక పారమ్య మూర్తిగా !**

**నీవు వెన్నెలవు, రేయిని నేను; నేనె వె**
**న్నెల నౌదు, నను దాల్చి నీవె రేయివి కమ్ము !**
**ఎవర మెవ్వరమైన, ఇర్వురము నున్నపుడె !**
**ఒకరి నొకరు ధరింప ఒకటె వెన్నెల రేయి !**

ఆశ్వయుజ శుక్ల సప్తమీ సరస్వతి పూజ లందుకొంటున్న లేత వెన్నెల రేయి !

నీవే నా రాగ సరస్వతివి !
నీ పూజే నా పరమార్థం !
నేనే వెన్నెలను.
నన్నే చీరగా ధరించి, నీవే బాలశారదవై నృత్యం చెయ్యి !
ఔను – ఈ నృత్యం చేస్తున్నది నీవే !
కాదు – నేను !
నీవే వెన్నెలవు !
నిన్నే కట్టుకొని నర్తిస్తున్నాను నేను !

నీలో నేనా ?

నాలో నీవా ?

**నా లోననే నీవా, నీ లోననే నేనా,**

**ఎవరిలో ఎవరమో ఎందుకీ జిజ్ఞాస ?**

**అధార విద్యాలయము నుండి నా మనో**

**రథముపై ఊరేగు రమ్యవైతివి, చాలు !**

## 19

"ఎందు కంత ఒళ్లు తెలియని తనం ?"

"ఎవరామె ?"

అపస్వరాలు !

నీవు నా దాన వైన ఈ శుభముహూర్తంలో, ఆనందం పట్టలేక, ఒళ్ళు మరచి తాండవం చేస్తున్న నా చుట్టూ – ఎక్కడివీ అపస్వరాలు ?

మర్రిచెట్ల తొర్రల పరదాల నుంచి, తొంగిచూస్తున్నై గుడ్ల గూబలు !

ఆకాశం ఎత్తు పెరిగినా ఎవరికీ నీడ నివ్వలేని తాటిచెట్ల కమ్మలపై నుంచి, రెక్కలు రెపరెప లాడిస్తున్నై రామబంధులు !

గంధపుచెట్ల కొమ్మలను ఆశ్రయించుకొని, బుసలు కొడుతున్నై విషనాగులు!

ఆడుతున్న నా అడుగుల పైకెక్కి ప్రాణాలు దక్కించుకొంటున్న చీమలు, కండలు పీకుతున్నై కోరలు సాచి !

బురద గుంటల నుంచి కప్పలు –

పండిన వరిచేల గట్ల కన్నాల నుంచి ఎలుకలు –

పేద రైతుల వడ్లగాదెల క్రింద నుంచి పందికొక్కులు, వాళ్ళ వంట గదుల నుంచి పిల్లులు –

కొబ్బరిచెట్ల తలలలో నుంచి ఉడతలు –

భాగ్యవంతుల గేటుగుమ్మాల నుంచి కాపలా కుక్కలు –

చెరుకుతోటల నుంచి దోపిడీ నక్కలు –

అమృతమూ, ఆహ్లాదమూ ఆనందపు అంచులు తాకి ప్రవహిస్తున్న ఈ శరత్సుహాసంలో - ఎందుకో ఈ అపస్వరాలు !

ఎందుకో ఈ కర్కశ కఠోర నినాదాలు !

లోకోత్తర ప్రయోజకమైన ఈ నా ప్రేమసాగర మధనంలో హాలాహలం క్రక్కుతున్నది అసూయా వాసుకి !

శివుణ్ని నేను

నీ శక్తితో ఎలాంటి విషాన్నైనా కంఠగతం చేసుకోగలను.

నీవు కేవల వైశాఖి వేనా ?

నీవు నాలో కలిసిపోయే కొలదీ, నీ శక్తి నన్ను శివుణ్నే చేసే కొలదీ, పరమరాగ పరమేశ్వరివే నీవు నాకు !

రాగసుధాకలశివై, నీవే నా పెదవికి పెదవి వైనప్పుడు - ఈ నిశాచర లోకమా నన్ను నిరోధించ గలది ?

ఈ లోకులకా నేను ప్రత్యుత్తర మిచ్చేది ?

భారతీయ సంస్కృతికీ, సంప్రదాయానికీ విరుద్ధంగా ఫేరవించే అపస్వరాలను నరక వహ్నుల లోకి విసిరి పారవేసి, తాండవిస్తున్నాను నేను నీ అర్ధనారీశ్వర పూర్ణపదవి కోసం !

*"ఎవరామె?" అట !*

*నీవెవరో ఈ లోకాని కెందుకు ?*

*లోకం ఒక సత్రం*

*లోకులు కాకులు.*

*అదిగో - నా ఆటకు ఎక్కడినుంచో పాట !*

*లోకులు కాకులు, సఖుడా !*

*లోకములో మన నీయరు!*

*లోకోత్తర సుఖ రతిలో*

*లోకమునకు చనువీయకు!*

*లోకు లనగ నెవరోయీ ?*

*ఆకలి తీరిన వారే !*

అకలి తీరిన వెనుక
అవనిని మరిచిన వారే !
చిన్ననాటి బ్రతుకు పుటలు
చిరిగిన వారే లోకులు !
ఆశించిన ద్రాక్షపండ్లు
అందని వారే లోకులు !

## 20

ఎవ్వ రీమె అటంచు ప్రశ్నించు చున్న,
దెందుకో లోకమున కింత ఇది ? మదీయ
హృదయమవు నీవ, స్పందన మీవ, దాన
వెలయు రాగము నీవ, భావ లయ ఈవీ !

నీవు నా దానవు, నేను నీ వాణ్ణి. ఇతర్ల కెందుకు మన జోలి ?

ఆమె ఎవరు అంటున్నారు

ఏమిటి ఈ లేఖలు అంటున్నారు !

ఈ లేఖలు గురించి లోకానికి ఎలా తెలుసునో – అని ఆశ్చర్య పడతావు కదూ నీవు ?

తెలిస్తే, ఏం ?
రహస్యాలు లేవు మనకు
మన హృదయం లోక విదితం
మన ప్రణయం విశ్వ రణితం
మనం విశ్వేశ్వరులం !
మన రహస్యం ఒక్కటే
అది మనమే !
తెలుసుకోనీ లోకం.

ప్రణయాత్మే ఒక పనసపండు అనుకొంటే – దాని తొనలు కదా ఈ లేఖలు.

ఒక పూర్ణ ఫలం లోని వివిధాంశల, కళల, రుచుల, రసాల సార బిందువు నీవు !

చిన్మయానంద రుచు లిట్లు చేర్చి కూర్చి
తొనలు తీసి అందీయ, అందుకొనలేక,
ఏమి టీ లేఖ లన్న నే నేమి చెపుదు ?
హృదయమును పిండి ఎట్లు చూపింతు నిన్ను ?
ఎలా నిన్ను చూపించడం ?

ఈ తొనలను నా హస్తంతో లోకానికి అందిస్తున్న నీ అదృష్ట అమృత హస్తం ఎలా కనిపిస్తుంది బాహ్య నేత్రానికి ?

ఎందుకు కనిపించాలి అసలు?
*పండు తినునప్పు చెట్టు కన్పడున ? తేనె*
*గ్రోలునప్పుడు తోచునా పూలతోట ?*
*కన్నులుండియు కనలేని కర్మఠుండు*
*అనుభవము వీడి, మూలము నరయగోరు !*

పోనీ– నిన్ను చూపుతానే అనుకో. లోకం నిన్ను గుర్తించ గలదా ?

*పద్మములు చూచి నీ పాదపద్మములను*
*నీలమబ్బులు చూచి నీ నెరికురులను*
*మించులను చూచి నీ చిరు స్మేరములను*
*మంచిగా నిన్ను జగము గుర్తించ గలద ?*

*సలలితములు సుందర సరోజముల జూచి*
*విలసనములు గులాబి గుత్తులను జూచి*
*లాలసములు రసాల వల్లరుల జూచి*
*పోల్చుకొనున లోకమ్ము నీ పూర్ణ శోభ?*

*అంతవరకును తెలిసికొన్నదియె అనుము;*
*హృదయ సౌందర్య మెట్లు భావించగలదు ?*
*నాకు నీకును మధ్య ఆనంద పరమ*
*సారణుల నెట్టు లూహింప జాలు జగము ?*

నీ వెవర వన్న ప్రశ్నేల ? జీవకోటి
కోటి సౌందర్యములకు దిక్సూచి వీవు !
అద్దమున వోలె తము దాము దిద్దుకొనక
పెదవి విరువగ త్రిప్పి చూచెదరు జనులు !

అలాంటి లోకానికి నా ప్రేమ తపః ఫలాన్ని నిన్ను ఎలా చూపుకొంటాను?

నీ వెవర వన్న ప్రశ్నతో నిఖిల జగము
చచ్చినను చావనీ, చూపజాల నిన్ను ;
ఈసు విడనాడి, సౌందర్య మెచట నున్న
అర్చనము చేయు కళ దాని కబ్బుదాక !

# 21

లోకం మీద ఏదో పగతో పుడతారు కొందరు

వాళ్ళ ముఖా లెప్పుడూ చిరచిర లాడుతూనే ఉంటై.

ఏ విధమైన మంచినీ, అందాన్నీ, కళనూ సహించలేరు వాళ్ళు.

ఎప్పుడూ ఏ ఒకళ్ళకో అపకారం చెయ్యకుండా, ఏ మృదుల హృదయాన్నో వేధించకుండా, ఏ లలిత లవలినో త్రుంచి పారవెయ్యకుండా ఉండలేరు వాళ్ళు.

ఏ జన్మ లోనో, ఎవరి వల్లనో, ఏదో అపకారాన్ని పొంది, బాధతో కుమిలిపోయి, ప్రతీకార వాంఛ ప్రబలి, పగ తీర్చుకోకుండానే చచ్చిపోయి పుట్టిన దౌర్భాగ్యులు కావచ్చు వాళ్ళు.

తమకు అపకారం చేసిన వాళ్ళెవరో గుర్తు లేక, మొత్తం లోకం మీదనే సాముదాయకంగా పగ తీర్చుకోడానికి పూనుకొంటారు వాళ్ళు.

అపకారం పొందిన వాళ్ళూ వాళ్ళే. దాని వల్ల పతనమైన వాళ్ళూ వాళ్ళే. ఇప్పుడు మరీ దిగజారి పోతున్న వాళ్ళూ వాళ్ళే.

ప్రతీకార వాంఛ కంటే పతన హేతువు మరొకటి లేదు.

వాళ్ళే వీళ్ళు – మన చుట్టూ చేరి మనల్ని హింస పెడుతున్న తేళ్ళు.

పులి మేకను చంపుతుంది. నల్లి నెత్తురు తాగుతుంది. వాటి క్రౌర్యానికి ఒక ప్రయోజనం ఉంది. వాటి స్వార్థానికి ఒక అర్థం ఉంది.

తేలు ఎందుకు కుడుతుంది ?

పాము ఎందుకు కరుస్తుంది ?

అనూరాధ ఒక తేలు

ఆశ్లేషయ్య ఒక పాము

వాళ్లూ, వాళ్ళ నేస్తాలూ చేరి ఎందుకలా పీడిస్తారు నిన్నూ, నన్నూ ?

మనం లేఖలు వ్రాసుకొంటే, పాటలు పాడుకొంటే, పౌరోద్యానంలో కూర్చుంటే వాళ్ళ కెందుకు ?

తేళ్ళు ! పాములు !

లోకం మీద ఏదో తీరని పగతో పుట్టుకొచ్చిన విషపురుగులు వాళ్ళు !

తప్పించుకు తిరగాలి వాళ్ళ నుంచి

అదీ సాధ్యం కాదు తరచు !

మన ప్రక్కనే, మన తోనే ఉంటారు వాళ్ళలో ఎందరో - స్నేహితులుగా - రంగులూ, సెంట్లూ పూసుకొని !

అట్టివాళ్ళు చేసే అపకారం మరీ క్రూరం.

ఏం చేస్తాం ?

"మన ప్రేమానురాగాలు, మన సంగీత సాహిత్యాలు, మన ఆనందాలు మనవి. అవి మన ఆంతరంగిక అనుభూతులు. లోకంతో ప్రమేయం లేదు వాటికి. అయినా - ఎందుకో లోకం ఓర్వలేక పోతున్నది" అంటావు నీవు !

లోకమూ, లోకులూ అంటే ఈ కొద్దిమంది తేళ్ళూ, పాములేగా ?

భయపడ వద్దు వాళ్ళకి.

మనం ఒకళ్ళ కోసం ఒకళ్ళం పుట్టిన వాళ్ళం. లోకాన్ని ప్రేమించడం కోసం వచ్చిన వాళ్ళం. త్యాగాలకు సిద్ధపడ్డ వాళ్ళం.

లోకం మనల్ని హింసించినా, మనం ప్రేమిస్తూనే ఉండాలి లోకాన్ని !

అందుకే -

భయం లేదు మనకు -

భయపడ వద్దు ఎవళ్ళకీ.

# 22

ఝుంఝూ మారుతంలా వచ్చావు నీవు నా జీవితం లోకి !

స్తబ్దంగా పడి ఉన్న మనస్సును కుదిపి పారేశావు ఒక్క ఊపుతో !

తుపానులు, ఉప్పెనలు, భూకంపాలు వంటివి లేకపోతే - భూగోళమే స్తబ్ధమై పోతుంది నిజంగా !

మహా ప్రళయాలు ఏర్పడక పోతే - విశ్వమే నిర్వీర్యమై పోవచ్చు కూడ !

దున్నితే కాని భూమి పండదు కదా !

జీవతమే అంత !

అల్పాల్పం కానీ, అధికాధికం కానీ, మధ్య మధ్య విప్లవాలు లేకపోతే - చైతన్యం త్రుప్పు పట్టి పోతుంది.

నా లోకి నీ రాక కూడ అలాంటిదే !

హఠాత్తుగా చెలరేగిన ఒక మహా ఝుంఝుకు గసిగి, రాలి, కొట్టుకొని వచ్చి, నా ఒడిలో వాలిన వైశాఖ పూర్ణిమవు నీవు !

వైశాఖివి నీవు!

మాసిన మనస్సు, మొద్దుబారిన భావాలు, త్రుప్పు పట్టిన ప్రజ్ఞ - నా సమస్తమూ నీ ఒక్క గిజాయింపుతో జవజవ లాడిపోయి, రచ్చబండ కెక్కినై !

ఒక్క ధారాపాతంతో క్షాళితమై పోయినై !

వచ్చావు ఝుంఝూ మారుతం లా

ప్రక్షాళించేశావు నన్ను నన్నెల్లా

ఎంత చైతన్యం తెచ్చావు నీతో !

ఎన్ని మాధుర్యాలు నింపావు నా నిండా !

కుదిలిస్తే కుదిలించావులే ఆ చరణ మూర్ధం -

కుదురుగా కూర్చున్నావుగా నాలో !

కురిస్తే కురిశావులే పడగళ్ళు -

కుముదినివై, కౌముదివై, కామేశ్వరివై నిల్చిపోయావు నాతో !

మాంద్యమే మహిషం. దాని సంహారమే విజయం.

విజయ శారదవు నీవు !

కేదార విజయేందిరవు నీవు !

విశ్వ చేతనా ప్రకంపనవు నీవు !

విరిచి పారేశావు నాలోని తమస్సు నంతా !

నవీకరించేశావు నా సమస్తాన్నీ – నీ రాగ రసోదయ వినూత్న జీవ ద్రవ్యాలతో ! ధాన్య రాశులతో ! వెన్నెల కుప్పలతో !

నా ప్రతి జీవాణువూ ఇప్పుడొక రాగదీపిక !

నా ప్రతి జీవనాడీ ఇప్పు డొక ఉన్మాత్న రాగవీణ !

పూర్ణ పురుషుణ్ణి ఇప్పుడు నేను !

*శక్తి కల జీవనము సముద్రిక్త మగుచు*
*వివిధ రీతుల నుప్పొంగి వెల్లివిరియు,*
*బ్రతుకు నిండ ప్రచండ వైభవము లపుడె !*
*భ్రామరీ దివ్య భవ్యానుభవము లపుడె !*

## 23

లత, వనిత, కవిత
సౌందర్య త్రయం ఇది,
రస నిష్ఠం ఈ త్రయం.

ఈ ముగ్గురు మతల్లికలూ – దేని మట్టుకు అదే – జగన్మోహనలు, వసంతంలా వికసించినప్పుడు,

ఏదైనా వికసించినప్పుడే పరమ సుందరం.

లతా హృదయం వనిత, వనితా హృదయం కవిత, కవితా హృదయం లత?

వివిధ వర్ణ సౌందర్య విలసితం, వివిధ రాగ రసోదయ రుచిరం, వివిధ భావ సమావేశ పరమానందం అది !

రసోద్భవ అయిన లత, తదనుభూతి జన్య అయిన వనిత, తద్భావ సంభూత అయిన కవిత – ఒకరిలో ఒకరు పర్యవసించగా – రసవాహిని ప్రభవించి, ఆనందమై ప్రవహిస్తుంది తిరిగి.

పరస్పరాశ్రయ జీవన సౌందర్య మంజూషలు ఈ ముగ్గురూ.

బ్రతుక్కు కావలసింది ఈ ముగ్గురే – ఏ బ్రతుక్కు అయినా.

చేతనా సౌందర్యానికి, దాని స్పందనకు, ప్రభూతికి మూలమూర్తి లత.

దాని రమణీయ రాగజ్యోత్స్న వనిత.

దాని ఆనంద పారవశ్యమే కవిత.

పరమ వరాలు ఈ ముగ్గురూ !

ఈ వరాలు లేని ఏ బ్రతుకైనా ఎడారే !

లతను పెంచలేని, వనితను ప్రేమించలేని, కవితను అనుభవించలేని ఇసక దిబ్బలు, ఉప్పు పత్రలు, మురికి కయ్యలు ఎన్నో ఉన్నై. వాటికి ఉన్నతమైన విలువలూ ఉన్నై లోకంలో.

కాని అవి కేవలం భూత పదార్థ నిక్షేపాలు.

వాటి జోలి వద్దు మనకు.

లతా వనితా కవితా సమాకృష్ట మధుర జీవితమే సఫల జీవితం ఏ మగవాడికైనా.

షండులు, సన్యాసులు నిషేధిస్తే నిషేధించనీ – వాళ్ళ కర్మ అది.

నా లతవు నీవు !

నా వనితవు నీవు !

నా కవితవు నీవు !

ఈ అమృత చేతనా త్రయ సౌందర్య సమ్యగ్రాగ రమ్యవు నీవు !

నీలో పర్యవసించి, ప్రవహించి పోతున్న ఆనంద లహరిని నేను.

*గాయకుడు గానమున, కవి కావ్య మందు,*

*శిల్పి శిల్పాన పర్యవసించి పోవు ;*

*కార్యమున కారణ మ్మిట్లు కరిగిపోవ*

*పొంగి ప్రవహించు ఆనంద పూర్ణ గంగ.*

# 24

తలంటి పోసుకొని

పన్నీటిలో స్నానం చేసి

తడి కురుల్ని ఆరబోసుకొంటూ

గుప్పుమని ముసురుకొంటున్న సాంబ్రాణి పొగ, చీకట్లలో చిక్కుకొన్న వెన్నెల వలె, తడి కురులలో తగులు కొని, బరువుగా లేచి, తెల్లగా, మబ్బుల్లా, ఆకాశాన్ని అలముకొంటూ ఉండగా –

చల్లగా పిల్లగాలులకు ఎదురెక్కుతున్న తుమ్మెదల బారుల వలె, మబ్బుల నీడల్లో విప్పారిన నెమలి ఫించాల వలె అలలు వేసే నీ కురులలో – చిక్కుపడ్డ నా ముఖం పూర్ణచంద్రుని పరాఙ్ముఖం కాగా –

ఆశ్వయుజ పూర్ణ సుందరిగా అవతరించిన నిన్ను – ఆ నీ ముఖ బింబాన్ని అలా నీ శిరో రేఖపై నుంచి వంగి ముద్దు పెట్టుకోవాలి నేను !

వదన కల్హారం మీది ఆ మత్త మధుపాలకు అమృతం గ్రోలించి మత్తెక్కించి అవి మత్తిల్లి మైమరచిన వెనుక, ఏత త్కల్హార దళాలకు కర్పూర తాంబూలం లంచం పెట్టి, రాగ రక్తిమను పంచుకొని, జ్యోత్స్నాసాగర మధ్యంగత సుధా కలశాన్ని పెదవులతో ఒత్తి ఆస్వాదించాలి నేను !

నా రెండు చేతులలో రెండు పీయూష భాండాలు !

నా పెదవులలో పూర్ణ సుధా రసబింబం !

నా చుట్టూ మృగశిర మబ్బులు !

నా నిండా విశాఖ మెరుపులు !

మేరు శిఖరాలను నొక్కితే పాల్కడలి మధనమై, అమృతం ఉప్పొంగాలి నా కోసం !

నా ఆశకు అంతు లేదు !

నీ కోసం ఎదురు చూస్తున్న కొలదీ – నా కోరికలు కళ్ళాలు త్రెంచు కొంటునై !

అలా నిన్ను తనివార అనుభవించి - తన్మయమై - అలా, అలా, అలా ఎంతసేపో ఒక్కరమై ఉండిపోయి, ఉండిపోయి, ఉండిపోయి -

లేచి, ఇద్దరమై, తప్పని నీ తిరోగమనంలో నిన్ను అనుసరించి -

నేలకు జీరాడి, నిఖిల సంపదలూ పండించే అ నీ కేశ సౌభాగ్యాన్ని గుండెలకు హత్తుకొంటూ -

గిరి శిఖరాలపై, సానువులలో, లోయల నిండా లావణ్యాలు కైలుచేసే వయ్యారాల తేనె వాగులలో పెదవులు ముంచుకొంటూ -

పద్మాలు పరిమళించే నీ పారాణి జాడల్లో అడుగులు వేసుకొంటూ

నిన్ను అనుసరించి - ఎంత దూరమైనా రాగలను నేను !

ఎంత దూరమైనా - ఎంత చీకటి నుంచైనా !

రమణీయ రజనీ కుమారిగా సాగిపోతూ, వెనుదిరిగి ఉదయ రవి చంద్రికగా నీవు ఎదురు తిరిగి నప్పుడు -

నీ వెచ్చని ఊర్పు తావులు నా వదనంపై సోకే దాకా !

నీ కేల్మోద్పులో నేను బాల సూర్యుణ్ణే అయే దాకా !

## 25

బాగా చిక్క పోయానట నేను

విశ్వం అన్నాడు నిన్న వచ్చి.

నీవూ ఎంతగా చిక్కిపోయావో కద !

చక్కనమ్మ చిక్కినా అందమే అన్నమాట నీ వంటి వాళ్ళను గురించి చెప్పినట్టిది. చిక్కినా బాగానే ఉన్నానట నేను కూడ !

అది నీ సహవాస భాగ్యం కావచ్చు !

ఏదో తపస్సులో ఉన్నట్టు కూడా ఉన్నానట నేను.

ఏదో వినూత్న సాహితీ సృష్టికి పునస్సంధానం జరగబోతున్న శుభ లక్షణాలు కూడా కనిపిస్తున్నాయట నాలో !

సాహితీ హృదయం తెలిసిన గొప్ప కవి, శాస్త్ర దర్శనం చేసిన మహా

విమర్శకుడు విశ్వం. లోకానికి ఎంతో సహృదయుడు, నాకు పరమ ఆత్మీయుడు, పరమోపాసకుడు.

చిన్న వాడైనా ఎంతో పెద్దవాడిలా మాట్లాడతాడు, ఎంతో చనువుతో నా దగ్గర.

ఇంకా ఏమేమో అనబోతూ ఉంటే, కాఫీతో అతడి నోరు కట్టేశాను వెంటనే.

నేను తపస్సు చేస్తున్న మాట నిజమే !

అయితే – అది ఏ వినూత్న సాహితీ సృష్టి కోసమో కాదు అది నీ కోసం!

సమస్త సాహితీ రసభావ సౌందర్య సమాహార స్వరూపం ఎవరో – ఆ నీ కోసం !

నీ సంపూర్ణ సాక్షాత్కారం కోసం !

అట్టి నీ సంపూర్ణ సాక్షాత్కారమే నాకు లభిస్తే – ఒక నాకు వేరే సాహితి దేనికి ?

సాహితీ సుధాంసం నీ అధర సుధా రసం కంటే మధురమా ?

నా తపస్సు ఎందుకో అతడి కేం తెలుసు ?

వినీలాకాశం లోకి ఎంతటి ఫ్లాష్ లైటును వేసినా, స్పష్టంగా మనకేమీ కనిపించదు. అలానే, మిస్టిక్ కవిత్వంలో రసానుభూతి లేదు – అన్నాడు విశ్వం.

కావచ్చు. నాకు బాగా తెలియదు – ఈ కవితా మతాలను గురించి.

జీవిత కృషిలో తీరికే లేదు నాకు

తీరిక దొరికితే, నీ గురించి తపస్సు.

కృషి – తపస్సు

తపస్సు – కృషి

ఇదే నా నిత్య కార్యక్రమం.

నాకు కావలసింది కవిత. అది ఏ మత పాత్రలో ఉన్నా సరే, ఏ వేష భాషల్లో ఉన్నా సరే, ఏ దేశ కాలాల్లో ఉన్నా సరే.

కాని –

మిస్టిక్ కవితలో అనుభూతి లేకపోయినా, దాని అభాస ఉంది. అది చాలు సామాన్యుడికి.

సాక్షాత్తు కాళిని భరించలేడు మానవుడు. ఆమె విగ్రహం చాలు అతడికి. దానికే చేస్తాడు ఎన్ని పూజలైనా.

మానవుడికి కావలసింది వాస్తవం కాదు – దాని అభాస.

భగవంతుణ్నే భరించలేడు, నిజంగా ఇంటికి వచ్చి కూర్చుంటే !

మానవుడు స్వతంత్రుడు, స్వార్థపరుడు.

తన తర్వాతనే – ఏ దేవుడైనా !

తనే కేంద్రం సర్వ సృష్టికీ !

పరిస్థితుల్ని తన వైపుకు వంచుకొనే టందుకు తాను కూడా కొంత వంగుతా డంతే!

భక్తి, గౌరవం, క్రమశిక్షణ, సంప్రదాయం, ఆచారం, నీతి వగైరా అన్నీ అతడి స్వార్థ సాధనకు ఉపకరణాలే.

తనకు అనుకూలిస్తే అనుసరిస్తాడు, ప్రతికూలిస్తే ధిక్కరిస్తాడు – సంఘాన్నీ, ఆచారాన్నీ, దేవుణ్నీ కూడా !

తాను వాస్తవం. తక్కిన దంతా ఆభాస.

ప్రతి మానవుడికీ అంతే !

అందుకే, ఏదీ వాస్తవం కాదని కొట్టి పారేస్తాడు జ్ఞాని.

బ్రహ్మజ్ఞానీ, నాలాంటి రస బ్రహ్మ కోరేది వాస్తవ సత్య సౌందర్య దర్శనం !

ఊహాసౌధాలు, ఊహా ప్రేయసులు, ఊహా దేవతలు, ఊహా స్వర్గాలు – వీటి తోడిదే లోకం సామాన్యుడికి.

అట్టి వాడి కోసమే ఈ మిస్టిక్ కవితా కర్మాగారాలు, ఈ అధివాస్తవికతా హోటళ్ళు, ఈ అభ్యుదయ సాహితీ ట్రేడ్ యూనియన్లు, ఈ భావకవిత్వ బార్లూ !

నా సెర్చి లైటు ప్రసరణ అయోమయం లోకి కాదు, వాస్తవ సౌందర్యం మీదికి.

అంతరాళమూ అనంద సుందరమే చూడగల కంటికి.
దృష్టి నైశిత్యాన్ని బట్టి దూరాలు, లోతులు కనిపిస్తై.
మిస్టిసిజం అంటే – ఎవరికి ?
నీవు ఇతర్లకి మిస్టి సిజమే కావచ్చు.
నాకు వాస్తవ మానవ కాంతవే కద !
పరోక్షంలో ఉన్నా, అపరోక్ష రాగ రమవే నీవు నాకు !
నీ సంపూర్ణ సౌందర్యం కొరకే ఈ నా తపస్సు.
సాక్షాత్కరించవా ఇక ?

*అందమెట నున్నదో, అమృత మట నున్నదే ;*
*అమృతమే ఆనంద, మదె నీ నివాసమ్ము !*
*నీ నివాసమె సదా నిశ్శ్రేయసము నాకు ;*
*సాక్షాత్కరించవే, సంపూర్ణ సుందరీ !*

# ఆశ్వయుజి

*మధుప వినుత వినూత్న హేమాబ్జ యుగళి,*
*మృగ మదాంబుద సంలిప్త మేరు యుగళి,*
*హస్త యుగళిని దాల్చి ముద్దాడి నాను*
*సరస వైశాఖి గూడి ఆశ్వయుజ వేళ !*

*చిమ్మ చీకట్ల కురులు మై చెంగలింప,*
*వదన పూర్ణిమ పై నుండి వంగి, వామ*
*నయన వక్షోంక మధుర లాంఛనము మీద*
*పెదవి మోపితి ఆనంద పదవి కొరకు !*

*మధుర మోహన మాపాద మస్తకమ్ము,*
*అమృత పూర్ణ కుంభము అంతరంగ రమత,*
*పదముల పదాలు – తీయని పెదవి పెదవి –*
*రమ్య వైశాఖి శారద రమ్య నాకు !*

శరచ్చంద్ర పూర్ణ సుందరమైన వెన్నెల రేయి !
ఎంత హాయి !
ఒకరిపై ఒకరం వెన్నెల చల్లుకొని
ఒకరితో ఒకరం బాగా ఒరిసిపోయి

ఒకరిలో ఒకరం పూర్తిగా కరిగిపోయి

ఆనంద మధుర పయోనిధిలో మునిగిపోయిన ఆ వెన్నెల రేయి !

ఎంతో కాలంగా ఎదురు చూచిన రేయి -

ఎన్నో జన్మల నుంచి - కలువల కాలి దిండుగా, మల్లెల మధుతల్పంగా, తారల పూల పందిరిగా, చల్లని గంధపు గాలుల వీవనలతో - లజ్జా కజ్జల కమనీయ కాంతిరేఖ అయి - మనవెంట వస్తున్న రేయి !

మన రేయి !

మనం మనమైన రేయి !

ఎంత హాయి !

అశ్వినీ దేవతల హస్త వాసి వలె, ధన్వంతరి చేతి సుధాకలశం వలె, నా అధరామృత ధారా దేవివై అవతరించిన ఆశ్వయుజీ రూప రాగవైశాఖీ !

ఓహో !

ఆనందం !

నే నెరుగని, ఊహించని, వర్ణించలేని - ఒళ్ళెరుగని - అదేదో, ఏదో, పరమానుభూతి ! పరమానంద విభూతి !

శరీరాలే హృదయాలై కరగిపోయినై - ఏదో ఒక అపూర్వ సౌందర్య లహరి లోకి !

నీ లోకి !

మన రెండు  శరీరాలూ ఏకమై నీ లోకి !

హృదయా లే మైనవో !

విశాల చాంద్రాంతరాళమే శృంగార శయ్యాగృహం కాగా

శయ్యా సౌభాగ్యమే మనం కాగా

ప్రేయః పరిధిపై రాసక్రీడలలో అలసి, శ్రేయః కేంద్రంలో తన్మయించిన ఆ మనమే -

శివ పారమ్యం నుంచి వస్తూ - శివపారమ్యం లోకి పోతూ - మధ్యలో తలెత్తి చూచుకొని, కలిసికొని, కౌగలించుకొని, కరిగి పోయిన ఆనంద తరంగాలం ఆ మనమే -

ఏమై పోయామో తెలియని ఆ రేయి !

ఆ పండు వెన్నెల రేయి !

*మిన్నేటి తీరాల, వెన్నపూల వనాల,*

*పాలపచ్చిక మేసి, పరవశిల్లిన రేయి !*

*పండు వెన్నెల రేయి ! గుండె పండిన హాయి !*

*అమృత మొసగిన రేయి ! ఆనంద రసపాయి !*

# 27

ఎంత మంచి తోటమాలిని నేను !

పుట్టుక తోనే తోట మాలిని నేను !

"ఒక్క గంట సేపు ఆనందించా లంటే విందుకు కూర్చో, ఒక్క రోజు పాటు ఆనందించా లంటే పెళ్ళి చేసుకో. జీవిత కాలమంతా ఆనందించా లంటే తోటమాలివి అవు" అన్నా డట ఒక వివేకి.

అతడూ నా లాంటి తోటమాలే అయి ఉండవచ్చు.

తోటల్లో పుట్టాను, తోటల్లో పెరిగాను, తోటల్ని పెంచాను. తోటల్ని ప్రేమించాను నేను.

పచ్చిక బయళ్లు, పైరు మొక్కలు, తీగలు, చెట్లు, పువ్వులు, పండ్లు, పిట్టలు, పాదులు, కోనేళ్ళు, వాగులు, లేగ దూడలు, లేడి పిల్లలు, తేనెలు, తుమ్మెదలు, వసంతాలు, వర్షాలు - ఎన్ని ఎన్ని మధుర స్నేహాలు ! ఎన్ని ఎన్ని స్నేహ అను భూతులు !

ఎన్ని తోటలు పెంచాను
ఎన్ని అందాలు పూయించాను
ఎన్ని మాధుర్యాలు పంచాను నా చుట్టూ !
ఆరి తేరిన తోటమాలిని నేను !
ఇంటా బైటా కూడా తోట మాలినే నేను
నిద్ర లోను మెలకువ లోను కూడ తోట మాలినే నేను !
అతిశయోక్తి కా దిది
ఇప్పుడీ తోట చూడు !

ఇంత విశాలమైన, ప్రాణ సుందరమైన, మనో మోహనమైన తోట ఈ నగరం లోనే కాదు, ఈ లోకం లోనే ఉన్నదా ?

నీలి మబ్బులు నెమళ్ళ వలె పురులు విప్పి ఆడతై నా పాటకు.

ఋతు భేదం లేకుండా మధుప్రియులు వీణల వలె మ్రోగుతై నా మెప్పుకు.

కమల వనం నిండా కలువలు, కలువ కొలను నిండా కమలాలు - ఉదయం తెల్లగా, సాయంత్రం ఎర్రగా వికసిస్తై నా చూపుకు.

ఇక నా చిరునవ్వుకు -

నెలవంకలు, చెరకువిండ్లు, మెరుపుతీగలు, కాటుకవానలు, ఎర్ర గులాబీలు, చంపక పుష్పాలు, అమృత బింబఫలాలు, సువర్ణ రసాలు, రత్న సానువులు, హిమానీ నదాలు, మానస హ్రదాలు, దూర్వాక్షేత్రాలు, రంభావనాలు, ఉన్నత సైకతాలు, హంసలు, కోకిలలు, కూజితాలు -

"అబ్బా - చాలు ! చాలు ! చాలు !"

ఓహో, మేనే మరచిపోయాను కదూ !

ఈ అందాలన్నింటికీ నేనే బ్రహ్మ విష్ణు మహేశ్వరులు !

"ఇంతటి సుందరోద్యానం ఎక్కడున్నదీ ? ఒక్కసారీ చూపలేదే !" అంటున్నావా?

అదిగో చూడు - ఆ నిలువుటద్దంలో, ఈ నా చేతుల్లో !

*అందాల తోటవే !*
*ఆనంద సుందరివే !*
*నా ప్రణయాంజలిలో*
*నవ మధు దేవతవే !*

## 28

శుక్ర గ్రహాన్ని సానపట్టి తీసిన రజనును వెన్నెలలో తడిపి చేసిన వీణవు నీవు.

బాల సూర్యుని అరుణ కిరణాలను తీగలుగా బిగించి, అనురాగ రాగాలను శ్రుతి చేసి, వాగీశ్వరుడు కారుణ్యంతో నా కందించిన రాగవీణ ఇది !

ఎంత నవనీత కఠినంగా ఉన్నదిది !

ఎంత బిగువుగా ఉన్నై తీగలు !

నేరని నా శిలా మృదుల కరాంగుళులు దీన్ని ఎలా పలికించగలవో !

హేమగిరి మూలమే అయిన ఈ నితంబ సీమను నా అల్పాంకం ఎలా భరించగలదో !

పూర్ణోదయ చంద్ర బింబాల లాంటి ఈ సువర్ణ తుంబీ ఫలాలను కత్తి వంటి నా భుజశృంగం ఎలా మన్నించగలదో !

అనుమానంతో

భయంతో

వణుకుతున్న హస్తాలతో

అందుకొన్నాను నేను వీణను !

సంధ్యారాగ సుందర పటాచ్ఛాదనను తొలగించాను మెల్లగా !

ఓహో, నా భాగ్యం !

వీక్షణ మాత్రం లోనే స్పందించి, స్పర్శా మాత్రం లోనే పలికింది వీణ - సిగ్గుపడుతూ, ముద్దులొలుకుతూ, అలవోకగా స్థాయి పెంచుతూ, ఆకాశ గంగలా జాలువారుతూ !

తారా పథాల కల్పవల్లికల చివళ్ళలో చివురిస్తూ, నా హృదయ కమలం లోకి ఆనంద మధువుగా దిగివస్తూ !

ద్రవించి పోయింది వీణ నా కరతలంలో !

ద్రవించి, ఆపాతమధురమై స్రవించింది - నా జీవనాడుల్లోకి !

ఎంత మధురం, ఎంత మహితం ఈ రాగ డోలా లీలోత్సవం !

నా రాగ వల్లకివి నీవు !

నా ప్రాణ వల్లభవు నీవు !

నా ఆనందరాగ సరస్వతివి నీవు !

ఆలపించు-నిరంతరంగా ఆలపించు - అనురాగ రాగాలను నా నిండా ఆలపించు !

అనురాగమే మూలరాగం ఈ సృష్టికి !

ఆనంద చేతనను మీటే మేళకర్త ఇది.
తదితరమైన సర్వ స్పందనలూ దీనికి జన్యాలే
ప్రతి హృదయవీణా దీనికి అనుకృతే !
ప్రతి అనుకృతీ నీలోని ఒక అనుభూతే !
రాగవీణా !
వీణాగాన సముజ్వల రసాలినీ !
రసాలినీ జగచ్ఛాఖీ !
వైశాఖీ !
ఆలపించు !
నీ గాన ౖక్ష్మికి మహాలక్ష్మే నీరాజనం ఇచ్చేలా ఆలపించు !

## 29

ఎంతసేపు, ఎంతసేపు,
ఈ ఎదురు చూపు ?
కన్నులు కాయలు కాయ !
కలువలు తామరలు కాగ !
అమృత మీయకుండగనే
అనిమేషుని జేసితివే ?
ఆకలితో, దాహముతో,
అంతులేని మనుగడతో !
వస్తావను కోలేక,
రావనుకొని పోలేక,
నిన్నటి సుఖ భోగాలను
నెమరు వేసుకొనుచు ఇట !
ఎంత సేపని ఈ ఎదురు చూడ్డం !
కూర్చున్నాను చెట్టు క్రింద ఎదురు చూస్తూ ఎంతసేపటి నుంచో !

నాకు నీడ పట్టిన గున్నమామిడి నీ నీడలా ఉండి, వెనక్కి తిరిగి చూశాను నీవు వచ్చేశా వనుకొని !

ఆకులు కనపడకుండా పూచిన నందివర్ధని – వెన్నెల పట్టు చీర కట్టుకొన్న నీవులా కనిపించి – పిలిచింది నన్ను దూరంలో !

అది నందివర్ధని చెట్టే అనుకొంటూ వచ్చాను నీ వద్దకు.

కాని – అది నిజంగానే నీవు కాదు !

తెల్లని చీర, తెల్లని రవిక, తెల్ల కలువ పువ్వుకు ముద్దులు మప్పే ఆ ముఖం. వెనుక నల్లని కేశరాశి – ఆకాశం నుంచి అవనికి దిగి వచ్చిన జోత్స్నాదేవివి నీవు !

అదిగో వచ్చావు !

రాలేదను కొంటున్నాను నేను !

ఇది కృష్ణ పక్షం !

ఈ వెన్నెల అంతా ఎక్కడిది మరి ?

నీవు ప్రక్క లేకుండా ఒక్క అడుగైనా వెయ్యలేని నేను ఇంత చీకటిలో, ఇంత దూరం ఎలా నడిచి వచ్చాను !

నీవు నా కూడానే ఉన్నావు

హృదయంలో ఉన్నావు

లోన నీవు నడుస్తుంటే, బైట నేను నడుస్తున్నాను. లోన ఉన్నావు నీవు.

బైట లేవు ! బైటికి వస్తానని రాలేదు ! అదీ సంగతి !

లోన ఉన్నంత మాత్రాన చాలదు. నా బైట కూడ కనిపించాలి నీవు నాకు!

నా కౌగిట్లో కరిగి, నా లోకి ఇంకిపోవాలి నీవు !

అందుకూ ఈ ఎదురు చూడ్డం !

అబ్బ ! ఎదురు చూడ్డం ఎంత బాధ !

ఎవరో వస్తున్నారు !

పూలతో ఆడుకొంటున్న పిల్లగాలి !

అదిగో నీ చిరునవ్వు !

మిణుగురు !

నవ్వులాటగా ఉంది ప్రకృతికి నన్ను చూస్తే !

భుజంపై చేయి !

దొరికావు !

పూలకొమ్మ !

వెతుక్కోవడంలో ఆనందం ఉంది. ఎదురు చూడ్డమే బాధ !

నా చుట్టూ నీ సమక్షమే. నీవే లేవు !

ఎందుకు రాలేదో!

దుర్భరం ఈ వియోగం!

*నిన్ను దివ్వెగ బట్టి,*

*నీ కొరకె వెదకి -*

*విసిగి వేసారి, ది*

*వ్వెను పారవైచి -*

*పొగులులో పడి మున్గిపోతిని !*

*నాకు నీ*

*పొగలలో గుడి కట్టుకొంటివి !*

# 30

కళా సి సృక్ష

సౌందర్య బుభుక్ష

జంతువు నుంచి మనిషిని విడదీస్తున్న గుణాలు ఈ రెండూ !

ప్రకృతికి మెరుగులు దిద్దేది కళ

కళను రసబ్రహ్మకు చేర్చేది సౌందర్యం.

కళా మనస్కత, సౌందర్య మనస్విత లేని మానవుడు కేవలం మృగప్రాయుడు.

"మన ప్రేమను ద్వేషిస్తున్న పెద్ద మనుష్యులు, మనల్ని అల్లరిపాలు చేస్తున్న రౌడీలు – వీళ్ళంతా అలాంటివాళ్లే !" అన్నావు కదూ ఒకనాడు ?

కాదు అన్నాను నేను !

మనల్ని లాలించే దంతా మంచీ కాదు, బాధించే దంతా చెడ్డా కాదు.

నీ ప్రయోజక దృక్కోణం నుంచి నిర్ణయించకూడదు మంచి చెడ్డల స్వరూపాన్ని.

లోకం అంతా మంచిగా నిర్ణయించిన ఒక విషయం నీ ప్రత్యేక వ్యక్తిత్వానికి అడ్డం రావచ్చు. నీ వైయక్తిక ప్రగతి కోసం దాన్ని నీవు ధిక్కరించనూ వచ్చు.

అలా ధిక్కరించిన వాళ్ళే మన మహర్షులు, ప్రవక్తలు, నియంతలు - మానవ ప్రగతి చరిత్రకు ప్రధానాధ్యాయాలైన వాళ్ళంతా !

కేవల సామాన్య మానవులకు సంబంధించినంత వరకు నీవు చెప్పిందే నిజ మనిపిస్తున్నది నాకు !

మనల్ని, మనలాంటి అనేకుల్ని ఏడ్పిస్తున్న వాళ్ళందరూ విద్యావంతులే, ఆధునిక నాగరిక సమాజంలో అగ్రతాంబూలం అందుకొంటున్న వాళ్ళే !

స్నేహం, సౌందర్యం, మనోవైశాల్యం, కళా హృదయం ఏవీ లేవు వాళ్ళకి.

వాళ్ళు కోరేది సౌందర్యం కాదు, సెక్సు.

మనకు మొరటు మనుషులుగా కనిపించే గ్రామీణులే నిజంగా కళా హృదయులూ, సౌందర్యోపాసకులూ !

ఇక్కడ పులితోళ్ళు కప్పుకొని, తోడి మనుషుల్నే తినివెయ్యవచ్చు. మేకతోళ్ళతో బలికి సిద్ధపడనూ వచ్చు.

వేష భాషలు లోకంలో బ్రతకడం కోసం.

మృత్యుకుడ్యాన్ని చొచ్చుకొని అద్దరికి పోలే వవి.

పరమాత్మ ఎదుట నిలిచేది నగ్నాత్మ.

అది కళా సౌందర్య పరిస్నపితమో, లోక వ్యవహార పంకిల దుష్టమో తేలేది అక్కడ !

ఇక్కడ అతడు రిక్షావాలా కావచ్చు. రాజ్యపాలకుడు కావచ్చు. అక్కడ అతడి విలువను తేల్చేది అతడి కళా ప్రవృత్తి. అది ఆత్మ సంబంధి.

కళకు రాణి సాహిత్యం

సౌందర్యానికి రాణి నీవు.

సాహిత్యాన్ని నా కుడిచేత, నిన్ను నా ఎడమ చేత ధరించిన ధీర లలితుణ్ణి నేను !

సాహిత్య సృష్టికి నా మొదలువు నీవు.

రసాలు ఎనిమిదా, తొమ్మిదా అన్న వాదం శుష్క సైద్ధాంతికులకు.

నాకు ఒక్కటే రసం

అది నీ దరహాస వదన సారసం !

సౌందర్యమే నీవు

నీవే కళ

శరీర పరిధిని దాటిన రిరంసే కళా సి సృక్ష !

దాని ఆత్మోపరతే సౌందర్య బుభుక్ష !

*రాస వేదిక నుంచి*

*రాగమై ప్రవహించి*

*నీ ప్రణయ మధు వెల్ల*

*నిలిచెనే నా యెదను !*

*రాధ నారాధించి నానే !*

*నిన్ను*

*రస రమ్యంగా పొంది నానే !*

## 31

ప్రతి క్షణమూ నీవు వస్తావని ఆశిస్తూ, ప్రతి అలికిడీ నీ అడుగుల చప్పుడే అనుకొంటూ, ప్రతి పలుకూ నీ కంఠస్వరమే అని వింటూ, ప్రతి మెరుపూ నీ చిరునవ్వే అని చూస్తూ – ఎన్ని యుగాలు గడిపానో నేను ఈ సాయంత్రం మధు శిలపై !

ఎందుకు రావడం లేదో నీవు !

ఏమై పోయావో నీవు !

వర్తమానం లేదు !

వార్త కూడ లేదు !

అనూరాధ ఏమి చెప్పిందో మీ వదినకు ! ఆశ్లేషయ్య ఏమి ఊదాడో మీ అన్న చెవిలో !

గయ్యాళికి, రౌడీకి భయపడి పోతుంది సజ్జన లోకం ! వాళ్ళకు లొంగి పోతుంది బేషరతుగా ! ఎందుకనో ?

న్యాయంపై కంటె, తమను తాము కాపాడు కోవడం పైనే దృష్టి ఎక్కువ సజ్జనులకు.

వట్టి కుమ్మరి పురుగులు ఈ సజ్జనులు !

గయ్యాళి నోరు, రౌడీ చేయి - లోకాన్ని పాలిస్తున్న మహాశక్తులు ఈ రెండే !

ఇప్పటికే అనుమానిస్తున్నారు మీ వాళ్లు మనల్ని. అగ్గికి ఆజ్యం అందిస్తున్నారు - అసూయా పరులూ, ఆకాశ రామన్నలూ, ఆత్మలు కుళ్ళిన వాళ్ళూ !

అయితే -

మీవాళ్ళు అంత సంకుచిత ప్రజ్ఞులు కారుగా ?

మరేమిటి కారణం ?

అనారోగ్యమా ? నీకా ? ఏమో - మానవులం ! శరీరాలు వట్టి మట్టి కుండలు !

ప్రమాద మేదీ జరగలేదు కద ?

కళ్ళు మూసుకు నడుపుతారు కొందరు కార్లు. వాయువేగంతో పోతారు కొందరు కోతులు. ఇక, లారీలు ఖడ్గమృగాలే కద ?

చీకటి పడితే - ఈ మానవ మహానగరం సందుగొందులు క్రూరమృగాలకు ఆటపట్లై పోతై ! మనిషే మనిషిపై దూకుతాడు పంజా విప్పి !

గుండె గుబేలు మంటున్నది !

ఏమిటీ కుశ్శంకలు నాకు !

అమిత ప్రేమ అశుభాన్ని శంకించవచ్చు కాని, ఇంత ఘోరం గానా ?

వివిధ దుస్సంఘటనల మధ్య నీ రూపాన్ని ఊహించుకొని ఏడుస్తున్నది నా మనస్సు !

నీ కోసం సర్వస్వాన్నీ అర్పించగల నేను నిస్సహాయుణ్ణై పడి వున్నా నిక్కడ !

మానవుని మనోనేత్రం ఎంత గుడ్డిది !

మానవశక్తి ఎంత అల్పాల్పం !

చిలుకను స్వేచ్ఛగా వదిలా ననుకొంటూ, పంజరాన్ని ఎగరవేస్తాడు మనిషి !

ఎంత అజ్ఞానం !

ఈ అజ్ఞానావరణను చీల్చుకొని, బైటపడి, వెదకలేను నేను !

అంతా అంధకారం !

నా అనుమానం గాని – నీవు క్షేమంగా ఎందు కుండవు ?

ఉంటే – ఎందుకు రావు ?

తెలీదు !

అందుకే ఏడుస్తున్నది మనస్సు.

శరీరాని కున్న దీపం కూడా మనస్సుకు లేదు !

**ఏలా తీరని వాంఛ లిన్ని మదిలో**
**సృజ్యమ్ము లౌ జీవికిన్ !**
**కాలన్ సంకెలలన్ దగిల్చి, కదలం**
**గా నీక బంధించి, స్వే**
**చ్ఛా లోకమ్ముల మానసమ్ము విహరిం**
**చన్ జేయు ఆంధ్య మ్మి దే**
**వ్యాళమ్మో ! ఇటు ముంచెదున్ ప్రకృతి కే**
**లాడించు మంత్రాంగమై !**

## 32

"మీ కోసమే పుట్టాను నేను.

"నా ఆత్మ, మనస్సు, హృదయం, శరీరం – ప్రత్యణువూ మీదే

"నిజంగా, మీ వీణను నేను

"ఈ నా సహస్రాధిక జీవతంత్రులపై క్షణాని కొక రాగం పలికిస్తున్నారు మీరు

"ఇలా పలుకుతూనే - తారాస్థాయికి లేచి, దాన్ని కూడ దాటిపోయి, రాగాల కొసల నుంచి గెంతి, మీ హృదయ పయోధి లోకి దూకెయ్యాలని ఉంది నాకు.

"తీగలు పట్ పట్ మని తెగిపోవాలి మీ మునివ్రేళ్ళపై. వీణ సమస్తం ఒక క్రొత్త రాగమై కలిసిపోవాలి మీ రాగ పారమ్యంలో.

'గతాన్ని శిశిరంలా రాల్చేసి, మీలో ఐక్యమైపోవాలి ఈ నా ప్రణయ వసంతం.

"గతం మృతం. భవిష్యత్తు అమృతం. నా భవిష్యత్తు మీరు. మిమ్ము నా కింత కష్టసాధ్యం చేస్తున్న వర్తమానం ఎంత చెడ్డది ? దీని సంకెళ్ళు ఎలా తెగిపో తవో ?"

ఆనాడు నీవు వ్రాసిన ఆ లేఖ ఈనాడు గాని నా కర్థం కాలేదు.

నిన్ను వర్తమానం బంధించి వేసిందా, దేవీ !

కుల మత వర్గ విభేద దుష్టమైన వర్తమానం ! ఎంత ఘోరం !

నా రాగ సరస్వతివి నీవు.

నీ రాగ మోహన మధుర నాదం ఇక నాకు వినిపించదా ?

నీ రాగ రంజిత లోచన కాంతి ఇక నాకు కనిపించదా ?

నీ రాగ రోచి ర్వి నిర్మల దరస్మితం ఇక నాకు లేదా ?

నీ రాగోజ్జ్వల పులకాంకిత తను స్పర్శ ఇక నన్ను మై మరపించదా ?

ఆ నీ ఆలింగన సౌభాగ్యం -

ఆ నీ పరిచుంబన పరమైశ్వరం -

ఆ నీ -

ఊహించ లేను ఇక !

ఇక నేనే శాశ్వతంగా చెవిటివాణ్ణీ, గుడ్డివాణ్ణీ, తనుస్పర్శా మనోభావాదులు లేని పరమశూన్యుణ్ణి అయిపోవలసిందేనా ?

అసూయ తప్ప ఆత్మీయత తెలియని వర్తమానం - వంశ ప్రతిష్ఠల పేరుతో ప్రణయ పవిత్రతల ప్రాణాలు తీసే మూర్ఖత్వం - ఇక మనల్ని కలుసుకోనివ్వదా ?

ఇక నీవు రావా ?

ఇక నేను లేనా ?

అయ్యయో ! జీవన వసంతమా ! త్వదీయ

గర్భమున ఎన్ని పూల రాగములు మాసి

పోయె ! ఎంతెంత మధు వింకిపోయె ! ఎంత

శోకమును మ్రింగి, త్రేను వీ శోభ నీవు !

## 33

ఆనాటి ఆ నీ లేఖకు, ఆనాడే నీకు నే నిచ్చిన జవాబు – నా స్మృతి పథంలో రగిలి, యావచ్ఛరీరాన్ని దహించి వేస్తున్న దీ నాడు.

రాగమయీ !

నిజమే !

మనం తరచు కలుసుకోడానికి అవకాశం లేకుండా ఉంది.

మనస్సులకు ఉన్న స్వేచ్ఛ శరీరాలకు లేదు.

స్వేచ్ఛ ఉన్న మనస్సులు కలిసే ఉన్నై కద !

శరీరాలకు అధినేత సమాజం, సమాజానికి లక్ష సంకెళ్లు. జాతి, మతం, కులం, శాఖ, వర్గం, స్థితి, గతి, శాంతి, భద్రత – ఇలాంటివి ఎన్నో దాన్ని ముందుకు కదల నివ్వవు.

ఇలాంటి వాటిని ఆసరా చేసుకొని, స్వార్థపరులు ఎందరో తమ స్వప్రయోజనా లను సాధించుకొంటూ ఉంటారు.

ఆత్మార్పణ చేసుకొన్న ప్రేమను ఇవేవీ నిరోధించలేవు. తాత్కాలిక జయాలు కొన్ని వాటికి లభించినా, తుది విజయం ప్రేమదే.

అయినా – ఎందు కంత బెంగ ?

అనుభవాలు సెలవు పెట్టినప్పుడు – అనుభూతులు లేవా మనకు ?

నీవు ఎదురుగ్గా ఉన్నప్పుడు గతం జ్ఞాపకం ఉండదు నాకు.

నీవు లేనప్పటిది నిన్ను గురించి ధ్యాస.

నీవు లేని దెప్పుడు ?

గత ॅ ౖతి విరామ లక్షణం.

వెనక్కి తిరిగి చూచుకోవడం ఆగినప్పుడు కద ?

ఆగే తీరికా, అవసరమూ లేదు నాకు.

నాకు నీవు ఎల్లప్పుడూ అపరోక్ష రాగ బ్రహ్మవే !

నా మఃోవాక్కాయాలలో ఏదో ఒకటి నిన్నెల్లప్పుడూ అనుభవిస్తూనే లేదా ?

నా ఆత్మకు కూడా నీ ఆత్మే కదా పుట్టిల్లు ?

నీకూ అంతే కద ?

ఎందుకు మరి ఆ బెంగ ?

నీతో నా కెప్పుడూ ఎడబాటు లేదు.

గతం మృతం అంటావు నీవు !

నాకు అసలు గతమే లేదు.

కాలం ఒక్క వర్తమానమే నాకు !

భూత భవిష్యత్తులు – కాలి ధూళీ, నేత్ర కాంతీ మాత్రం !

నీ పరమావధి నేను.

నా సృష్టి శిల్పానికి మోడలువు నీవు.

ధరిస్తావు నీకు నచ్చిన దుస్తుల్నీ, అలంకారాలనూ, అంగరాగాలనూ – అభిగామిక వైహారిక విస్రంభణంగా !

ప్రదర్శిస్తావు నీకు ముచ్చటైన రంగుల్నీ, హంగుల్నీ, వంపుల్నీ, వయ్యారాల్నీ – నాకు నచ్చిన రీతిలో !

అందిస్తావు అమృతాన్నీ, ఆనందాన్నీ !

ఓజస్వినివి నీవు !

ఉజ్జ్వల రసరాజ్ఞివి నీవు !

నిత్యం నాతోనే ఉంటూ, ఎందుకు వియోగ దుఃఖభీతి ?

(అప్పుడు నీ వన్నావు – "నీ" బదులు "నా" ఉంచుమని !)

కావచ్చు !

అయితే – తీసి పారెయ్ అవన్నీ ! ఆ దుస్తులు, అలంకారాలు, ప్రదర్శనలు, ప్రసాదాలు అన్నీ !

చీరే అడ్డ మైనప్పుడు, శరీరం అడ్డం కాదా ?

నగ్నం కా – ఆత్మ దాకా !

నీ ఆహార్యం నా చిత్ర శిల్పాన్ని పులిమి వేస్తున్నది !

దర్శించనీ నన్ను నీ నగ్నాత్మను. స్పృశించనీ నీ రాగాత్మను. అనుభవించనీ నీ రసాత్మను !

ఆగనీకు నన్ను
ఇవ్వకు విశ్రాంతి
పేరుకోనీకు గతాన్ని
విదల్చి పారెయ్ ఆ ధూళి నంతా
కాళ్లు కడుక్కో ఈ నా ఆనంద బాష్ప సరోవరాలలో
స్నానమే చేసెయ్ పూర్తిగా !
వర్తమానాన్ని నిందించకు
మనమే వర్తమానం ఎల్లప్పుడూ
నీవూ – నేనూ
ఎదురు బొదురుగా !
ఒకరి కొకరం నిలుపు టద్దాలమై !
ఆత్మ కాదా నగ్న దీపాలమై !
రాగసుందరీ !
అలాంటి వాళ్ళం కదా మనం !
మరి –

నాకు ఎంతటి ప్రియమైన వర్తమానమేనా – ఈనాడు నిన్ను నిర్బంధంలో ఉంచినట్టిది !

అంతటి ఆత్మవాదిని నేనేనా నీ రూపం కనిపించక ఇప్పుడిలా ఏడుస్తు న్నది !

ఎలా భరిస్తున్నావో వాళ్ల ఆ నిందా వాక్యాలు, ఆ తీవ్రకోపాలు, ఆ తిరస్కారాలు – రాసి రంపాన్ని పెట్టే ఆ హింసాకాండ నంతా !

ఎంతమంది, ఎంతకాలం కాపలా ఉండగలరు స్త్రీ చుట్టూ ? అభిమానవతిని అనుమానించడం అవమానించడమే కాదా ?

స్త్రీకి స్వాతంత్ర్యం ఇవ్వకూడదన్న దుష్టనీతి ఇంకా ఎంతకాలం దాగి ఉంటుందో మానవ మనః కూపంలో – దీపం క్రీనీడలో నల్ల త్రాచు వలె !

*కాలాహి పడగపై*

*బాలార్క మణి అదే !*

*పడగ నీడను బ్రతుకు*

*ప్రాణాల కదె మెతుకు !*

*పాము చీకటి పుట్ట చేరులే ! జగము*

*సోమ శేఖరు గూడి ఆడులే !*

# 34

"రోజుకు రోజు, మరింత మోజు"

అవును, నవ నవోన్మేష రాగశాలినివి కదా నీవు !

"మరి దేనికి బెంగ ?"

అవును. బెంగ దేనికి. మనం ఆత్మీయంగా కలిసే ఉన్నాం. శారీరకంగా కలుసుకుంటూనే ఉన్నాం.

"మీ కివ్వని దేముంది నా దగ్గర ?"

అవును. ఏమీ లేదు.

"నేను మీ కంటి పాపనే కదా ? ఎందుకు నన్ను అలా కన్నీరుగా కార్చి పారేస్తారు ?"

అవును. గుండె బలహీనత.

"ఏవో తాత్కాలిక మైన ఆటంకాల వల్ల, నేను రెండు రోజులు కనిపించనంత మాత్రాన – ఇంత బాధ పడిపోతే ఏలా ? నేనేమైపోయాననుకొంటున్నారు ?"

ఏమైపోయావో తెలియకనే కదా, దేవీ, ఈ బాధ – ఈ బెంగ – ఈ కన్నీరు ?

గ్రీష్మంలో మలయ మారుతంలా, అమావాస్యకు దీపావళిలా, ఎంత

ఉపశమనాన్ని, ఎంత ఆశాకాంతిని తీసుకువచ్చిందీ ఈ నీ లేఖ నాకు !

జీవిత యాత్రలో ఏదో అలసట, అశాంతి, నీరసం, నిరాశ కలిగినప్పు డెల్లా - చూపు మాత్రం లోనే ప్రాణానికి ఇంత హాయిని కలిగించే ఈ నీ లేఖలు నిజంగా అమృత కలశాలే !

అవును. నీవు కలిగిన నేను అమృత చైతన్య బ్రహ్మనే!

నీ వంటి రాగ సరస్వతిని ఒక్కసారి గుండెకు హత్తుకొనే అదృష్టం కలిగిన ఎవరైనా సరే రాగబ్రహ్మే.

బెంగ, బాధ, కన్నీరు ఏమీ లేవు నాకు.

కాని -

చూడా లనుకొన్నప్పుడు నిన్ను చూడలేక పోతేనే తెగిపోయే నా నరాలు - ఇన్ని రోజులు నిన్ను చూడకుండా, ఏమై పోయావో తెలియకుండా ఎలా ఉండ గలను ?

అంతవరకు లేవనుకొన్న బెంగలు, నీ సమక్షంలో కనిపించని భయాలు, బాధలు అన్నీ - నీ పరోక్షంలో ఎక్కడి నుంచి వస్తవో - ముట్టడించి చంపేస్తై నన్ను !

నీవు దగ్గర లేకపోతే, ఎందుకు నా కీ శరీరం ?

నాకు కావలసింది లేఖ కాదు, నీవు !

అమృత కలశాలే కావచ్చు లేఖలు !

క్షణాని కొక కొత్త భావనతో, కొత్త మాధురితో, కొత్త కాంతితో ఆత్మకు ఆనందోపరతిని కలిగిస్తూనే ఉండవచ్చు అవి !

అయినా తృప్తి లేదు

శరీరం తపించి పోతున్నది

మనస్సు ఏడుస్తున్నది

ఇదేనా జీవితం ?

నీకూ, నాకూ మధ్య ఈ దూరమేనా జీవితం !

ఎలా ఉన్నావో ఒంటరిగా, ఆ అజ్ఞాన తమో మాయావరణంలో !

# 35

"ప్రణయ పరంజ్యోతీ !"

"ఎందుకిలా ముట్టించారు నా ఆత్మకు ఈ విరహాగ్నిని ?"

"కాలిపోతున్న దిది రాత్రి పొడుగునా - అగరువత్తి అయి !"

"మీ సంయోగమే పగలు, మీ వియోగమే రాత్రి నాకు."

"వత్తి కాలుతున్నప్పుడే దాని పరిమళమూ, ప్రయోజనమూ, అస్వాదయోగ్యతా - నిజమే."

"ఈ పొగల వెన్నెల మబ్బుల మధ్య, ఈ పరిమళాల ఘుమఘుమల మధ్య మైమరచి - నన్ను నన్నెల్ల ఆస్వాదించి, జీవితం తెల్ల వార్చడమే మీ అభిలాష అయితే - సరే !

"కాని -

"రేపటికి మీకు మిగిలేది వట్టి నుసి మాత్రమే"

"వట్టి నుసి - బూడిద !"

"అది ఏ వత్తిదైనా ఒక్కటేగా ?"

"నిశాంతంలో, తూర్పు దిశా ముఖాన మీరు అరుణోదయంలా అవులించి, లేచి చూచుకొన్నప్పుడు - ఏం ఉంటుం దక్కడ ?

"మీ ఆవులింత గాలికి ఆ నుసి కూడ ఎగిరిపోయి - ఆనవాలు కూడా ఉండ దక్కడ !"

"నే నేమైనా కానీ - "

"ఎన్నెన్ని ఆత్మవత్తులు ఇలా పూర్ణార్పణ చేసుకోకపోతే - ఉదయభానుడై వెలుగగలరు, లోకాన్ని వెలిగించగలరు అహరహం మీరు ?"

"శయ్య చుట్టూ, గది నిండా వెలిగించుకోండి నాలాంటి అగరువత్తుల్ని, కర్పూర దీపాలను అనంతంగా."

"ఆ పొగ మబ్బుల్లో, పాల-తరగల్లో, వెన్నెల వెలుగుల్లో మత్తిల్లి, జొత్తిల్లి ఆనందించండి చల్లని జాబిల్లిగా !"

"అందులో ఒక వత్తి నైతే చాలు నాకు. మీ పాదాల దగ్గర ఒక్క చిన్న అగరువత్తి నైతే చాలు నాకు."

"మీ ఆనందమే కదా నా ఆదర్శం ?"

"కాలి పోనీండి నన్ను ఇలా !"

"ఈ రాత్రంతా ఇలా కాలిపోనీండి నన్ను. కలిసిపోనీండి మీలో – కమ్మని తావినై, ప్రాణ వాయువునై – మీ అణు వణువునా !

"మీ కన్నులలో కాంతినై వికసించనీండి నన్ను – రేపు మీ ఉదయ భాస్కర ప్రాభవంతో !"

"మీ లోనే ఉన్న నా కోసం వెతుక్కోకండి బైట, పెట్టుకోకండి బెంగ !"

ఓహో, దేవీ !

నేను రోజూ రాత్రంతా ఆస్వాదించే పరిమళం నీవేనా ?

ఇంత విరహాగ్నిలో కూడా రక్షిస్తున్న ఈ చందన శైత్యం అంతా నీదేనా ?

నీవు కాలిపోతూ, నన్ను బ్రతికిస్తున్నావా ఇలా ?

*మిగలనా నీవు రేపటిదాకా ?*

*తెల్లవారదా నాకు ఇక మీద ?*

*దండెత్తుకు రానా కృష్ణుడిలా ?*

*ఎత్తుకు పోనా నిన్ను రుక్మిణినిలా ?*

## 36

"నాలుగు రోజులు కనిపించక పోతేనే అంత బాధైతే ఎలా ?"

"అన్నీ మీరే చెపుతారు. కించిత్తు వియోగాన్నే ఓర్చుకోలేరు."

"ప్రేమబలం గల కన్యకు తిరస్కరణీదేవి బలం కూడా ఉంటుంది పరివేష్టించి. కర్కోటకులైన గృహ పెద్దల పహరాలు గాని, మృగ ప్రాయులైన రౌడీల ఎత్తులు గాని ఆ దేవి ముందు పనిచెయ్యవు."

"అనుకొంటే, అభిసారికనే కాలేనా నేను ?"

"నేను రాక పోవటానికి మావాళ్ళ కాపలా ఒక్కటే కాదు కారణం"

"గుండెల్లో ఏదో బాధ ! చచ్చిపోతాననే అనుకొన్నాను మొన్న !"

"నేను చచ్చిపోతే, తర్వాత మీరెలా ?"

"ఇంకెవర్ని ముద్దు పెట్టుకొంటారు ?"

"ఎంత వెతుక్కుంటాయో ఆ చూపులు ! ఆ తనివి లేని తాగు బోతు చూపులు ! నా కన్నుల కాటుక కోసం, నా బుగ్గల కుంకుమ కోసం, నా పెదవుల మధువుల కోసం, నా జటలో మల్లెల కోసం, గులాబి గుత్తుల కోసం !

"నా ఒళ్ళంతా మందార మొగ్గలతో అలంకరించే ఆ మత్తు చూపులే నా సర్వ సంపదలూ !

"ఎందుకు చూస్తారో మీ రలా !

"మీది కానిది, మీకు ఇవ్వనిది ఇంకా ఏమున్నది నా దగ్గర ?"

"తృప్తి లేదా చూపులకు !"

"ఎంత దాహం !"

"నా బ్రతు కంతా మీ కొక గుటక !"

"నా దైవానికి నే నిస్తున్న దేమిటి, ప్రభూ ? లోకోత్తరమైన సమస్త సౌందర్యాలూ, మాధుర్యాలూ నాకు ప్రసాదించు. ఒక్క క్షణం పాటైనా నా స్వామిని తృప్తి పరిచి, గుండెలపై జోకొట్టుకొంటాను - అంటూ ప్రార్థిస్తాను నిరంతరం కన్నీళ్ళతో."

"చచ్చి పోతానేమో అన్న ఊహ రాగానే, ఎంత ఏడ్చానో !"

"ఆపాదమస్తకం, ప్రతి అంగుళం మీ ముద్దులతో పునీతమై, అమృత సుఖాన్ని సంతరించుకొన్న ఈ నా శరీరం, నేను చచ్చిపోయిన తర్వాత ఏం గాను ?

" ఇన్ని సౌందర్యాలు, మాధుర్యాలు, అనురాగాలు, ఆరాధనలు. అన్నీ వట్టి బూడిదేనా ?"

" ఈ శరీరాలు వట్టి అద్దె కొంపలు. వీటిపై మనకే అధికారమూ లేదు. ఎంత అన్యాయం !"

" నేను బ్రతికి ఉన్నప్పుడైనా, నా శరీరంపై నాకు అధికారం లేదే! అన్యాయానికి పరాకాష్ఠ కాదా ఇది !"

"డాక్టరు వచ్చి చూచి, ఏ జబ్బూ లేదన్నది. వట్టి అజీర్ణ మట !"

"గుండెల్లో అజీర్ణ మేమిటో !"

"బహుశా, మీ రాగాన్ని జీర్ణించుకోలేక పోతున్నానేమో !"

"మనస్సును గాయపరచి, శరీరానికి మందు పూస్తారు ఈ పెద్దలు !"

" మీ సువర్ణగిరుల మధ్య లోయలో వస్తున్నది నొప్పి !"

"అక్కడున్నది గుండె కాదు – మీరు !"

"ఎంత నొప్పి కలిగిస్తున్నానో మీకు !

"వ్యర్థమైన ఈ నిఘా ఇంకా ఎన్నాళ్ళులే ! నాకు మైనారిటీ తీరే వరకే కదా ?

# 37

"ఒంటరి దాన్ని కాను నేను."

"మీరు లేరా హృదయంలో ?"

"మీరు బైట కనిపించ నప్పుడు, లోనికి పోతాను నేను"

"అక్కడ – నా హృదయ పద్మం మీద – పద్మాసనం వేసుకొని, తపస్సు చేసుకొంటూ ఉంటారు మీరు శివుడిలా !"

"వట్టి దొంగ తపస్సు"

"నేను లభించిన తర్వాత కూడ తపస్సేనా ?"

"ఇంకా, ఏ రాగ – అమ్మో ! నే నేమనుకొన్నా, తెలిసిపోతుంది నీకు."

"ఎందుకా ఎరుపు ?"

"ఇంకెవరి కోసమూ లేదులే, ఏ గంగమ్మ కోసమో అని నే నన్నానా ఏమిటి ?'

"నా ఆరాధనే నాది"

"లోకమంతా మీ రాగ లీలేగా ?"

"అయినా – ఏ మోహిని కొంటెతనమో మోసం చేస్తుందని నా భయం"

"అసూయ కాదు సుమండి, వట్టి భయం"

"మనం నలుగురం – మీరు, నేను, నాలో మీరు, మీలో నేను !"

"ఎడబాటే లేదు మనకు"

"ఒంటరి దాన్ని కాను నేను"

"చీకట్లో - నా వెలుగు మీరు"

"చిక్కుల్లో - నా సంకల్ప బలం మీరు"

నరనరం లోను ప్రవహిస్తారు మీరు నాలో - నవ చైతన్య విద్యుత్తుగా - తలంపు మాత్రాన"

"ఏ ఎండ మావులో ఏ ఎడారి మధ్యకో విసిరి పారెయ్య వచ్చు జీవితాన్ని"

"అయితే ఏం ? నా ఒయాసిసు నా హృదయం లోనే ఉందిగా ?"

"ఒక్కె చిరునవ్వు, ఒక్క మత్తుచూపు, ఒక్క ఎఱ్ఱముద్దు - ఏదైనా చాలు నాకు మీ నుంచి. గెల్చుకు రాగలను ప్రపంచాన్ని నేను."

"నా హృదయంలో మీ రున్నారు. ఏ భయమూ లేదు నాకు"

"భయాలు, బెంగలు, చింతలు, చిక్కిపోవటాలు - మన వంటి వాళ్ళకు కాదు. మనం అద్వైతాన్ని సాధించిన జీవేశ్వరులం !"

"నా ఆత్మా, శరీరమూ ఏక ముఖమై ఏకాంత సేవ చేస్తున్నై మీకు."

"కలా, నిజమూ రెండూ ఒకే అనుభూతి రూపమై భాసిస్తున్నై నాకు."

ఓహో, రాగోన్మనీ !

కల లోనే కరిగి పోతున్నావా, దేవీ !

**ఉన్మనస్కుడ నేను, ఉన్మనీ రమ నవీవు ;**
**ఇంత చక్రవ్యూహ మెందుకో మన నడుమ !**
**అధిగ మించగ లేవె ఆటంకముల నెల్ల ?**
**ఉప్పొంగి రాలేవె ఉన్మాత్న శక్తితో ?**

## 38

"ఎంత నిజమైన కల !"

"రసాలినిలో, మధుశిలపై - వైనతేయం తరంగాలలో వయ్యారాలు పోతున్న కార్తిక రాకా సుధాకర సరోవరంలో కాళ్ళు కడుక్కొంటూ - జారి, మీ కౌగిట్లో వాలి -

- ఓహో, ఎన్ని దీపాలు !

బృందావనం నిండా గోపికలు, నందన వనం నిండా అప్సరసలు, రోదోంతరాళం నిండా తారలు !

రసాల వనం నిండా మనం ! మనిద్దరం !

మణి మృణాళినీ రత్న కమలినీ స్వర్ణ రజో తల్పినులపై పడి -

దివ్య భోగినీ భోగ డోలికలపై వినోదిస్తూ

నాగలోకం లోతుల నుంచి, స్వర్గలోకం శిఖరాలకు వీచాం మనం రెండు మలయ మారుత పరిమళ చీలికలమై

"ఆ మధ్యలో ఎంత అంధకారం ! ఎంత దుర్వాసన ! ఎన్ని నోళ్ళు ! ఎన్ని కోరలు ! ఎన్ని కారపు కళ్ళు ! ఎన్ని కత్తులు ! ఎన్ని ఉచ్చులు ! ఎంత నరకాగ్ని ! ఎంత ఏడ్పు !"

"పర్వతారణ్య దుర్గమ గర్భంలో సన్నని వాగులా, తీయని పాటలా, మెరుపు తీగలా దూసుకుపోయాం మనం – ఏ కత్తికీ అందకుండా, ఏ కోరకూ దొరక్కుండా!'

"సమస్త లోకాలకూ, సౌందర్యాలకూ శిఖరాయ మానమైన ఉజ్జ్వలోద్యానం అది ! అది మన వనమే ! రసాలిని !"

" ఆ రమ్యాలోకం, రాగరమణం, రసభోగం అనిర్వచనీయం !"

" కల కాదిది !"

"ఒళ్ళంతా నొప్పులు, నొక్కులు, ఎర్రబడ్డ బుగ్గలు, నెత్తురు చిందుతున్న పెదవులు, మంటలు, జుర్రిన లేత ముంజెల వలె, అబ్బా – ఇవన్నీ, ఇంత ప్రత్యక్షంగా, ఇంత మధురంగా బాధ పెడుతూ ఉంటే ఇదంతా వట్టి కల అని ఎలా అనుకోను ?'

అ "కల ద్వారా పునరావృతమైన పూర్వానుభవమే ఇదంతా ?"

"కాదు కాదు. ఇదంతా పచ్చి వాస్తవం !"

"మీకు అంచక్కా ఏమేమో చెయ్యాలనీ, ఏవో అనందాలు వండాలనీ, కొసరి కొసరి తినిపించాలనీ ఉంటుంది నాకు – ఒంటరిగా ఉన్నప్పుడు కాని –

"మీ సమక్షంలో అన్నీ మరిచిపోతాను – నన్ను నేను మరిచి పోతాను."

"ఆ మైమరపులో ఏమిచ్చుకొంటానో మీకు !"

"మీ చూపు లోనే మైమరచిపోతుందీ మేను !"

"మనకు శరీరాలు వద్దన్న నేనే, నా సమస్తమూ ఒక్క శరీరమే అయినట్టు, కరిగిపోతాను మీ స్పర్శలో !"

"వృద్ధి క్షయాలూ, నాశనమూ కల శరీరాలకు సృష్టి ప్రణాళికలో ఇంతటి ఆధిక్యత దేనికో !"

ఏమిటో ఈ రేఖలు !

మలయ పవనమూ, ఝంఝూ మారుతమూ సూర్య చంద్రనాడులా ఆడుతున్నై వీటి పంక్తుల నడుమ !

ఎంత కలగి పోయిందో నీ మనసు ఈ మానవ కల్పిత విరహ ఝంఝులో!

నీవే ఝంఝూ మారుతంలా వచ్చిన నీకేనా ఈ తుపాను దెబ్బ !

ఎంత తపించి పోతున్నావో మనోవ్యథతో - ఏ దారీ కనిపించక ! ఏం చెయ్యను నేను ?

*ఈ తుపాను గాలులలో*
*ఎంత కలగి పోయావో !*
*ఎద పగిలీ, మధు వొలికీ,*
*ఎంత బాధ పడినావో !*
*విశ్వమోహనముగ విరిసి*
*వెలయనున్న రాగలతవు !*
*పరమరాగ సుధను భువికి*
*పంచనున్న మోహినివి !*
*ఎదదలు కలిసిన ప్రేమకు*
*ఎడబాటే ప్రతిఫలమో ?*
*మనసిచ్చిన చెలిని విడిచి*
*మరణించుటె జీవితమో ?*

## 39

**కామం - ప్రేమ**

స్త్రీగా పురుష సంబంధాన్ని పాలించే జంట ఇది.

ఈ రెండు ప్రవృత్తులూ తృప్తి పొందనిదే ఏ మానవ జీవికీ ఆనందం లేదు.

సుఖాన్ని ఇచ్చేది కామం

సుఖాన్ని స్థిరీకరించి, ఆనందాన్ని ఇచ్చేది ప్రేమ.

కామజన్యమైన సుఖ సంతానాదులు జీవకోటి కంతకూ సామాన్యమే.

ప్రేమ మానవుని ప్రత్యేక భాగధేయం.

స్వచ్ఛమైన ప్రేమ స్థాయిని మానవు డింకా అందుకోలే దనిపిస్తుంది నాకు.

ప్రేమకు శరీరాలతో పని లేదని నీ వన్నప్పు డెల్లా, నీ దివ్యత్వం జిగేలు మంటుంది నా కళ్ళల్లో!

నాకేనా ఈ భౌతిక వాంఛ లన్నీ!

నిన్ను చూడకుండా ఒక్క రోజైనా ఉండలేను కదా నేను!

నా హృదయంలో ఉన్నావు నీవు - నిజమే

నా ఆత్మలో ఆత్మవై ఉన్నావు - నిజమే

నిన్ను నా మనోనేత్రం నిత్యం దర్శిస్తూనే ఉంది - నిజమే

నీతో నా చిత్తం నిరంతరం రమిస్తూనే ఉంది - నిజమే

నేను నీవే - నిజమే

కాని -

ఇన్ని నిజాలు ఒక్క క్షణంలో అబద్ధమై పోయి, వాస్తవంగా - సశరీరంగా నిన్ను - ధర్మవరం పట్టుచీర కట్టుకొన్న నిన్ను - చూడా లనిపిస్తుంది నాకు.

నిన్ను చూడాలి

ఈ కళ్ళతో రెప్ప వెయ్యకుండా చూడాలి

స్పృశించాలి

కౌగిలించుకోవాలి

ముంగురులు, నొసలు, కళ్ళు, చెంపలు, బుగ్గలు, పెదవులు, కంఠం - ఆచ్ఛాదనం జారిపోతూ ఉండగా, ఆనంద సుందరంగా ఆవిష్కృతం అయ్యే ప్రతి కళాబిందువూ ముద్దు పెట్టుకోవాలి!

సర్వనగ్నమైన నీ శరీరలక్ష్మి రాగలక్ష్మే కావాలి – నా సమగ్ర సమాలింగన శతపత్రంలో !

అప్పుడు కాని, తృప్తి లేదు నాకు !

ఇదంతా నా బలహీనత ! కామ ప్రాబల్యం ! ప్రేమ స్థాయికి పెరగలేదు నేను !

నా శరీరం నాపై చెలాయిస్తున్న పెత్తనానికి, నా అబలత్వానికి ఎంతో ఎంతో సిగ్గు పడుతున్నాను నేను ఇంతవరకూ !

కాని –

ఇప్పుడు నీవు – నన్ను ఓదారుస్తూనే నీవు పడుతున్న బాధ !

ప్రేమ కాదా ఇది ?

శరీరానిది కాదా ఇది ?

పరమాత్మ, ఆత్మ, జీవాత్మ, ఘటాత్మ, అనాత్మ – ఈ ఆత్మ పంచకంలో, మానవ ప్రకృతిలో, ధర్మార్థ కామ మోక్షాదిక సమస్త విధి సిద్ధికీ ఘటాత్మ ప్రధానం!

ఘటాత్మే శరీరం !

నిరాకారమైన ఆత్మ యొక్క ఘనీ భూత సాకార స్వరూపమే శరీరం!

సశరీర సమాత్మైకమే సంపూర్ణ పూర్ణైక్యం !

అందుకే మనం విడిచి ఉండలేం !

వచ్చేసింది కార్తిక పూర్ణిమ.

పూర్ణిమే కదా జీవిత పూర్ణానందం మనకు !

అపరాజితవు నీవు

అభిసారికగా అయినా రాలేవా ఒక్కసారి !

**పూర్ణ కళా సమభిజ్ఞా !**

**పూర్ణేందు మనోజ్ఞ ! రాగపూర్ణ జ్యోత్స్నా !**

**పూర్ణా ! పూర్ణిమ వచ్చెను !**

**పూర్ణైశ్వర్యమున నన్ను పూర్ణించగదే !**

# కార్తీకి

ఓహో, వచ్చేశావా, దేవీ !

కరిగించి వేసుకోనీ –నిన్ను నిన్నెల్లా – ఇలా ఈ నాలోకి !

సమ్మలేం శరీరాలను !

అవి ఉన్నంత వరకూ ఎడబాటు భయం ఉంది మనకు !

ఇక ఎడబాయలేను నిన్ను !

కరిగిపో నీవు నాలోకి !

కరిగి పోనీ నన్ను నిన్ను నీలోకి !

ఇంత గాఢా లింగనంలో కూడ ఇంత ఎడమా మన మధ్య ?

అమృత సాన్నిధ్యానికి అడ్డం వస్తున్నె శరీరాలు !

అబ్బ ! మనకు మన శరీరాలే శత్రువులు !

ఇలా ఎంతసేపు !

కలకాలం ఇలా ఉండిపోలేమా ?

కాలం కూడా శత్రువే మనకు !

అవశమై, అవ్యక్తంలో, సశరీరంగా ఆనందమై పోవలసిన మనస్సు మళ్ళీ మేల్కొంటున్నది !

మనస్సు కూడా శత్రువే మనకు !

ఓహో ! వచ్చేశావా దేవీ !

అర్ధరాత్రి నుంచీ మత్తెక్కిస్తున్న ఈ అపూర్వ దివ్య పరిమళాలు నీ పాద పయోరుహ సౌరభాలేనా ?

ఏవీ – ఇలా ఇవ్వు – పాదాలు !

కార్తిక పూర్ణిమా పుణ్యదీప జ్యోత్స్నల్ని చిమ్ముకొంటూ వచ్చావు కదా –వీణా మండలం నుంచి ?

ఎంత కర్కశం ఈ వెన్నెల !

ఆకాశగంగలో స్నానం చేసి, దానికి నీ సర్వ శుక్ల సౌరుచ్యాన్ని ప్రసాదించి, అక్కడి సువర్ణ కమలాలకు నీ పాద కమలాల సౌభాగ్యాన్ని రుచి చూపి, నీ తనూలత నమూనాగా కల్పలతికల్ని సింగారించి, ఐరావతానికి నీ యాన గంభీరత మప్పి, మేనకాది లావణ్య రాశులకు నీ మేని –

"అబ్బా ! నలిగిపోతున్నై గులాబీలు ! పాదాలు పద్మాలు అంటూనే, అంతకన్న మృదువైన కుసుమ గుచ్ఛాలను అలా నలిపి పారేస్తారేం ?"

ఓహో, పెదవులు !

అవి పెదవులా ? అమృత పదవులు !

హంసలా వెన్నెల జలపాతంలోకి ఉరికి, చిమ్ముకొంటూ ఇలా వచ్చేశావు, కదూ ?

"పిచ్చి ! ఇదంతా వట్టి పిచ్చి !"

పిచ్చి కాదు, ప్రజ్ఞానం ఇది. ఇదే అసలైన జ్ఞానావస్థ !

ఉన్నది ఉన్నట్టు చూడగల ప్రజ్ఞా ప్రాభవం ఇది !

వట్టి నాచును, పీచును మాత్రం చూడగల ఆధునిక పాండితీ ప్రకర్షలకు వాటి క్రింది అమృత జలాలు, ఆనంద తరంగాలు, అమూల్య భావరత్నాలు ఎలా కనిపిస్తై ?

మేల్కొని ఉన్నా ననుకొనే వాడే నిజంగా నిద్రపోతున్న వాడు !

శరీరం నిద్రపోక, ఆత్మ మేల్కోదు.

ఆత్మ మేల్కొనక, అసలు సత్యం కనిపించదు.

మల్లెపువ్వులు ఈ నీ చరణ కమలాలు !

నవ్వకు మరి ! అప్పుడే రానీకు ఉషస్సును !

ఈ మల్లెపూల వెన్నెల పరుపుపై నీ వొక స్వర్ణ కమలానివి !

ఎంతో ప్రయాణం చేసి వచ్చావు నీవు !

నడిచి వచ్చావు అనంత దూరాలు !

విశ్రాంతి తీసుకో ఈ నా హస్త కమలాలలో !

ఎంత స్వచ్ఛంగా ఉన్నై ఈ నీ పాదాలు !

పాదాలే చెపుతై ఎవరెక్కడ తిరిగి వచ్చిందీ !

కార్లూ, విమానాలూ, రోదసీ నౌకలూ శరీరానికే కాని, ఆత్మకు కావు కదా ?

వాటిలో తిరిగినంత మాత్రం చేత కర్మలు అంటకుండా ఉండవు.

కొందరి పాదాలపై, ఎక్కడెక్కడి కర్మో పేరుకొని ఉంటుంది.

విదలిస్తే వదలిపోయే ధూళి

కడుక్కుంటే కరిగిపోయే కంకర

సబ్బుతో కాని పోని పంకిలం

ఆమ్లాలు వాడితే కాని చెరగని కుళ్ళు

చర్మం ఒలిచినా పోని పాపం

ఇదీ, మానవుడు తన జీవయాత్రలో సంపాదించుకొని, కూడా తీసుకుపోయే గతం !

కొందరు కాళ్లు కడుక్కోబోతే, చేతులు కూడా మలిన మవుతై !

ఎవరైనా కడగబోతే, వాళ్ళకీ అంటుకొంటుం దది !

వాళ్ళు ముట్టుకొన్న దంతా మురికి అయిపోతుంది పాపం !

పుప్పొడి, కస్తూరీ మాత్రమే కాదు. ఆ ప్రక్కనే మురికీ, కుళ్లూ కూడ ఉన్న లోకం ఇది.

ముందుకు చూచుకు నడవాలి.

కళ్లు మూసుకు నడుస్తారు కొందరు.

అంతరాత్మ హెచ్చరికను కూడ వినక, దూకుతారు బురద లోకి.

ప్రతి ప్రాణికీ ఒక దీపం ఉంది

వెలిగించుకోరు చాలా మంది

ఆర్పేసుకొనే వాళ్ళూ ఉన్నారు !

కొందరి పాదాలు ఎంత స్వచ్ఛంగా ఉంటై !

పువ్వుల్లో నడిచి వస్తారు కొందరు

ఎక్కడ నడచి వచ్చినా, గతాన్ని అంటుకోనివ్వరు కొందరు.

పంకాన్ని కూడ పరిమళింప జేయగల పాదాలు నీవి !

మనిషిని దైవంగా మార్చగల మంత్ర పుష్పాలివి !

ఓహో, వచ్చేశావా, దేవీ !

రాకేం జేస్తావు ?

భగవతి సరస్వతి నా కిచ్చిన వరానివి నీవు.

ఇచ్చిన వరాన్ని తిరిగి పుచ్చుకొంటుందా జగదీశ్వరి ?

శాశ్వతంగా నా దానవు నీవు !

# 41

తనివే తీరడం లేదు నాకు !

దాహంతో ఆవురావురు మంటున్న ఎడారి నోట్లో ఒక్కొక్క చుక్క రాలుస్తున్నావు నీవు !

మరీ ఎక్కువ చేస్తున్న దది దాహాన్ని.

ఆషాఢ మహామేఘాలను గుప్పెట్లో పెట్టుకొని, ఏమి టీ తుంపర్లు ?

"ఎందుకు ఆ వ్యర్థోపమానాలు ?" అంటున్నావు కదూ ? అవును !

నీకున్న పాటి నిశితదృష్టి, ఔచిత్య జ్ఞానం, రస స్వరూప వేత్తృత సాహితీ సమీక్షకులకు ఉంటే ఎంత బాగుండును !

*ప్రకృతికి, మానవ ప్రకృతికి నడుమ*

*ముళ్ల డొం కలు లేచి, మొఱిగె నన్ జూచి*

అని అంటే–

"ముళ్ళ డొంకలు మొరగడ మేమిటి ?" అని ప్రశ్నిస్తా డొకడు.

ముళ్ళ డొంకలు మొరుగుతై, పూలతీగలు నవ్వుతై, పద్మవనాలు పిలుస్తై. తెలీదు అతడికి !

*పదవి, గౌరవం, విందు, వినోదం,*

*ఇలాంటి ప్రాభవాలు కాదు నే కోరేది !*

*నీతో ఒక్క లేశం ఏకాంతం !*

అని వ్రాస్తే –

"ఆ పిల్ల ఇంకేమీ వద్దా ? ఎంత ఘోరం !" అంటూ డింకొకడు తప్పు ! నీవు అంటే పరబ్రహ్మ స్వరూపిణి అని గుర్తించలేడు అతడు !

కాకువు లేదంటాడు మరొకడు !

చేతికి మధుపాత్రను ఇస్తే – ఆ మధువు ఏ పువ్వులదో, ఎవరు తీసారో తెలుసుకొనిగాని ముట్టుకోడు మరో మహాశయుడు !

స్వతంత్ర ప్రయోగాలను తప్పు లనుకొంటాడు మరొక మిడిమిడి జ్ఞాని

అది రాయో, రత్నమో గ్రుడ్డివాళ్ళకు ఎలా తెలుస్తుంది ?

ఎక్కడో కాపీ కొట్టిన ట్యూన్లకు మాటలు పొదిగి, వాటిని పాట లంటాడు సినిమాలు తప్ప మరేమీ ఎరగని ఆధునికుడు !

మునగలేక, ముత్యాలు లే వనేవాళ్ళే అధికం, నేటి మన సంగీత సాహిత్య కళారం.గాలలో !

ప్రతిభను తలెత్త నివ్వరు పండితులు. పాండిత్యాన్ని తలెత్త నివ్వరు పామరులు.

ఇక మిగిలింది భిక్షాటన – ప్రతిదానికీ, పరదేశాల వెంట !

శక్తీ, సంప్రదాయమూ పోయినై మన నేల నుంచి. అవెక్కడైనా కనిపిస్తే – ఎంత నిరసన వాటి పట్ల మన ఆధునిక పెద్దలకు అర్థంగాక !

ప్రకృతి అర్థం కాదు, పరమాత్మ తెలియదు, ఎవరికీ ఈనాడు ?

తన ఎల్లిని తప్ప మరో సుందరిని ఎన్నడూ చూచి ఉండని పేరిగాడి లాంటి కైసరులు సమాజానికి పెట్టని కోటలే కావచ్చు. సాహిత్యానికి మాత్రం తీరని చీడలు కారా ?

ఈనాడు సాహిత్యం అంటే కులం, వర్గం, మతం, ముఠా, సమస్యలు, ఉద్యమాలు, నినాదాలు, వ్యాపారం !

రసం, అనుభూతి, ఆనందం ఏమీ లేవు. వీటిని ఎరగరు కూడా ఈనాటి వాళ్ళు !

"నా రాగ స్పందనం నీవు, నీ ఆనంద మందిరం నేను" అంటే – అదేదో చెత్త.

" బొచ్చు కుక్క, బూదిగుంట " అంటే – అది మహాకవి వాక్యం ! దానికి బండెడు ప్రచారం !

తిండి, డబ్బు తప్ప మరో ప్రయోజనం లేదు ఆధునిక మానవ జీవితాలకు.

"అలంకారం సహజంగా ఉండాలి. బంగారం ఉంది కదా అని కాలికి కుండలాలూ, మెడకు వడ్డాణమూ తగిలిస్తారా ? ఒకటి రెండు రోజులు వర్షం ఎగబట్టినంత మాత్రం చేత, గోదావరి లంక ఎడారి ఎలా అవుద్ది ?" అంటున్నావు కదూ ?

అవును !

అంతే కాదు –

అక్షయమైన ప్రణయ కలశం నుంచి నీ చేతులు లాగేవరకు, నీ శరీరం అలసేవరకు, నీ ఆత్మ తనిసేవరకు వంచుతూనే ఉన్నావు, ఆనందాన్ని నా ఆత్మ నిండా !

నాకే తనివి తీరడం లేదు !

ఈ సమస్త మేఘ రాశిని– తేనె తుట్టెను వలె – పిండుకు తాగెయ్యాలి నేను.

ఈ కమలాకరాలను వంచేసుకోవాలి నా గుండెల్లోకి.

ఈ ఫలాలు, పుష్పాలు, వీటి శీధు మధు రసాలు ఒక్క గుటక కాగా

ఈ నదీనదాలను పులినాలతో సహా, ఈ సముద్రాలను తీరాలతో సహా, ఈ రోదోంతరాళాలను తారకలతో సహా పట్టెయ్యాలి ఆపోశనం.

ఇంత దాహమూ – అగస్త్యుడికి లోపాముద్రవలె– తీర్చేస్తూనే ఉన్నావు నీవు – నీవే ఒక సుధాకలశివై, దివారాత్ర భేదం కూడా లేకుండా !

అయినా, తనివి తీరడం లేదు నాకు.

ఇదంతా పచ్చి శృంగారం అంటాడేమో ఏ మహానుభావుడైనా ! అంటే, అననీ !

శివపారమ్యం కోరే ప్రతి ఆత్మభావనా పచ్చి శృంగారమే !

వ్యంగ్యాన్ని ఆత్మ వైపుకు కాక, శరీరం వైపుకు మళ్ళించుకొని బావురుమనే వృద్ధ పాండిత్యం ఏమనుకొంటే మనకేం ?

వంచెయ్యి నీ మొత్తం కలశం !

వచ్చేశావు తిరిగి !

అన్ని నిరోధాల్నీ, నిర్బంధాల్నీ గడిచి, హిమానీ కుమారివై దూకి వచ్చేశావు!

ఎంత దివ్యానుభూతిని తెచ్చావు నీతో !

కార్తిక పూర్ణ దీపలక్ష్మి వే అయినావు నా నిండా !

రాగ జ్యోతివై రసామృతమే చేశావు నన్ను !

*కొందరికి గుండె చిన్నది, కొందరికి మ*
*నస్సు చిన్నది, బ్రతుకె కొందరికి చిన్న,*
*దంత మాత్రాన నిల చిన్నదనము లేదు*
*పెత్తనము చేయు నీ కన్న పెద్దదైన !*

# 42

ఎంత అనుభవించినా, తనివి లేదు మీకు !

"చిలుక కొరికిన సువర్ణ రేఖలై పోయినై ఈ స్నిగ్ధ సుందర లవలీ దళాలు !

ఈ అరుణబింబ ఫలం గంట్లుపడి అమృతం ఓడుతోంది !

మేరుగిరి శిఖరాలు వంగి వాలినై ప్రభాకరుని పాదాబ్జాల ముందు

ఈ విశాల పేశల సికతా సీమ త్రొక్కిన మడుగైపోయింది – గజేంద్రమోక్షం కథలో వలె !

"ఈ – అబ్బా, ఇక చెప్పలేను.

"మీ తాగిన కళ్ళ చూపుల్లో ఏమున్నదో పీల్చి పారేసినై నన్ను ఆత్మదాకా !

"ఎంత బాధ ! ఎంత ఆనందం !

"బాధ పడే కొలదీ ఆందం, ఆనందపడే కొలదీ బాధ !

"రోజూ ఇంతే !

"ప్రతిరోజూ ఇంతే !

"ఏదీ ఆరదు !

"ఏదీ తీరదు !

దేనికీ పారం లేదు !

"పెదవుల్ని ఆశించి, రదన క్షతాల్ని పొంది, బాధపడుతూనే మళ్లీ ఆ పెదవుల్నే ఆశించడం !

"శిఖరస్థాయిలో అబ్బా అనుకొని, ఇఃక ఎప్పటికీ వద్దు అనుకొని, జీవితం మొత్తానికి ఈ సుఖం ఒక్కటే చాలు అనుకొని, ఆనందం నుంచి తేరుకొని, అభినందనలు చెప్పుకొని, ఆలింగనం చేసుకొని, అదుముకొని విడిపోయి– మరుక్షణం లోనే మళ్లీ అదంతా కావాలని ఆరాట పడటం !

"చికుర సీమల నుండి చరణ నఖాగ్రాల దాకా

"ప్రతి అందాన్నీ, ప్రతి అణువునూ

"చూచుకొని, చూచుకొని, చూచుకొని

"ముద్దిడుకొని, ముద్దిడుకొని, ముద్దిడుకొని

"గుండెకు హత్తుకొని, హత్తుకొని, హత్తుకొని

"ఎత్తుకొని, ఎగరేసి, పట్టుకొని, పడేసి

"చచ్చినంత సుఖంలో మునిగి, ఉక్కిరి బిక్కిరైపోయి, జన్మ కిక చాలు అనుకోవడం ప్రతీసారీ !

"కాసేపటికే మళ్ళీ దాహం, తాపం, చచ్చేటంత విరహవేదన !

"అంతా క్రొత్తే మళ్ళీ !

"తీరదు తనివి !

"మీకు – మిమ్మల్ని బట్టి నాకు !

"మన జన్మ ఇక ఇంతే చివరి దాకా !

"అసలు చివరే లేదు గద దీనికి !

**"తనియ వేలరా ?**

**తరుణ రాగ సుధాకరా !**

"నింగి నిండ తారలు
నేల నిండ కలువలు
వలచి, నిన్ను బ్రతుకు నిండ
కొలుచు కొనుచు నున్నగాని !

"పూర్ణుడవై శివుని సిగను
పూజ లందు కొనుచుండి
దినమున కొక లోకానికి
దేవుడవై యుండి కూడ !

"మోక్షభార మొక నాటికి
మోయలేని కళాధరా !
ప్రణయముతో ప్రతి కళకును
ప్రాణ మొసగు జీవేశ్వర !"

## 43

"రెచ్చిపోతాను - చెయ్యి వేశారంటే ?"

పంచేంద్రియాలూ,వాటి ఉపగ్రహాలూ, మనస్సూ కూడా రెచ్చిపోయి - పిచ్చిగా ఉంది నాకు అప్పటికే !

శరీరం ప్రణయ మధువును బాగా గ్రోలి, మైకంలో పడి ఉన్నా, మనస్సు మేలుకొనే ఉంది నీకు !

అవును - నీవు స్త్రీవి !

శ్రుతి చేసిన వీణవు నీవు !

నీ సమస్తమూ కళా మృదులమే, రాగ మధురమే !

ఎక్కడ తాకితే అక్కడ స్పందిస్తుంది ఏదో ఒక ప్రణయకళ - గొంతెత్తుతుంది ఏదో ఒక దివ్యరాగం !

వాత్స్యాయను డేదో అంటాడు కాని - నీలో ప్రతి అణువూ ఒక కళా స్థానమే ! రాగ సరస్వతీ పుణ్యక్షేత్రమే !

తాకితే రాగం, తానం, పల్లవి !

శిరోజాల కొసల నుంచి, చరణ సరోజాల దాకా !

చెయ్యి వెయ్యకూడదు నీ మీద – అన్నప్పుడూ !

చెయ్యి వేస్తే – పలికించవలసిందే నిన్ను – ఆనంద శిఖరస్థాయిలో, అవనీ మోహనంగా !

అంచులు పొర్లనింపిన మధుపాత్రవు నీవు.

పెదవులతో అందుకోవలసిన చోట చేతితో తాకితే – ఉద్రేకం రగలడం తప్ప, ఆనంద జ్యోత్స్న ఎలా భాసిస్తుంది ?

పెదవులు ముంచి పీల్చుకొంటూ, నిన్ను నిన్నెల్ల, కోనసీమ రసాలాన్ని వలె, ఆస్వాదించి పారవెయ్యనా – పోనీ ?

నీవు ఫలానివి– నేను రసాన్ని.

పరస్పర ఆధార ఆధేయ ద్వయం మనం !

ఇదంతా రెచ్చిపోయిన పిచ్చిగా ఉన్నదేమో నీకు !

ఫలం మీద చెయ్యివేసి నొక్కితే – రసం చిప్పిలుతుందిగా !

నేనే చిప్పిలి, చింది, సిక్తమై పోతానన్న మాట !

పోతే పోనీ – అనంతత్వం దాకా !

"మోడలు మీద చెయ్యి వెయ్యకూడదు" అన్నాడు చిత్రశిల్పి రాజు.

మోడలు చలించ వచ్చు.

శిల్పీ చలించ వచ్చు

చిత్రం చెడిపోవచ్చు.

అలా చెడిన చిత్రాలే ధృతరాష్ట్రుడు, పాండురాజు వగైరా !

లోకంలో చెడిన చిత్రాలే అధికం – కుమారస్వామి నుంచీ కూడ.

నీవు నా సాహితీ మోడలువు !

లేదు మనకు అలాంటి భయం.

చలించి, చలింపజేసి – రెచ్చి, రెచ్చగొట్టి – రమించి, రమించబడి– రసధ్వనిలా భాసించే మననుంచి, ఆనందంగా ఆవిర్భవించే విశ్వశ్రేయో దివ్యచిత్రం ఎందుకు చెడిపోతుంది ?

చెడిన చిత్రాలే బాగుపడే హస్తవాసి మనది !

చెడిపోవడం అనేదే లేని అమృత దివ్యం మన సన్నిధి !
వెయ్యనులే చెయ్యి !
వేస్తే పలికిస్తానులే, అవనీ వశంకర శివంకర శిఖర స్థాయిని !

*నా వీణవు నీవు,*
*నా ఒడిలో నవ రసముల !*

*నా పొదవున విరబూరి*
*నా ఎదలో నినదించి*
*నా గొంతున అక్షర మా*
*నవ గాయని నీవు !*

*వేయి తీగ తల్లుల ఎద*
*విరిసిన రమ్యా కమలిని*
*అడుగుల రేకులలోని*
*అమృత లహరి నీవు !*

*ప్రణయమునే ప్రణవముతో*
*ప్రతి మెట్టున మేళవించి*
*నాకే శ్రుతి చేసుకొన్న*
*నాద బ్రహ్మవు నీవు !*

## 44

రేపు ఇన్ని గంటలకు ప్రొద్దు పొడుస్తుంది. సూర్యుడు తూర్పున ఉదయిస్తాడు. పౌర్ణమి రోజున చంద్రుడు నిండుగా ఉంటాడు – ఇలాంటివి స్పష్టంగా చెప్పగలడు ఏ మనిషైనా.

ఎలా చెప్పగలడు ?
అవి అందరి అనుభవంలోను ఉన్న నిత్య సత్యాలు కాబట్టి !
సత్యం అంటే ఏమిటి ?
సృష్టిలోని ఒక క్రమస్థితి.

అది ఎలా తెలుస్తుంది ?

నిత్య పరిశీలన వల్ల !

అందరికీ తెలిసిన సత్యాలే ఎక్కువ లోకంలో. వాటిపై ఆధారపడే దైనందిన జీవితం సాగిపోతుంది – ఒక క్రమానికి కట్టుపడి !

పంచభూతాలు, ఋతువులు, జీవగుణాలు, వాటి ధర్మాలు – అందరికీ తెలిసిన సాధారణ సత్యాలే, వీటి విషయంలో ఎవరైనా జోస్యం చెప్పవచ్చు.

మేఘం పట్టి ఉన్నప్పుడు, వర్షం వస్తుందని జోస్యం చెప్పగల వాళ్ళు చాలామంది. అది ఎప్పుడు పడుతుందో చెప్పగలవాళ్లు కొద్దిమంది. ఎలా పడుతుందో చెప్పగలవాడు విజ్ఞాని ఒక్కడే. ఎందుకు పడుతుందో చెప్పగల వాడు ఒక్కడూ లేడు.

అన్ని ప్రశ్నలకూ జవాబు లున్నై. ఎందుకు అనే ఒక్క ప్రశ్నకే జవాబు లేదు మానవుడికి !

అనుభవం, పరిశీలన, పరిశోధన, ఉపాసన, తపస్సు – ఇలా దృష్టీ నిశితమూ, ఏకాగ్రమూ అయే కొలదీ, ప్రకృతి అంతరాంతరాలలోని పరమ సత్యాలు అవగతం అవుతూ ఉంటై !

తాను దర్శించిన సత్యం తనదే – తాను అనుభవించిన సత్యం తానే – ఏ మానవుడి కైనా !

దాని విషయంలో స్పష్టంగా జోస్యం చెప్పగల డతడు.

ప్రకృతి గర్భంలో మానవుడు ఒక చిన్న దీపం మాత్రం. తన కాంతి పరిధి దాటి చూడలే డతడు. ఆ ఆ పరిధిలోనే అతడు ద్రష్ట, ప్రవక్త, ఋషి ! అది దాటితే అతడు వట్టి అనామకుడు, వట్టి శూన్యం !

అసలు మానవ మాత్రుడికే అందని మహా సత్యాల ముందు అతడి కందిన పరమ సత్యాలు – సూర్యుడి ముందు మిణుగురులు !

శక్తి వికాసాన్ని బట్టి, దృష్టి నైశిత్యాన్ని బట్టి, ఆత్మోన్నతిని బట్టి – మానవుడి జ్ఞానేంద్రియాలకు, మనస్సుకు, అంతరాత్మకు అందగల సత్యా లున్నై కనుక –

వాటి విషయంలో అతడు జోస్యం చెప్పగలడు కనుక –

మన చెల్లారావు చెప్పింది మనం ఎందుకు నమ్మకూడదు ?

చంద్రుని పైకి విడిచిన రోదసీ నౌక భవిష్యత్తును గురించి దాని విజ్ఞాని ఎంత ఖచ్చితంగా జోస్యం చెప్పగలడో - అంత ఖచ్చితంగానూ చెప్పగలడు జోస్యం విజ్ఞాని అయిన సాముద్రికుడు !

మ నిద్దరి చేతులూ ఒకే మాదిరిగా ఉన్నై అన్నాడు కదూ చెల్లారావు ?

అందుకే నేమో మనం ఒక టయింది ?

అధికారం ఉన్నా ఆత్మను పోగొట్టుకోని అమృత హృదయుడు చెల్లారావు. రసజ్ఞుడు, మిత్రుడు. సాముద్రిక శాస్త్ర విజ్ఞాని.

"చేతి రేఖలకు బ్రతుకులు బానిసలే నా !" అన్నావు నీవు !

జీవిత ప్రణాళికను సూచిస్తై అవి ! ఇచ్ఛాశక్తితో వివరాలను మార్చుకోవచ్చు.

నీ విద్యారేఖను అడ్డుకొన్న వైరి రేఖలు చెరిగిపోతై విద్యార్జనపై నీ మనస్సు లగ్నమయే కొలదీ.

నీ అదృష్ట రేఖ కంటే నాదే బాగుంది - అదే నీవు !

మన హృదయ రేఖలలోని ఆ చెరకు విలువంపులే మన శృంగార కళా వైభవాలు !

మనోరేఖ, జీవిత రేఖ కలవలేదు నా చేతిలో !

నన్నూ నాతోపాటు ప్రపంచాన్నీ కూడ ధిక్కరించగల శక్తిని నా అహంకారానికి ఇచ్చిన అధికారం ఇదే నేమో !

తరచు నిన్నూ ఏదో అని, నొప్పించి, ఏడ్పించే నా ప్రవృత్తికి నివృత్తే లేదేమో, మరి !

నా కాంతివి నీవు !

నా మనస్సు నీ చుట్టూ అల్లుకొని ఉంది - జలజం చుట్టూ జలం వలె !

బుద్ధి మాత్రమే తాగినట్లు ప్రవర్తిస్తుంది అప్పు డప్పుడు !

ఎందుకో నేను కోపంగా ఏదో అనగా - అందుకే నీవు అలిగి అలా వెళ్ళిపోగా -

ఎంత సేపు కూర్చున్నానో నేను - ఒంటరిగా -ఆ చలిలో, ఆ చీకటిలో !

నా శిల్పానివి నీవు అదృశ్యమైపోగా - చీకటికే శిల్పాన్నై నిల్చాను నేను మధుశిలపై !

# 45

" శిల్పాన్ని నేను"

" నన్ను తీర్చి దిద్దుతున్న శిల్పికి గుండెలు లేవు. నా కెలా వస్తై?

" చేతికి దొరికిన శిలను నేను అతనికి

" నా తండ్రి హిమవంతుడైనా, భగవంతుడైనా, అతడికి ఏమిటి లెక్క!

" సరే - అలానే కానీ !

" నే నొక శిలను. అతడొక శిల్పి. అంతే చాలు నాకు.

" ఏ పోకిరీ చేతికో, ఏ రుబ్బురోళ్ల షావుకారికో, ఏ తాపీ మేస్త్రీకో, ఏ చాకి పనివాడికో చిక్కకుండా - భావుకుడైన ఒక శిల్పికి నేను దొరకడం నా అదృష్టం కాక మరేమిటి ?

" చెక్కుకోనీ అతని ఇష్టానుసారం

" మలుచుకోనీ అతని అభిరుచికి అనుగుణంగా.

" కాని -

" ఈ శిల జీవశిల !

" దీనికీ ఉన్నై చేతిలో రేఖలూ, వాటి లక్ష్యాలూ !

" మనస్సును, మనస్తత్వాన్ని మధువుతో సేవించే మహాశిల్పి - సమయజ్ఞుడు కాకపోతే, ఎలా ?

" శ్రీవల్లి ఎదటేనా శిల్పి చేష్టలు !

" ఎక్కడికి పోతుందీ శిల ?

" తన కోసమే పుట్టిన శిల ?

" హృదయం నిండా అమృతం నింపుకొని, పెదవుల దాకా మాధుర్యం కూర్చుకొన్న ఇది వెన్నెల వెన్నవలె మలగి చెలగదా అతని కళా కమనీయ కరాంగుళులలో ?

" చేతిలోని కళా కలశాన్ని హృదయంలోకి వంచుకోవ డానికి అంత తొందర దేనికి ?

" ఏదో ఒక రూపాన్ని చెక్కి పారవేయాలన్న తహతహ దేనికి ?

" శిల అతడిది, కళ అతడిది, ఎంత తీరికగా చెక్కితే, అంత లోకోత్తర సుందర గా అవతరించదా శిల్పమూర్తి ?

" శిల్పం ఎంత అతిలోక సుందరమైతే, అంత అమృత కీర్తి లభించదా అతడికి ?'

సరే, కానీ –

" నాకు నేనుగా అతడి చేతులలో పెట్టుకొన్న అజ్ఞాత అనామక శిలను నేను".

" కరగిపోతున్నాను. వెల్లి విరుస్తున్నాను – అతని కరస్పర్శా మాత్రంలో!"

" ఉలి చక్కిలిగింతలు పెడుతోంది. సుత్తి రసధ్వనులు పలుకుతోంది.

" కోపం వచ్చినా, పరాఙ్ముఖును కాను నేను."

" ప్రణయ శిల్పీ ! మలుచుకో నన్ను నీ ఇష్టానుసారం !

'దేవతగా దిద్దుకొంటావో, దెయ్యంగా చెక్కుకొంటావో – నా భవిష్యత్తుకు నీవే శిల్ప బ్రహ్మవు !

" ఒక్కటి మాత్రం మరచిపోవద్దు.

" ఇది వ్యక్తిత్వం కల జీవశిల !

## 46

" ఆ పద్యం కొంచెం పాడండి !

" ఏ పద్యం ?

" అదే, మొన్న మీరు వ్రాసి పంపిన పద్యం – రాఖీ పూర్ణిమ

" సంగీతం సరస్వతిని నీవు !

" నాద బ్రహ్మ మీరు !

" నీ గురించి, నీ కోసం వ్రాసి, నీ కిచ్చిన పద్యం అది. ప్రతి క్షణం పాడుకొంటూనే ఉన్నావు నీవు దాన్ని. పాతదైపోయింది కూడా. ఇప్పు డెందు కది ?"

" కవితకు పాత కొత్త లేమిటండీ ? మీరు పాడితే వినాలని ఉంది. అంతే.

" అయితే, ఏదీ ఆ కాగితం !

" అమ్మో ! అక్కడి నుంచి తియ్యడమే దాన్ని ?

" నేను తీసుకోనా ?

మన ఆ సంభాషణ, ఆ తర్వాతి పెనగులాట ఇప్పటికీ ఇప్పడే జరిగినట్టుంటుంది నాకు !

శృంగార లీలా సంగ్రామ రంగంలో గెలిచిన పురుషుడి కంటె ఓడిపోయిన స్త్రీయే అధికురాలు కదా ! పురుషుడి చేతిలో ఎంత చిత్తుగా ఓడిపోతే అంత ఆనందాధి దేవత అవుతుంది స్త్రీ !

పురుషుడి విజయ పతాకే స్త్రీ ఆనంద సింహాసనం !

ఆ పద్యం వ్రాసిన కాగితం పదహారు మడతలతో తాళి బొట్టంత అయి - మేరుగిరి రత్న సానువుల మధ్య దేశంలో, అనాహత పద్మదళాల ఆవరణలో, ఎక్కడో దాచబడి ఉంది.

అందలి ప్రతి శబ్దం నీ హృదయంతో కలిసి స్పందిస్తున్నది.

ప్రతి అక్షరం నీ సాత్త్విక భావ పరిస్నపితమై రసవత్తర మవుతున్నది.

నా పద్యాక్షర మాలికా సమలంకృతాలు ఏతన్మంగళ గౌరీ శంకర గిరి శృంగాలు !

అంతకన్న మేటి పూజ ఏమున్నది - నా సాహితీ రాగదేవతకు !

సాధించాను నిక్షేపాన్ని !

చదివాను పద్యం వచనంలా.

" చదవ మనలేదు, పాడమన్నాను.

పాడాను మోహనచ్ఛాయలో.

" వచనం చదవడానికి, పద్యం పాడడానికి.

" అవును. నా ఉద్దేశం కూడా అదే.

ఈ నాడు ఎంత మంది ఏమి చెప్పినా, పద్యమే కాదు - అది కవిత అయితే, గద్యం కూడ - పాడాలనే అంటాను నేను.

విశ్వ జనీన సుందర భావాన్ని లయబద్ధంగా వ్యక్తీకరించడమే కవిత.

నగ్న సత్యం వేదాంతం, అలంకృత సత్యం కవిత - నా దృష్టిలో.

ఆ అలంకారంలో ప్రధాన మైనట్టిది లయ.

లయ అంటే రిథం. రిథం అంటేనే కాని లయ అర్థం కాని దుస్థితి ఆధునిక ఆంధ్ర విద్యావంతులది.

ప్రకృతే లయబద్ధం.

ఒక క్రమవృత్తంలో ప్రకృతిని నడిపిస్తున్న ఆ పరమశక్తే ఒక నాద లయ బ్రహ్మ !

అర్థం కాదు ఈ నాటి వాళ్ళకు ఇదంతా.

లయ లేనిది ఆనందం ఇవ్వదు. ఆనందం ఇవ్వనిది కవిత కాదు.

శరీరానికి సెక్సు. ఆత్మకు కవిత !

కవితను పాడాలి. చదవగూడదు.

ఆదికావ్యం రామాయణం గానం చెయ్యబడింది.

వేదాలు గానం చెయ్యబడుతున్నై.

ప్రపంచ సాహిత్యంలో మరొక ఆది కావ్యమైన ఇలియడ్ ఆనాడు హోమర్ మహాకవిచే వీధుల్లో పాడబడిందే !

ఖురాను కూడ వేదం వలె గానం చెయ్యబడుతున్నదే.

సూర్యోదయాది ప్రకృతి ధర్మాల వలె – వివిధ మతాల వేదాల వలె – ఆనంద జీవితోద్దిష్టాలైన పరమ సత్యాలు, ధర్మాలు, కళలు, కవితలు అన్నీ – లయబద్ధం కాక తప్పదు.

ఆంగ్ల కవిత కూడ ఒక లయలో చదవ బడుతుంది.

తెలుగు కవిత పాడ బడుతున్నదంటే – అది మన అదృష్టం !

లయను మించి, సంగీత స్థాయిని స్పృశిస్తున్న పరమ రమణీయ స్థితి తెలుగుది !

సిగ్గుపడడం చేతకాని తనం !

"గెలిస్తే భూలోక రాజ్యం, చస్తే స్వర్గ రాజ్యం" అన్న వీర భగవద్గీతకు నిర్వీర్య వ్యాఖ్యలు వెలువడి, భారతీయుల్ని పనికిమాలిన పందలుగా, బానిసలుగా తయారు చేసిన దురదృష్టం మనది.

ఆలోచించడం లే దెవరూ !

హరిదాసులు, పౌరాణికులు, జంగాలు – కడకు, సోది చెప్పే చెంచెతలు కూడ – వచనాలను సైతం పాడతారు నేడున్ను !

రసం రసాన్ని పొందినప్పుడే ఆనందం.

రస స్ఫూర్తీ, ఆనంద సిద్ధీ మాత్రమే కవితా ప్రయోజనం. కవిత ఏ రూపంలో వెలువడినా, ఏదో రాగ వరసలో వినపడక తప్పదు.

శాస్త్రీయ గానానికీ, లలిత గానానికీ, కావ్య గానానికీ ఎన్ని తేడాలు ఉన్నా- కవిత ఏదో ఒక స్థాయిలో, లయలో గానం చెయ్యవలసి నట్టిదే !

అర్థ భావ రసస్ఫోరకంగా పాడాలి కవితను.

అలా పాడ బడేదే కవిత.

చేతకాని వాళ్లు, తమ చేతకాని తనానికి బలకరంగా సృష్టించుకొనే సిద్ధాంతాలతో మనకేం పని ?

పాడగల కవిని నేను.

పాడతా – పాడించుకో !

**పాడెద నేను నీ వదన**
**పద్మ రుచుల్ వికసింప : తీయగా**
**పాడెద నేను నీ హృదయ**
**పద్మ మరందము గ్రోలి : ఉన్మతిన్**
**పాడెద నిన్ను నిన్నె ఒక**
**పాటగ నాయెద మేళవించి; నే**
**పాడెద నేను నేనె ఒక**
**పాటగ నీ యెద మ్రోయగా, ప్రియా !**

# 47

ప్రతి స్త్రీ లోను ఏదో ఒక అందం కనిపిస్తుంది నాకు.

అందాలు అనంతం !

ప్రకృతి లోని అనంతమైన సౌందర్యాంశలలో – ఏదో ఒక అంశ వికసించని స్త్రీయే ఉండదు లోకంలో !

ప్రతి అంశా దేని కది సుందరమే, ఆకర్షణీయమే, అనుభవయోగ్యమే !

ఏదో ఒక అంశ ఆకర్షిస్తుంది – ఏదో ఒక సాటి మగవాణ్ణి, ఏదో ఒక అనుకూల మనస్థితిలో !

ప్రతి అంశా ఆకర్షిస్తుంది. పూర్ణ పురుషుడైన వాణ్ణి.

సర్వాంశా సమన్విత సంపూర్ణ సౌందర్యం మాత్రమే ఆకర్షిస్తుంది పురుషోత్తముణ్ణి !

నీతో కలిసి – నే నిప్పుడు పురుషోత్తముణ్ణే !

నీవు నాతో చేరిన తర్వాత – మరి నన్ను ఆకర్షించగల మహా సౌందర్యం ఏదీ లేదు మిగిలి !

ఏదో వ్రాయాలనుకొని – మరేదో వ్రాసేస్తున్నాను కదూ ?

ప్రకృతి పురుష తత్వాన్ని వివరించా లనుకొన్నాను – సరేష !

మిత్రులతో కూడి – మూడు జిల్లాలు వెతికినా, పెళ్ళాడడానికి ఆడపిల్లే కుదరలేదు – రాంబాబుకు !

నాకు నచ్చిన, మంచి మంచి కన్యల జాబితా ఇచ్చాను అతడికి. అందర్నీ చూచి వచ్చి, తనకు ఒక్క వాళ్ళూ నచ్చలేదన్నా డతడు!

ప్రతి స్త్రీ లోను ఏవేవో లోపాలు చూపుతా డతడు – కేవల పండితుడి వలె !

ప్రతి స్త్రీ లోను ఏవో అందాలే కనిపిస్తై నాకు – ఒక జానపద కవికి వలె !

ప్రతి ఆడపిల్లా అందంగానే కనిపించి, ఎవర్ని వదులుకోవాలో తెలియక, అందర్నీ పెళ్ళాడెయ్యా లనిపించేది నాకు – నీవు కనిపించక పూర్వం !

నాది పూర్ణ సౌందర్య దృష్టి

సమస్త సుందర కళా సమ్య క్కామిని ఒక్కతె మాత్రమే నన్ను వివశుణ్ణి చేయగల పూర్ణ సుందరి !

పురుషుడు కేంద్రం

స్త్రీ పరిధి

పురుషుడు ఏకైక శుద్ధ చైతన్య మూర్తి

స్త్రీ అనంతకోటి రసభావ సౌందర్య విక్షేపం.

పురుషుని దృష్టి నలువైపులా

స్త్రీ దృష్టి ఏక కేంద్రం వైపు.

పరిధిలోని ఏ అంశ నైనా ప్రేమించగలడు పురుషుడు. అన్ని అంశలనూ ప్రేమించగలడు – ఒకే సారి, ఒకే రీతిగా, ఒకే గాఢతతో.

స్త్రీ అలా కాదు, తన కేంద్రం లోని ఆ ఒక్క పురుషుణ్ని మాత్రమే ప్రేమిస్తుం దామె !

స్త్రీకి పురుషుడు ఒక్కడు

పురుషుడికి స్త్రీలు అనేకం

ఇదే గోపీకృష్ణ తత్వం

ఇదే జీవేశ్వర తత్వం

తెలియదు ఈ నాటి వాళ్ళకు.

సనాతనమైన ఆర్ష ధర్మాన్ని తెలుసుకోకుండా, అపజ్ఞాన దూషితమైన పాశ్చాత్యుల పాపసిద్ధాంతానికే దాసోహం చేస్తున్నారింకా మనవాళ్ళు !

ఏం చేస్తాం ?

అది అలా ఉండనీ.

పురుషుడు స్త్రీని ప్రేమించడంలో విశేషం లేదు. ఏ స్త్రీ నైనా, ఎంతమంది నైనా ప్రేమించగలడు – అతడిలోని ప్రతిపత్ చైతన్య ప్రాభవాన్ని బట్టి.

ఆనంద ప్రాభవ సిద్ధికి అతణ్ణి స్త్రీ కూడా ప్రేమించవలసి ఉంది.

ఒక్క స్త్రీ అయినా ప్రేమిస్తే చాలు – ఆ పురుషుడు ధన్యుడే.

అనేకమంది స్త్రీలచే ప్రేమించబడే వాడు పూర్ణ పురుషుడు.

సమస్త ప్రపంచం చేతా ప్రేమించబడే వాడు పురుషోత్తముడు.

ఒక్క స్త్రీ చేత కూడ ప్రేమించబడని పురుష డెవడూ ఉండడు లోకంలో.

వెతుక్కోవాలి, వేచి ఉండాలి.

నిగ్రహం లేక, ఆత్రంతో స్త్రీల వెంట పడేవాడు ఏ ఒక్క స్త్రీ ప్రేమనూ పొందలేడు చివరకు.

వ్యభిచారి అయిన వాడికి స్త్రీ ప్రేమ లభ్యం కాదు. స్త్రీ ప్రేమ లభించని జీవితం సంపూర్ణం కాదు.

ప్రేమ లభించేవరకు వేచి ఉండడమే స్థిత ప్రజ్ఞత. అది లభించినప్పుడు, సాహసంతో నైనా దాన్ని పొందడమే కర్తవ్య ధర్మం.

ఒక్క స్త్రీ కూడా నచ్చలేదు రాంబాబుకు.

తాను ఏ ఒక్క స్త్రీ కైనా నచ్చాడో లేదో కూడ తెలియలేదు.

పెళ్ళికి నచ్చడం చాలు, ప్రేమ అక్కరలేదు అందుకు.

అతడు కేవలం దోష దృక్కు !

అందాన్ని చూడలేని వాడు ఆనందానికి నోచుకోడు.

ముళ్ళే కనిపించే వాడికి పువ్వులు సుఖం ఇవ్వవు.

జన్మాంతర స్నేహ పునీతమైన ప్రేమకు అందంతో నిమిత్తం లేదు. అట్టివాళ్ళు శుచులైనా, అశుచులైనా; ధనులైనా, నిర్ధనులైనా; యౌవనులైనా, వృద్ధులైనా; రూపసులైనా, కురూపులైనా శరీరాలతో సంబంధం లేకుండా – ఒకళ్ళ నొకళ్ళు తెలుసుకోగానే ఆత్మైక్యం పొంది, అమృతమూర్తు లైపోతారు.

ప్రేమకు శాసనం లేదు.

పెళ్ళికే ఏ గోలైనా !

సంసార జీవితం సుఖంగా గడిచి పోవడానికే కదా పెళ్ళి ?

బుద్ధిమంతురాలైన ఏ యువతి అయినా చాలు అందుకు.

ఆరోగ్యవంతమైన యౌవనమే అందం.

గ్రుడ్డిది రాంబాబు మనస్తత్వం.

ఎంత వెలుగు చూపి మాత్రం ఏం లాభం ?

## 48

స్త్రీ – పురుషుడు

రెండు మహాశక్తు లివి.

ఈ రెండు శక్తుల సంయోగ నైరంతర్యమే సృష్టి నైరంతర్యం.

పరస్పర విరుద్ధాలైన ఈ రెండు శక్తుల మధ్య గల ఆకర్షణమే ప్రణయం.

వాటి సంయోగమే సుఖం.

ఈ రెండు శక్తులు – దేని కది విడిగా అసంపూర్ణం కనుక – సంపూర్ణత్వం కోసం, అందువల్ల జనించే ఆనంద లవం కోసం – అవి తహతహ లాడతై.

అందుకోసం అవి ఒకదాని కొకటి చేరువ అయ్యే కొలదీ, వాటి సంయోగావకాశం కూడా ఎక్కువ అవుతూ ఉంటుంది సహజంగా.

స్త్రీ లభించినప్పుడు పురుషుడు, పురుషుడు దొరికినప్పుడు స్త్రీ, అనుభవించకుండా ఉండలేరు అందుకే.

శ్రీ శుకుడు, శంకరాచార్యుడు, క్రీస్తు, రామకృష్ణ పరమహంస, వివేకానందుడు, బాలయోగి వంటి లోకోత్తర పురుషులను గురించి చెపుతావు నీవు.

లోకం గురించి ఆలోచిస్తాను నేను.

లోక ధర్మానికి, సృష్టి ధర్మానికి విరుద్ధంగా, అతీతంగా, వెళ్ళే వాళ్ళను లోకం గౌరవించగలదు. కాని – అనుసరించ లేదు.

స్త్రీ పురుష సంయోగ సుఖ స్వరూపమే సృష్టి.

స్త్రీని బహిష్కరించే పురుషుడూ, పురుషుణ్ణి బహిష్కరించే స్త్రీ – పూర్ణ వ్యక్తులు కాలేరు.

ప్రత్యేక ప్రయోజనం కోసం ఒంటరిగా, ఏ బంధమూ లేకుండా ఉండిపోవచ్చు. అది వేరే సంగతి.

స్వయంగా స్త్రీని సంపాదించుకోలేని పురుషులు, పురుషుణ్ణి సంపాదించుకోలేని స్త్రీలు–ఎక్కువ సంఖ్యలో ఉంటారు లోకంలో. తల్లిదండ్రులు తెచ్చిన వాళ్ళను పెళ్ళాడి, సుఖంగా గడిపేస్తారు జీవితాలను వాళ్ళు. సామాజిక వ్యవస్థకు పునాదీ, ప్రాణమూ ఈ రకమైన సామాన్య జనమే.

మరి కొందరు పురుషు లుంటారు. ధనం, బలం, హోదా, అధికారం వగైరా అదనపు శక్తులతో స్వాధీనం చేసుకొంటారు స్త్రీలను వాళ్ళు. బహు స్త్రీ భోగం ఒక వ్యసనం వాళ్ళకు.

కేవల సంగీత సాహిత్యాది కళల ద్వారా సన్నిహితు లవుతారు కొందరు మధుర హృదయులు. కళలో సహజంగా, అంతర్వాహినిగా ఉండే కామతత్త్వం పైకి ఉబికి ఉప్పొంగుతుంది అట్టి వాళ్ళలో.

ఆ కారణంగా, చెప్పుకోదగ్గ బాహ్యాకర్షణ ఏదీ లేకుండా, రెండు ఆత్మలు కలిసిపోయి, హృదయాలు కరిగిపోయి, శరీరాలు ఒకటైపోతై కొద్దిమంది విషయంలో. అందుకు మనమే ఉదాహరణ.

రెండు మేఘాలు, రెండు సెలయేళ్ళు, రెండు కిరణాలు – ఒకదాని నొకటి వెతుక్కొంటూ వచ్చి, ఒకటిగా కలిసి పోవడం !

హేతువు కనిపించదు ఈ ప్రేమకు, అంతం ఉండదు దాని ఆనందానికి.

చాలా అరుదుగా కనిపించే మన లాంటి రాగ హృదయుల్నీ, మహాయోగుల్నీ, మినహాయిస్తే – తక్కిన స్త్రీ పురుషు లంతా కేవలం కామోప భోగ లాలసులే. సృష్టి ప్రణాళికలో సాధారణ సాధనాలే.

కామోప భోగం స్త్రీ పురుష సహజ గుణం.

నిరోధాలకు, నిషేధాలకు లొంగేది కాదది.

దేవతలు, మహర్షులు, ఇంకా అనేక మంది గొప్ప వాళ్ళు. ఆదికాలం నుంచీ దీనికి లొంగిపోయిన వాళ్ళే.

అలాంటి సహజ ప్రవృత్తిని అదుపులో పెట్టనూ వచ్చు. పెట్టలేకనూ పోవచ్చు మానవుడు.

పెట్టలేనప్పుడు, అది వరదలా పొంగి, కట్టలు త్రెంచుకొని, సమాజాన్ని ముంచకుండా తగిన కట్టుదిట్టాలు, డ్రైనేజీ ఏర్పాట్లు చేసుకోవలసి ఉంది.

అలాంటి వేమీ లేకుండా, ఉన్న ఏర్పాట్లను కూడా రద్దు చేసి, సహజ ప్రవృత్తికి వ్యభిచారం అంటూ ఒక చెడ్డపేరు పెట్టి, దాన్ని శిక్షకు పాల్పడ జెయ్యడం నిజంగా అన్యాయం !

కామం సహజ ప్రవృత్తి. బహిరంగంగా నిరోధించ బడితే, రహస్యంగా విజృంభిస్తుం దది.

ఒక్క మానవుడికే కాదు, సృష్టి లోని ఏ ప్రాణి కైనా – సహజ ప్రవృత్తి వల్ల ఆనందం, పారవశ్యం కలిగించే రాగమధువులు కొన్ని ఉన్నై. అందులో ప్రధాన మైనట్టిది కామం.

ప్రవక్తలు, ప్రవచనాలు, నీతులు, నియమాలు, మతాలు, నరక భయాలు, శాసనాలు, జైళ్ళు – ఇవన్నీ కూడా అపజయం పొందిన కారణం తెలుసా ?

ప్రాణికి పరమేశ్వరు డిచ్చిన ఒక మధుర వరాన్ని – ఒక రాగమధువును – ఒక ఆనంద సుధను – కంట్రోలు చెయ్యడానికి బదులు, పాప మని నిషేధిం చడమే !

ఒమర్‌ఖయామ మహాకవి వ్రాసిన రుబాయతులను తన రాజ్యంలో నిషేధించి, తాను మాత్రం చదువుకొనే వాడట ఔరంగజేబు చక్రవర్తి !

మానవుడి అహంకారానికీ, అహంకారి లోని అల్పత్వానికీ పరాకాష్ఠ ఔరంగజేబు ప్రవర్తన !

మానవులలో తా నొక్కడే గొప్పవాడి ననుకొనేవాడు పరమ అల్పుడు. వట్టి మృగం.

ఎదిరి బలం తెలియంది ఒక్క మృగానికే !

ఇంతకూ - చెప్పా లనుకొన్న దేమిటంటే-

ఒక సామాన్య పురుషుడికి ఒక సామాన్య స్త్రీ చాలు. అలాంటి స్త్రీ పురుషులే అధిక సంఖ్యాకులు. వాళ్ళే సమాజం అంటే.

కాని...

సామాన్యుడి ప్రక్క మరో అసామాన్యుడూ, సామాన్య స్త్రీ ప్రక్క మరో అసామాన్య సుందరీ ఉంటూ ఉండడం తప్పడం లేదు కదా ?

మురికి వేళ్ళు, మొద్దు కాండం, చప్పని ఆకులు, కరుకు ముళ్ళు -వీటి నడుమ అందమైన మొగ్గ ! అంతా ఒకే కుటుంబం !

పువ్వులనే తీసుకొన్నా -మల్లె ప్రక్కనే సుందర తరమైన గులాబి !

మల్లెకూ ముల్లుకూ, ఎండకూ చీకటికీ, ఆవుకూ దున్న పోతుకూ, మూడు ముళ్ళూ వేసి కట్టి పడవేయడం జరుగుతున్నందు వల్లనే - సుఖంగా సాగవలసిన సంసార సాగరాలలో రేగుతున్నై తుపానులు ! తెగుతున్నై కట్టలు ! పొంగుతున్నై ఉప్పెనలు !

ధనం, అధికారం, బలం, స్ఫుర ద్రూపం, వాక్చాతుర్యం - లాంటి అధి గుణాలు కల పురుషులు ఎక్కువగా ఆకర్షించ గలరు స్త్రీలను.

అలాంటి పురుషుని చుట్టూ చేరడం సహజం అనేకమంది స్త్రీలు - అయస్కాంతం చుట్టూ ఇనుప సూదుల వలె ! శారీరకంగా వీలు లేకపోతే, మానసికంగా అయినా !

ఫలితం -

ధనం వలె, విద్య వలె, అధికారం వలె - ప్రేమ కూడా ఒక్కొక్క చోట

కేంద్రీకృతమై పోవడం ! తక్కిన సమాజంలో ప్రేమ దారిద్ర్యం ఏర్పడడం ! దాని స్థానంలో కృత్రిమంగా కామం విజృంభించడం: స్వైరవిహారం పెరగడం !

బలహీనుల రక్షణార్థం వంచక శాసనాలు బైలుదేరడం !

కోర్టులు, పోలీసులు, వారసత్వ హక్కులు, కుటుంబ గౌరవం – వీటి భయం లేకుండా, భార్యకు కేవల హృదయంతో ఏలుకోగల భర్తలు ఎంతమంది సమాజంలో ?

సోషలిజానికి వ్యతిరేకిని కాను నేను. కాని – గడ్డి పరకల్ని రక్షించడం కోసం గోవుల్ని ఎండగట్టేది మాత్రం కాగూడ దది !

బలహీనుణ్ణి రక్షిస్తూ, బలవంతుణ్ణి అణచివేసే శాసనన్యాయం ఎప్పటి నుంచి బైలుదేరిందో – అప్పటి నుంచే ప్రారంభమైంది మానవజాతి పతనం !

నైతికులు, సన్యాసులు, భిక్షకులు, నిర్వీర్యులు – ఇలాంటి పనికిమాలిన వాళ్ళకు రాజ మర్యాదలు !

సోక్రటీసులు, క్రీస్తులు, అభిమన్యులు, భగత్సింగులు, గాంధీలు – లాంటి వాళ్ళకు రాజ మర్యాదలు !

లక్షమందిని రక్షించగల ఒక బలశాలిని పదిమంది కూడి చంపేస్తారు కుట్ర చేసి ! మోసానికి మౌలికశక్తి బలి !

ఇలాంటి న్యాయ శాసనం క్రింద – ఒక స్త్రీనీ, ఒక పురుషుణ్ణీ చేర్చి, కట్టి పడవేస్తున్నది సమాజం – కలిసి బ్రతకమని !

కలిసి బ్రతకవచ్చు – వాళ్ళ స్వభావాలు కలిస్తే, కలవకపోయినా, వాళ్ళ సహజ ప్రవృత్తులకు పరిపూర్ణ స్వేచ్ఛ ఉంటే. వాళ్ళిద్దరికీ వీధి గుమ్మం ఒక్కటే అయితే !

స్వేచ్ఛా కామం వీధి గుమ్మం
వ్యభిచారం దొడ్డి గుమ్మం.
వీధి గుమ్మాన్ని మూసివేసింది అధునిక సమాజం
దొడ్డి గుమ్మం వెడల్పు అయింది సహజంగా !

ఒక సామాన్య స్త్రీతో పూర్ణ పురుషు డెలా తృప్తిపడి ఉండలేడో, ఒక సామాన్య పురుషుడితో పూర్ణ స్త్రీ కూడా అలానే తృప్తిపడి ఉండలేదు.

కాగా -

సమాజం నుంచి వ్యభిచారం పోవాలంటే - కామోపభోగానికి వ్యభిచారం అన్న పేరును తొలగించుకోక తప్పదు.

సమాజంలో అందరూ సామాన్యులో, పరిపూర్ణులో కాలేరు కనుక అన్నం పేరును సున్నంగా మార్చినంత మాత్రం చేత, దాన్ని ఎవరూ తినకుండా ఉండలేరు కనుక

ఏ షరతూ లేకుండా స్త్రీ పురుష సంయోగాన్ని పవిత్రంగా భావించినప్పుడే మానవుడు పవిత్రు డవుతాడు ! మరో అడుగు ముందుకు పోతాడు !

ఆకలి దప్పుల వలెనే సెక్సును శారీరక తృష్ణగా మాత్రమే తీసుకొన్నా - (అలా తీసుకోవడమే సబబు ఈ సంతాన నిరోధక యుగంలో, కామానికి మరో ప్రయోజనం లేని ఈ రోజుల్లో) - అట్టి తృష్ణ అయా వ్యక్తుల సొంత విషయమే కాదా ?

అసహజమైన నీతుల్నీ, నిర్బంధాల్నీ కల్పించుకొని - వ్యక్తుల స్వవిషయాల్లో జోక్యం చేసుకొని - వాళ్ల బ్రతుకుల్ని నాశనం చేసే హక్కు సమాజాన్ని కెక్కడిదో ?

స్త్రీ - పురుషుడు
రెండు మహాశక్తులు ఇవి !
పురుషుడు రస స్వరూపి
స్త్రీ కళా స్వరుపిణి.
కళా స్వాదనే రసం
రసం రసాన్ని పొందడమే ఆనందం.

రసానందం బ్రహ్మానం ద లవం. అందుకే దాని కంత అవక్రపరాక్రమం. అంత విశ్వలీలా రామణీయకం.

ఈ రెండు శక్తుల నడుమ లేచిన విధి నిషేధ కుడ్యాలే అవినీతికీ, అక్రమానికీ, పతనానికీ హేతువులు.

సహజ ప్రకృతి పట్ల మానవునికి విధి నిషేధా లేమిటి ?
స్వేచ్ఛగా విడిచిపెట్ట బడవలసిన శక్తులు ఇవి రెండూ.
వాటికి స్వేచ్ఛ లభించే వరకూ లోకం పాపంలో కుళ్ళి చావక తప్పదు !

***నీతికీ, అవినీతికీ తేడా ఏం లేదు ;***
***తనకు దక్కిన సుఖం నీతి,***
***మరొకడికి దక్కిన సుఖం అవినీతి !***

# 49

తాను పురుషుడ నన్న అహంకారం జాస్తి గానే ఉంది రాంబాబుకు.

నీవు సూచించిన స్వర్ణలత కూడ నచ్చలేదు తనకు.

తన లక్ష్యాలకు అనుగుణమైన విద్యావతి దొరికే వరకు పెళ్ళాడడట తాను

మరి – ఆమెకూ ఉంటైగా కొన్ని లక్ష్యాలు ?

తన లక్ష్యాలకు అనుగుణమైన స్త్రీ అంటే – తనకు బానిసగా పడి ఉండగల స్త్రీ అనేగా అర్థం ?

విద్యావతి బానిసగా ఎలా పడి ఉంటుంది ?

చదువు అబ్బక, ఏ కళ లోనూ ప్రవేశం లేక, తన బ్రతుకు తాను బ్రతికే ఏ విలువా లేక – ఎవడో ఒక మగవాడికి శరీరాన్ని అప్పగించి, అతడికి పిల్లల్ని కనిపెట్టడానికి మాత్రమే పనికివచ్చే ఆడవాళ్లు కొల్లలుగానే ఉన్నారు ఈ మన సమాజంలో.

కొనుక్కో నక్కరలేదు
ఏ ఖర్చూ అక్కరలేదు
ఎదురు కట్నాలతో వస్తారు భార్యా రూపంలో కోరుకొన్న బానిసలు !

మనం విలువైన వస్తువును కొనుక్కొంటాం. పనికిరాని వస్తువును సొంత ఖర్చుతో తీసి పారవెయ్యిస్తాం.

తమ ఆడపిల్లల్ని సొంత ఖర్చులతో వదిలించుకొనే లక్షల కొలది తండ్రులలో – పిల్ల నిచ్చి, డబ్బు కూడ ఇస్తాడుగా ఏ ఒక్కడైనా ?

స్త్రీ కంటే పురుషుడు బలవంతు డన్న సత్యాన్ని గుర్తించి, పురుషుని ఆధిక్యత దృష్ట్యా చూస్తే – కన్యా శుల్క పద్ధతే కొంత విలువ ఇచ్చిం దనవచ్చు స్త్రీకి.

అయితే – రాంబాబుకు కావలసింది విద్యావతి అయిన బానిస.

పెళ్లి చదువులు చదివిన వాళ్ళంతా అలాంటి వాళ్ళే !

అయినా – కొన్ని లక్ష్యా లుంటై వాళ్ళకు కూడ

నేటి విద్యావతి – కేవలం తిండి కోసం మగవాడిపై ఆధారపడే నిస్సహాయ కాదు.

అవసరమైతే – మగవాణ్ణి పోషించగల దామె స్వార్జనతో.

భార్య, భర్త అనే పదాలే నాకు కిట్టవు. బానిస, యజమాని అనే కదా వాటి అర్థం ?

"నీకు పని మనిషి కావాలా ? సహచరి కావాలా ?" అని అడిగాను నేను రాంబాబును. ఇద్దరూ కావాలన్నా డతడు.

ఇద్దర్నీ, ముగ్గుర్నీ చేసుకోడానికి నేటి చట్టం ఒప్పుకోదు –

చట్టాన్ని సవరించుకో వచ్చుగా అన్నది లత !

లత ఉద్దేశాలే వేరు. బహుభార్యా నిషేధ చట్టం స్త్రీకే ఎక్కువ అపకారం చేసిం దంటుంది ఆమె !

మానవ శాసనం ప్రతీదీ ప్రకృతి శాసనానికి విరుద్ధమే అంటుంది కూడా.

ఈ విషయం మరోసారి చర్చించుకోవచ్చు కాని – రాంబాబు పెళ్ళే ఒక సమస్య అయి కూర్చుంది.

లక్ష్యా లట !

లక్ష్యం అంటూ ఏదీ లేనివాళ్ళు ఉండరు లోకంలో.

ప్రతి వ్యక్తికీ ఉంటుంది ఏదో ఒక లక్ష్యం

జీవికి ప్రధాన లక్ష్యం జీవించడం.

జీవించడం కోసం ఆ జీవి చెయ్యని పని అంటూ ఉండదు !

మంచి, చెడ్డ, పాపం, పుణ్యం, అధికారం, ధిక్కారం, యాజమాన్యం, సేవ–సమస్తాన్నీ ఏతత్ ప్రధాన లక్ష్యసిద్ధి కోసమే ఉపయోగిస్తున్నాడు మానవుడు.

సృష్టి స్థితి లయాలు మూడూ మానవుడి చేతిలోవే నేడు.

ఈనాడు సమాజం అంటే బలవత్తముడైన ఒక వ్యక్తి.

అతడు గొల్ల, సమాజం లోని తక్కిన వ్యక్తు లందరూ గొర్రెలు.

గొల్ల లక్ష్యమూ బ్రతకడమే

గొర్రె లక్ష్యమూ బ్రతకడమే.

అదే హేతువు లోకం లోని ఈ కల్లోలా లన్నింటికి,

వైర లక్ష్యాల తీగలతో అల్లబడిన జల్లెడ ఈ లోకం.

ప్రతి జీవికీ ఒక లక్ష్యం ఉంది. ప్రతి లక్ష్యానికీ ఒక మార్గం ఉంది. ప్రతి మార్గానికీ ఒక క్రమం ఉంది.

తనకే ఒక లక్ష్యం ఉన్నట్టు, మరెవరికీ లేనట్టు మాట్లాడటం మూర్ఖత్వం.

ప్రకృతి ధర్మాన్ని, క్రమశిక్షణను అనుసరించి పోతే – ప్రతి వైర శక్తి విరోధం లేకుండానే పురోగమించ గలదు. ప్రతి లక్ష్యమూ సాధ్యం కాగలదు. ఎవరి లక్ష్యానికీ ఎవరూ బానిసలు కానక్కర లేదు.

గుర్తించదు రాంబాబు !

లీల వంటిదే లాంగదియ్యా లతణ్ణి !

## 50

ఎవరీ సీరి – ఊర్వశిలా !

ఒకొక్క రమణి ఒకొక్క పౌరాణిక కాంతను జ్ఞప్తికి తెస్తుంది నాకు – ఒకొక్కప్పుడు.

ఆయా అంశలలో పుడతారు కొందరు.

ఆయా అంశలకు ఛాయా మూర్తులుగా భాసిస్తారు కొందరు.

అనంత కాలవాహినిలో అంశలు కూడ అనంతకాల చిరంజీవన లీలా తరంగాలే కావచ్చు కద ?

నీవే కదూ పరిచయం చేశావు ఆనాడు ఈమెను ?

గొప్ప పని చేశావు !

ఊర్వశిలా కనిపిస్తుంది సీరి నా కంటికి !

ఆ మాటే అన్నాను ఆమెతో నిన్న సాయంత్రం.

ఆనందంతో మందార పుష్పమే అయిందామె ఆ మాటకు !

ఏ స్త్రీ అయినా అంతే – వట్టి బెలూను !

అందంగా ఉన్నావంటే చాలు – బెలూనులా ఉబ్బిపోయి, టప్‌మని పగిలిపోతుంది ఆ మగవాడి చేతిలో !

మగవాడి చేతిలో ఆడది బానిస కావడానికి కారణం ఆమెలోని ఈ బలహీనతే !

సహజోక్తి ఏదో, కపటోక్తి ఏదో తెలిసికోగల నీ వంటి వివేకినులకు అది వరమే కావచ్చు. కాని – పొగడ్తలన్నీ నిజమే అనుకొనే విలాసినులకు మాత్రం అది పతన హేతువు !

అది వట్టి పొగడ్త అని తెలిసి కూడ, అందులో పడిపోతా రెందుకో చాలామంది !

పొగడ్తను మించిన మద్యం లేదు లోకంలో, స్పర్శామాత్రం తోనే మత్తెక్కిం చేస్తుం దది ఏ వ్యక్తి కైనా !

ఇక, సీరి విషయం–

నిజంగానే ఊర్వశిలా కనిపిస్తుం దామె నాకు !

నే నెవర్నీ పొగడను. పొగడవలసిన అవసరం కూడ లేదుగా ?

తన ఫొటో ఒకటి ఇచ్చిం దామె నాకు.

నా ఫొటో ఒకటి కావాలన్నది. కాని – నాకు ఫోటోలే లేవయ్యో !

నాది ఫోటోముఖం కాదు. నా ఫోటో నాకే నచ్చదు.

గోదావరి లంకలలో, మహా కరకట్లను కొమ్ములతో చిమ్మి, రంకెలు వేసే పోట్లగిత్త ముఖంలా – దుర్భరంగా కనిపిస్తుంది నా ముఖం నాకే !

అమృత భాండం ఇదే నంటూ – పెదవులు తియ్యవు మరి దీని నుంచి !

అది నీ ప్రేమకు నిదర్శనం, నా అందానికి కాదు.

అందుకే నేను ఫోటోలు తీయించుకోను. నాకు ఫోటోలే లేవు.

తనను గురించి చెప్పుకోవడంతో పాటు, నీ గురించి కూడ చెప్పిందామె ఏమేమో ! ఈ సంగతు లేమీ నీతో చెప్పవ ద్దన్నది కూడా !

మనం అందర్నీ నమ్ముతాం. అందరూ మనలాంటి వాళ్లే అనుకొంటాం. మన మిత్రు లంతా మనలాగే అవ్యాజాను రాగంతో ప్రేమిస్తా రనుకొంటాం. వాళ్ళంతా మన శ్రేయోభిలాషులే అనుకొంటాం.

నా మిత్రుడు మన్మథసూరి నా గురించి నీకు చెప్పినట్టే, నీ మిత్రురాలు సీరి నీ గురించి నాకు చెప్పింది !

ఈ చెప్పడాలు అప్పడాల వలె కమ్మగా ఉంటై !

ఆ కమ్మదనమే రిమ్మ తిరిగేటట్టు కొడుతుంది – వాళ్ళ జీవితాల గూబలపై!

మనల్ని చూచి అసూయతో చస్తున్న వాళ్ళు మన శత్రువు లొక్కళ్ళే కాదు – మన మిత్రు లనేకులు కూడ !

పిల్లులు, గుడ్ల గూబలు వెలుగును చూడలేవు. మరి నక్షత్రాలు కూడ ఎందుకు చూడలేవో !

మన ప్రేమను, అనురాగాన్ని, ఆరాధనను చూడలేక కళ్ళల్లో కారం కొట్టుకొంటున్న లోకం ఎవరో కాదు, మన చుట్టూ ఉన్న మనవాళ్ళే !

అందుకే జాగ్రత్తగా ఉండాలి మనం.

ఈ మధ్య మనం ఎదుర్కొన్న క్లిష్టపరిస్థితికి కారణం ఇలాంటి వాళ్ళ కుట్రలే కదా ?

స్వార్థాలు అనేక విధాలు. కుట్రలు అనేక తరహాలు.

తన ఫోటో ఒకటి ఇచ్చింది సీరి.

అంతకన్న మంచి ఫోటో లన్నీ మన్మథసూరి తీసుకుపోయాడట – ఏదో సినీమాలో వేషం ఇప్పిస్తానని !

తిరిగి ఇవ్వమని అడిగితే, తన గదికి వచ్చి తీసుకువెళ్ళ మంటున్నాడట !

మంచి చేప కోసం గాలం వేస్తున్నా నన్నా డతడు మొన్న నాతో.

బహుశా ఆ చేప ఇదే కావచ్చు !

## 51

ఊర్వశి విశ్వప్రేయసే కావొచ్చు. నాకు మాత్రం కాదు.

వెర్రి వాడి పెళ్ళాం వాడ కంతటికీ వదినె. ఏ ఒక్కరికీ అక్కరలేని ఆడది – అందరికీ కావలసిన వేశ్య !

అర్జునుడి వంటి దక్షిణ నాయకుడు, కృష్ణుడిలాంటి విశ్వ ప్రేమికుడు కూడా వేశ్యను అభిమానించినట్టు లేదు ఎక్కడా !

స్వకీయలైన ప్రియురాండ్రు లేని కేవల భావుకులు ఎవరైనా పడితే పడవచ్చు ఆమె వెంట. అలాంటి దుర్గతి పట్ట లేదు నాకు ! ఎలాంటి అనుమానాలూ వద్దు నీకు !

నా ప్రేయసి నా కుంది.

నా జీవితం లోనూ, నా సాహిత్యం లోనూ కూడా ఒక్కర్తే ప్రేయసి నాకు. అదే వైశాఖి !

బాల్యం నుంచీ రాగలక్ష్మిగా, రాగజ్యోతిగా, రాగప్రభగా, రాగరమగా - వివిధ రూపాలలో, వివిధ రాగాలతో నన్ను రసబ్రహ్మను చేస్తూ వస్తున్న ఆ ఏకైక అమృత రాగ ప్రేయసి - నీవే !

కృష్ణుడికి రాధ ఉంది.

రాధ పై మక్కువ కలవాళ్ళంతా, తామే రాధల మనుకొంటూ, శ్రీ కృష్ణుణ్ణి ఆరాధిస్తారు భర్తృ భావంతో. అది మధుర భక్తి ! స్త్రీ వేషం వేసుకొని, స్త్రీలతో కలిసి తిరిగే అక్బరు మనస్తత్వం అది !

ఊర్వశి సామాన్య. ఊరందరికీ ప్రేయసి ఆమె. ఆమెపై మక్కువ కల వాళ్ళంతా క్యూలో నిలబడి - ఆమె ఏ పురూరవుడికో పిల్లల్ని కంటూ ఉండడం వల్ల హతాశులై, విరహాగ్నితో వేగిపోతూ, భావగీతాలు పాడుకొంటూ గడిపేస్తారు కాలం.

ప్రేమకు, పవిత్రతకు, సౌందర్యానికి, ఆత్మార్పణకు, ఆనందానికి ఆదర్శప్రాయలైన స్త్రీ మూర్తులు ఎందరో ఉన్నారు ! పూర్వమూ, ఇప్పుడూ కూడా । సీత, సావిత్రి, అరుంధతి, శకుంతల, రాధ, ద్రౌపది, ఎంకి, కాంతం, అనార్కలి, భాగ్యమతి, స్నేహ, మధుబాల, బాల, కిన్నెరసాని - ఎంద రెందరో !

అట్టి ఆదర్శ స్త్రీ మూర్తులను భక్తితో ఆరాధించుకోలేక, క్రొత్తవారిని సృష్టించుకోలేక, పాత్ర క్రొత్తల నడుమ సతమత మవుతున్న వాళ్ళంతా మెహిందీలకు ఎగబడుతున్నారు - సంగీతం కోసం, సౌందర్యం కోసం, ప్రణయం కోసం !

అలాంటి వాళ్ళలో ఎక్కువ మందిని తన వెంట త్రిప్పుకోగలిగిన ఊర్వశి నిజంగా విశ్వప్రేయసి !

ఊర్వశి విశ్వప్రేయసే అయినా, సీరి రూపంలో ఆమె నా వెంట పడినా - నీ సహస్రాధిక సఖీ జనంలో ఆమె ఒక్కతె మాత్రమేగా !

అనుమానం వద్దు నీకు

వచ్చెయ్ - అనుభవిద్దాం ఈ మార్గశిర పౌర్ణమిని !

ఈ చలి మరీ ఉడుకెత్తిస్తున్నది నన్ను!

# మార్గశిరి

*ఈ చలిలో !*

*ఈ చల్లని వెన్నెలలో !*

*ఒత్తుగ మెత్తగ ఎదలకు*
*ఒకరి నొకరు హత్తుకొని*
*ఎల్ల జగము నిదురపోవ -*
*ఎవ్వడవో, ఒంటరిగా !*

*వస్తానని ఏ సోమరి*
*బద్దకించి కూర్చున్నదొ !*
*వీలు లేక ఏ సుందరి*
*విరహాగ్నుల బడి యున్నదొ !*

*కవ్వించే కలువలతో*
*కయ్యానికి దిగబోకుమ !*
*మత్తు చల్లి, మంచు చల్లి,*
*చిత్తు చేయు జాబిల్లి !*

నా మనస్సును చదివి, పాడుతున్నది ఉద్యాన రమ - నా చుట్టూ ఈ పాటను.

అది జాలో ! హెచ్చరికో !

మృగశిరా దేవి ఒడిలో బోర్లా పడుకొని, క్రిందికి వంగి చూశాడు. పాట విని పూర్ణచంద్రుడు నాకేసి !

తీక్షణంగా చూస్తున్నాడు – మీసం మెలివేసుకొంటూ !

వడవడ వణికి పోతున్నాను నేను – ఆ మంటల విసుర్లకు !

పార్వతీ పరమేశ్వర మిధున మూర్ధోపరి గంగా ప్రతీరంలో విహరిస్తున్న వీరు డతడు – వెనుక రోహిణితో, ఎదుట అర్ద్రతో !

క్రింద కలువల పట్ల కూడ ఎంత లాలస అతడికి !

నేను వాటి జోలికి పోకుండా నా పై ప్రయోగించాడు అగ్నేయాస్త్రాన్ని !

మంటలు, జ్వాలలు, ధూమం, ధూళి !

ఓహో, వెన్నెల కాదిది !

ఎందుకో ఇంత మాత్సర్యం అతడికి నా పట్ల ?

కేవలం కలువల రక్షణార్థ మేనా ?

అతడి కలువలు నా కెందుకు ?

నీ కందొవలు లేవా నాకు ?

అతడి ప్రియ తారలు నీ హారం లోని ముత్యాలు మాత్రం !

అతడి పూర్ణ జ్యోత్స్న నీ చిరునవ్వు కాంతి మాత్రం ?

అతడి పక్షాలు నీ బొట్టూ, కాటుకా మాత్రం !

రాగ జ్యోత్స్నవు నీవు !

ఒక అధి వీరుణ్ణి నాలో గుర్తించిన ప్రతి వీరుడు చంద్రుడు !

నీపై ద్వేషంతో నాపై యుద్ధానికి పురికొల్పి ఉంటుం దతణ్ణి మృగశిరా దేవి !

ఇదీ వీరత్వం !

ఇదీ వీర రసం !

ఇప్పుడు మా ఇద్దరికీ మధ్య జరుగుతున్న యుద్ధం యొక్క కథనమే వీర కావ్యం !

రెండో ప్రపంచ యుద్ధాన్ని పద్యాలలో వ్రాసి, దాన్ని మహా కావ్యంగా గుర్తింప జేసుకొంటున్నాడు సింహ మహాకవి !

మహా పండితులు, మహా నాయకులు – ఆ మహా కావ్యాన్ని వేనోళ్ల పొగిడి తరించడానికి తాము ఆదిశేషులం కాలేకపోయామే – అని బెంగ పెట్టుకొని చస్తున్నారట !

(నాకు తెలియదు. అతడే అన్నాడు నాతో)

" రామాయణ, మహాభారతాలను మించిన మహాకావ్యం వ్రాశాను. అంతా భగవత్కృప " అన్నా డతడు మొన్న వ్రాతప్రతి నుండి ఒకటి రెండు పద్యాలు చదువు తూ !

ఈ నాటికి మళ్ళీ ఒక మహా కావ్యం !

ఓహో, దేవీ ! సరస్వతీ ! రసపయోధీ ! రాగోదయీ ! విశ్వవాగీశ్వరీ ! సర్వ జీవ శ్రేయస్వినీ !

" మహాకవీ ! మహర్షీ మీ కావ్యనాయకు డెవరు ? నాయిక కాగల్గిన ఆ జగచ్ఛక్తి ఎవరు ?" అన్నాను నేను ఆనందబాష్పాలు తుడుచుకొంటూ !

జవాబు లేదు !

ఆనంద స్థాయి నుంచి, ఆఫీసు స్థాయికి పడిపోయి, ప్రశ్నార్థకంగా చూశాను అతడి కేసి !

అత డక్కడ లేడు !

రెండో ప్రపంచ యుద్ధమే కాదు – ఏ పోరాటం అయినా, అది చరిత్ర కాగలదే కాని, వీరకావ్యం ఎలా అవుతుంది ?

చరిత్రనో, జీవిత చరిత్రనో వచనంలో వలెనే పద్యాలలో కూడ రచించవచ్చు.

గణిత శాస్త్రాన్ని, వైద్య శాస్త్రాన్ని కూడా పద్యాలలో బిగించిన జాతి మనది !

పద్యం కవిత్వం కాదు.

నీతులు, నినాదాలు, ప్రవచనాలు – ఏవీ కవిత్వం కాదు.

అవన్నీ జీవితానికి కావలసిన ఉపకరణాలు.

కవిత్వం ప్రియభోజనం !

స్పర్శా మాత్రంగా అయినా రసం ఉంటేనే అది ఆస్వాదన యోగ్యం అవుతుంది. కవిత అవుతుంది !

రసం ఆనంద స్ఫోరకం

ఆనందం తన్మయిశ్రీ !

నినాదాలు, ఉద్యమాలు, విప్లవాలు, చరిత్రలు – ఏవైనా సరే, ఒక రిథంలో నిర్మించవచ్చు. పద్యాలతో అల్లవచ్చు. అంతే !

పద్యమో. పాటో, లఘు కావ్యమో, పూర్ణ కావ్యమో, ఏదైనప్పటికీ – అది కవిత కావా లంటే – రసం ప్రధానం !

అది ఏ రసమైనా సరే !

రసానికి ఆలంబనం ప్రకృతీ పురుషులు ! నాయికా నాయకులు !

పరిశీలించి చూడు !

శృంగార నిరోధమే వీరం. శృంగార వైఫల్యమే కరుణం.

శృంగార స్పర్శ లేనిదే రసం కాదు

రస స్పర్శ లేనిదే కవిత కాదు

కవితా స్పర్శ లేనిదే కావ్యం కాదు !

రెండు పార్టీల మధ్య వీధిలో కొట్లాట కంటే – రెండు దేశాల మధ్యో, రెండు సిద్ధాంతాల మధ్యో ప్రపంచ యుద్ధం – స్వభావంలో ఏ విధంగా గొప్పది ?

కొట్లాట, యుద్ధం – తర తమ భేదాలతో – రెండూ ఒకటే !

ఇవి చరిత్రాంశాలే కాని, రస నిష్ఠాలు కావు.

రామ రావణ యుద్ధంలో సీత ఉంది

మహా భారత యుద్ధంలో ద్రౌపది ఉంది

ప్రతి ఇంటికీ ఒకో ఇల్లాలు ఉంది

రెండో ప్రపంచ యుద్ధంలో ఉన్న దెవరు ?

స్త్రీ లేనిదే శృంగారం లేదు. శృంగారం లేనిదే రసం లేదు. రసం లేనిదే జీవితం లేదు. జీవితం లేనిదే కావ్యం లేదు.

ప్రతి వ్యక్తి జీవితమూ ఒక కావ్యమే – మరో వ్యక్తి హృదయంతో ముడి పడ్డప్పుడు.

మన జీవితమే ఒక మహా కావ్యం ఈ రాత్రి !

నాయకుణ్ణి నేను !

ప్రతి నాయకుడు పూర్ణ చంద్రుడు !

మహా యుద్ధం ఇది !

హిమ కిరణాలు అణ్వస్త్రాలై ప్రేలుతున్నై !

ఓహో, వచ్చేశావు నీవు !

ఏడీ చంద్రుడు ?

దాక్కొన్నాడు పోయి, బిల్వ వృక్షం కొమ్మల్లో – ఆర్ద్రాదేవి పమిటె మాటున !

ఓడిన చంద్రుడి నుంచి, అతడి పదహారు కళలూ వచ్చేసి, నిన్నాశ్రయించినై ఇప్పుడు !

మన్నించనీ, సమ్మానించనీ, తృప్తిపరచనీ వాటిని – నా చుంబన చూషణపేషణాదిక సమస్త సంస్కార సంపద తోను !

**తలపున జొచ్చి నీవు సర**
**దా మెయి నాడుచు పాడుచున్ ప్రవ**
**ర్తిలు సమయాల – కాల మొక**
**ప్రేక్షకురా లయి నిల్చిపోవు ! నా**
**కలలకు ఏ విరామమును**
**కల్గదు ; నీ పదపద్మ సేవలో**
**మలచితి జీవిత మ్మొక న**
**మస్కృతిగా, కృతిగా, ప్రభూతిగా !**

## 53

మన్మధ సూరి నాకు మంచి మిత్రుడే

అయితే – ఈ మధ్య బాగా అసూయ పట్టుకొన్న దతడికి నా మీద.

నేను నీకు పూర్తిగ లొంగిపోయి, అతణ్ణి మరిచి పోయా నట !

అతణ్ణేనా నేను మరచి పోయింది ? బంధువుల్ని, స్నేహితుల్ని, శ్రేయోభిలాషుల్ని, సినిమాల్ని, నాటకాల్ని, లోకంలో నాకు గల సమస్త పరిచయాలను మరచే పోలేదా నేను నీ అమృత పరిష్వంగ పరమంలో ?

ముందు వచ్చిన చెవుల కంటె, వెనుక వచ్చిన కొమ్ములు వాడి అన్నాడు మొన్న.

అవును – వాడే !

అది వాటి అదృష్టం. ఎవ రేమి చెయ్యగలరు ?

ప్రకృతి సత్యాన్ని పేర్కొంటూ, మళ్ళీ దాన్ని ద్వేషిస్తా రెందుకో !

పుట్టుతో వచ్చిన వెంట్రుకల కంటె, తర్వాత వచ్చిన దంతాలు గట్టి కాదా? అంతకంటె ఉపయోగకరం కాదా ?

" తల్లి విషం. పెళ్ళాం బెల్లం " అనేది మరొక ద్వేష పూరిత వాక్కు – లోకంలో !

పెళ్ళాం బెల్లంగా కలకాలం బ్రతకాలనేగా – అందరూ కోరి పెళ్ళి చేసింది ?

అట్టి బెల్లంపై మన్ను చల్లే తల్లి విషం కాక మరేమవుతుంది ?

తానూ తన మగడికి బెల్లమేగా ?

తన కొడుకు బెల్లంపై ద్వేషం దేనికి ?

అలా ద్వేషించే స్త్రీ తల్లి ఎలా అవుతుంది ?

ఎందుకు గుర్తించరో ఈ సహజ సత్యాలను !

ఎందుకు పెంచుకొంటారో ప్రయోజనం లేని అసూయా ద్వేషాల్నీ, మాత్సర్యాల్నీ !

దేశకాల పాత్ర లనేవి వాస్తవాలు కావు చాలామందికి !

అందుకే – వాటి కనుగుణంగా మారలేక, మారే మనుషుల్ని చూచి ఓర్చుకోలేక – అసూయ పడతారు వాళ్ళు !

అసూయ అనేది వాస్తవ సత్య పరిజ్ఞానం లేకపోవడం వల్ల వచ్చే ఒక జబ్బు.

పుట్టింటినే బూడిద చేసుకొనే అగ్ని అసూయ !

దేశకాల పరిస్థితులు వాస్తవ సత్యాలు. క్షణం క్షణం మారుతూ, ముందుకు పోతున్నై అవి.

చైతన్యం కల దేదైనా ముందుకు సాగేదే. మృత పదార్థం మాత్రమే పడి ఉంటుం దొక చోట. అది కూడ ఆ చోటుతో పాటు కదిలి పోతున్నట్టిదే - గాడిద మీది బూడిద మూట వలె !

కొత్తగా పెళ్లైన కుర్రవాడు పెళ్ళాన్ని విడిచి-తల్లి ఒడిలో పడుకుంటాడా ? చెల్లెలితో సినీమా కెళతాడా ? మిత్రుడితో రాత్రంతా పేకాడతాడా ?

అలా చేసే వాడు మగవా డనిపించుకో గలడా ? మనిషిగా బ్రతక గలడా ?

కొడుకుకు ప్రాణమిచ్చే తల్లి, కొడుకు అర్ధాంగిని దయగా అయినా చూడదేం ?

అసూయ !

అసూయకు పైకి కనిపించని కారణం సెక్సు !

కొడుకును ప్రేమిస్తూ, కోడల్ని ద్వేషించే స్త్రీ ఎంతటి పతివ్రత అయినా సరే - మానసిక వ్యభిచారిణే !

తల్లిని ఆరాధిస్తూ, పెళ్ళాన్ని హింసించే మగవాడు కూడా అంతే !

అసమర్థులుగా కనిపించే సక్కుబాయి మగళ్ళు పరమ దుష్టులు !

మన్మథ సూరి మనస్తత్త్వం విచిత్రం.

ఒక స్త్రీ కోసం మరో స్త్రీని వదులుకొనే వాడు మనిషి కాడు - నా దృష్టిలో.

చాలా మందిని వదిలేసిన వాడు మన్మథసూరి ! అరటిపండులా తిని, తొక్కలా పారేసి పోవా లంటా డతడు స్త్రీని !

ఆరాధన అవివేక మంటాడు. రంభలూ, ఊర్వశులూ డజను ముప్పావులాకు మార్కెట్లో దొరుకు తున్నా రంటాడు !

మీ అన్నతో ఇతడు కూడ ఏదో చెప్పాడు కదూ మనల్ని గురించి ?

ఎంత యాతనకు గురి అయాం మనం !

ఆశ్లేషయ్య దుష్టుడు. ఇతడు అసూయాపరుడు.

తాను బ్రతకడం కోసం ఎంతమంది నైనా చంప గలదు అసూయ !

# 54

అబద్ధ మాడను నేను

అబద్ధ మాడే వాడు కవి కాదు - నా దృష్టిలో !

కవి చెప్పేదీ, వ్రాసేదీ అంతా అబద్దమూ, అతిశయోక్తీ - అంటుంది కదూ లోకం ?

అలా అనేది మూఢలోకం. సహృదయ లోకం కాదు.

అలా అనడం లౌకిక ప్రయోజనాల కోసం పద్యాలు వ్రాసే వాళ్ళను గురించి. రసానంద బ్రహ్మలైన కవుల్ని గురించి కాదు.

ప్రకృతి యొక్క అంతరాంతరాలలోకి కవి వెళ్ళేటంత దూరం సామాన్యుడు వెళ్ళలేడు, కవి చూచే టన్ని అందాలను చూడలేడు.

అపూర్వ లోకాలలో, లోకోత్తర సౌందర్యాలను దర్శించి, దివ్య మాధుర్యాలను అనుభవించి, తన అనుభవ పీయూషాన్ని ప్రపంచానికి పంచిపెట్ట వచ్చిన కవి - సామాన్యుడికి అర్థం కాదు. పైగా అనుమానించ బడతాడు కూడ. దానితో అతడి మొత్తం కవిత్వమే అతిశయోక్తిగా, అబద్ధంగా కొట్టివేయ బడుతుంది !

కవి గోవు లాంటి వాడు

తాను గడ్డి మేసి, లోకానికి పాలిస్తా డతడు.

చూచేవాళ్ళు ఎంతమంది ఉన్నారో, అన్ని కోణా లున్నై సత్యానికి

ఏ కోణం నుంచి చూచేవాడికి ఆ కోణం నుంచి కనిపించేదే సత్యం.

మరో దృక్కోణాన్ని అర్థం చేసుకోలేడు సామాన్యుడు, గుర్తించలేడు పండితుడు, సహించలేడు నాయకుడు.

అన్ని దృక్కోణాల నుంచీ చూడగల వాడు కవి ఒక్కడే !

పూచిక పుల్ల కూడ పువ్వులు పూచేస్తుంది - కవి చేయి తగలగానే !

అతడి చేతిలో రసవంతం కాని వస్తువే లేదు సృష్టిలో

కవి రస బ్రహ్మ

కవి చెప్పేదంతా సత్యం, పరమ సత్యం, సత్యస్య సత్యం !

నేను కవిని. అబద్ధ మాడను నేను

ఒకొక్క స్త్రీలో ఒకొక్క సౌందర్యం భాసిస్తుంది నాకు !

ఎన్నో రకాల కళ్ళు, ఎన్నో రంగుల కాంతులు.

పౌరాణిక కాంతల స్వరూప సౌందర్యాలను గురించి నిశ్చితమైన ముద్ర లున్నై నా మనస్సులో !

సమాజంలో, మన చుట్టూ, కనిపిస్తూనే ఉంటారు మనకు - ఎంతో మంది సీతలు, తారలు, ద్రౌపదులు, అహల్యలు, రాధలు, రంభలు, మేనకలు, కుంతులు, కైకలు, శూర్పణఖలు, సుమతులు, ప్రద్వేషిణులు !

చూడగానే చెప్పగలను నేను ఏ స్త్రీ ఏ అంశకు చెందినట్టిదో !

బాల్యం నుంచీ వెతుక్కొంటూనే వస్తున్నాను నేను నీ కోసం.

ఎంతో మంది - నీవే అన్నంత భ్రమ కలిగించిన రాగవతులు - తారసిల్లారు నాకు నా అన్వేషణలో.

నా కోసం పుట్టిన పూర్ణ సుందరి కంటపడనే లేదు నాకు నిన్ను చూచే దాకా !

సీరి ఊర్వశే అయినా, నీ చెలికత్తె మాత్రమేగా !

నీ చెలికత్తె నీవు ఎలా అవుతావు ?

ఏడ్పు, ఆకలి, హక్కులు, పోరాటం-ఇవే సాహితీ లోకాన్ని సైతం పాలిస్తున్న ఈ యుగంలో- నీ లాంటి ఒక పూర్ణ రసైక రాగేశ్వరిని సంపాదించుకో గలిగిన నేను ఎంత ధన్యుణ్ణి !

సీరి మన్మథసూరి లాంటి వాళ్ళ కోసం

నత్తలు కొంగల కోసం.

" మునిగితే గాని ముత్యాలు దొరకవు " అన్నది కదూ కుసుమ ?

కుసుమ, రాజు, సత్యకళ, రమణ, రామకృష్ణ, మోదుకూరి, రామదాసు, తారక - వంటి అమృత హృదయాలే లేకపోతే ఆశ్లేషయ్య లాంటి హాలాహలం నుంచి బ్రతికి బైటపడే వాళ్ళమే కాము మనం - ఆ తొలి రోజుల విలయాలలో !

మంచి చెడ్డల్ని గుర్తించి, పూర్తిగా, ఆమోదించేదే స్నేహం.

అలాంటి స్నేహం మూర్తి దాల్చిన మృదు మధుర మందార కుసుమమే కుసుమ !

ఇప్పుడు ఎక్కడున్నదో, ఏమైపోయిందో ఆమె !

కాని –

ఆత్మికంగా మనతో ఉంది, ఉంటుంది శాశ్వతంగా.

నిండా మునిగి సంపాదించుకొన్న ముత్యాలం మనం– ఒకరి కొకరం !

ఈ ముత్యాలే ప్రకృతి పురుష సత్యాలు !

అబద్ధ మాడను నేను

పరస్పర రాగబద్ధం, అనిరుద్ధం – ఈ మన జీవితోద్గీథం !

## 55

ఎవరి భర్తనో ప్రేమించే స్త్రీలు !

ఎవరి భార్యనో ప్రేమించే పురుషులు !

ఎలా తీరతై వీళ్ళ కోరికలు ?

లీలావతి ప్రశ్న ఇది.

ఎందుకో వచ్చి, బాతాఖానీ పెట్టింది నాతో మొన్న.

తమకు పని లేనప్పుడు, ఇతర్లకు కూడా పని ఉండ దనుకొనే వాళ్ళలో లీల ఒకర్తి.

నాకు పని ఉన్నదని గట్టిగా చెప్పలేని మొగమాటం నాది.

కూర్చున్నాను వింటూ.

ఏమిటో ఈ ప్రేమలు !

ఎందుకు జరుగుతవో ఇలా !

" కావాలని ప్రేమిస్తారా ఎవరైనా ? ప్రేమ ఎప్పుడు, ఎలా ఎవరిపై పుడుతుందో ఎవరికీ తెలీదు. ప్రేమించిన తర్వాత కదా, ఫలానా వ్యక్తిని ప్రేమించినట్టు తెలియడం ? ఆ తర్వాత కదా ఆ వ్యక్తి వివరాలు తెలియడం ? ఆ వ్యక్తి లభించడం సాధ్యం కాదని తెలిస్తే ఆ తర్వాత ఏమిటి గతి? అప్పటికే అంచులు మోసి ప్రవహిస్తున్న ప్రేమ వాహిని ఎటు మళ్ళడం ? రహస్య కామం వైపా ? ఆత్మహత్య వైపా ? ఆమరణ బ్రహ్మచర్యం వైపా ? ఎటు ?" అన్నది లీల.

ప్రేమించిన వాళ్ళను పెళ్ళాడకూడ దనే సిద్ధాంతం కదా నాది ?

సెక్సు కంటే, సంసారం కంటే ప్రేమ గొప్పది నా దృష్టిలో.

సెక్సు ఒక కోరిక. అది శరీర నిష్ఠం.

ప్రేమ ఒక అనుభూతి. అది ఆత్మ నిష్ఠం.

సెక్సుకూ, సంసారానికి ఏ స్త్రీ అయినా చాలు, ఏ పురుషుడైనా చాలు.

ప్రేమించడం అతిలోక సుందరం.

ప్రేమ స్థాయిలో పెళ్ళాడి, ఆ తర్వాత కూడ ప్రేమను అదే స్థాయిలో నిలుపుకొని తరించగల పూర్ణత్వం ఎవరి కుంది ?

ఎవరి భర్తనో, ఎవరి భార్యనో ప్రేమిస్తే ఏం ? దాని వల్ల వచ్చే నష్టం ఏమిటి ?

ప్రేమించడాన్ని నిషేధించలేరు ఎవరూ.

ప్రేమ ఆత్మ స్వరూపి. ఆనందలహరి. ఊర్ధ్వశ్రీ అది నిషేధించే కొలదీ వికసిస్తుం దది.

ప్రేమ ఏక పక్షమైనా తారక మైనట్టిదే. ఉభయ పక్షమైతే, ఇహపర సుఖదాయకం అవుతుం దది ఇతోధికంగా.

ప్రేమ ఆధ్యాత్మికం. పెళ్ళి లౌకికం. అందుకే ఆ రెంటికీ సంబంధం ఉండ కూడ దంటాను నేను. ఉంటే - సామాన్యుల విషయంలో ప్రేమ దెబ్బ తింటుంది.

ప్రేమ వల్ల ఏ చిక్కూ లేదు.

కామిస్తేనే ఏ చిక్కైనా !

కామం శరీర సంబంధి కనుక, రెండు శరీరాల కలయిక లేకుండా తీర దది.

అంటే - అవతలి వ్యక్తి కూడా విధిగా కామించవలసి ఉంటుం దప్పుడు.

అదీ జరిగితేనో ?

" ప్రారంభదశలో ప్రేమనూ, కామాన్నీ వేర్పరచలేం కనుక - అంతటి గాఢానురాగం, ఆత్మాను బంధం వ్యక్తం కావడం ఒక్క ప్రేమ విషయం లోనే కనుక - తాను ప్రాణాలను సైతం అర్పించి, తన ప్రేమ లక్ష్యాన్ని సాధించాలన్న ఆ తీవ్ర వాంఛ, మర్యాదగా తీరవలసి లేదా ? " అంటుంది లీల.

పోనీ, అది కామమే అనుకొన్నా - అది ఏక వ్యక్తిపై లగ్న మైనప్పుడు, అందులో ప్రేమ పాలే ఎక్కువ కదా ?

దానిని సఫలీకృతం చేసుకోవాలనే ఇచ్ఛ ఆ వ్యక్తిలో బలీయంగా ఉండదా ?

ఆ ఇచ్ఛ మర్యాదగా తీరనప్పుడు - శారీరక వ్యభిచారమో, మానసిక వైకల్యమో, దురంత జీవిత వైఫల్యమో తప్పదు కద ?

" అంతటి దుస్థితినీ, దుర్మార్గాన్నీ కొనసాగనిచ్చే కంటె - అలాంటి ఎన్నో జీవితాలను క్రూరంగా నాశనం చేసే కంటె - ఆ కోరిక సహజ మార్గం లోనే, చట్ట సమ్మతంగానే తీరిపోయే ఏర్పాటును, సంప్రదాయాన్ని నెలకొల్పు కోవడం శ్రేయస్కరం కాదా ? " అంటుం దామె.

ఔను - నిజమే !

అది వట్టి కామమే అయితే - అది చల్లారి పోక తప్పదు - ఆ కామినీ కాముకులు కలుసుకొన్న అచిరకాలం లోనే.

అది ప్రేమే అయితే - దాన్ని శాశ్వతంగా నిషేధించి, ఆ ప్రేయసీ ప్రియుల్ని జీవితాంతం హింసించడం పరమ పాపం.

మనస్సును వ్యభిచరించ నిస్తూ, శరీరాన్ని గదిలో పెట్టి తాళం వేసే దురాచారం ప్రబలి నప్పటి నుంచే పతనమై పోయింది మానవ సమాజం - నరకం లోతుల దాకా !

సహజమైన కామ నివృత్తికి వ్యభిచార మనే పేరు దేనికి ? ఆ పేరుకు అంతటి నిషేధం దేనికి ? ఆ నిషేధోల్లంఘనకు అంతంత ఘోరశిక్షలు దేనికి? మానవుడికి మెద దున్నదా ? ఉంటే - దానికి కాంతి ఉన్నదా ?

మానవ మనస్తత్వం, ప్రేమ తత్త్వం, పర తత్వం అర్థం కాని వృద్ధ నియంతలు శాసించే సమాజం ఏదైనా - ఇలా చీకట్లో బ్రతక వలసిందే.

స్వచ్ఛమైన ప్రేమకు శరీరంతో పని లేదు. ఎవరి నైనా, ఎంత మంది నైనా ప్రేమించ వచ్చు స్వేచ్ఛగా !

పచ్చి కామానికి ఏ శరీర మైనా ఒకటే !

కామించి, ప్రేమించి, ఈ రెంటినీ ఒకే వ్యక్తిలో కేంద్రీకరించుకొని, ఆ వ్యక్తితో జీవిత సాఫల్యం పొందుదా మనుకొన్న పవిత్ర స్త్రీ పురుషుల్నే కదా - ఈ సమాజం హింసిస్తున్నది ?

" పురుషుడికి స్త్రీ, స్త్రీకి పురుషుడు ఎందుకు ? కామ తృప్తి కోసం, సంతానం కోసం, ఆత్మైక పారమ్య ప్రాప్తి కోసం ! అవునా ? వీటి సిద్ధికి నేటి సమాజం ఎలా తోడ్పడుతున్నది ?" తీవ్రంగా అన్నది లీల.

నిజమే, మరి !

నీతికీ, జీవిత గమనానికీ సంబంధమే కనిపించడం లేదే !

మాది ఆధ్యాత్మిక మతం అని చెప్పుకొంటూ – ఆత్మను బైట పెంటమీద పారేసి, శరీరాన్ని పరదా వెనక దాచుకొనే మూఢ జాతిమనది.

ఆత్మను ఇచ్చుకొన్న చోటనే శరీరాన్ని కూడ ఇచ్చుకోనిచ్చే ధర్మజ్యోతి ఇంకా ఎంతదూరంలో ఉన్నదో !

# 56

" లీల చిన్నదే కాని, పెద్ద కబుర్లు చెపుతుంది "

" ఇంతకూ ఆమె చెప్పే పరిష్కారం ఏమిటి ?

" ఎంత మందిని ప్రేమిస్తే అంతమందినీ పెళ్ళాడే పద్ధతి మళ్ళీ తిరిగి రావాలంటుందా ఆమె ?"

" అది యుగం నాటి ఆచారాలను తిరిగి తెచ్చుకొంటే, ఇక మానవ జాతి సాధించిన పురోగతి ఏ మాత్రం ? "

బాగున్నై నీ ప్రశ్నలు.

పూర్వ కాలంలో బహు భార్యాత్వం, బహు భర్తృత్వం కూడ ఉన్నై.

ఇప్పుడా సంగతి వద్దు మనకు.

ఈనాడు కూడా బహు భార్యాత్వం చట్ట సమ్మతంగా అమలులో ఉంది – చాలా సమాజాలలో.

విడాకులు అనే ఒక కృతక న్యాయాన్ని సృష్టించుకొని, దాని ద్వారా తన బహు స్త్రీ భోగేచ్ఛను తీర్చుకొంటున్నాడు పురుషుడు – కొన్ని సమాజాలలో.

అదే పని స్త్రీ కూడ చేస్తున్నది.

విడాకుల చాటున ఈ దొంగ వ్యాపారం దేనికి ? ఇది వ్యభిచారం క్రిందకు రాదా ?

ఒక స్త్రీని పెళ్ళాడడం కోసం, మరొక స్త్రీకి విడాకు లివ్వడం ఎందుకు ?

తాను ఉండగా, తన మగడు మరొకతెను పెళ్ళాడ డానికి భార్య ఒప్పుకోదు కనుక !

ఎందుకు ఒప్పుకోదు ?

ఆర్థిక సమస్య ఉంది కనుక !

తన భర్త ఆస్తిని, ఆర్జనను, వారసత్వపు హక్కులను మరొకరు పంచుకోడానికి ఏ భార్యా ఒప్పుకోదు. కామం కంటె, ప్రేమ కంటె, ఆస్తిపై హక్కే భార్య ప్రవర్తనను నియమించే ప్రధాన సూత్రం – ఎక్కువగా.

ఇప్పుడు – నేటి స్త్రీల పరిస్థితిని పరిశీలించి చూడు !

పురుషులతో సమానంగా చదువు కొంటున్నారు స్త్రీలు. సమానంగా పని చేస్తున్నారు అన్ని రంగాల లోనూ. హక్కులు కూడా సమానంగానే ఉన్నై. కాని – పెండ్లి కావడం ఒక్కటే సమస్యగా ఉంది.

ఆఫీసు లోనో, విద్యాలయం లోనో, వ్యాపార సంస్థ లోనో, కర్మాగారం లోనో, ఎక్కడో ఒకచోట ఉద్యోగం చేస్తున్న ఒక స్త్రీ – తోడి ఉద్యోగి అయిన ఒక పురుషుణ్ణి ప్రేమించడంలో వింత ఏమీ లేదు కద !

అత డప్పటికే వివాహితుడై ఉంటే ?

నేటి మన సమాజంలో మూడే మార్గా లున్నై ఆమెకు – తన ప్రేమ సఫలం కావాలంటే –

అతడితో చాటుగా వ్యభిచరించడం.

ఉంపుడు కత్తెగా ఉండి పోవడం.

భార్యకు విడాకు లిప్పించి, తాను భార్య నామం ధరించడం !

ఆమె ప్రేమకు తగిన మార్గాలేనా ఇవి !

ప్రేమ నుంచి ఆనందాన్ని, ఆత్మోపరపతిని కోరుతున్న దామె.

పై మార్గాలలో దేని వల్లా ఆమె కోరిక నెరవేరదు.

మొదటి మార్గం పాపం.

రెండోది అవమానం.

మూడోది అన్యాయం.

ఆమెను రెండో భార్యగా అతడు స్వీకరిస్తే, ఈ గోలంతా ఉండదుగా ?

అతడి ఆస్తిని గాని, ఆర్జనను గాని, వారసత్వాన్ని గాని, మరేవిధమైన ఆర్థిక ప్రయోజనాలను గాని కోరడం లేదామె. అలావ్రాసి ఇస్తుంది కూడా. సమాజం కోసం భార్య అనే రెండక్షరాల బిరుదును కోరుతున్న దామె. తన బిడ్డకు చట్ట సమ్మతమైన ఒక తండ్రిని కోరుతున్నది - అంతే !

" సహజమైన ఆమె కోరికను తీర్చడానికి అనుగుణంగా మనం మన చట్టాలను ఎందుకు సవరించుకోం ?" అని అడుగుతుంది లీల.

ఏక భార్యా నియమానికి, విడాకుల పద్ధతికి మూలం ఆర్థిక బాధ్యతలే. భర్త ఆస్తి, ఆర్జన, వారసత్వం మొదటి భార్యకే చెందుతవనీ, తక్కిన భార్యలు వాళ్ళ బ్రతుకు వాళ్ళు బ్రతక వలసినదేననీ చట్టంలో నిబంధపరిస్తే - సమస్యే తీరిపోదా ? " అంటుం దామె.

అప్పుడు సమాజంలో రహస్య ప్రణయా లుండవు. వ్యభిచారం ఉండదు. స్త్రీకి పెళ్ళి సమస్య ఉండదు. ఉంపుడుకత్తెలు ఉండరు. ప్రేమ విఫలత లుండవు, ఆత్మహత్య లుండవు.

రాంబాబు వచ్చి చేరాడు మా సంభాషణలో.

దానితో ప్రారంభ మయింది ఆ ఇద్దరి మధ్యా - ప్రమీలార్జునీయం !

ఆ ఇద్దర్నీ అలా ద్వంద్వ యుద్ధంలో విడిచి - లేచిపోయాను నేను.

## 57

" శ్రీవల్లితో సినీమాకు వెళ్ళాను రాత్రి.

" అసలు సినీమాలకే వెళ్ళడం లేదుగా నే నిప్పుడు !

" ఎక్కడికి వెళ్ళినా, మీతో వెళ్ళాలి. మీతో అయితే, ఎక్కడికి వెళ్ళాలి ? మీరే నాకు సినీమాలు, నాటకాలు, సమస్త వినోదాలు !

" ఎన్నాళ్ళ నుంచో అడుగుతున్న దామె. అందుకని వెళ్ళాను. "

" దారి పొడవునా ఏవో కబుర్లు, కథలు చెపుతూనే ఉన్న దామె. అవేవీ నాకు వినిపించనే లేదు.

" సీట్లలో కూర్చున్నాం. ఆట ప్రారంభ మయింది. ఒంటరి దాన్ని అయిపోయాను నేను. "

" ప్రక్క కూర్చుని ఏమేమో వాగుతున్న మిత్రురాలు, చుట్టూ ప్రేక్షక జనం, ఎదుట చక్కని పిక్చరు, హాలంతా కరతాళ ధ్వనులు – అయినా, ఒంటరిదాన్ని నేను !

" మీరు ప్రక్క లేరు !

" మరి, ఎక్కడున్నారు ?

" లోన హృదయంలో ఉన్నారు, సరే. బైట ఎక్కడున్నారు ?

" రసాలినీ లతా గృహంలో ? మధుగిరిపై ? మన్మధసూరితో ? మరి–మరి

" వెదక సాగింది నా మనస్సు

" నిన్న మీరు చేసిన పని – ద్రాక్షరసం బ్లౌజుపై ఒలకడం – వృధాగా పోతున్నదని మీరు దానికి పెదవులు చేర్చడం - పెదవుల మధ్య హేమగిరి శిఖరాల మొనలు చిక్కు కోవడం – ఉత్సాహ సంరంభంలో గాజు పగిలి నెత్తురు చిందడం – అప్పటి క్రీడలో నేను రాగజ్యోతినే కావడం – అన్నీ కనిపిస్తున్నె నాకు తెర మీద !

" మనమే నాయికా నాయకులం !

" శ్రీవల్లి పిక్చరు చూస్తోంది. నేను మన ప్రణయ లీలా విలాసాలు చూస్తున్నాను ఒకే తెర మీద !

" మనకు ముఖ్యం హృదయా లని నేనంటే – హృదయాలకు ఆధారాలు శరీరాలని మీరన్నా రొకనాడు. అదే నిజ మనిపిస్తుంది నేడు !

" ఆత్మ పదార్థం సర్వత్రా ఒక్కటే. ప్రేమ స్వభావమూ ఒక్కటే. మీరు నేను అనే భేదం, మనిద్దరం కలవడం ద్వారా దాని రహితం – శరీరాలను బట్టి వచ్చినట్టిదే కదా ?

" మనం హార్దికంగా కలిసే ఉన్నా, శారీరకంగా విడిపోయి ఉన్నందు వల్లనే కదా ఒంటరితనం బాధిస్తున్నది నన్ను ?

" ఎవ రెన్ని చెప్పినా, వాస్తవ జీవితంలో శరీరానిదే ప్రధాన పాత్ర. "

" మనం ఆంజనేయుని కొండపై, శివాలయం ఎదట, నందీశ్వరుని తోక దగ్గర ఉన్నాం అప్పుడు.

" అక్కడే కదా మనం పాణిగ్రహణం చేసుకొన్నది ? "

" ఎంత పారవశ్యం ! ఎంత చక్కని తోక ! దానితో ఆడుకొంటూ, ఒక వెంట్రుక పీకాను నేను ! "

" అబ్బా – జడ పీకేశావు – అన్నది శ్రీవల్లి !

" ఉలిక్కి పడ్డాను నేను !

" చూశావా – నాయిక చివరి కేమయిందో "

" ఏ నాయిక ? "

" నీతో సినీమాకు రా కూడదన్న దామె ! "

" ఏ నాయిక ఎలా పోతే నాకేం ! ఇప్పుడు నా నాయకు డెక్కడున్నాడో – అనుకొంటూ ఇల్లు చేరాను నేను.

" నిద్ర పట్టలేదు నాకు – ఆ తర్వాత ! "

ఓహో, రాగ లాస్యా !

ఎంతటి సత్యాన్ని మోసుకు వచ్చింది నీ లేఖ !

నీవు సినిమా చూస్తున్నంతసేపూ నీ మనస్సు ఎక్కడ విహరిస్తున్నదో, అక్కడే అంతసేపూ నా మనస్సు కూడా రమిస్తున్నది !

మన మనస్సులు లేచిపోయి, విశ్వవిహారం చేస్తూ, రాధామాధవం జరుపుకొంటూ ఉంటే – శరీరాలకు నిద్ర ఎలా పడుతుందిక ?

**నాయికవు నీవు, నీ నాయకుడనే నేను;**
**లోకమే ఒక సినీమా కదే మనకొరకు !**
**పాటగాడను నేను, ఆటగత్తెవు నీవు !**
**మన ప్రయోగమె అస్తి ! మన వియోగమె నాస్తి !**

## 58

" మీరు తరచు కలుసుకొంటూనే ఉన్నారుగా ? మధ్యలో మళ్ళీ ఈ లేఖ లెందుకు ?" అన్న దన్నావు కదూ శ్రీ వల్లి !

సామాన్యులకు అర్థం కాదు మన ఇతి వృత్తం.

నీవు చెప్పిన జవాబు కూడ అర్థం కాలేదు కదూ ఆమెకు ? ఆమె ఒక సామాన్య యువతి.

ప్రేమించుకొన్నా మనుకొనే ఇద్దరు యువతీ యువకులు శారీరకంగా కలుసుకోవడం వరకే ఆమె అర్థం చేసుకోగలదు.

లోక రీతే అంత !

జడ ప్రకృతికి అనుభవం లేదు.

ఆ మీది జంతు ప్రకృతికి అనుభవం ఉంది. కాని, అనుభూతి లేదు.

ఆ మీది మానవ ప్రకృతికి అనుభూతి ఉంది. కాని, దాని పరమజ్ఞత లేదు.

ఆ మీది పూర్ణ పురుష ప్రకృతికి పరమజ్ఞత ఉంది. పూర్ణపురుషుడు పురుషోత్తము డయ్యే దశ అక్కడ ప్రారంభ మవుతుంది.

అక్కడ పుడతాడు కవి !

పరమానుభూతి మెట్టు మీద పుడతాడు కవి !

ఆనందం, స్పందనం, భావం, బీజం, స్థావరం, జంగమం, మానవం– ఈ అన్ని దశల నుంచీ పయనించుకొంటూ వచ్చే జీవుడు, మానవ ప్రకృతిలో మొదటి మెట్టు మీద అడుగు పెట్టిన తొలిదశలో, అచ్చు జంతువు లాగే ప్రవర్తిస్తాడు – తికమకతో.

దొంగలు, దగాకోర్లు, రౌడీలు, శాడిస్టులు, కులతత్వవాదులు, గర్వపోతులు, హింసకులు, హంతకులు – ఈ బాపతు మనుషు లంతా జంతు ప్రకృతి నుంచి మానవ ప్రకృతిలో తొలిసారిగా అడుగుపెట్టిన ప్రొబేషనర్లే !

దేశం, జాతి, మతం, కులం, వంశం, వర్గం వీటి ప్రమేయమే లే దిక్కడ. జంతువు ఏ దేశంలో, ఏ వాతావరణంలో పుట్టినా జంతువే.

భౌతిక ప్రకృతి మానవ రూపం పొందిందే కాని, మానసిక ప్రకృతి ఇంకా జంతు దశ లోనే ఉన్నది అట్టి వాళ్ళకు.

అంధకారం నుంచి అప్పుడే వెలుగులో పడ్డ శిశువులు వాళ్ళు.

కళ్ళు మూసుకొనే ఉన్నై ఇంకా వాళ్ళకు !

అక్కడి నుంచి వాళ్ళ ప్రయాణం - ముందుకే అయినా - రకరకాలుగా సాగుతుంది కదిలి !

కొత్త వెలుగును భరించుకోలేక కొందరూ, దానిని దుర్వినియోగం చేసుకొని కొందరూ - తిరిగి జంతు ప్రకృతి లోకి తిరోగమించడమూ కద్దు.

ముందు శరీరం మానవ రూపం తాలుస్తుంది.

ఆ తర్వాత మనస్సు మానవతను సంపాదించు కొంటుంది.

ఆ నడుమ కాలం మూఢం.

అది సంధ్య చీకటి.

వివేకికి అది ఉదయ సంధ్య. అవివేకికి సాయం సంధ్య.

జీవశక్తిని ముకుళింప జేసుకొని వెనక్కి పోవడమో, వికసింప జేసుకొని ముందుకు పోవడమో - అది వాళ్ళ పురాకృత పుణ్య సామర్థ్యంపై ఆధారపడిన విషయం.

వాళ్ళ శరీరాలను అదుపులో పెట్టవచ్చు. మనస్సుల్ని ఎవడు కంట్రోలు చెయ్యగలడు ?

వాళ్ళ భవిష్యత్తును నిర్ణయించేది వాళ్ళ మనస్సే !

వివేకి అయిన జీవుడు, సంస్కార బలంతో నిగ్రహాన్ని అవలంబించి, తప్పటడుగులు వేసి పడుతున్నా - వెనక్కి జారిపోతున్నా - లెక్క చెయ్యకుండా, నవనవోన్మేష ప్రజ్ఞా ప్రాభవంతో ముందుకు సాగిపోతాడు.

పరమానుభూతి స్థాయిలో కవిగా పుట్టేవరకు, కష్ట భూయిష్ఠం గానే ఉంటుంది జీవుడి యాత్ర.

కవి, యోగి - వీళ్ళ స్థాయీ స్థితులు రసబ్రహ్మ, పరబ్రహ్మ సాయుజ్య సముపరతులు !

అవ్యక్తం నుంచి, బీజప్రకృతి నుంచి, జీవలత పుట్టి, పెరిగి, వికసించిన పుష్పం కవి !

ఫలం యోగి !

జీవన పథాన్ని, జీవిత పరమార్థాన్ని గుర్తించుకొన్న మానవుడు సహృదయుడు.

సహృదయుడైన క్షణం నుంచీ హెచ్చుతుంది- అతడి పురోగమన వేగం.

పరమార్థం అల్లంత దూరాన, శ్రీశైల శిఖరం వలె, దృగ్గోచరం కాగానే- కవి అవుతా డతడు.

అక్కడి నుంచి ఇంకా ముందుకు సాగేవాడు సాధకుడు, ముముక్షువు, మహాయోగి !

పరమార్థ లక్ష్యం చేరడమే జీవ బ్రహ్మైక్య పరమస్థితి.

ఇదంతా ఒక ఎడ తెగని యాత్ర. ఒక జీవ ద్రస వాహిని.

రాత్రిం బవళ్ళ వలె - జనన మరణాలు యాత్రను ఆపలేవు. మజిలీలు కావచ్చు అవి !

పెడదారి పట్టినప్పుడు నిరోధకాలు కావచ్చు అవి. చుట్టుదారుల వల్ల ఆలస్యం కావచ్చు కూడా.

కొన్ని రాత్రులు ప్రయాణం సాగక పోవచ్చు. కొన్ని పగళ్ళు ఆకర్షించి ఆపివెయ్య వచ్చు.

ఏది ఏమైనా - యాత్ర మాత్రం తప్పదు.

తొందరగానో, ఆలస్యంగానో - ఉత్సాహంగానో, ఆయాసపడుతూనో, నవ్వుతూనో, ఏడుస్తూనో - లక్ష్యం చేరక తప్పదు ఎప్పటికైనా !

వ్యక్తం కావాలనే తపన, ముందుకు పోవాలనే వ్యగ్రత, లక్ష్యం చేరాలనే ఉత్తేజన - భావస్థితి నుంచీ ఉంటుంది ప్రతి జీవికీ !

కవి స్థాయిలో విశిష్టరూపం ధరిస్తుం దది !

అక్కడి నుంచి పట్ట పగ్గా లుండవు దానికి !

అంతవరకు సంపాదించుకొని, సంచితం చేసుకొని, దారి బత్తెంగా మోసి తెచ్చుకొంటున్న సమస్తమైన అనుభూతుల్నీ - ఇరువైపులా విరజిమ్ముకొంటూ, పరుగు తీస్తా డతను ముందుకు !

ప్రయాణంలో తినడాని కేమీ దొరకదేమో నన్న భయంతో మూటగట్టి తెచ్చుకొన్న అటుకులు, దారి పొడుగునా సంచీలో నింపుకొంటున్న ఫలాదులు - భోగ భాగ్య వైభవోపేతమైన లక్ష్య లక్ష్మి ఎదురుగా కనిపించేటంత వరకే పనికివస్తై - ఆ మీద అవి వట్టి బరువులు.

వాటిని ఇటూ అటూ పారవేసుకొంటూ, దానం చేసుకొంటూ పోతాడతడా మీద.

ఆ విధంగా అతడు ఎడా పెడా చిమ్మివేసే అనుభూతులే, అతడి నుంచి లోకానికి లభించే సాహితీ సంపద.

అనాదిగా మనకు లభిస్తూ వస్తున్న అలాంటి సంపదే – వేదాలు, పురాణాలు, ఉపనిషత్తులు, కథలు, కావ్యాలు ఇత్యాది.

ఆ అనుభూతుల విలువను బట్టి ఉంటుంది – ఏ తత్సంపద విలువ కూడా –

అటుకులు కావచ్చు, అమృత ఫలాలు కావచ్చు అవి.

లక్ష్యం చేరేసరికి అతడి వద్ద మిగిలేదేమీ ఉండదు.

అప్పు డతడు శుద్ధ నిర్గుణ బ్రహ్మ.

కవి – యోగి మధ్య దారిలో ఉన్నాం మనం.

మనం తేలిక పడి, గమనం హెచ్చడం కోసమే ఈ చర్య ఈ లేఖలు. –

ప్రేమ, అనురాగం, త్యాగం, శరీరసుఖం, ఆనందం, ఆత్మోపరతి, పూర్ణార్పణ – మన సమస్త అనుభవాలకు మనం కల్పించుకొంటున్న అక్షర రూపా లివి.

లోభి వాని ధనం కాదు – ప్రతిభావంతుని అనుభూతి.

ఒకరి ఒడిలో ఒకరం మైమరచి ఉన్నప్పుడు, తరంగిత మయ్యే ఎన్నో మధుర భావాలు–

సిగ్గుతో పెదవి దాటనివి
పెదవులపై ముద్దుల్లో మూగ వోయేవి
ఊహల్లో ఊరేగేవి
పాల కోవాల్లా గొంతు దిగనివి
కౌగిట్లో కరగి పోయేవి
మానసంలో ఈదేవి
ఆకాశంలో రగిలేవి
ఆత్మకు కూడా అందనివి

ఎన్నో, ఎన్నో లజ్జా కజ్జల సునోజ్ఞ భావాలు - ఆనంద స్పర్శలు - నిక్షిప్తాలైన మధుకలశాలు ఈ లేఖలు !

మన దైనందిన అనుభవాలే అయినా - పచ్చి వాస్తవాలే అయినా - సార్వకాలిక విశ్వజనీన మాధుర్యాలు కావా ఇవి ?

వీటికి తల్లివి నీవు !

అర్థం కాదీ తత్వం శ్రీ వల్లికి.

బాహ్య విషయాభ్యంతర పరమ రహస్యాలను, అందలి అందాలను చూడగల రాగతపస్సు లెంతమంది ?

ఆపోజ్యోతీ సహజ్యోతివి నీవు !

నీ కిరణాలే అమృత శ్రీ చరణాలు !

***చూడగల కను లుండి చూడవలెనే కాని,***
***అందాలు లేని చోక అణువైన కలుగునే !***
***అన్ని అందాలు నీ అడుగులై పద్మింప,***
***పద్మవౌ నిను గొల్చి పడయరే మోక్షమ్ము ?***

## 59

చాలీ చాలని ఉన్నీల మేఘ శల్కం క్రింద ఉద్ధతమైన సౌదామనీ లతలా ఉన్నావు నీవు - ఆ కాశ్మీరు శాలువా కప్పుకొని !

బంగారు శరీరం, ఎఱ్ఱ కలువల ఛోళీ, పాల వెన్నెల చీర, చిమ్మ చీకటి కేశరాశి, నల్లని శాలువా, ఐరావత గమనం, నీలోత్పల రుచిరాలైన విశాల విలోకనాలు - సమ్మోహితులై పోయారు కద ఎగ్జిబిషను లోని స్త్రీ పురుషు లంతా నిన్ను చూచి !

పంచబాణుడు పంచ బాణాలతో అలంకరించి, రతినే సంధించి, ఎగ్జిబిషను మీదకు వదిలాడో అనిపించింది అక్కడికి నీ రాక !

మత్తెక్కిన మంచివాళ్ళు, గుటకలు మ్రింగే సంసారులు, రాసుకు పోవాలనుకునే రౌడీలు, బూటు కాళ్ళతో పాదాలు త్రొక్కజూచే కారుదున్నలు - వీర విహారం చేస్తున్నారు అందమైన ఆడవాళ్ళ వెంట పడి !

ఏమిటో ఈ మనస్తత్వం మగవాళ్ళకు !

తనది కాని, తనపట్ల మనసు లేని, తనకేసి చూడనైనా చూడని ఒక స్త్రీ వెంట అలా ఎందుకు పడతాడో మగవాడు !

అందాన్ని చూడవచ్చు. ఆనందించవచ్చు. పీడించడం దేనికో !

ఆహారం కోసం పులి మేకను చంపినట్టు, శరీరసుఖం కోసం స్త్రీని హింసించి చంపుతాడు క్రూరుడు !

అట్టివాడు బహుశా, అప్పుడే జంతు స్థితి నుంచి మానవస్థితికి పరిణమించిన జీవుడై ఉంటాడు. శాడిస్టు అయి ఉంటాడు.

ఆకలి, ఆశ, ఆరాటం – ఇవే అట్టివాడి సహజ గుణాలు.

ప్రేమ, సౌందర్యం, రసం వంటి వేమీ అర్థం కా వతడికి !

ఆకలి, ఆశ, ఆరాటం – వాటిని తీర్చుకోడానికి వేట !

అతడు ఏ రంగంలో అడుగు పెడితే, ఆ రంగం భయ విహ్వలమై పోతుంది. పాప దుష్టమై పోతుంది కూడ.

సంస్కారం మొగ్గ దొడగని ప్రాథమికుడు వాళ్ళు, పాపం.

అట్టి జంతు ప్రకృతులే ఎక్కువ ఎప్పుడైనా, ఏ సమాజంలో నైనా.

ఏం జేస్తాం వాళ్ళని ?

పాశవిక ప్రవృత్తి తగ్గుతూ, సహృదయత పెరుగుతూ, మానవత వికసించ వలసి ఉంది వాళ్ళలో.

అది క్రమంగా జరగవలసిన పరిణామం.

అది జరుగుతూ, అట్టి వాళ్ళు ముందుకు పోయే కొలదీ, క్రొత్త వాళ్ళు వస్తూనే ఉండరా!

ముగిసేది కాదు ఈ క్యూ !

సర్దుకు పోవలసింది మనమే.

తేళ్ళకు మందులు, పాములకు మంత్రాలు, జంతువులకు ఆయుధాలు భగవంతుడు మన కిచ్చిం దందుకే !

చేతులు జోడిస్తే కరుణిస్తుందా పెద్దపులి ?

మన చుట్టూ ఉన్న ప్రకృతిని అర్థం చేసుకొంటే చాలు మనం.

ఒళ్ళన్నీ కళ్ళతో చూచింది మొత్తం ఎగ్జిబిషను నీ వంక !
ఒక రంగుల రాట్నమే అయి తిరిగిం దది నీ చుట్టూ!
దాని ఇరుసే నీ సింహాసనం !
అదే నా శిరోభూషణం !

## 60

*మనసు వరకె కదా*
*మనకు లభించిన స్వేచ్ఛ ?*
*మాధవ సఖిగా విరిసి,*
*మధు మోహినిగా వెలసి,*
*రస రాజ్యము లేలు మనసు !*
*రాగ రమా మణి మనసు !*
*చీకటి లేనిది మనసు,*
*లోకము మీదిది మనసు,*
*ప్రణయ పావనము మనసు,*
*పరమామృతమే మనసు !*
*కోరి నంతనే కోరిక*
*కొంగు బంగరౌ మనసు !*
*చేరి నంతనే శివునికి*
*శివయే తానగు మనసు !*

పరువు ప్రతిష్ఠల పేరుతో శరీరం బంధింపబడి నప్పుడు, ప్రేయసీ ప్రియులకు ప్రాణాధారం వాళ్ళ మనస్సు ఒక్కటే కద ?

దాన్ని కూడ బంధించి పారేస్తే ?

మనస్సును పూర్తిగా బంధించే శక్తి మానవులకు లేదు. కాబట్టే బ్రతికాం మనం మొన్నటి మహావిలయాన్ని గడిచి !

మనస్సును నిగ్రహించాలి –
మనో నియంత్రణ జరగాలి –

మనస్సు అధీనంలో ఉండాలి –

సృష్ట్యాది నుంచీ సామాజిక మానవుడు చేస్తున్న నినాదా లివి !

మనస్సును కట్టుకొన్న మహా యోగుల దగ్గర నుంచి, దాన్ని విచ్చల విడిగా విడిచి పెట్టేసిన మహా నియంతల దాకా – ఎందరో చేశారు, చేస్తున్నారు ఈ నినాదాల్ని !

ఇంతకూ –

మనస్సు అంటే ఏమిటి ?

అది ఎవరి అధీనంలో ఉండాలి ?

అసంఖ్యాకమైన జీవరాశి నుంచి మానవుణ్ణి వేరుపరచి చూపే ప్రధాన భూతం మనస్సు.

జీవలత పెరుగుతూ వచ్చి, ఒక విశ్వలీలా వసంతంలో మొగ్గ తొడిగి, పూచిన పువ్వే మేధస్సు. దాని పరిమళమే మనస్సు.

పరిమళం ఒకళ్ళ దొడ్డిలో నుంచి మరొకళ్ళ దొడ్డి లోకి వ్యాపిస్తున్నది కాబట్టి, దానిని గొలుసులతో కట్టి పడవెయ్య మంటారు వృద్ధులు !

మనస్సు కోతి లాంటిదనీ, దాన్ని అధీనంలో ఉంచుకోకపోతే జీవితం అధోగతి పాలవుతుందనీ, ప్రతివాడూ మనస్సు చెప్పినట్టెల్లా చేస్తే సమాజమే చచ్చిపోతుందనీ – అంటుంది కదూ మీ దొడ్డమ్మ ?

ఇప్పుడు బ్రతికి ఉన్న దనేనా సమాజం ?

మనస్సు కోతిలాంటి దంటాం.

ఆ సంగతి మనకు చెప్పిం దెవరు ?

ఆ మనస్సే కదా ?

అది కోతే అయితే, దాని మాట నమ్మడం ఎలా ?

అచల నిర్గుణ బ్రహ్మ సగుణ చైతన్యంగా భాసించి, వికసించి, పరిమళించి, ప్రసార గుణ వ్యాప్తిని పొంది, వేదమై, వేదాంతమై పరిఢవిల్లగా – అట్టి మనస్సును ఈనాడు నిరోధించు మనడం ఏరు దాటి తెప్ప తగలబెట్టు మనడమే కదా ?

ప్రకృతి ఇంకా ముందుకు సాగిపోవాలంటే – మనస్సు ప్రజ్ఞాన పూర్ణమై,

తానే మూలపుష్పమై వికసించి, ఆనంద పారిమళ్యం విరజిమ్మాలి విశ్వ విశ్వాంత రాలలో - అనంతకోటి సౌరమండల పరివ్యాప్తంగా ?

సూర్యు డొక దీప కళిక - సౌరమండలం ఒక చిన్న గది - మనోరూప జగజ్జీవ సమాజంలో !

ప్రకృతి పురోగమనంలో మానవుడే అగ్రగామి. మనస్సే మార్గదర్శిని.

మార్గాలను వెదకి, సరళం చేసి, విశ్వ విశ్వాలలో ప్రయాణించి, ఆనందోద్యానాలను గుర్తించి, తాను ముందుండి మానవుణ్ణి నడిపించుకు పోవలసి నట్టిది మనస్సు.

మనసే శరీరంగా కల ఒక పరమానంద చేతనా పరిణామానికి ప్రాతిపదిక కావలసినట్టిది మనస్సు.

అట్టి మనస్సునే కట్టి పడవేసే మానవుడు తాను జీవచ్ఛవం కావడమే కాక, ప్రకృతి పురోగతికే గుదిబండ కాదా ?

మానవుల్ని గొర్రెల వలె పాలించాలనుకున్న స్వార్థపరులు, రౌడీలు, మన పెద్దలు మనస్సుపై యుద్ధం ప్రకటించారు. బందీని చేశారు. స్వతంత్రంగా ఆలోచించే శక్తిని చంపేశారు. మానవజాతిని నిర్వీర్యం చేసి, ఒక మురికి పేటగా మార్చి పారేశారు.

మానవుని కంటె ఈనాడు - ఈ జీవకారుణ్య యుగంలో - పశువులు, సీమకుక్కలు, గినీపందులు, టర్కీకోళ్ళు, పిల్లులు, చిలకలు వగైరా అన్నీ ఉత్తమ జీవులేగా ?

అతి నీచ నికృష్ట జీవి ఒక్క మానవుడే - నేటి మానవుడి దృష్టిలో.

ఇప్పుడు మానవ జాతి బ్రతికి ఉన్న దనుకొంటున్నావా ?

అది చచ్చి చాలా కాల మయింది !

ఈ అవశేషమైనా ఇంకా బ్రతికి ఉండడానికి కారణం - ఎవరో ఒక కృష్ణుడు, ఒక క్రైస్తు, ఒక గాంధీ - సంప్రదాయాన్నీ, సాంఘిక నియమాలనూ కాలదన్ని, మనస్సును విడిపించి, యథేచ్ఛగా వదిలి, దానివెంట ముందుకు పోవడమే !

మనస్సు వెంట వెళ్ళలేదు మనిషి.

మనిషి నిర్మించే ఏ రాకెట్టూ మనస్సు వేగాన్ని పట్టుకోలేదు.

లక్షల కోట్ల కాంతి సంవత్సరాల దూరాన్ని క్షణంలో దాటేసి, అక్కడి మన్మథ లోకం లోని మందార కన్యలతో రమించి, వచ్చెయ్య గలదు మనస్సు - అనుకొన్న వెంటనే !

తమ మనస్సే తమ మార్గంగా పురోగమించిన మహా సాహసికుల ఆత్మ కథల సంపుటే కదా నేటి మానవ చరిత్ర ? మనస్సును కట్టేసుకుని, ముక్కు మూసుకొని, ప్రతివాడూ కూర్చుని ఉండి ఉంటే - ఈనాడు చెదపుట్టలు తప్ప, మనుష్యులు మిగిలే వాళ్ళేనా ?

మోక్షాన్ని కోరడం తిరోగమనమే కాని, పురోగమనం కాదు కదా !

అలసిపోయిన జీవపదార్థం, విశ్రాంతి కోసం, బ్రహ్మపదార్థం లోకి తిరిగిపోవడానికి పడే తహతహే కదా మోక్ష కాంక్ష ?

మరి నైష్ఠికులు, సన్యాసులు, మతపెద్దలు వగైరా తిరోగమన వాదులు - పురోగమన శీలకమైన మానవప్రకృతిని పాలించడానికి ఎలా అర్హులు ?

వృద్ధుని మార్గం యువకునికి అనుసరణీయ మేనా ?

ఒకడి శక్తి మరొకడికి ఉండదు. ఒకడి పట్టు మరొకడికి దొరకదు. ఒకడు తింటే మరొకడికి ఆకలి తీరదు. వ్యక్తిత్వం కల ఏ ఒక్కడూ మరొకరి మార్గాన్ని అనుసరించలేడు అందుకే !

స్వేచ్ఛా నిగ్రహ శక్తులు రెండూ మనస్సు లోనివే.

ఎటు ఎతదూరం వెళ్ళాలో, ఏ పని ఎప్పుడు ఎంతవరకు చెయ్యాలో, మనస్సుకు తెలిసినంతగా మరెవరికీ తెలియదు.

మనస్సు ఒక అద్భుతమైన, అద్వితీయమైన శుద్ధ చైతన్య ప్రజ్ఞాన వైదిక శక్తి.

దాన్ని కంట్రోలు చెయ్యా లనుకోవడం వ్యర్థం.

నీతులతో, నరకభయాలతో, స్మృతులతో, శిక్షలతో దాని ఇచ్ఛ కార్యరూపం తాల్చకుండా నిరోధించ వచ్చు. అలా నిరోధించబడ్డ మనస్సు - అశోకవనం లోని సీతలా క్రుళ్ళి ఏడుస్తూ ఉంటే చుట్టూ మూగిన రాక్షస మూకలా అట్టహాసం చేస్తోంది సమాజం !

కుటుంబం, కులం, మతం, జాతి, వాటి ఆచార సంప్రదాయాలు, వాటి విధి నిషేధాలు వగైరాలను అధిగమించలేని మనస్సు మనస్సుగా పేర్కొనదగింది కాదు. జడమైన శరీరమే అది. మట్టిలో చేరిపోవలసినదే అది.

అందుకే – దేవీ !

అంధకారంలో మిణుగురుల కాంతి లాభం లేదు.

ఏ మానవుడి మెదడుకూ నేడు అంతకన్న వెలుగు లేదు.

జ్ఞాన సూర్యోదయం కానీ !

రమించనీ మనస్సును విశ్వ విశ్వాంతర సౌందర్య సీమలలో !

ద్రష్టగా, శ్రోతగా, మన్తగా, విజ్ఞాతగా విహరించనీ దాని విశ్వాత్మ పారం ముట్టి !

అధిగమించి పోనీ దాన్ని

వికసించివేయనీ మనస్సే మహస్సుగా !

ఊహించలేం మన మిప్పుడు !

అంతవరకే మనస్సుకు స్థితి !

ఆపై మహస్సులో మనం !

మనలో మహస్సు !

## 61

" ఇది దెయ్యాల ప్రదర్శన కాదు. ఆధునిక చిత్రకళా ప్రదర్శన. కళ్ళు తెరు !" అంటూ అభయం ఇచ్చేవరకూ – కళ్ళు మూసుకొనే ఉన్న నీవు ఎంత కళా సుందరంగా కనిపించావు నాకు !

ప్రదర్శనను మాని, నిన్నే చూశారు కదా జనం అంతా !

క్యూబిజం, గ్లోబిజం, సింబాలిజం, సర్రియలిజం – అంటూ ఏమేమో చెప్పుకు పోతున్నాడు, చిత్రాలను గురించి, మనతో పాటు వచ్చిన చిత్రశిల్పి రాజు !

అన్నీ తెలుస్తున్నట్టే తల ఊపుతున్నాను నేను గొప్పగా !

అన్నీ తెలిసినట్టు ప్రవర్తించడమే సభ్యత ఈనాడు.

తెలియడం జ్ఞానం. తెలియక పోవడం అజ్ఞానం.

" ఇదేమిటి - అని ప్రశ్నించవద్దు. ప్రశ్నిస్తే - అదేమిటో నీకు తెలియదని అందరికీ తెలిసిపోతుంది. అప్పుడు నిన్ను ఎవరూ గౌరవించరు. మరి, నిజంగానే తెలియదు కదా- అంటావా ? తెలిసినవాళ్ళు మాత్రం ఎవరున్నా రిక్కడ ?" అంటాడు మన్మథసూరి.

అదీ నిజమే !

నాకు తెలియకపోతే, ఎవడికి మాత్రం తెలుసు ?

గుండెధైర్యం, వాక్చాతుర్యం, సాహసం కల ప్రతివాడూ - జర్నలిస్టో, ఆర్టిస్టో, పోయట్టో, పొలిటీషియనో అయిపోతూ ఉండడం లోని కిటుకు ఇదే.

ముందుకు వచ్చినవాడే నాయకుడు. ఎలుగెత్తి అరిచినవాడే ప్రవక్త. ఎదుట ఉన్నవాడే పెళ్ళికొడుకు. అడిగే వా డుండడు. అడిగేవాడు అజ్ఞాని కనుక, ఖాతరు చెయ్యబడడు.

" ఓహో, వహ్వా, బహుతచ్ఛా " అనే రెండు మూడు మాటలు నేర్చుకొని, శిరఃకంపనం చేస్తూ, చిరునవ్వు నవ్వగలిగితే - రసజ్ఞుడుగా, కళావేత్తగా, మహాను భావుడుగా కీర్తి రావడమే కాక, దానితో పాటు ఎన్నో పదవులు, లాభాలు కూడ లభించే అవకాశం ఉన్న ఈ రోజులలో మనస్సులోని అభిప్రాయాన్ని వెలిబుచ్చి, అజ్ఞాని అనీ, అనాగరికుడనీ అనిపించుకోవడం దేనికీ ?

పదవులూ, లాభాలూ నా దాకా రావు. ఆలి వంక అతిథులు వంట గదుల్లోనే ఉంటారు మకాం. అయితే - మంచివా డన్న పేరు పోతుందేమో అన్న దొక్కటే నా - భయం !

అందుకే ఊపుతున్నాను తల - అంతా తెలిసిపోతున్నట్లు !
నేను నీ వంక చూచినప్పు డెల్లా - నీవు నా వంకే చూస్తున్నావు ! -
నీ వంక నేను, నా వంక నీవు చూసుకొంటున్నాం మనం !
మన వంక చూస్తున్నారు ప్రదర్శనను చూడవచ్చిన వాళ్ళంతా !
మరి - చిత్రాన్ని ఎవరు చూస్తున్నట్టు ?
ఓహో - అంటూ నే నెందుకు తల ఊపుతున్నట్టు ?
భరించుకోలేక అనేశావు నీవు - ఇదంతా వట్టి చెత్త - అని !

" ఒక్క అందమైన, ఆనందకరమైన బొమ్మ కూడ లేదే ! అన్నీ గీతలు, ఊచలు, ఇటికరాళ్ళు, శిథిల సమాధులు, బ్రహ్మచెముడు డొంకలు, దిష్టిబొమ్మలు, పిశాచపు కళ్ళు, దయ్యపునోళ్ళు, కుష్ఠు పుళ్ళు, క్షయరోగపు ఎమ్ముల గూళ్ళు ! ఈ పులుముడా చిత్రకళ ? హారి, దేవుడా !"

ఎంత ధైర్యం నీకు !

ప్రేక్షకులంతా నీ పక్షమే !

రాజు కూడ నీ పక్షమే !

ఈ మోడర్న్ ఇజా లన్నీ తెలుసుకొన్నవాడే కాని, వాటి జోలికి పోయినవాడు కాదు రాజు. భారతీయమైన కేవల సౌందర్యాన్ని ఉపాసిస్తా డతడు. అందుకే పైకి వచ్చి పదవులు పొందలేక పోతున్నాడు సాటి వాళ్ళ వలె.

కళ పిచ్చిలోకీ, పిచ్చి వ్యాపారంలోకీ, వ్యాపారం గుత్తపద్ధతిలోకీ దిగి - సమాజాన్ని మాయ చేస్తూ, దోచుకొంటున్నప్పుడు ఎదిరించి సత్యం చెప్పగల ధైర్యం ఎంత గొప్పది !

అంతరార్థాలు, అర్థాంతరాలు, గూడార్థాలు వంటివి ఆలోచనామృతమైన సాహిత్యానికి చెల్లుతవేమో కాని - సద్యస్సుందరం కావలసిన చిత్రకళకు ఎలా చెల్లుతై ?

సౌందర్యం లేదు. మాధుర్యం లేదు. రంజనం లేదు. రసం లేదు. ఉన్న దంతా కేవల కంకాళ బీభత్సం !

వినగానే ఆనందం కలిగేది సంగీతం.

చూడగానే ఆనందం కలిగేది చిత్రకళ.

వాటిలోని శాస్త్రీయ సాంకేతిక విషయాలు ప్రజల కక్కర లేదు.

కావలసింది రుచికరమైన భోజనం.

అదంత రుచికరం కావడానికి ఎందరు ఎన్ని త్రిప్పలు పడ్డారో. అతిథులకు అనవసరం - జుగుప్సాకరం కూడ !

ఆనందానికి మూలం అందం

అందానికి మూలం రూపం

రూపం ప్రాతిపదికగా కలది చిత్రకళ.

అట్టి పునాదికే మొప్పం వచ్చినప్పుడు కళాసౌధం వట్టి పురాణ శైధిల్యమే కదా !

ఎవడో పేరున్నవాడు, ఎవడో నోరున్నవాడు, ఏ పనీ లేని వాడు - ఏమీ తోచక బొగ్గుతో నాలుగ్గీతలు గీస్తాడే అనుకో -

అతడి కార్యదర్శి వాటిని ప్రచారం చేస్తాడు - ఉద్యోగ ధర్మంగా !

అతడి అనుగ్రహం కోసం వేచి ఉన్న వాళ్ళంతా వాటి చుట్టూ చేరి భజన సాగిస్తారు - మహా చిత్రాలంటూ, కళాత్మకే కల్యాణ తిలకా లంటూ !

డబ్బుతో కీర్తిని కొనగల అదృష్టవంతులు కొనేస్తారు వాటిని - వందలు, వేలు పెట్టి - బహిరంగంగా, మహాడంబరంగా !

దేవతా వస్త్రాల కథే - ప్రతి విషయం లోనూ !

కంటికి పచ్చ కర్పూరపు కాటుక కావలసిన చిత్రకళ - కారం కొట్టినట్టు మండిపోతున్న దీనాడు !

సౌందర్య పారమ్యానికి సశరీరంగా మానవ భావుకతను తీసుకపోవలసిన చిత్రకళ - నీ వంటి అమృత హృదయను కూడ గాభరా పెట్టేస్తున్న దీ నాడు !

అబ్బ !

ఎంత బీభత్సంగా ఉంది ఈ మోడర్న్ ఆర్టు !

భూకంపం మరునాటి పీనుగుల పెంటలా ఉన్న దిది !

*నీ అందాన్నీ, నీ ఆనందాన్నీ, నీ ఆత్మనూ -*
*నిన్ను నీవే తొక్కి పారేసుకొంటూ పోతున్న ఓ మనిషీ !*
*ఎందుకోయ్, శ్మశానం కేసి అంత పరుగు !*

## 62

మొన్న ఎగ్జిబిషన్‌లో నన్ను పలకరించిన శివరంజని నీ స్నేహాన్ని అర్థించడం చిత్రమే !

నన్ను గెల్చుకొని కూడ, ఓడిపోయిన ఒక దురదృష్టవంతు రాలాయె ! కాలు జారి పడి, తిరిగి లేవలేకపోయిన ఒక దయనీయ గాథ ఆమెది.

ఆ కథ మరోసారి చెపుతాను.

నీలోత్పల, మణిశిల, దూర్వ - వీళ్ళ వివరాలు కదూ అడిగావు ?

ఈ ముగ్గురూ మూడు మనస్తత్వాలకు ప్రతినిధులు

ఎవరెలా పోయినా, తాను మాత్రం తన ధర్మాన్ని విడనాడ గూడ దన్న దీక్షతో, సంసారం నిలుపుకొని సుఖపడ్డ సతి నీలోత్పల.

తాను నమ్మిన ధర్మాన్ని తన వలెనే ఇతరులు కూడ అవలంబించాలని పట్టుపట్టి, విఫలురాలై, సంసారాన్ని పాడుచేసుకొని, తాను నాశనమైపోయిన మూర్ఖ మణిశిల.

ఇద్దరు పురుషులకు ప్రియురాలై, ఒక్కర్నీ తృప్తి పరచలేక, ఇద్దర్నీ పోగొట్టుకొన్న రేవడ దూర్వ.

నిత్యం మన మధ్య, మనతో కలిసి తిరుగుతున్న వాళ్ళ చరిత్రలే - సూక్ష్మంగా పరిశీలించి చూస్తే- అకాడమీ బహుమతులు పొందిన నవలల కంటె, నాటకాల కంటె కూడా అద్భుతంగా ఆవిష్కృతా లవుతై !

నీలోత్పల భర్త డబ్బున్నవాడు. వ్యభిచారి. తాగుబోతు. జూదగాడు. ఏ విశిష్టతా లేనివాడు. అయితే, క్రూరుడు మాత్రం.

నీవు నా కడ్డం రాకు. నీకు కావలసిన సుఖమేదో అడిగి పుచ్చుకో అన్నా డతడు.

సరే నన్న దామె.

పిల్లలు, కారు, విందులు, వినోదాలు - హాయిగా ఉంది ఆమె సంసారం. భర్తపై ఈగను కూడ వాల నివ్వ దామె ! అతడి సేవే ఆనందం ఆమెకు !

మణిశిల భర్త గొప్ప కళాకారుడు. ప్రేమ సముద్రుడు. లోకప్రియుడు. దేవతలా ఆరాధించు కొంటా డామెను.

చంద్రుని చుట్టూ కలువల వలె, అతడి చుట్టూ చేరతారు కళాహృదయులైన యువతీ యువకు లెంద రెందరో !

అందుకు అసూయ పడిం దామె. తనతో తప్ప .మరే ఇతర స్త్రీతోను మాట్లాడ వద్దన్న దతణ్ణి. ఇరుగమ్మల పొరుగమ్మల సలహాలు, నౌకర్ల చాడీలు విషపూరితం చేసినై ఆమెను. అతణ్ణి బాధించింది. తాను బాధ పడింది. సుఖ సుందరమైన సంసారాన్ని శిథిలం చేసుకొంది.

దూర్వ చిన్నప్పటి నుంచీ గాలి పిల్ల. అదుపాజ్ఞలలో పెరిగినట్టిది కాదు. డబ్బు కోసం ఒక వృద్ధుడికి స్నేహ మయింది. సెక్సు తీర లేదక్కడ. సెక్సు కోసం ఒక యువకుణ్ణి మరిగింది. అతడి సెక్సును తాను తీర్చలేక పోయింది. ఇంట్లో వృద్ధుడి అనుమానం ! వీధిలో యువకుడి ఆరాటం !

అవసరానికి పనికిరాని నీవు నా కెందుకు పొమ్మన్నాడు యువకుడు.

విశ్వాస ఘాతకివి - ఇక నీ ముఖం చూప వద్దన్నాడు వృద్ధుడు.

మతి పోయిం దామెకు !

చూశావుగా ఆ చూపులు !

# 63

ఈ వారంలో మనం చూచిన నాటకాలు, వాటిపై నీవు చేసిన వ్యాఖ్యానాలు - మనోరంగంలో మెదులుతున్నై నా కిప్పుడు.

రాగద్వేషాలకు, ఉద్యమాలకు అతీతమైన సహృదయ వ్యాఖ్యా లవి.

నీ వన్నట్టు, కన్యాశుల్కం నాటక మేమిటి ?

నాటకం అంటే ఏమిటి ?

నాటకం వాస్తవానికి ప్రతిబింబంగా ఉండా లంటాడు ఒకడు.

ఔ నంటారు అతడి అనుచర బృందం ఒక పదిమంది.

అంతటితో ఒక నాటు అద్దం తయా రవుతుంది సహృదయుల ముందు.

అందులో కళా పద్మిని కనిపించక రసిక అలావుద్దీన్లు దిగులు పడి పోగా - తమ ముఖాల్ని తామే చూచుకొని ప్రేక్షక మహాశయులు కేరింతలు కొడతారు !

అదే గుమాస్తా, అదే ప్యూను, అదే బక్షీసు ! అదే డాక్టర్లు అదే రోగి, అదే ఫీజు ! రోజూ ఇంట్లోనూ, వీధిలోనూ అనుభవించలేక చస్తున్న అదే గోల మళ్ళీ నాటక రంగంపై ప్రత్యక్షం !

అర్ధణా ముండకి అణన్నర క్షవరం అన్నట్టు - దానికో టిక్కెట్టు !

ఇంట్లో ఏడుపును, వీధిలో గోలను కాసేపు మరచిపోయి మనస్సుకు విశ్రాంతిని, హృదయానికి ఆహ్లాదాన్ని చేకూర్చు కొందామనీ, ఉత్తేజాన్ని పొందుదామనీ నాటకానికి వస్తే -

అక్కడ కూడా అదే ఏడుపూ, అదే గోలా నా ?

నాటకం ఒక సంపూర్ణ కళా సమామ్నాయం అన్న జ్ఞానం రచయితలకు గాని, ప్రయోక్తలకు గాని, విమర్శకులకు గాని ఉన్నట్టు లే దీనాడు !

పద్యాలు వ్రాయలేని వాడు వచన నాటకాలను ప్రచారం చేస్తాడు.

పద్యాలు పాడలేనివాడు అవి లేకుండా డైలాగులు కొట్టమంటాడు.

వీధిలో జరిగిన కొట్లాటను, జరిగింది జరిగినట్టు, స్టేజి మీద చూపా లంటాడు – ఆ కొట్లాటలో పాల్గొని వచ్చిన అసలు ముద్దాయి !

స్త్రీ పాత్రలకు ఆడవాళ్ళు దొరకరు కాబట్టి, స్త్రీ పాత్రలే లేని నాటకాలు కావా లంటాడు ప్రయోక్త !

పోనీ–

నాటకం జీవితానికి ప్రతిబింబంగా ఉండా లనుకొన్నప్పటికీ – జీవితంలోని స్త్రీలు నాటకంలో ప్రతిబింబించరా ?

పురుషుల చేత స్త్రీ వేషాలు వెయ్యించడం కృత్రిమం అనుకొంటే – అసలు స్త్రీలే లేకపోవడం కృత్రిమ తమం కాదా ?

" కళా కాదు, కాకరకాయా కాదు, పచ్చి వ్యాపారం " అంటావు నీవు.

అక్షరాలా అంతే.

అసమర్థుల, అజ్ఞానుల దుర్జనత్వం తప్ప మరేమీ కా దీనాడు కళారంగం.

వ్యాపారం – డబ్బు కోసమో, కీర్తి కోసమో.

కీర్తికి కళారంగంలో ఉన్న స్థిరత్వం మరెక్కడా లేదు.

బొగ్గతో ఇంత మసి పులిమి, దానిని మేఘం అనగలిగితే – పెళ్ళికి పంచరత్నాలు అల్లగలిగితే – కొన్ని నినాదాలను ఒకదాని క్రింద ఒకటి పేర్చగల్గితే – ముఖానికి ఇంత పౌడరు కొట్టుకొని, స్టేజీ మీదకు రాగల్గితే – అట్టివాడు సన్మానాలకు, గౌరవ ప్రతిష్ఠలకు తద్వారా ఉన్నత పదవులకు అర్హు డవుతున్నాడు.

ఏ కళా తెలియని, ఔచిత్యం ఎరగని వ్యాపారం చేతుల్లో చిక్కుకొన్నది – ఈనాడు కళారంగం అనే బాలనాగమ్మ !

వ్యాపారం చేతుల్లో మంత్రపు బొమ్మలు – కవులం, గాయకులం, చిత్ర శిల్పులం, నటకులం అనుకొనే వాళ్ళంతా నేడు !

సంగీత, సాహిత్య, నృత్య, ఆలేఖ్య, శిల్పాది సర్వకళా సంపూర్ణమైన ఒక విశిష్ట కళా ప్రక్రియ నాటకం.

నేత్ర పర్వం, శ్రవణపేయం, మనోమోహనం కాగలిగిందే నాటకం.

వాస్తవాన్ని ప్రతిబింబించడం కాదు నాటక ప్రయోజనం, ప్రతిబింబాన్ని వాస్తవీకరించడం.

వెంకయ్యను అద్దంలో చూపడం కాదు – వెంకయ్యను శ్రీ కృష్ణుడుగా చూపడం నాటక లక్ష్యం. అప్పుడే రసనిష్పత్తి, తన్మయీ భావానుభూతి, ఆనంద సిద్ధి !

అందుకే అన్ని దుస్తులు, అన్ని రంగులు, అంత రంగాలంకరణ ! అంత సంగీతం, అంత సాహిత్యం !

గుణాలకు, ఆదర్శాలకు ప్రతిమూర్తులైన నాయికానాయకులను వాస్తవీకరించి, సదస్యులకు ఏ తద్యైక్యతా రసానుభూతిని అందివ్వడానికే అన్ని కళలూ ఒక లయలో ప్రవర్తిల్లడం !

అందుకే – కన్యాశుల్కం నాటకం కాలేకపోయింది. వసంత సేన నాటకం కాగలిగింది.

కన్యాశుల్కంలో రక్తి కట్టించిన మధురవాణి నవ్వు – ఆ పాత్ర ధారిణి యొక్క వైయక్తిక ప్రతిభ మాత్రమే. ఆ నవ్వు కోసమే కదా కూర్చున్నారు హాలులో ఆ కొద్దిమంది జన మైనా ?

ఆమె క్రీగంటి చూపుల కోసమే కదా కూర్చున్నారు – మొదటి వరసల లోని రసికులంతా అంత సేపు ?

ఆ పెద్దల అనుగ్రహం సంపాదించడం కోసమే కదా ఆమె చూపిన ఆ హావ భావ విలాసాల తమాషా లన్నీ ?

స్టేజి, స్క్రీను – ఈ రెండు రంగాలు కూడా ఇలానే కళాహీన దీనమై పోయినై – వ్యాపారం స్వైర హస్తాలలో !

వసంతసేన గ్రాంథికంలో వ్రాయబడ్డ నాటకం. పద్యాలు, పాటలు ఎన్నో ఉన్నై. అయినా – హాలు కిటకిట లాడిపోయింది జనంతో.

ఎందుకని ?

అది నాటకం కనుక.

కళాస్రష్టలు, కళాభిజ్ఞులు, కళా విమర్శకులు ఎవళ్ళూ బ్రతికి లేరు ఈనాడు. బ్రతికి ఉన్నవాళ్ళు ఒక్క ప్రజలే !

ఉద్యోగ విజయాలు, చింతామణి, హరిశ్చంద్ర, పాలేరు వంటి నాటకాలకు వచ్చే జనం, డబ్బు ఆధునిక వచన నాటకాలకు ఎందుకు రావడం లేదు ?

అవార్డులు పుచ్చుకొంటున్న నాటకాలు, నటకులు కూడా వెంటవెంటనే అదృశ్యమై పోవడానికి ఏమిటి హేతువు ?

ఈ నాడింకా నాటక కళ బ్రతికి ఉన్నదంటే కారణం, కళా సంస్కారం గల ప్రజలు ఇంకా బ్రతికి ఉండడమే.

ప్రజ లెప్పుడూ బ్రతికే ఉంటారు.

కళ కూడ బ్రతికే ఉంటుంది.

కావ్యాంతే నాటకం - అన్నది ఋషివాక్యం.

కావ్యం కాదు కాదా, రెండు వాక్యాలు కూడా సమంగా వ్రాయలేని - జీవితానుభవం సైతం ఏమీ లేని - వాళ్ళంతా వ్రాస్తున్నారు నాటకాలు నేడు.

విదేశీ నాటకాలను కాపీ కొట్టేస్తున్నారు-సంప్రదాయ భేదాలను కూడా గమనించకుండా !

అక్షరాలు వచ్చిన ప్రతివాడికీ ఈనాడు తన తొలి రచన నాటకమే !

నాటకం అంటే - సమాజాన్నో, వ్యక్తులనో విమర్శించే ఏవో కొన్ని సంభాషణలు - అతడి దృష్టిలో !

అంతకంటె మరేం ఉంది కన్యాశుల్కంలో ?

సొంతంగా ట్యూన్లు కట్టుకోగల సంగీతవేత్తలు, సొంతానికి పాటలు వ్రాసుకోగల కవి బ్రహ్మలు, సొంత రుచులతో లోకం అంతరంగాన్నే జ్వలింప జేయగల చిత్రశిల్పులు కూడ మృగ్యమే మనకు ఈనాడు.

ఇంటి నిండా ఉప్పు, పప్పు, బియ్యం అన్నీ ఉన్నా-

ప్రతి దానికీ చేతులు చాచడమే - విదేశీ ఊక కోసం !

అభిజ్ఞ అంతరిస్తున్నది !

సరస్వతి నిద్ర పోతున్నది !

ఏదీ నీ భూపాల !

*అమృత మయమైన బ్రహ్మ ముహూర్తమున కూడ*
*మరచి నిద్రించునే మన భారతీ దేవి !*
*కళ లెల్ల గంగలో కలిసి పోవుట లేదె ?*
*పలికించవే వీణ! పాడవే భూపాల !*

## 64

ఎక్కువ చదువుకొన్నదే కాని - ఆత్మ విశ్వాసం లేనిది విద్యావతమ్మ. లోకజ్ఞానం కూడ తక్కువే ఆమెకు.

సంగీతంలో అపర సరస్వతి దేవేంద్రయ్య. కాని - నిగ్రహం, స్థైర్యం అనే మాటలు అతని నిఘంటువు లోనే లేవు.

ఈ ఇద్దరూ నాకు ఎంత ఇష్టులో, అంత గడ్డు సమస్యలు !

అసలు - అమ్మ, అయ్య అనే మాటలను పేర్ల చివర పెట్టుకోవడమే కిట్టదు నాకు.

మా అమ్మను తప్ప, మరొక స్త్రీని అమ్మ అనలేను నేను.

నా జీవితంలో, నా హృదయంలో మా అమ్మది ఒక ప్రత్యేక స్థానం. ఆ మహా స్థానంలో మరొక స్త్రీని నామ మాత్రంగా అయినా భరించలేను నేను.

అందమైన స్త్రీల రూపాన్ని నత్తులూ, అడ్డబాసలూ పెట్టి చెడగొట్టినట్టే - అందమైన పేర్లను కూడ అమ్మ, అయ్య చేర్చి నాశనం చేస్తారు కొన్ని భాషల వాళ్ళు !

మనిషి ఉండవలసింది మనసులో. పేరులో కాదు.

సంస్కృతం వంటి ఉత్తమ భాషలకు ఈ గోల లేదు.

ఈ ఇద్దరూ పేర్ల దగ్గరి నుంచీ సమస్యలే నాకు.

వీళ్ళ మనస్తత్వాలను బాగా చదివి చూశావు కదూ నీవు ?

నీ అభిప్రాయాలే నిజ మనిపిస్తున్నై వీళ్ళ విషయంలో నాకు.

జీవితానికి ముఖ్యం చదువు కాదు - వ్యక్తిత్వం.

జీవితం బహు ముఖం.

లోకం సువిశాలం.

ఏ ముఖంగా పోగలిగినా, సఫలీకృతం కాగలదు జీవితం.

కావలసింది - ఏదో ఒక ముఖంగా ముందుకు పోగలగడం.

వ్యక్తిత్వ శక్తిపై ఆధారపడిన విషయ మది.

వ్యక్తిత్వానికి పదును పెట్టగలది మాత్రమే చదువు.

వ్యక్తిత్వం కన్ను. చదువు దాని కాటుక.

అక్షరజ్ఞానం లేని ఒక బీడీల వర్తకుడు - తన దగ్గర పట్టభద్రులనే పెట్టుకోగలడు గుమాస్తాలుగా !

కళ అంటే ఏమిటో ఎరగని ఒక ప్రొడ్యూసరు - తన కాళ్ళ దగ్గర నిలుపుకోగలడు తారాపథం లోని రంభలనూ, నలకూబరులనూ !

ప్రతి వ్యక్తికీ ఒక వ్యక్తిత్వం ఉంది. ఒక కర్తవ్యం ఉంది. ఒక జీవితరేఖ ఉంది ఒక చేతిలో.

అయితే -

అదేమిటి ? ఎలా ఉపయోగించుకోవాలి దాన్ని ? ఏం చెయ్యాలి అందుకు ?

తెలుసుకోడానికి ప్రతిభ కావాలి.

చాలా మందికి ఈ ప్రతిభా ప్రభాతంపై పొగమంచు కప్పి ఉంటుంది. మేఘాలే క్రమ్మి ఉంటై.

జ్ఞాన సూర్యుణ్ణి ప్రకాశించ నివ్వవు అవి.

దీక్షతో, తపస్సుతో తొలగించు కోవాలి వ్యక్తి - నిప్పుపై నివురువంటి ఈ ఆవరణలను.

జీవిత యాత్రా మార్గంలో - తాను ఉన్న దశ ఉన్నతమైన దైనప్పుడు, ప్రతిభ తనంతట తానే బాణంలా సమస్త ఆవరణలనూ ఛేదించుకొని, ప్రకాశిస్తుంది అరుణోదయంలా !

ప్రతిభ చాలని సామాన్యులే ఏ దిక్కూ తోచక, అనుకరిస్తారు ఇతర్లను.

ఒకడు డాక్టరీ చదివి డబ్బు సంపాదిస్తుంటే - తాము కూడ అదే చదువుతారు చాలమంది.

తన తండ్రి పుస్తకాలు ఉన్నై కదా అని - తాను కూడ అదే కోర్సు చదువుతాడు కొడుకు !

ప్రతిభను వెలిగించుకోలేక, వ్యక్తిత్వాన్ని గుర్తించుకోలేక, ఇతరులతో పోటీలు పడి, ఓడిపోతూ ఉంటారు జనం ఎక్కువగా !

నే నెవరు ?

నా ప్రతిభ ఎట్టిది ?

నా జీవిత కర్తవ్యం ఏమిటి ?

ఈ ప్రశ్నలు వేసుకొని, సరైన జవాబులు పొంది, ఎన్ని త్యాగాల కైనా సిద్ధపడి, తదనుగుణంగా జీవిత రథాన్ని నడుపుకోగల వాడే విజయు డవుతాడు చివరకు, అపజయమే ఉండ దతడికి.

జీవితానికి ప్రధానం వ్యక్తిత్వం.

వ్యక్తిత్వానికి నిదర్శనం దాని లక్ష్య సిద్ధి.

లక్ష్యాలు అసంఖ్యాకం.

అభిరుచి సిద్ధమైన ఏ లక్ష్యం సాధ్యమైనా చాలు – ఆ జీవితం తరించి నట్టిదే !

విద్యకు చదువు ఉంది. అందరూ చదివితే తానూ చదివింది. ప్రతిభ వికసించ లే దామెలో.

దేవేంద్రకు కళ ఉంది. క్రమం లేదు.

జిగేలు మనే క్షణిక ప్రభ తప్ప మరో ప్రతిభ లేని క్షణ ప్రభ వలె, అతడి బుద్ధి క్షణ క్షణం.

జీవితాని కొక పథకం లే దతడికి. ఎర్ర చీర కనిపిస్తే చాలు – చేస్తున్న పనిని అలానే వదిలేసి, దాని వెంట పడి పోతా డతడు !

అలా వెంట పడే కదా – మొన్న సీరిచే చెంపకాయ తింట ?

దేన్నో వెతుక్కొంటూ ఉంటా డతడు నిత్యం !

నిద్రపోతూ ఉంటుం దామె నిరంతరం !

ఏమి చేద్దాం వీళ్ళని ?

ఈ ఇద్దరినీ కలిపి, పెళ్ళి చేస్తారట వాళ్ళ పెద్దలు !

ఆమె చచ్చినా ఎర్రచీర కట్టదు.

అతడు ఒక్క క్షణం కూడ పక్కలో ఉండడు.

తమాషాగా ఉంటై ఇలాంటి జంటలు !

గతి, గమనం, గమ్యం – ఈ త్రిగా దేవి స్వరూపం స్పష్టంగా తెలియకపోతే, ఎంత చదువుకొన్నా వ్యర్థమే. ఎంత కళ ఉన్నా విఫలమే.

*గతి గమన గమ్య త్రిగా దేవి శ్రీదేవి*

*ఆమె సాక్షాత్కారమే మాధవత్వమ్ము !*

## 65

ఆ ముఖం ఎంత అందంగా ఉండే దనుకొన్నావు !

ఏమై పోయిందో ఆ లావణ్యం !

ఉప్పు మాత్రం పండుతున్న దిప్పుడు – నెరలు తీసిన ఆ బాలకపోలా లలో !

ఏ నిదాఘులు ఆర్పివేశాయో ఆ కమల వనాన్ని ! ఏ తుపానులు ఆర్పివేశాయో ఆ కన్నుల లోని కామజ్యోతుల్ని !

చిన్ననాటి నైర్మల్యం, మాధుర్యం, ప్రేమ వంటి దివ్య వరాలన్నీ మాసిపోయి – ఎందుకలా మారిపోయిం దామె అంత కఠినశిలగా ?

ఎందుకలా ద్వేషిస్తుందామె పురుష లోకాన్ని ?

బాలగా అమృతం కురిసిన ఆమె, యువతిగా విషం క్రక్కుతున్న దెందుకని ?

మరొక సారి చూడు లక్ష్మీతులసిని !

ఆమె అనుభవం అట్టిది !

మానవుడు తన అనుభవంలో నుంచి చూస్తాడు లోకాన్ని.

అనుభవమే లోకం.

అనుభవాన్ని బట్టి అర్థం చేసుకొంటాడు లోకాన్ని. తదనుగుణంగా ప్రవర్తిస్తాడు లోకంలో. తన అనుభవమే తన లోకం ఎవరి కైనా.

అందుకే – ఎవరి లోకం వారిది.

ఎన్ని కోట్లమంది మానవు లున్నారో, అన్ని కోట్ల లోకాలున్నై ఈ భూలోకంలో – ఒక దానితో ఒకటి చిక్కుపడి !

అందులో లక్ష్మీతులసి లోకం ఒకటి.

దురాశ, దౌష్ట్యం, కృతఘ్నత, వంచన - వీటితో నిండి ఉన్న లోకం అది !

అట్టి లోకాన్ని ద్వేషించక, ప్రేమిస్తుందా ఆమె ?

ఆమె లోకం అలా ఎందు కయింది ?

ఏడెనిమి దేండ్ల క్రితం -

ఆమె ఇంకా అరవిచ్చిన మొగ్గగా, ఆనంద దుర్గ్యగా, సుషమగా, షోడశిగా ఉన్నప్పుడు -

ఒక పెళ్ళికి వెళ్ళిం దామె !

పెళ్ళిళ్ళు, పేరంటాలు, ఇవేగా మన వధువులకు వరప్రదర్శన శాలలు !

అందులో ఓహో, ఒక అందగాడు !

పాము కుబుసం షర్టు, కోడెపులి మీసం, ఎలుగుబంటి జుట్టు, వేటకుక్క కళ్ళు, వంక నవ్వు, జింక చాతీ - అబ్బ ! ఎంత అందగాడు !

అతడి వలలో పడిం దామె !

శుభ ముహూర్తం ఒకతెకు !

దుర్ముహూర్తం మరొకతెకు !

ప్రేమ, వాగ్దానం, గర్భం, వాగ్దానభంగం, గర్భస్రావం, దుఃఖం, ఆశావైఫల్యం, ఆత్మ పాతిత్యం - ఇదంతా యుగయుగాలుగా జరుగుతున్న కామ చారిత్రక పునరావృత్తమే కద ?

ఒకసారి పడ్డ స్త్రీ వెంటనే లేచి నిలబడక పోతే ఇక జన్మలో నిలబడ లేదు.

ఆత్మబలం కలది కాదు తులసి !

ఆ తర్వాత మరొకడు, మరొకడు, మరొకడు !

వేటగాణ్ని మన్మథు డనుకొంటుంది కామశబల.

ప్రతి ధానుష్కుడూ పుష్పబాణుడు కాదు.

మృగాన్ని మనిషనుకొని, అతడి కోరల్లో చిక్కుకొని, తన సమస్తాన్నీ పోగొట్టుకొని, అసలు మనుషుల్ని ద్వేషిస్తున్న అవివేకిని తులసి !

హృదయం కల మగవాడు ఎలాంటివాడో ఎన్నడూ ఎరగదామె !

మనస్సు, హృదయం, ఆత్మ, వీటి సౌందర్యాన్ని ఎరగని దురదృష్టవంతులు,

శీల సౌందర్య పరమ మాధుర్యాన్ని రుచి చూచి ఎరుగని దైషోపహతులు - ఎందరో ఉన్నారు లోకంలో !

ద్వేషిస్తారు వాళ్ళు లోకాన్ని.

తులసి ద్వేషిస్తున్నది.

ఆమె గతం కోటి బ్రహ్మాండాల బరువుతో క్రుంగదీస్తున్న దామెను !

ఆమెను ఉద్ధరించలేమా - అంటావు నీవు !

ఎందుకు లేము ?

గతం ఒక స్వప్నమని ఆమెను ఒప్పించ గలవా ?

తాను చేసిన పాపం ఏమీ లేదని ఆమెను నమ్మించ గలవా ?

" అందగత్తె కన్న అనురాగవతి మేలు " అన్నాడు నార్ల.

ఆత్మోన్ముఖం కమ్మను. ఆత్మేశ్వరుణ్ణి గుర్తించుకోమను. అనురాగాన్ని పెంచుకోమను. అనాసక్త కామమే ఆనందయోగంగా తెలుకోమను !

ఈ స్థాయిని అందుకో గలిగితే, మళ్లీ ఆనాటి నిష్కళంక సుందర శోభావతే కాగల దామె.

## 66

" అబ్బ ! దేవుళ్ళకు కూడ ఇద్దరేసి పెళ్ళాలు " అన్నది లక్ష్మీతులసి, భోగిస్నానం చేసి నేను వెంకటేశ్వరస్వామికి బంతిపూలు పెడుతుండగా వచ్చి.

" చెంచులక్ష్ములూ, లక్ష్మీతులసులూ కాక " అన్నాను నేను ఆమె వంక చూడకుండానే.

" అతడు గోపాలకృష్ణుడు కాబోలు ! మహానుభావుడు ! " అన్నది మళ్ళీ - కృష్ణుడి చిత్రపటాన్ని చూస్తూ.

శివుడి కేశబంధం లోని గంగను చూచి విరగబడి నవ్విందామె !

" పాపం, ప్రియురాంద్రను దాచుకోడానికి ఎంతెంత కష్టం పడుతున్నారో వీళ్ళు " అని, ఇంకా ఏమో వాగబోతూ ఉంటే భరించుకోలేక పోయాను నేను.

" నోరు మూసుకొంటావా ? బైటికి నడుస్తావా ?"

నోరు మూసుకొన్నది వెంటనే.

సంక్రాంతికి భక్తితో బొమ్మల కొలువు పెట్టుకొని, నీవు వస్తే బాగుండుననుకొంటూ ఉంటే - తులసి వచ్చిపడింది ఎక్కడినుంచో !

ఎంతగా చెడిపోయింది తులసి !

ఇక పనికి రాదా !

కూర్చుంది మెదలకుండా - నేను ఒక్కొక్క పటానికీ పువ్వులు పెడుతుంటే -- చూస్తూ !

ఎంత అమాయకురాలు !

అందుకే వంచించగలిగాడు ప్రతి పశువూ ఆమెను !

నిజానికి - ఈ పటాలలో బిగించబడి ఉన్న ఈ మూర్తు లందరూ దేవుళ్ళేనా ?

అయితే -

మనుష్యులకు కూడా లేనంత కామ తామసం వీళ్ళ కెందుకున్నది ?

ఆలోచిస్తే అర్థం దొరుకుతుందేమో !

" ఆలోచించే తీరిక ఎవడి కుందీ " అంటాడు దేవేంద్ర.

తాగుడు, జూదం, వ్యభిచారం వంటి వాటికి ఉన్నదట తీరిక !

" నీవు ఆలోచిస్తూ కూర్చో. నాకు పని ఉంది " అంటూ వెళ్ళిపోతా డతడు - కనిపించిన చీర వెంట !

ఈ దేవుళ్ళు కూడా అతడి లాంటి వాళ్ళేనా ?

శ్రీకృష్ణుడికీ, మన దేవేంద్రయ్యకూ తేడా ఏమిటి ?

దేవేంద్రయ్య ఆడవాళ్ల వెంట పడతాడు. చిక్కితే తొక్కి వదిలేస్తాడు. తప్పితే తన్నులు తిని వచ్చేస్తాడు.

ఆడవాళ్ళు శ్రీకృష్ణుడి వెంట పడతారు. అందరికీ తనలో స్థానం ఇచ్చి, తాదాత్మ్యం పొందుతా డతడు వాళ్ళతో. అందర్నీ తనలో లయం చేసుకొని, తాను అందరి లోనూ లయమై పోయే పరమాత్మ అతడు.

బలమైన, సమర్థుడైన, సరసుడైన, విశ్వాసపాత్రుడైన అట్టి పురుషుడి చుట్టూ స్త్రీ లోకం చేరడం - ప్రతిఫలాపేక్ష లేకుండా అతడికి ఆత్మార్పణ చేసుకోవడం - నిత్యం మనం చూస్తున్నదే.

శుద్ధ చైతన్యశక్తి నుంచి ఎంత ఎక్కువ శక్తిని చేదుకోగల్గితే అంత పరిపూర్ణత సిద్ధిస్తుంది పురుషుడికి.

ఎంత ఎక్కువగా వికసించగల్గితే అంత పూర్ణ సౌందర్యం లభిస్తుంది స్త్రీకి.

స్త్రీ పూర్ణ పురుషుణ్ణి, పూర్ణ పురుషుడు పూర్ణ స్త్రీనీ వెతుక్కొంటూ ఉంటారు నిరంతరం.

ఈ సహజాన్వేషణకూ, వివాహ వ్యవస్థకూ సంబంధం లేదు.

స్త్రీ పురుషులలో పరిపూర్ణ వికాసం లేనప్పుడు – ఏక పత్నీవ్రతం ఎంత అసహజమో, పాతివ్రత్యమూ అంతే అసహజం.

సహజాన్వేషణా, స్వయంవరణమూ అరికట్ట బడ్డప్పుడు – రహస్య ప్రణయమూ, మనోరమణమూ తప్పవు.

ప్రకృతి అనంతానంత రూపాలు కలది.

అన్ని రూపాల తోనూ ఆరాధిస్తుందది పురుషుణ్ణి.

గులాబి ఏ శక్తిని ఆరాధిస్తుందో – మల్లె, గన్నేరు, కలువ, జాజి వగైరా అన్ని పువ్వులూ అదే శక్తిని ఆరాధిస్తై !

రూప రాగాది భేదాలెన్ని ఉన్నా, ఆరాధనలో ఏకాగ్రత ఉంది ప్రకృతికి.

అదే ఈ గోపీకృష్ణ మధురభావన.

చరాచర జీవప్రకృతి సర్వమూ సహస్రాధిక గోపగోపీవ్రజం.

కేంద్రంలో కృష్ణబ్రహ్మ, నిరంతర సృష్టిలీలే రాసలీల !

అపరోక్ష జ్ఞానం ఇది. అనుభవం లోదే ప్రతి వ్యక్తికీ !

నిర్గుణాత్మక పరబ్రహ్మ యొక్క కామ శబలిత సగుణ చైతన్యమే పురుషుడు. అతడే హిరణ్యగర్భుడు. అతడి సృష్టే ప్రకృతి ! అతడి కళకు లక్ష్మి ! నాదానికి సరస్వతి ! బిందువుకు అర్ధనారీశ్వరి !

ఈ సగుణద్వయ వైవిధ్యానికి రూపకల్పనలే మన త్రిమూర్తులూ, దేవుళ్ళూ, దేవతలూ.

బుద్ధీ, సిద్ధీ మాత్రమేనా గణేశ్వరుడి భార్యలు ? అష్ట సిద్ధులూ అతడి భార్యలే కారా ?

ఆర్షమతం ఒక అలంకార శాస్త్రం. ఒక ధ్వని కావ్యం. ఒక వ్యంగ్య చిత్రం. ఒక సింబాలిజం.

ఏ దేవుడు ఏ గుణానికి మూర్తికల్పనో తెలిస్తే - అప్పుడు అతడి భార్యలూ, చర్యలూ, అన్నీ అర్థమవుతై మనకు.

ప్రపంచ వేదాంతానికే మకుటం ఆర్షసూత్రం - తత్త్వమసి ! దాని బహుముఖ శాఖోపశాఖా పరివ్యాప్తే, దాని అభిజ్ఞే ఈ కల్పన !

ఈ బొమ్మల కొలువు !

గూఢార్థాలు తెలియక మూఢార్థాలు తీస్తున్నారు పండితులు ! నమ్ముతున్నారు సామాన్యులు !

హేళన చేస్తున్నారు తులసి వంటి వాళ్ళు - దాఖలాలు కనిపించక !

స్త్రీ ప్రమేయం లేని ఏ అసలు దేవుడి కోసమో అన్వేషించి, పాప క్షమ కోసం మతాలు మార్చి, ప్రతి చోటా కామవేటకు గురై, లోకం మీద ద్వేషం పెంచుకొని, వచ్చి కూర్చున్నది తులసి - ఇక్కడ ఈ బొమ్మల కొలువులో !

మార్చవచ్చు నేమో ఈమెను !

పువ్వులు పరుచుకొని, నీ ఫోటో ముందు కూర్చుని, నేను బొమ్మ పాట పాడుకొంటుంటే - ఆమె అలా మునిగిపోయింది ఏదో ధ్యానంలో !

# పౌషి

నీ జటలో ముద్ద బంతిలా పూర్ణ చంద్రుడు !

దాని ప్రక్క వదులై వ్రేలాడుతున్న చేమంతిపూల చిరుచెండులా - పుష్యమి !

ఆ చెండు చివరికొస దారంలా ఆశ్లేష !

వృషభ వామనుడైన అర్ధనారీశ్వర మిధున మూర్తికి పూర్ణేందు శేఖర బిరుద ప్రధాన దివ్యోత్సవం ఈ పుష్య పూర్ణిమ !

పౌష్య లక్ష్మివి నీవు !

నా రాగ పౌషివి నీవు !

ప్రతి పూర్ణిమ మన కొక పండుగ

ప్రతి పండగా మన కొక పూర్ణిమ.

ఆనంద పూర్ణిమవు నీవు నాకు ప్రతి క్షణమూ !

సకల చరాచర ప్రకృతికీ అధిష్ఠాన చైతన్యం ఆనందమే !

ఆనంద ఇత్యుపస్థే-అన్నారు ఋషులు.

సుధాపూర్ణ పూర్ణ సోమ బింబమే ఆ ఆనంద భాండం.

అదే అన్నరసం సమస్త సృష్టికీ.

అన్నమే పరబ్రహ్మ. రస స్వరూపం అది. రసో వై సః అని ఋషు లనడం ఆ పరమ రసోమృత చైతన్య బ్రహ్మను గురించే.

సోమ కళలు కామ కళలై, పూర్ణ నారీ రూపంతో అవతరించిన రాగ కళా కామేశ్వరివి నీవు !

వస్తున్నావు కదూ ?

నీ జాడల నీడలే ఈ వెన్నెల పొలాలు !

పొలాల నిండా పచ్చని పై—

సరస్సుల నిండా కాయగూరలు !

రోదసి నిండా - సంక్రాంతి ముగ్గులను కాపీ చేసుకొంటున్న చంద్ర గృహిణులు !

నీ పాదాలు అంత స్వచ్ఛంగా ఉంటై అందుకే !

ఆపాద మస్తకం చుంబనార్హ మైనప్పుడే ఆ జీవితం స్వచ్ఛం !

పెదవులే చుంబనార్హం కావు చాలా మందికి !

అసూయా ద్వేష దూషణ వాచా విష దూషితాలై ఉంటై ఎంతో మంది పెదవులు !

ఎవరి గుండెలనో కొరుక్కు తినేసినట్టు - ఎర్రరంగు పూతతో - నెత్తు రోడుతూ ఉంటై పెదవులు కొందరికి ! బహుశా, హృదయం లోని విషయంతో నల్లబడ్డ పెదవుల్ని, అలా దాచుకొంటారో ఏమో లిప్పుస్టిక్కుల్లో వాళ్ళు !

కాళ్ళు గతంలోను, తల భవిష్యత్తులోను ఉంటుంది లోకంలో ఎక్కువ మందికి.

మొండెం మాత్రమే వర్తమానంలో బ్రతుకుతుంది వాళ్ళకు !

ఆ కాళ్ళను ఎంత మురికి !

ఆ మురికిని వర్తమానమే భరించలేదు–భవిష్యత్తు ఎలా భరించ గలదు ?

అందుకని - మొండెం మాత్రమే సాగుతుంది వర్తమానం పొడవునా !

అదే పురోగమన మంటుంది భవిష్యత్తు లోని తల !

ఇందులో తరించడం ఎక్కడ ?

తరించి, తరింప జెయ్యమంటున్నది మన ధర్మం.

ఎవరూ ఎవర్నీ తరింప జెయ్యలేరు.

తనకు తాను తరిస్తే చాలు ప్రతి వ్యక్తీ.

తనను తాను తెలుసుకోవడమే తరించడం.

అందుకు - ఆపాద మస్తకం వర్తమానంలో బ్రతకాలి !

పాదాలు, పెదవులు కూడ స్వచ్ఛంగా, చుంబనార్హంగా ఉండాలి.

అప్పుడే ఆనంద పూర్ణ పారవశ్యం. అదే తరించడం !

రాత్రిని వలె గతాన్ని వదిలేసి, ప్రభాతం వలె నడిచి వస్తావు నీవు వర్తమానం లోకి !

వికసిస్తావు నీవు శ్వేతపద్మం వలె నా చుట్టూ !

నీ లక్ష్యాన్ని అనుసరిస్తే చాలు మానవుడు !

తరించగలడు - తన్మయుడే కాగలడు- ఆనంద బ్రహ్మలో !

ఇంకా ఎందుకు రాలేదో నీవు ?

ఎందుకు తేలిపోనిస్తున్నావో నన్ను ఈ ఊహా మేఘాలపై ?

ఎవరు మూశారు నా కళ్ళు ?

ఓహో - నా వెనుకనే ఉన్నావా ఇంత సేపూ !

*నను గోరి, నా కేసి నడిచి వచ్చే వేళ*

*పరమ గమ్యములు నీ పాద పద్మములు !*

*నను చేరి, నా చుట్టు నాట్యమాడే వేళ*

*పరమ రమ్యములు నీ పాద పద్మములు !*

*నను గూడి నా గుండె నధివసించిన వేళ*

*పరమ సౌమ్యములు నీ పాద పద్మములు !*

*పరమ పూజ్యములు నీ పాద పద్మములు !*

*పరమేశ్వరములు నీ పాద పద్మములు !*

## 68

*కాలు జారిన దంచు కంగారు పడకు !*

*కలుష మంటిన దంచు కన్నీరు తేకు !*

తెలివిగా, మెల్లగా తీసుకో కాలు !
కనపడ్డ కొలనులో కడుగుకో బురద !
చేత కాకున్న, నా చేయూత కొనుము !
కొనుము నా కన్నీరు, కొలను లేకున్న !
జారి నట్లుంచకు జారిన కాలు !
కడిగినచో పోని కలుషమ్ము లేదు.
గతుకులతో నున్న బ్రతుకు తెర్వులలో
ఎప్పుడో ఎక్కడో ఎవ్వరో ఒకరు
పట్టు తప్పుచు నుంద్రు, పడుచునే యుంద్రు,
పడియు లేచుచు నుంద్రు, పయనించుచుంద్రు.
కాటు జారుట తప్పు కా దెవ్వరికిని,
లేవ లేకున్నప్పుడే వచ్చు ముప్పు !
తోడనే లేచి ముందుకు పోవ కున్న
తొక్కుకొనుచు పోవు తక్కిన జగము !
జగతిదే ఒక కాలు జారిన గాథ !
కాకున్న ఇన్ని దుఃఖపు గాథ లేమి ?
మొగ్గ త్రుంచుటలేమి ? మోసము లేమి ?
వెర్రి కామము లేమి ? వేటలు నేమి ?
దారి అంచున కాలు జారిన గాని,
తను వెల్ల బురదలో తడిసిన గాని,
భయ మింతయును లేదు, భద్రమా నీకు !
సదల నీకుము ఆత్మశక్తి సుంతైన !

ఓదార్చడం కోసం, నేను శివరంజనికి వ్రాసిన పద్యా లివి !

శివరంజని నాకు బాల్య సఖి. ఎప్పుడూ వెన్నంటి ఉండేది నన్ను. ప్రేమించగల మగవాడిని సుఖపెట్టగల అమృత మాధుర్యా లెన్నో నిక్షిప్తమై ఉన్నై ఆమెలో.

ప్రేమ, త్యాగం, విధేయత, ఆరాధన పరిచర్య వంటి ఎన్నో మంచి గుణాలు వికసించి పరిమళించినై ఆమెలో చిన్నప్పుడే.

వాళ్ళ నాన్నకు బదిలీ అయి ఆమె, నా చదువు కోసం నేను, విడిపోయాం అప్పుడే. కలుసుకోలేదు మళ్ళీ.

కుమార్తె పట్ల రెండు ముఖ్య బాధ్యత లున్నై తండ్రికి. పదహారు – పద్దెనిమిది ఏండ్ల మధ్య పెళ్ళి చెయ్యడం ఒకటి. స్వతంత్రంగా బ్రతకడానికి తగిన విద్య చెప్పించడం ఒకటి.

శివరంజని నాన్న మంచివాడే. కాని, వంశప్రతిష్ఠ పిచ్చి ఎక్కువ. ఈ రెండు బాధ్యతలలో ఒక్కటీ నిర్వహించలే దతడు. పైగా, ప్రేమించిన యువకుడితో స్నేహాన్ని పెంచుకొనే వీలు కూడ లేకుండా చేశాడు – ఆశ్లేషయ్య లాంటి వాళ్ళ దుష్ట సలహాలు విని !

అలాంటి పరిస్థితుల నడుమ విడిపోయాం మేం. గడిచిపోయినై ఎన్నో సంవత్సరాలు. మరిచేపోయాను నేను వాళ్ళ సంగతి పూర్తిగా.

పిల్లలు సహజంగా పెరగకుండా చిన్నప్పుడు ఎంత కరకుగా అణచిపెట్టబడితే, అంత కసిగా కట్టు తప్పి వ్యవహరిస్తారు ఆ తర్వాత.

అదే జరిగింది శివరంజని విషయంలో.

ఆమె చుట్టూ బిగించబడ్డ కట్టు దిట్టాల బాధ మరీ దుర్భర మైనప్పుడు, వాటిని తెంచుకొని పారిపోయిం దామె, ఒక గోముఖ వ్యాఘ్రుంతో కలిసి.

ఏది గోవో, ఏది గోముఖవ్యాఘ్రమో ఎరగ దామె. చెప్పలేదు వాళ్ళ తలిదండ్రులు. స్వయంగా తెలుసుకోవ డానికి బైటి ప్రపంచంతో కలిసి మెలిసి తిరగ నివ్వలేదు కూడ.

అందుకే అమృత మనుకొని విషం త్రాగింది శివరంజని.

తామే శాశ్వత మనుకొంటూ, తమ పిల్లలు ఎల్లప్పుడూ పిల్లలే అనుకొంటూ, నిరంకుశంగా ప్రవర్తిస్తారు కొందరు తల్లిదండ్రులు. అలాంటి వాళ్ళ పిల్లలు అతి దుష్టులైనా అవుతారు, అధఃపతితులైనా అవుతారు, అప్రయోజకులైనా అవుతారు.

క్రమశిక్షణ అంటే– విద్యా వివేకాలకు వయస్సుతో పాటు క్రమవికాసం కలిగించడం. విద్యలో –చతుష్షష్టి కళలతో పాటు సెక్సు విజ్ఞానమూ, వివేకంలో – వివిధ మానవ మనస్తత్వ సమవగాహనతో పాటు ప్రేమ స్వాతంత్ర్యమూ కూడి ఉన్నై.

లక్ష్మి తులసిదీ, శివరంజనిదీ ఒకే రీతి గాథ. అయితే, తులసి వేటగాని వలలో పడింది. రంజని తనకు తానై విషం తాగింది.

గోవు దగ్గరకు చేరుస్తా నన్న వ్యాఘ్రం, తాను కూడా గోవునే అని నమ్మించి, గుటుక్కున మింగేసింది ఆమె లోని సమస్త సౌందర్యాలనూ, మాధుర్యాలనూ, ఆనందాన్నీ, ఆత్మస్వాస్థ్యాన్నీ కూడ ! వదిలేసి పోయింది శల్యావశిష్టంగా !

తులసి లోకాన్ని ద్వేషిస్తోంది. రంజని తనను తానే ద్వేషించుకొంటూ, క్రుళ్ళి చస్తోంది ఇప్పుడు !

ఏం చెయ్యను నేను ?

నా సమస్త సుకృతాన్నీ ధారపోసి అయినా, ఈమెను ఓదార్చా లనిపిస్తుంది నాకు.

నిజానికి శివరంజని పోగొట్టుకొన్న దేమిటి ?

బాల్యంలో ఎన్నో పొరపాట్లు జరుగుతై. అందులో ఇదొకటి

తాను పాప మనుకొని బాధపడితే తప్ప, ఏ పనీ పాపం కాదు.

పాపమనే దేదీ లేదు లోకంలో.

అది మనస్సులో ఉంది.

మనస్సును శుభ్రంగా ఉంచుకొంటే చాలు. శరీరం చేసిన పొరపాట్లు, తిన్న గాయాలు, పొందిన బాధలు, మ్రింగిన విషాలు అన్నీ శరీరంతోనే పోతై.

సెక్సు శారీరకం, శరీరం నశ్వరం. మరి, ఎందుకు ఆ వ్యథ ?

సెక్సును నిషేధించడం – దానితో పాటు మనస్సు కూడా పోతుందేమో అని కదా ?

మనస్సే ఎదురు తిరిగినప్పుడు, పోయింది మరేముంది ?

ఏదీ పోనప్పుడు వ్యర్థ భ్రాంతితో ఆరోగ్యం చెడగొట్టు కోవడం ఏం వివేకం ?

సంతాననిరోధం చట్ట సమ్మత మైనప్పుడు, వివాహం సెక్సు కోసమే కాదా ? వట్టి సెక్సు కోసం వివాహం అవసరమా ?

వివాహిత స్త్రీ ఎంతమందితో తిరిగినా ఏమీ చెయ్యలేదు లోకం.

అవివాహితలకే ఏ సమస్య లైనా ! ధైర్య సాహసాల అవసరం కూడ వాళ్ళకే !

నీవు కూడా ఓదార్చు ఆమెను.

ఆమె నీ స్నేహాన్ని అర్థించడం అందుకే కావచ్చు.

మరచి పొమ్మను గతాన్ని.

వివాహం చేసుకొమ్మను నచ్చిన వాణ్ణీ

లేదా - స్వేచ్ఛగా అనుభవించమను జీవితాన్ని

లేదా - ఏదో ఒక లక్ష్యం కోసం పాటు పడమను నిరీహతో.

అంతే కాని -

నశించి పోయే శరీరాని కేదో చిన్న దెబ్బ తగిలిందని ఏడుస్తూ, నశించని ఆత్మను క్షోభ పెట్టుకోవడం వివేకం కాదని చెప్పు.

*ఏ రస మెప్పు డే తరగ*
*నే గతి నుద్రతమై, యుదగ్రమై*
*మీరునొ, గట్లు పొర్లి పొలి*
*మేరలు ముంచునొ చెప్పలేము ; కా*
*సారము కూడ తీవ్ర తర*
*ఝం ఝుకు ఉప్పర మంటి పోయెడున్ ;*
*పారము లేని దీని కొక*
*పద్ధతి చూపుము, సాగి పోవగన్ !*

# 69

ఈ గిన్నెల గత చరిత్రలు ఎవరికి తెలుసు ?

అందుకే కడిగిన గిన్నెనే మళ్ళీ కడుక్కోవడం.

నీ 'వన్నట్టు, నాకు అనుమానం కొంచెం ఎక్కువే.

రక రకాల పనుల మీద, రాత్రింబవళ్లు పర్యటిస్తూ - రక రకాల హోటళ్ళలో ఆకలి తీర్చుకోవలసిన వాళ్ళకు, అనుమాన దృష్టి ఆరోగ్య హేతువే.

రకరకాల హోటళ్ళు !

రకరకాల గిన్నెలు !

కొత్తవి, పాతవి, తళతళ మెరిసేవి, రంగు మాసినవి, పెచ్చులూడినవి, బీటలు తీసినవి !

ఎంత తోమినా చెరగని మచ్చలు కలవి, ఎంగిలి అంచుల్ని ఇంకా పట్టుకొని ఉన్నవి !

అందులో ఏ రకం గిన్నె పెట్టాడో మన ముందు సర్వరు !

నీళ్ళ బాల్చీ నుంచి ఇవన్నీ తడితడిగా వస్తున్నవే !

అయితే, వీటి కర్మంతా ఆ బాల్చీలో వదిలిపోయే ఉంటుందా ? అక్కడి మురికి మరి కొంత వీటికి కొత్తగా అంటుకొని ఉండదా ?

అంతకు ముందు ఎవరు తిన్నారో ఈ గిన్నెల్లో !

కుఱ్ఱవాడో, వృద్ధుడో – ఆరోగ్యవంతుడో, వ్యాధిగ్రస్థుడో !

తృప్తిగా తిన్నాడో, బాధగా లేచి పోయాడో !

పాపం వలె ఆ చెరగని మచ్చలు – ఏ పుచ్చిన నోటి ఎంగిళ్లో !

ఒకో గిన్నె కొట్టే ఆ వాసన – వదలని జన్మవాసన వలె – ఎంద రెందరి నోళ్ళదో ! తెలియదు మనకు.

నాకు పెట్టిన గిన్నె కొత్తదో, పాతదానికి రంగు వేసినట్టిదో !

ఏ మచ్చా లేకపోవచ్చు. ఎంతో శుభ్రంగానూ కనిపించవచ్చు. అప్పుడే షాపు నుంచి వచ్చింది కూడ కావచ్చు.

ఆ షాపులోనే ఎంతమంది చేతులు పడ్డవో దాని మీద !

సర్వరు చేతులకు మాత్రం మురికి లేదనే హామీ ఏముంది ?

గతం తెలియదు మనకు !

తెలిస్తే – ఎంత అసహ్యం !

అందుకే, తెలిసికోం మనం.

ఈ గిన్నెల గత చరిత్ర – వద్దు మనకు

అందుకే, కడుక్కో నీవు నీ వంతుకు వచ్చిన గిన్నెను – నీ చేతులతో స్వయంగా.

నా గిన్నెను, నా చేతులతో స్వయంగా కడుక్కొని, నా దాన్ని చేసుకొంటేనే నాకు తృప్తి !

సర్వరు మహాశయుడు ఏ రకం గిన్నెను తోస్తాడో నా ముందుకు – ప్రారబ్ధంలా !

అందుకే మళ్ళీ కడుక్కోవడం !

క్షణ కాలం కోసం కావచ్చు. కలకాలం కోసం కావచ్చు. క్షణంలో అంటుకొన్న కర్మలు కలకాలం పీడించే ప్రమాదం ఉంది.

కాలం కాదు ప్రధానం.

గిన్నెలు, ఆకులు ఏవీ అక్కర లేకుండా - అరచేతుల్లోనే పెట్టుకొని ఆరగించిపోయే ఆత్రగాళ్ళు లేరా ?

ఆ అరచేతుల్లో ఎన్ని కరస్పర్శల ఖిల స్పర్శలో !
బ్రతుకు తెరువులో, తెరువు కిరు ప్రక్కలా, ప్రక్క ప్రక్కనే
రకరకాల హోటళ్ళు !
రకరకాల గిన్నెలు !
వద్దు వాటి గత చరిత్రలు
కడుక్కొందాం మనం మన గిన్నెలు మళ్ళీ మళ్ళీ !

*నిను నీవు కాపాడుకొనుచు పోవుటె సుఖము,*
*పరులపై ఆధారపడుటె దుఃఖము, చెలీ !*
*నీ బ్రతుకు చుక్కాని నీ చేత నుంచుకో !*
*నీ ప్రణయ గతి వెంట నీ విధిని మలుపుకో !*

# 70

*వేలాది వదనాల*
*వెర్రి చూపులు చూచి ,*
*వెక్కి రింతలు పొంది ,*
*వెదకి నిను కనుగొంటి -*

ఆ వేలాది వదనాల చరిత్రలు విన గోరుతున్నావు కదూ నీవు ?
చంపేశావు !

నీవు కోరడం సమంజసమే కావచ్చు. కాని–నేను చెప్పడం ఉచితమేనా ?

నీ కోసం వెతుక్కొంటూ , ఇంతవరకూ సాగివచ్చిన నా జీవితంలో - ఎంతో స్నేహం , ఎంతో శృంగారం , ఎంతో సౌందర్యం నన్ను ఉత్తేజపరుస్తూ వచ్చిన మాట నిజమే - దారి పొడుగునా , అడుగడుగునా.

అదంతా చెప్పడానికి అభ్యంతరంలేదు నాకు. ఎందుకంటే - అవన్నీ నీ అన్వేషణలో నేను పొందిన అనుభవాలే కద ?

కాని -

నేను చెప్పడం సాగిస్తే - నీవు సొంతం వినగలవా ?

విని - సహించుకో గలవా ?

నీ కోసం నా అన్వేషణ నిన్నటిదీ, మొన్నటిదీ కాదు. ఆకస్మికంగా, యాదృచ్ఛికంగా కలుసుకొన్న వాళ్ళం కాం మనం.

ఒకళ్ళ నొకళ్ళం అనుసరించి వస్తున్న వాళ్ళమే మనం అనాదిగా.

చైతన్య స్థితి నుంచి చేతన స్థితికి, ప్రజ్ఞాన స్థితి నుంచి జ్ఞాన స్థితికి , నిరాకార స్థితి నుంచి ఆకార స్థితికి వ్యక్తీభూతుల మైన తర్వాత - ఒక మహోత్సవంలో జన సందోహం నుంచి తీసుకొంటూ బైటికి వచ్చిన జంట వలె - చూచుకోక తప్పదు కద ఒకరి కోసం ఒకరం - వెనుకకూ, ముందుకూ ?

నా కంటే ముందే వచ్చేసి ఉన్నావో, వెనక్కే ఉండి పోయావో - ఎలా తెలుస్తుంది, ఈ మాయా మోహ మహోత్సవ నైరంతర్యంలో ?

ఎంతో మందిని చూచి నీ వనుకొన్నాను. స్నేహం చేశాను. మధువులు గ్రోలాను. మైమరిచాను కూడ - ఆయా రిరంసువుల హంసోత్తరీయాల మకరధ్వజాల మధుర చ్ఛాయల్లో !

ఒకరిలా ఒకరు !

ఒకరి కంటే ఒకరు !

ఒకరిలో ఒక అందం మధుర మనిపిస్తే - మరొకరిలో మరొక అందం దివ్యమనిపిస్తే - ఒకర్ని మించి మరొకర్నిగా స్నేహిస్తూ, ప్రేమిస్తూ వచ్చి వచ్చి, ఇప్పు డనుకొన్నాను - ఇవన్నీ కేవలం నీ అంశలనీ, ఇవన్నీ కలిసిన పూర్ణ సౌందర్యమే నీదనీ, నేను వెతుక్కొంటున్న ఆ వైశాఖీ రాగలక్ష్మివే నీ వనీ !

ఇప్పుడు కదా కనిపించావు నీవు - నా అన్వేషణా మార్గ మందార వల్లరి చివర - ఏకైకర విశ్వసుందరంగా, విశ్వైక మధుర మోహనంగా గుబాళిస్తూ ఔ

నీవు కూడ నన్ను వెతుక్కొంటూ, ఇటువంటి అనుభవాలనే పొంది ఉండవచ్చు కద ?

నీవు కూడ నేను వలెనే, వేలాది వదనాల వెర్రిచూపులు చూచి ఉండవచ్చు కద ?

ఆ చూపులు అన్వేషిస్తున్నవో, ఆహ్వానిస్తున్నవో తెలిసికోలేని దేవేంద్రయ్యలాంటి చిత్త కార్తెలు - వెంటపడి, కంటకాల వలె, నెత్తురు పిండి ఉండవచ్చు కద ?

ఎందుకు మనకు ఈ వ్యర్థ గతం ?

సెక్సు, శరీరం, సంసారం - ఇవే ప్రాథమిక మానవుడికి పంచప్రాణాలూ.

వీటికి సంబంధించిన తమ గత చరిత్రలు చెప్పుకోకూడదు - ప్రాథమికులైన భార్యా భర్తలు, ప్రేయసీ ప్రియులు కూడా !

చెప్పుకొంటే - సుఖ సముద్రం లోని తమ సంసార భద్రనౌక శతధా విభగ్నమే !

ప్రాథమిక మానవుడికి ఆత్మ తెలియదు. హృదయం అర్థం కాదు. మనస్సు నిలవదు. శరీర మొక్కటే అతని సర్వస్వం.

శరీర మంటే సెక్సు అతడికి.

ప్రాథమిక మానవు డంటే - అప్పుడే తొలిసారిగా జంతుస్థితి నుంచి, మానవ స్థితికి ప్రమోషను పొందినవ వాడు.

ఇలాంటి వాళ్ళు పుట్టు పేదలలో కంటె పుట్టు ధనికులలోనే ఎక్కువ.

మనం పరమ పారమ్య ప్రసిద్ధులం !

మనం అన్నిటా అబాధితులం !

తాను నశిస్తూ, లోకానికి వెలుగును ప్రసాదించే మైనపుదీపం స్త్రీ !

అందుకే - తాను వెతుకుతున్న స్త్రీ వలెనే కనిపిస్తుంది ప్రతి స్త్రీ, ప్రతి పురుషుడికీ !

నీవు పూర్ణ స్త్రీవి !

కనుక -

నీకు ఏ ముఖంలోనూ కనిపించి ఉండక పోవచ్చు నేను !

నేను పూర్ణ పురుషుణ్ణి !

కనుక-

ప్రతి ముఖంలోనూ నీ ఛాయలు కనిపించి ఉండవచ్చు నాకు !

ఆ ముఖా లన్నీ నీకు చూపుతానే అనుకో ! భరించుకో గలవా మరి నీవు ?

*గత మది శ్మశానమే కద ? ఎందు కది మనకు ?*
*మృత పదార్థమె కదా గతము త్రవ్విన కొలది ?*
*వర్తమానము నుంచి పైన మగుటే సుఖము !*
*ముందె కల వానందములు అందములు చాల !*

## 71

ఎందుకు వచ్చిందో నీ కంత కోపం !
కారణ ద్వారం లేని కోపగృహం లోకి నే నెలా ప్రవేశించగలను ?
ప్రారబ్ధం ఇలాంటిదే.

పూర్వజన్మలో చేసిన తప్పు లేమిటో తెలియవు జీవికి. ఈ జన్మలో మాత్రం ఘెరమైన శిక్షలు !

గత జన్మలో ఏ తప్పు చేసినందుకు, ఈ జన్మలో ఈ బాధ పడవలసి వచ్చిందో ?

స్పష్టంగా తెలియాలి జీవికి.
తెలిసినప్పుడే, అలాంటి తప్పు మరి జరగకుండా జాగ్రత్త పడగలగడం.
కారణం తెలియని శిక్ష అన్యాయం
కారణం తెలియని బహుమతి వ్యర్థం.
సృష్టి నిర్మాణ పథకంలో మౌలికమైన లోపం ఇదే.
సృష్టి ఎదగక పోవడానికి, మానవుడు పెరగక పోవడానికి ప్రధాన కారణం ఇదే.

నిర్గుణ బ్రహ్మ అగోచరం – ముత్యానికి మహాసముద్రంలా !
సగుణబ్రహ్మ వైయక్తికం – ఏ ముత్యాని కా హారధారి లా !
ఒకో ముత్యం ఒకో హారంలో చేరుతుంది. ఆ హారం ధరించిన మూర్తే దానికి ఆరాధ్య దైవం.

వ్యక్తికో భావం. భావానికో రూపం. రూపానికో రుచి !

రుచులు అనంతం.

ఒకరి రుచి మరొకరికి అరుచి !

పాపం, పుణ్యం, వ్యక్తి, దైవవం – సామాజిక వ్యవస్థకు మూలస్తంభాలైన ఈ నాలుగూ ఎవరివి వారివే !

ప్రతివాడూ తన రుచే లోకరుచి అనుకొంటాడు. డబ్బా వాయించుకొంటాడు. దూకుతాడు కసిగా తక్కిన వాళ్ళ రుచుల మీదకు – డేగలా, గాలంలా, కత్తిలా, ఖడ్గమృగంలా !

ఏది పాపం ?

ఏది పుణ్యం ?

ఏ తప్పు కీ శిక్ష ?

ఏ సుకృతాని కీ బహుకృతి ?

దైవ స్వరూపం ఎట్టిది ?

విశ్వ ప్రణాళికలో మానవుడి ప్రయోజనం ఏమిటి?

తెలియదు ఎవరికీ !

అందుకే ఈ అవ్యవస్థ !

ప్రతి పాపం ముందూ ఒక పరమార్థం, ప్రతి పుణ్యం వెనకా ఒక స్వార్థ చింతన, ప్రతి దేవుడిలోనూ ఒక స్వ – పర భేద కల్పన, ప్రతి మనిషి పట్లా ఒక అనుమాన దృష్టి !

జీవిత పరమార్థం తెలిస్తే
కర్మ స్వరూపం గోచరిస్తే
ఎంత బాగుండును !

ఎందుకు దాచబడిందో ఈ రహస్యం ?

ఏది ఏమైనా–

కారణం చెప్పకుండా శిక్ష విధించడం అన్యాయం – దైవం కానీ, ప్రభుత్వం కానీ, నీవు కానీ !

ఎందుకు వచ్చిందో నీ కంత కోపం !

ఈ పుష్య తమో విభావరిలా – ఎంత చలిగా, ఎంత చీకటిగా ఉన్న దది !

ఎంత అగమ్యంగా ఉంది మార్గం !

నా మిత్రులలో అన్ని రకాల వాళ్ళూ ఉన్నారు.

అందులో –

ఏ డబ్బా నీ చెవులు చిల్లులు పడ మోగిందో !

ఏ డేగ నీ భావంలో అసూయా క్రూర నఖాలను గుచ్చిందో !

ఏ గాలం మన గంగా యమునా సమానంద సరస్వతిలో వేటకు దిగిందో !

ముళ్ళ మీద నిల్చి, చిరునవ్వులు వికసించగల వజ్ర సంకల్పం నీది.

హాలా హలాన్ని అంగుట్లో వంచుకొని, అర్ధాంగమై నిల్చిన అమృత హృదయం నీది.

అయినా –

ఎందుకు వచ్చిందో అంత కోపం !

అసూయ లాంటి కోపం !

అసూయ అగ్ని, పుట్టిన చోటనే దహించి వేస్తుం దది. జీవితంలో నేను భయపడేది ఒక్క అసూయకే !

నీ కోపం –

అసూయ కాదు కద ?

# 72

*స్నేహము, ప్రేమ, రాగము, వ*

*శీకృతి, పూజ– సమస్త మాధురుల్*

*మోహినులైన కామినుల*

*ముద్దులతో కదు ధన్యమైన దీ*

*దేహము నాది ; నీ దయిన*

*దీ మధుమాసము నందు ! ఇంక నీ*

*అహవ భేరి వీడి, కుసు*

*మాహవ సాయక మందుకో గదే !*

గర్వ కారణం కావలసిన ఈ పద్యం నిజంగా యుద్ధకారణ మయింది కదా మన మధ్య !

మనస్సు, హృదయం, ఆత్మ - వీటన్నిటికీ శరీరమే కదా ఆధారభూతం. స్నేహాది పరమగుణ మాధురీ మనోజ్ఞమైన అట్టి శరీరాన్ని నీకు అర్పించుకొన్నానంటే, అందులో తప్పేముందీ !

భేరీ సాయక పదాలు సంభోగ శృంగారాన్ని వ్యంజిస్తున్నాయా ఏమిటి?

శరీరం గల ఏ జీవికైనా - పరమభోగ్యమైన రసం శృంగారమూ, దాని విశ్రాంతి సంభోగమూ కాదా ?

అదే చెడ్డదైతే, ఇక జీవితంలో మంచి దేది ?

కామినుల ముద్దులు నీ కభ్యంతరమై ఉండవచ్చు. ఈ కామినులులోని గుణ మాధుర్యాలు. బైటి మామూలు స్త్రీలు కాదు.

నమ్మకం కలగడం లేదు కదూ నీకు ?

సరే, పోనీ, మాట వరసకు- వాళ్ళంతావాస్తవ కాంతలే అనుకొందాం.

అప్పుడు - మరీ ధన్యురాలవు కదా నీవు ?

అట్టి మధుర మోహన మూర్తులైన కామినుల ముద్దులతో ఆపాదమస్తకం ఆనంద పులకితమైన ఈ నా పవిత్ర దేహాన్ని - నీ ఆరాధనలో హారతి కర్పూరంగా వెలిగించుకొన్న నేను ఎలా దోషిని ?

ఎవరి వైనా - ప్రేమానురాగాలు పవిత్ర మైనట్టివవే కద ? అట్టి అమృతసరంలో స్నానం చేసి, శుచినై నీ వద్దకు వచ్చి, నన్ను నీ కర్పించుకోవడం నీ గొప్పతనమే కాదా ?

ఆత్మాదులను గురించి ఎంత చెప్పుకొన్నా చివరికి ఎవవరికైనా కావలసింది శరీరమే.

ఏ స్త్రీకీ అక్కరలేని శరీరం నీకు మాత్రం ఎందుకు?

శ్రీరాముణ్ణి మరో స్త్రీ కోరకపోవడానికి కారణం, అతడికి సీత కూడా అక్కరలేకపోవడమే కద?

శ్రీ కృష్ణుణ్ణి అంతమంది స్త్రీలు కోరడానికి హేతువు అతడు విశ్వ ప్రణయకమూర్తి కావడమే కద ?

ఆత్మ గుణాల బాహ్య రూపమే శరీరం.

అందరూ కోరే వస్తువే విలువయింది.

అందరూ నన్ను కోరితే, నేను నిన్ను కోరాను.

అందరూ తమను తాము నాకు సమర్పించుకొంటే, నేను నన్ను నీకు సమర్పించుకొన్నాను !

అది కదా నీ ఆధిక్యత !

అదేనా నీకు కిట్టనిది ?

సీరి, లత, తులసి, శివరంజని, కృష్ణ, మంజీర, దూర్వ లాంటి వాళ్ళు ఎప్పుడో, ఎందుకో వస్తూనే ఉంటారు నా గదికి. వాళ్ళంతా నా కేలాంటివాళ్లో, నీకూ అలాంటి వాళ్ళే.

పూర్ణ సుందరివి – సామాన్యులతో నీకా పోటీ ?

*నా– కోరికలే నీవు,*
*అవి – తీరుటయే నేను !*
*తీరే కొలదీ కోర్కెలు*
*ఊరుటె మనము!*
*నా – కై పూచే పూలు,*
*నను – పిలిచే కోయిలలు,*
*నను– తనిపే మధురుచులు,*
*నా – బ్రతుకే నీవు !*
*అడుగడుగున నను నిలిపే*
*అప్సరలే నీవు !*
*అనునిమిషమునను నడిపే*
*ఐందవివే నీవు.*

# 73

అదా సంగతి !

నేను మంజీర ఇంటికి వెళ్ళినమాట నిజమే.

అయితే -

ఆ మాట నీకు చెప్పింది కూడా నేనే కద ?

అందులో రహస్యం ఏముందీ ?

ఏ రహస్యమూ లేదు నాకు.

నీ ముందే కాదు. మొత్తం లోకం ముందే నా జీవితం పరమనగ్నం.

శరీరం, హృదయం, మనస్సు, ఆత్మ, పరమాత్మ దాకా – ఏ విషయంలో దాచుకోవలసిం దేదీ లేదు నాకు.

అలంకారాలతో, అంగ రాగాలతో, రంగులతో, హంగులతో, వేష భాషలతో వివిధ లౌక్యాలతో కప్పి పుచ్చుకోవలసిన వికారాలు, నేరాలు, మచ్చలు, మురికి – ఏమీ లేవు నాకు ఎక్కడా, ఏ దశలోనూ !

నీ కంఠంలో నీడలా కనిపిస్తుంది – లోకానికి నా అంతరాత్మ – పరమ స్వచ్ఛంగా !

రాజకీయాలకు పనికి రాలేదు నేను అందుకే.

వైనతేయం, రసాలిని, నీవు – ముద్దులతో, విద్యలతో, పద్యాలతో నీ ఆరాధన – ఇదే కదా నా జీవితం బాల్యం నుంచీ ?

ఏ ఆచ్ఛాదనా లేనందువల్లనే, అప్పుడప్పుడు లోకం విసిరే మురికి, గుచ్చే ముళ్ళు, చల్లే నిప్పులు హృదయం దాకా తగిలి బాధిస్తై నన్ను.

లోకంలో బ్రతకాలనుకొన్న వాడికి ఏదో ఒక కవచం ఉండక తప్పదేమో !

సహజ కవచాలను కూడా వంచన చేసి ఒలుచుకుపోయే అహల్యాజారు లెంతమంది లేరు మన చుట్టూ ?

ఆశ్లేషయ్య ఎంతో శ్రేయోభిలాషిలా వర్తిస్తూ – నా గురించి మీ అన్న దగ్గరా, మీ అన్న గురించి నా దగ్గరా నీ విషయంలో ఎంత విషం క్రక్కాడో ఎరుగుదువు

కద ? అలాంటి విషనాగుల కాట్లకు ఎంతో మంది అమాయకులు బలైపోతూనే లేరా ప్రతినిత్యం ?

అలాంటప్పుడు -

కవచం కాదు కదా, బనీను కూడ ఒంటిమీద సహించలేని నావంటి వాడికి ఒక్క భగవంతుడే కదా దిక్కు ?

పాపం మంజీర !

లోక విషాదాన్నంతా తానే అనుభవిస్తూ, లోకానికి ఆనందం పంచ వచ్చిన హేమంత పూర్ణ చంద్రంలా ఉంటుం దామె వదనబింబం !

వీణ పలికిస్తే - వీణామండలమే దిగి వస్తుంది ఆమె వ్రేలి బుగ్గల లోకి ! నీ గాత్రానికి తోడులా, నీ గానానికి నీడలా ఉంటుం దది ఒకో క్షణంలో !

గజ్జె మ్రోయిస్తే- అప్సరో లోకమే అలా నిలబడి పోయి, కళ్ళప్పగించి చూడవలసిందే - ఊర్వశితో సహా ! రసాలినిలో, కొబ్బరి మొక్కలకు బీరపాదుల్ని ఎక్కిస్తున్న నీ వెంట - నీ అడుగులలో అడుగులు వేసుకొంటూ - నిన్నునుకరిస్తున్న మయూర బాలల బృంద నృత్యంలా మనో మోహనంగా ఉంటుందది !

అయితే - పాపం-

పాడుతూ, పాడుతూ మూగపోతుందామె వీణ !

ఆడుతూ, ఆడుతూ ఆగిపోతుందామె కింకిణి!

ఏ జన్మాంతరాల విషాదగాథలు జ్ఞప్తికి వస్తవో ! ఏ లోకాంతరాల వేదనా తరంగాలు గుండెకు తగులుతవో !

రెండు విఫల జన్మల మధ్య - ఏదో తెలియని స్ఫూర్తితో కఠోర తపం చేసుకొంటున్న అంబ జ్ఞప్తికి వస్తుంది నాకు, మంజీరను చూస్తుంటే !

అంబది పగ !

ఆమె జన్మాంతరం కూడ నాశనమై పోయిం దందుకే !

మంజీరది కరుణ !

కంఠం వరకు కన్నీటిలో మునిగి చేస్తున్న తపస్సు ఈమెది !

కరుణ రసానికి వర్ణచిత్రం ఈమె !

వీణను తోసేసి, గజ్జెను విప్పి పారేసి, వచ్చి కూర్చుంటుంది మంజీర నా ముందు, నన్ను చూడగానే !

ఎంత సేపైనా చూడాలనిపిస్తుంది నాకు ఆమెను అలా
ఏ జన్మాంతర మైత్రీ మాధుర్యమో ఇది !
పౌరోద్యానంలో కనిపించి, రమ్మంటే, వెళ్ళాను వాళ్ళింటికి మొన్న.
పాడమంటే పాడాను - నా కోరికలే నీవు - అంటూ !

" శివ ధనుస్సును సీత ఎత్తి పడవేసినట్టు - మీ రాతిగుండెను వీణలా మీట గల్గిన ఆ రాగ సరస్వతి-ఆ వైశాఖి-ఎంతటి మహా మహితాత్మురాలో ! ఆ మీ రాగ పూర్ణిమను ఒక్కసారి మాకు చూపరా ? " అన్నది మంజీర - కళ్ళు తుడుచుకొంటూ.

అపార్థం చేసుకోకు ఆమెను.
అసూయకు చోటివ్వవద్దు లవలేశమూ.
నీవు నన్ను వలె -
ఆమె ఎవర్ని వెతుక్కొంటూ వస్తున్నదో !
ఆ ఎవరు - నేనే ఎందుకు అవుతాను ?
అయితే మాత్రం ఏం ?
ఆముదపు చెట్టువు కావద్దు నీవు.

నీవు మహా బోధివి అయినప్పుడే - మహా బుద్ధుడికే కాదు, మహా విశ్వానికే ఆశ్రయం కాగలవు. ఆనందం పంచిపెట్టగలవు. అమృత పదవిని అందుకోగలవు.

*నీవు కా దటే-*
*నీడ నాకు పట్టినది ?*

*మురళీధరు నైనప్పుడు*
*మోహన బృందావని వై,*
*బుద్ధుడ నే నైన నాడు*
*బోధివి నీవు కాదటే ?*

*ఋషిబాలుడ వైనప్పుడు*
*ఋక్కుతల్లివై నన్ను*
*బృహదారణ్యక మధువుల*
*బహు ముఖముల పెంచినది?*

రస కోకిల నైనప్పుడు
రాగ రసాలినివై, నా
అఖిలానంద లవాలకు
అమృతార్ణవ మైనట్టిది ?

## 74

దుస్స్వప్నాలు !

కన్ను మూస్తే చాలు - చీకటి పడిందే తడవుగా వంటగదిని ముట్టడించే ఎలుకల వలె చుట్టుముడతై నన్ను - దిక్కుమాలిన దుస్స్వప్నాలు !

నేను మేల్కొని ఉండగా - ప్రాపంచికమైన ఎట్టి పనిలో, పరిస్థితిలో ఉన్నప్పటికీ - అందమైన, ఆనందకరమైన భావాలే పరివేష్టించి ఉంటై నన్ను ! నీలో, నీతో విహరిస్తూ, రమిస్తూ ఉంటుంది నా మనస్సు నిరంతరం !

అలాంటి సుందర మనస్థితి కల నాకు - ఎందుకో ఈ వికృత విభీకర స్వప్నస్థితి !

దొంగలకు, దుష్టులకు స్వప్నాలే రావట ! ఎంత అదృష్టవంతులో అట్టివాళ్ళు ! కొందరికి యథాతథంగా, మరికొందరికి వ్యతిరిక్తంగా స్వప్నాలు నిజమౌత వట ! మా చెల్లెలు ద్రౌపది అంటుంది. తన స్వప్నం యథాతథంగా నిజమౌతుందని ! ఆమె నిరంతర పూజాపరాయణ ! బ్రహ్మచారిణి ! స్థిత మనస్క ! ఆమె అనుభవాన్ని కాదనడం ఎలా ?

కాని -

నా స్వప్నాలు ఎలాంటి శుభా శుభ ఫలాలను సూచించవు !
స్వప్నాలు మనస్థితికి దర్పణా లంటారు కొందరు.
నా విషయంలో అది కూడా విపరీతమే !

అపకారికి కూడ ఉపకారమే చేస్తాను నేను. అసూయ, ద్వేషం, మాత్సర్యం, పగ వంటి వైరగుణా లేమీ లేవు నాకు. పశ్చాత్తాప పడవలసిన పనే చెయ్యను నేను. సౌందర్యం, ప్రేమ నా కుడి ఎడమలు ! దయ, ధర్మం నా ముందు వెనుకలు; తపస్సు, ఆరాధన నా క్రింద మీదులు. నా కళాపారమ్య సిద్ధి రాగసరస్వతి. అదే నీవు! అదే నేను !

ఇంతటి ఊర్ధ్వ కళా సంశోభిత సర్వ శుక్ల మనస్థితి కల నాకు - కన్ను మూస్తే ఎంతటి భయంకర భూత యాతన !

మెలకువ లోవి పగటి కలలు, నిద్రలోవి రాత్రి కలలు.

పగటి కలలు ఫలిస్తై, రాత్రి కలలు పీడిస్తై నన్ను !

ఈ పీడకలలు తెల్లవార్లూ - దోమల్లా, నల్లుల్లా పీడించి పీడించి - పాముల్లా, పులుల్లా జడిపించి జడిపించి - ఎడారుల్లో, శ్మశానాలలో త్రిప్పి త్రిప్పి - ఏదేదో గడ్డి తినిపించి తినిపించి - మెలకువ రాగానే దొంగల్లా పారిపోగా-

ఉదయం లేచేటప్పటికిఎంత నిస్సత్తు వని !

జీవుడు ఎన్నో నికృష్ట జన్మలెత్తి, మళ్ళీ మానవ జన్మలో ప్రవేశించినట్టు ఫీలవుతాను నేను - పీడ కలల నుంచి మేల్కొన్న ఆ క్షణంలో !

కావచ్చు !

ఎందుకు కాగూడదు?

జీవయాత్రా పథంలో, చివరి భాగంలో, కవి - యోగి దశల నడుమ ఉన్నాను నేను. సవికల్ప రాగ భోగంలో ఉన్నా ననవచ్చు. నిర్వికల్పానందానికీ, నాకూ ఎంతో దూరం ఉండదు.

ఇంతటి ఉన్నత అంతస్తు మీద ఉన్న జీవుడు - ఏవో కొన్ని స్వల్ప కర్మలను వదిలించుకోవడం కోసం ఎన్నో అంతస్తులు క్రిందికి దిగిపోవలసిందేనా ?

ఇలాంటి కంటింజెన్సీల కోసం, కాల కృత్యాల కోసం ఎక్కడి కక్కడే కొన్ని ఏర్పాట్లు, మినహాయింపులు ఉన్నై సృష్టి సంవిధానంలో. అందులో ఒకటి స్వప్న దశ.

నేరం చిన్నదైనప్పుడు, జైలు అవసరం లేకుండా, వార్నింగుతోనో, జరిమానాతోనో దానిని పరిహరించడం లాంటిది - కర్మ స్వల్పమైనప్పుడు, జన్మ అక్కర లేకుండా, స్వప్నంతో దానిని నివారించడం !

ఎంత మంచి ఏర్పాటు !

నా విషయంలో నా కనిపిస్తుందీ - ఎన్నెన్నో నికృష్ట జన్మల కర్మను ఈ జన్మలోనే స్వప్న రూపంలో అనుభవించి వేస్తున్నానని ! భావిజన్మల దుష్కర్మనే కాదు - ఈ జన్మ లోనే వాస్తవంగా జరగవలసి ఉన్న ఎన్నో దుస్సంఘటనల కర్మను కూడ స్వప్నస్థితి లోనే అనుభవించి వేస్తున్నానని !

రైల్లో బెడ్డింగు పోయినట్లు, ఎంత వెతికినా కనిపించనట్లు, ఈ లోగా దిగవలసిన స్టేషను దాటిపోయినట్లు, పరీక్ష నాశనమై పోయినట్లు – చచ్చినంత ఆందోళనతో మెలకువ వస్తుం దొకోసారి ! అదంతా వట్టి కల అని తెలిసినా, గుండె దడదడ లాడుతూనే ఉంటుంది చాలాసేపటి దాకా !

వాస్తవంగా రైల్లో బెడ్డింగు పోవలసి ఉన్న కర్మ కాస్తా విమోచనమై పోయిందన్న మాట ఈ పీడకలతో !

స్వప్నం కొద్ది క్షణాలే అయినా, అనేక సంవత్సరాల, జన్మల దీర్ఘ వ్యధను అనుభవిస్తాడు జీవుడు ఆ కొద్ది కాలంలోను !

అయితే – దుష్కృతం కొద్దిగా ఉండి, సుకృతం అపారంగా ఉండే నావంటి వాళ్ళకే ఈ మినహాయింపులు.

ధర్మరాజు ముందుగా నరకాన్ని దర్శించడం లోని రహస్యం ఇదే.

నా దుష్కర్మ అంతా ఇలా దుస్స్వప్న రూపంలో దూరీ కృతమైపోగా – స్వచ్ఛంగా, స్వేచ్ఛగా నీతో కలిసి, చివరి అంతస్తు వరకు పోగలను నేను.

దుస్స్వప్న మంటే భయం లే దిప్పుడు నాకు.

సుఖ స్వప్న మంటేనే భయం – రాగల సుఖం కాస్తా వాస్తవ రూపం ధరించకుండా స్వప్నమాత్రమై పోతోందేమో నని !

చెడ్డ అంతా స్వప్నంగా పోవాలి.

మంచి అంతా వాస్తవంగా వికసించి, ఫలించాలి.

ఇదీ నా కోరిక !

అందుకే – అంత చెడ్డ కల నీ గురించి వస్తే – కలలో ఎంత ఏడ్చానో, మేల్కొని అంత సంతోషించాను !

*కలలోనె కరగిపోవలె ఎల్ల చీకటులు,*
*వెలుగు లెల్లను లేచి విరియవలె నా నిండ !*
*అపడు నా తనువె సమ్యక్పుంద రోషస్సు,*
*అప్పుడు నేనే నీకు ఆనంద సుమనస్సు !*

# 75

" స్త్రీ హృదయం తెలుసా మీకు ? "

ఉలిక్కిపడి చూశాను తలెత్తి !

హేమంతం పోతూ పోతూ, శిశిరం ఒడిలోకి విసిరి పారేసింది నన్ను బహు క్రూరంగా ! కొయ్యబారి పోయాను నేను - ఆ అమావస్య కటిక చీకటి గుండా దూసుకు వస్తూ ! ఆ హేమంత శిశిర సంధ్యాశూన్యత లోదే నిన్ను గురించిన ఆ నా దుస్స్వప్నం ! అది మళ్ళీ మళ్ళీ నెమరుకు వస్తూ ఉండగా– పరధ్యానంలో మైమరచి ఉన్న నేను -

ఉలిక్కిపడి చూశాను తలెత్తి !

ఎదురుగ్గా - సీరి !

కొంటె చూపులూ, చంటి నవ్వులూ కలబోసి, నా ముఖం మీద - చిలకరించిం దామె ! తేరుకొన్నాను నేను !

" ఏ దుష్యంతుణ్ణి గురించి ఈ పరధ్యానం ? "

ఎంత హేళన !

నా వద్దకు వచ్చిన ఆడవాళ్ళను - కబుర్లు చెప్పి, కాఫీ ఇచ్చి పంపించేస్తా నని - సిటీ అంతా యాగీ చేసింది ఈమే కదా ?

సిటీ అంతా ఆమె వెంట పడితే, ఆమె నా వెంట పడింది ! ఏం జేసుకోను నేను ?

"సంవత్సరాల తరబడి మీ వెంటబడి తిరుగుతున్న స్త్రీని అర్థం చేసుకోలేని మీరు....." మనిషేమి టన్నట్టు చూచిం దామె నా కళ్ళల్లోకి !

" నీ మీద పడి రాసుకు తిరుగుతుందామె. నీవు అర్థం చేసుకోవడం లేదని ఏడుస్తూ ఉంటుందెప్పుడూ. నాకు చేతి కందేటంత దగ్గరలోకైనా ఆమె రాగల్గితే..." లొట్టలు వేస్తాడు ఒక మన్మధసూరో, ఒక దేవేంద్రో- ఆమెను తలంచు కొని !

అది నాకు గర్వకారణమే !

కాని-

నీవు ఇంకా లభించి ఉండకపోతే - నీ అన్వేషణా యాత్రలో ఆమె కూడ నా కొక మజిలీ కాగలిగి ఉండేదో ఏమో !

అరుణోదయం తర్వాత దీపంలా, అమృతం తర్వాత నారింజ రసంలా, శ్రీ లక్ష్మి తర్వాత శశికళలా వచ్చిందామె నా వద్దకు !

దేన్ని చూస్తే మరి దేన్నీ చూడనక్కరలేదో, దేన్ని అనుభవిస్తే మరి దేన్నీ అనుభవించ నక్కరలేదో - ఆ నిన్ను నా దాన్ని చేసుకొన్న తర్వాత - సీరి వంటి తృణ శలాకలు నన్ను ఎలా ఆకర్షిస్తై ?

అరిసెలు తిన్న నోటికి అట్లు రుచిస్తవా ?

భీముణ్ణి రంజించగలది ఒక్క హిడింబా రాగ సుందరే !

దురదృష్టవంతురాలు సీరి !

నేను మహా మేఘుణ్ణి.

నీవు సౌదామనీ రాగలతవు.

సీరి ఒక వరిమొక్క మాత్రం !

" ఎన్ని తెలిసినా, స్త్రీ హృదయం తెలియకపోతే, ఏమీ తెలియనట్టే "అన్నది కాఫీ తాగుతూ !

నేను సహించలేని భావం అది !

" పురుష హృదయం తెలుసా నీకు ? " ఎదురు ప్రశ్న వేశాను నేను.

అదేం ప్రశ్న - అన్నట్టు చూచిం దామె - ముఖాన్ని మఖలా ప్రశ్నార్థకం చేసుకొంటూ !

పురుషుడికి హృదయ మేమిటి ? అది తెలియడ మేమిటి ? హృదయం స్త్రీ ధనం ! అది ఆమె జన్మహక్కు ! అందువల్ల -

నా హృదయం ఆమె గుర్తించ నక్కర లేదట ! ఆమె హృదయం నేను గుర్తించి, దాని అడుగులకు మడుగు లొత్తాలట !

నిన్ను నేను ఎరిగి ఉండకపోతే - ఆ హృదయం అనేదేదో స్త్రీకి కూడా లేదని వాదించి ఉండేవాణ్నే !

మగవాడి హృదయానికి నేనే ప్రతినిధిని. స్త్రీ హృదయం ఒక వరద గోదావరే కావచ్చు. పురుషుని హృదయం ఒక మహా గంభీర పయః పారావారం !

స్త్రీకి హృదయం ఉంది. చూశాను దాన్ని నీలో !

హృదయ రీతుల వైవిధ్యాల మీమాంసే వద్దు మన కిప్పుడు.

స్త్రీ హృదయం కమలం.

పురుష హృదయం రవి.

కమలాలు అసంఖ్యాకం.

రవి ఒక్కడే !

ప్రతి కమలానికీ రవి ఒక్కడే !

ప్రతి కమలమూ రవికి తా నొక్కతే !

రవి కిరణం ఒక్కొక్కటి ఒక్కొక్క మూర్తి. ఆ మూర్తే పూర్ణ రవి ఆ కమలానికి !

ఒక కమలానికి ఒక కిరణం చాలు.

అనంతానంత కోటానుకోటి కమల హృదయాలకు రవి ఒక్కడే ప్రాణ పతి !

సహస్ర కమల సమాహార మహా పరమ సుందరి నీవైనప్పుడు - సహస్ర కిరణ సమాధార మహా పరమాత్మను కాకుండా ఎలా ఉండగలను నేను ?

పురుషుణ్ణి అర్థం చేసుకోడానికి నిరాకరించే స్త్రీని ఏ పురుషుడు మాత్రం అర్థం చేసుకోగలడు ?

పోనీ-

అర్థం చేసుకోలేకపోతే, ఏం ?

తనను నేను అర్థం చేసుకోలే దంటుంది సీరి !

అర్థం చేసుకోవడ మంటే, తనకు ఇష్టమైన రీతిలో నడుచుకోవడం !

నా ఇష్టం మాత్రం ఆమెకు అక్కరలేదు !

ఎంత స్వార్థం !

అయితే ఒకటి -

పురుషుణ్ణి అర్థం చేసుకొన్న స్త్రీ అతణ్ణి రాజు చేసి, తాను రాణీ అవుతుంది.

స్త్రీని అర్థం చేసుకొన్న పురుషుడు ఆమెను దాసీ చేసి, తాను యజమాని అవుతాడు !

ఇదొక పరమ రహస్యం !

పురుషుడు గుర్రం

స్త్రీ రౌతు

గుర్రాన్ని యధేచ్ఛగా పోనివ్వాలి.

కళ్ళెం మాత్రం వదలకూడదు.

అప్పుడే ఆ జంట పరమానంద పారమ్యం అందుకో గలదు.

ఏ స్త్రీ అయినా, ఏ పరిస్థితిలో అయినా, కళ్ళెం బిగించిందో –

పడిపోతుం దామె తక్షణం – ఆనందస్వర్గం నుంచి వైఫల్య వైతరణి లోకి ! తరచు – గుర్రంతో సహా !

రౌతుకు గుర్రమే ఆధారం.

ఇదొక మహా రహస్యం !

పెట్టమారి మగడు మగనాలి ప్రేమకు ఎలా అర్హుడు ?

అర్థం కాదు సీరికి !

మనం పరస్పరం అర్థం చేసుకొన్న వాళ్ళం.

కనుకనే –

అర్ధనారీశ్వరులం !

*అమృత శక్తులు కల్గు అశ్వమే మగవాడు,*
*అశ్వ హృదయము తెలిసినట్టి దే మగనాలు !*
*ఆనందలీలా విహార యాత్రకు గాక,*
*అంగటికి పోవగా అశ్వమేలనె, చెలీ ?*

# 76

ఎవరు నీవు?

జన్మ జన్మాలుగా నా వెంట వస్తున్నది – బాల్యం నుంచీ నేను వెతుక్కొంటు న్నది– నా సంగీత సాహిత్యాలకు ఆపాత మధురంగా ఆలోచనామృతంగా భాసిస్తున్నది – ఎవరు ?

నీవు కావా ?

సమస్త సౌందర్యాలకూ పీఠస్థ దేవతవు, పరిపూర్ణ సుందరివి, నా హృదయైక రాగేశ్వరివి కావా నీవు ?

అయితే -

మరి, ఈ అసూయ లెందుకు ?

జీవనదీ సుందరికి నీటి బోదెలపై అసూయా ?

మన ప్రేమస్వర్గానికి నిప్పు పెట్టదలచిన నరకాసుర బలాన్ని మట్టుపెట్టి, సాంఘిక దురహంకారాన్ని పూడ్చిపెట్టి, అమావస్య గాఢ తమస్సును లక్ష ఆశా జ్యోతులతో వెలిగించి, అక్కడ బందీ చేయబడ్డ సహస్రాధిక జీవన మాధుర్యాలకు విముక్తి కలిగించి, కార్తిక బాల చంద్రికలతో నన్ను అలంకరించిన అపరసత్యవు కదా నీవు ?

ఒక్క రుక్మిణిపై అసూయతో భర్తను తన్నిన సత్యే, పద హారు వేల మంది రాజకన్యల్ని విడిపించి భర్త కివ్వగలిగిన సత్య !

సత్య కంటె, రుక్మిణి కంటె, రాధ కంటె కూడా అపూర్వ ప్రణయానంద ఘనతను సాధించిన ఉజ్వల వతివి నీవు !

ఒక మహా బడబానలం నుంచి ఉద్ధరించిన నీవే, మరో భీకర విలయంలోకి విసిరి వేస్తున్నావెందుకు నన్ను ?

" ఎవరు చెప్పారు మీకు, నే నసూయ పడుతున్నానని ? " అంటావు కదూ నీవు ?

ఎవరు చెప్పాలి ?

మనో వైఖరులు ముఖ పద్మంపై వెలుగు నీడలై ప్రవర్తిల్లవా ?

అసూయలు అంతరంగాన్ని ఉడికించేస్తై. ముఖపద్మాన్ని మాడ్చి వేస్తై ! చిరునవ్వులు మాయ మవుతై. లావణ్యం ఇంకిపోతుంది. ఔజ్జ్వల్యం నశిస్తుంది. ఆకర్షణ పోయి, వైముఖ్యం పెరుగుతుంది. అంతటితో ఆ మనస్సు నుంచి, ముఖం నుంచి – ప్రేమానురాగాలు, శృంగార వైభవాలు, ఆనంద రసాలు చెప్పకుండానే పారిపోతై ! మిగిలేది శిశిరమూ, చిరాకులూ !

అందుకే చేరనివ్వ గూడదు అసూయలను దగ్గరకు.

తియ్యగా వస్తై అవి ఆశ్లేషయ్య నవ్వుల వలె !

తియ్యటి నవ్వుల్లో ఎంత విషం, ఎంత కుట్ర !

సరాసరి మనస్సు లోకే పోతై అవి పుట్టింటి చుట్టాల్లా !

ఆ తర్వాత ఆ మనస్సు దెయ్యాలకొంపై పోతుంది. ఆ ముఖం పిశాచాల వంటగదై పోతుంది. ఆ జీవితం విశ్వస్థ చాకిరీ ఐపోతుంది.

నేను భయపడేది వీటికే.

మన స్నేహాన్ని నిరోధించిన మీవాళ్ళను, మా వాళ్ళను, మన మిత్రులను, సమాజాన్ని కూడ ఎదిరించి నిలవగలిగాం మనం. అంత వరకూ వస్తే, ధిక్కరించి పారేశేవాళ్ళం కూడ.

సంస్కారం, స్వాతంత్ర్యం, లోకజ్ఞత, త్యాగం, అనురాగం అపారంగా కల అదృష్టవంతురాలవు నీవు. ఈ మహా సంపదతో బైటి శత్రువుల్ని చిత్తు చేసి పారెయ్యవచ్చు చిటికలో. జీవించవచ్చు సుఖంగా, స్వేచ్ఛగా – లోకాన్నే ధిక్కరించి!

కాని –

అంతశ్శత్రువులు అసూయలు

మహా భయంకరాలు అవి !

సర్వ నాశంకరాలు అవి !

వద్దు మనకు అసూయలు

అనురాగ జీవితరంగంలో ఆనందపూర్ణ వైశాఖివి నీవు.

ఎన్ని సౌందర్యాలైనా నీ రాగవర్యలే ! ఎందరు కుసుమబాలలైనా నీ రాగలీలలే ! ఎంత ఆనంద పారవశ్యమైనా నీ రాగరస్యమే !

*ఎవరు మించిపోయిరి నిను*
*ఎందుకే అసూయ ?*
*నవ్వవేలనే ఎదలో*
*నవ రాగము విరియ !*
*రాగ సాగరమె నీకు*
*భోగ తల్పకము కాదటె ?*
*భోగి భూషణుడె నీకై*
*యోగ మూర్తి కాదటే ?*

విరిసిన ఏ పువ్వైనా
మెరిసిన ఏ మబ్బైనా
ఉర్వికి రాలేదేనే
ఉండే దొక నీవేనే !

## 77

కమ్మగ పాడవచ్చిన పి
కమ్మను నేను ; రసార్ణవాంతరం
గమ్ము మథించి తెచ్చిన సు
ఖమ్ములు పంచుదు నిందు ; ఈ పువుం
గొమ్మల నీడలో కలిసి
క్రోలక – నెచ్చెలులార ! ఏల ద్వే
షమ్ములు పెంచుకొంద్రు కల
శమ్మునకై ? సుధ లొల్కబోతురే ?

సహజమైన పాట పికానిది
నేర్చుకొన్న విద్య కాదది.

నేర్చుకొన్న దానిలో నూతనత్వం ఉండదు. చిలుక పలుకులు ముచ్చటగా ఉండవచ్చు, కోకిల పాటలు అమృత స్రవంతులు.

ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసం – ఈ మూడూ ముఖ్యమే జీవిత విజయానికి.

అయితే –

వ్యుత్పత్తి, అభ్యాసం – ఇవి జీవితాన్ని నడిపించేవి మాత్రం.

జీవితాన్ని సృష్టించగలది ప్రతిభ ఒక్కటే !

ప్రతిభాజన్య మైన జగత్తును అర్థం చేసుకోవడం వ్యుత్పత్తి, ఆ అర్థాన్ని తిరిగి చెప్పగలగడం అభ్యాసం.

సహజ గానం పికానిది.

సహజంగా పుట్టేదే ఏ కళ అయినా.

వికసిస్తుం దది దేశకాల పరిస్థితులకు అనుగుణంగా.

వైశాఖంలో ధగధగ లాడిపోయే ఆకాశమే, మబ్బులు కప్పుకొని మూలుగుతుంది శ్రావణంలో, పొగమంచు శవపేటికలో జీర్ణించి పోతుంది మార్గశిరంలో !

ఆకాశమే దక్ష ప్రజా పతి !

చిత్రా విశాఖలు విశ్వైక మోహినులు !

వసంత రాకా సుధాకరుడే ఈ పుంస్కోకిల ! విశ్వమోహనంగా పాడవచ్చిన ఈ పికం !

ఆనంద రసార్ణవాన్ని మథించి తీసిన గాన సుధా సారాన్ని గొంతు దాకా నింపుకొని వచ్చి కూర్చున్న దిది - రసాలినిలో, మధూదయంలో.

అందరికీ చాలుతుందీ అమృత రసం

అక్షయం ఈ కలశం.

ఎప్పుడు, ఎవరికి, ఎంత కావాలో అప్పుడు, వారికి, అంతా లభిస్తుంది ఈ ఆనందసుధ !

పోటీ పడనవసరం లేదు

క్యూలో నిలబడ నక్కరలేదు

లభించదేమో అన్న భయం లేదు

ఒక చెట్టు క్రిందనే గుమిగూడాలని లేదు.

ఏ చెట్టు క్రింద నిల్చున్నా, ఏ కొండ మీద కూర్చున్నా, ఏ సాగరంలో ఈదుతున్నా - అందుతుం దది.

ఏ వేళ వచ్చినా దొరుకుతుం దది.

హృదయాల నిండా, జీవితాల నిండా - జన్మ జన్మాలకు సరిపడేం తగా - క్రోలవచ్చు దీన్ని అందరూ !

ఇంకెందు కీ పోటీలు ?

ఇంకెందు కీ కీచులాటలు ?

ఇంకెందు కీ అసూయలు ?

కలశం కోసమా ?

ఆ కలశం అక్కడున్నప్పుడే, అందరి కన్ని రూపాలుగా అమృతం అందిస్తుం

దది ! ఎవరి మట్టుకు వారే దాన్ని లాక్కోవాలని పోరుకు దిగితే - అమృతం ఒలికిపోదా ? కలశం పగిలిపోదా ?

రాగవతీ !

చూస్తున్నావుగా లోకాన్ని ?

వట్టి కలశం కోసం ఎంత పోరాటం !

పగల గొట్టేస్తా రేమో దీన్ని చివరకు !

ఎగర గొట్టేస్తారేమో పికాన్ని పాడకుండానే !

జారి పోతుందేమో వసంతం తిరిగి హేమంతంలోకి !

కలుగ జేసుకో - సమయం మించిపోకుండానే !

అందుకో అమృత భాండాన్ని

దాచేసుకో హృదయ పద్మంలో

పాడుకొంటాను నేను అక్కడి నుంచి, నిరాటకంగా, నిత్యనూతనంగా, భ్రమరంగా నైనా !

## 78

"అమ్మా !

" మా ఒక తాతయ్యకు ఏడుగురు భార్యలు - అవరుద్ధలూ, యాదృచ్ఛికలూ కాక "

" లోకం ఆశ్చర్యపడవచ్చు ఈ మాట విని. లోకానికి తెలియని అచ్చట్లు, ముచ్చట్లు ఎన్నో ఉన్నై మన గ్రామ సీమల్లో.

" మరి, శాసనా లెలా అంగీకరించా యంటే - అప్పటికి ఈ కలి శాసనాలు పుట్టుకు రాలేదు.

" మరో తాతయ్యకు కూడా ఏడుగురు భార్యలే. అయితే, అతడు ఏక పత్నీ వ్రతుడు.!

" అంటే - ఒకతె చనిపోతే మరొకతెనుగా చేసుకొంటూ వచ్చాడన్న మాట. ఒకొక్క బిడ్డను కని చనిపోతూ వచ్చారు. ఏడోది కూడ చనిపోయేటప్పటికి అతడికి తొంభై దాటినై !

" ఈ ఇద్దరి తాతయ్యల విషయం లోనూ, ఆడవాళ్ళు ఇష్టపడి వచ్చినవాళ్లే. హృదయాలను కూడ సమర్పించుకొన్న వాళ్ళే ! "

" ఒక్క రెండో తాతయ్య విషయం తీసుకొన్నా ఆ ఏడుగురూ అగ్నిసాక్షిగా పెళ్ళాడిన అర్ధాంగులే. పతివ్రతలే. జన్మ జన్మాలు అతడే భర్త కావాలని కోరుకొంటూ చచ్చిపోయిన వాళ్లే !

" ఆత్మ, పరమాత్మ, జన్మ జన్మాంతర వాసన, వాంఛ, మోక్షం వంటి ఆర్ష ధర్మ ప్రణాళిక లోని సత్యాలను - లోకమంతా ఆమోదించిన ఉపనిషద్గీతలను ఖాతరు చెయ్యని వాళ్ళను అలా వదిలేద్దాం.

" తాతయ్యా, ఆ ఏడుగురూ మోక్షం పొందేస్తే సమస్యే లేదు. కాని, వాళ్ళు అంతటివాళ్ళు కాదు "

" వాళ్ళంతా తిరిగి జన్మ ఎత్తితే - ఆధ్యాత్మికత నశించిన ఈ మానవతా యుగంలో - ఏమిటి గతి ?

" వాళ్ళందరికీ భార్య హోదా రావాలంటే, వాళ్ళు ఒకళ్ళ తర్వాత ఒకళ్ళుగా మళ్ళీ చావక తప్పదా ?

" అందరూ ఏక కాలంలో భార్యలుగా ఎందుకు బ్రతకగూడదో - తాము కోరుకొన్న అతడితో ? "

" ఏ స్త్రీ అయినా ప్రేమించిన వాణ్ణే పెళ్ళాడడం ధర్మం కాదా ? చట్టం ద్వారా దాన్ని నిషేధించడం స్త్రీ పాతివ్రత్య ధర్మాన్నే విచ్ఛిన్నం చెయ్యడం కాదా ?

" స్త్రీని ఇలా ఎందుకు హింస పెడుతున్నారో నేటి సంఘపెద్దలు ? "

" మణిశిల లాంటి వాళ్ళే ఆదర్శ స్త్రీలా లోకానికి ? "

" ఆర్షధర్మం ఏమైపోయినట్టు ? "

" స్త్రీ సాంగత్యమే మూల పాపం అన్న అజ్ఞానుల కృతక శాసనాలను తెచ్చి మనపై రద్దుతున్నా రెందుకు మన పెద్దలు ? "

" ప్రశ్న లడుగుతున్నది స్వర్ణలత లాంటి ఆధునిక విద్యావతులే కాదు, మా దొడ్డమ్మ లాంటి సనాతన ఆచారవతులు కూడ ! "

" ఇదంతా తెలియని దాన్ని కాదు నేను "

" నాకా అసూయలు ? "

" నేను పుట్టక ముందు నుంచీ, మీరు పుట్టినప్పటి నుంచీ, మిమ్ము ఉత్తేజపరుస్తూ వస్తున్న ఉజ్జ్వల రాగదేవత లందరూ నా అంశలే కారా ?

" నా అంశల పైనే నాకు అసూయా ?

" పోనీ – వాళ్ళందరూ వాస్తవ వ్యక్తులే అనుకొందాం ! సీరి, శివరంజని, మంజీర, దూర్వ వంటి వాళ్ళ వలెనే – రాగజ్యోతి, రాగప్రభ, రాగలత, రాగవీణ, రాగలక్ష్మి వంటి వాళ్ళు కూడ కేవల భావప్రేరణలే కాక, మీకు వాస్తవ ప్రియురాండ్రే అనుకొందాం ! అయితే, ఏం ?

" ఎందుకు అసూయలు నాకు ? "

" సామాన్య స్త్రీని నేను "

" ప్రజ్ఞానబ్రహ్మ మీరు "

" రాగ అనే రెండక్షరాల విశేషణంతో – విశ్వసౌందర్య విక్షేపంలోని ప్రతి రమ్యతా నేనైపోతున్న అదృష్టాన్ని నా కిచ్చిన మీ పట్లనా అసూయలు ?

" కుటుంబ సంబంధమైన చిక్కులు నా ఆలోచనల్ని పీడించినప్పుడు, ముఖం లోని నా అన్య మనస్కత అసూయగా కనిపించి ఉండవచ్చు మీకు.

" లేక–

" మనం ఎగ్జిబిషనులో తీయించుకొన్న ఫోటో పట్టుకుపోయి, నన్ను చింపేసి, మిమ్ము మాత్రమే జాకెట్టులో దాచుకొన్న సీరి – నాతో ఎంతో స్నేహంగా ఉంటూ, మీరు నాకు వ్రాసిన లేఖలను తీసుకుపోయి కాల్చి పారేసిన మేఖల – లాంటి వాళ్ళు నన్ను గురించి చాడీ లేమైనా చెపుతున్నారేమో మీకు !

" వాళ్ళను నేనేమీ అనడం లేదు. వాళ్ళ ప్రేమ గాఢత అలాంటిది కావచ్చు "

" ప్రేమ ఎంత గాఢంగా ఉంటే, దాని ప్రక్క అసూయ కూడా అంత దట్టం గానూ ఉండవచ్చు – వెలుగు ప్రక్క నీడలా "

" కాని –

" నా ప్రేమ స్వప్రకాశ సుందరం. దీనికి ఏ నీడలూ లేవు "

" మనకు ప్రమాదం తేగల వాళ్ళు మన చుట్టూ తిరిగే వాళ్ళేగా ?

" నమ్మవద్దు వాళ్ళ మాటలు "

" మాఘ స్నానాలు మొదలు పెట్టింది మా దొడ్డమ్మ.

" రసాలినికి ఎగువలో, అశోకధార దగ్గర మా స్నానాలు !

" శివరాత్రికి శ్రీశైలం వెళ్ళవలసి రావచ్చు. ఇప్పటి నుంచే బెంగగా ఉంది నాకు ! "

" ఏది ఏమైనా–

" మీతో పూర్ణైక్యం పొందిన నాకు, మీలో లేని ఏ దోషాన్నీ ఆపాదించవద్దు. మీలో ఉన్న దోషాలను కూడా నన్ను సోకనీయవద్దు. మీ రొక గులాబి చెట్టు, తామర కొలను, మహా సముద్రం. నేను కేవలం గులాబి మొగ్గను, పద్మకళికను, అనావిద్ధ రత్నాన్ని. మనిద్దరం ఒక్కటి కాదు. పునాది నుంచి శిఖరం దాకా ఆలయం సమస్తం మీరే. మీ హృదయాంతఃపురంలో పూజ లందుకొనే రాగేశ్వరిని నేను "

" మీ ప్రాణం నేను

" నా స్థానం ఎప్పటికీ నాదే !

" రేపు వస్తున్నాను – ప్రత్యేకంగా ! "

*నీలోని ఒక రాగలీలా లవము నేను !*

*నీ నుండి ఎగసి, ఈ నింగిలో విరిసేను !*

*నా వెలుగు నీ దర్శన ప్రాప్తి కోసమే !*

*నా బ్రతుకు నీ స్పర్శన స్ఫూర్తి సౌఖ్యమే !*

## 79

" ఎంత సేపు చూశానో ఎదురు తెన్నులు !

" నిర్ణీత సమయ నిర్నిద్రత లేని చెలి, నెచ్చెలుల కెంతొ చింతను గూర్చు – అంటూ మధుబాల నించిన కన్నీటి బిందువులో సుళ్లు తిరుగుతున్న అప్పటి నా ముఖాన్ని మీరు చూడగల్గితే !

" చూశాను – చూశాను – చూశాను – చూశాను

" ఎంతసేపు చూశానో ఎదురు తెన్నులు !

" ఒకనాడు – మీరు కూడ పొందిన ఈ బాధ ఎంత దుర్భరం !

" మీ వదనంపై రెపరెప లాడవలసిన ఈ సంజకెంజాయ చీరపైట చెంగుకు కన్నీళ్ళొత్తుకొనే ఉద్యోగం దొరికిం దిన్నాళ్ళకు.

" మీ చూపుల స్పర్శకే బిగువెక్క వలసిన ఛోళీ తడిసి మెత్తబడిపోయింది చింతతో.

" మీ కిష్టమైన ఎర్రగులాబి చీర, మందార ఛోళీ, తలంటుకొన్న కురుల నిండా ఇన్ని సన్నజాజులు - ఎంత శృంగారంగా వచ్చానని !

" చూడగానే, ముఖం ఎర్రముద్దులా చవిచూచిన చెంగల్వ వలె విప్పారగా, మీరు - వైశాఖీ ప్రియసఖీ దేవీ అంటూ - తులు చాస్తారనీ -

" నేను అందకుండా, అలా - అల - గాలిలో తావిలా తేలిపోబోతే, అమాంతం నా మీద కురికి, అపిలు పండుసు వలె అందుకొని, నా అందాన్నంతా కొరుక్కు తినేస్తారనీ -

" నేను మధురంగా మీ కంఠం దిగుతూ - ఉదరం లోకి కాక, హృదయం లోకి చేరుకొని - అన్నరసంగా కాక, ఆత్మరసంగా మారిపోగలననీ -

" ఎలాంటి తియ్యటి ఊహలతో వచ్చానో !

" ఎంత అందంగా వచ్చానో !

" అడవి గాసిన వెన్నెలై పోయాను నేను ఆ సాయంత్రం !

" మీరు చూడని ఈ అందాలు, మీరు అనుభవించని ఈ మాధుర్యాలు, మీ స్పర్శ తగలని ఈ శరీరం నా కెందుకు ?

" అడు గడుగునా గుచ్చుకొనే ఈ దబ్బముళ్ల మోజు కోసమా అంత పచ్చిక బీడును నడిచి ఇంత దూరం నే వస్త ?

" ముళ్ళేకాని కళ్ళు లేవు ఈ గులాబి పొదలకు ! మీద కురుకుత్తై రకరకాల పూల ఎంగిళ్ళతో ఈ తుమ్మెదలు ! చల్లని ఈ చలిగాలి చిలిపి ఆటలు నా పమిటెతోనా ? ఈ గోరింక పిల్లలకు మరో పనేం లేదు - నా వెంట పడడం తప్ప ! సంధ్యారాగం కాదిది - మన్మథుని బాణాలు కడిగిన నెత్తురు మడుగు ! రక్త మాంస శకలాలు ఈ ఎర్రకలువలు ! అన్నిటినీ మించి అగ్గిపై గుగ్గిలంలా - చెలరేగుతున్న రథసప్తమి వెన్నెల !

" ఏం చెయ్యను నేను ?

" ఎలా భరించగలను ఈ భగ్న మనోరథాన్ని ?

" సాగరంలో దూకనా ?

" కాని -

" నేను నా దాన్ని కానే !

" మీ సొత్తును పాడుచెయ్యడానికి నాకేం హక్కుందీ ?

" మీ సొత్తునేనా నేను?

" అయితే, మీ రెందుకు రాలేదు ?

" నా లేఖ అందలేదా ?

" అయ్యో, ఇది నా ఛోళీలోనే ఉండిపోయిందే! ఎంత పొరపాటు జరిగింది !

" వెన్నెలలా వచ్చిననేను

" చీకటిలా వెళ్ళి పోయాను తిరిగి !

*ఎంత బాధ పడితివో*
*ఎదురు చూచి, ఎదురు చూచి !*
*విలయ కాల కీలల వలె*
*విషము గ్రక్కు వెన్నెలలో !*
*గుచ్చి గుచ్చి గుండె చీల్చు*
*కుసుమ శరుని దాడులలో !*
*ఆనందము కోరుకొని,*
*అమృత రుచులు తలచుకొని,*
*ఆశా పరిధుల దాకా*
*అశ్రువులను నింపుకొని !*
*విరహాగ్నులతో తనువే*
*వెలి బూదిగ మండి పోవ,*
*భగ్న మనోరథము క్రింద*
*ప్రాణములే చితికి పోవ !*

# మాఘి

*మేలుకో !*
*బాల గోపీ విలోలా !*
*బ్రహ్మ వెలసెను, పరమ శృంగా*
*రమ్ము కలచెను అచల హృదయము !*
*ప్రణయ రాగ రసోజ్జ్వలమై*
*భాను బింబము రూపు కట్టెను !*
*వికృత హేమంతము నశించెను,*
*విశ్వమే ప్రత్యూష మాయెను !*
*మాఘ పుణ్యస్నాన సంధ్యల*
*మాధవా ! మేల్కోవ ? దేవా !*
*అరుణ అరుణారుణ రజస్విని*
*అమృత సంధ్యా రాగ లక్ష్మి*
*నీ కొరకె వికసించె ! ఈ అతి*
*లోక మాధురి అందుకో !*
*ఎక్కడి దీ నాదోన్మని !*

నన్ను మేలుకోమంటూనే, జీకొట్టి నిద్ర పుచ్చుతున్న ఆ ఉన్మనస్క ఎవరు ! భూపాల రాగ మనుకొని, కామవర్ధని పాడుతున్న ఆ రాగవర్ధని ఎవరో ! నీవేనా, దేవీ ?

నీవు కాక ఇంతటి మహాసత్త్వ మరెవరు ?

నేను నిద్రపోయా ననుకొంటున్నావు కదూ ?

రోజూ, తెల్లవారు జామున, అశోక ధార క్రింద, నీవు పాడే రాగోదయాలు నేను వినడం లేదా ?

" మరి, లేచి రావేమి ? " అంటావు నీవు !

పెదవితో లెమ్మంటూ, కంటితో వద్దంటూ, చేతిలో లాగుతూ, శరీరంతో అదుముతూ ఉంటే – ఏ దేవుడు లేవ గలడు అట్టి చమత్కార పరమైశ్వర్య పారవశ్యం నుంచి ?

వ్రతం చేస్తున్నది మీ దొడ్డమ్మ కద ?

ఆమె కోరుతున్నది నిజంగా కైవల్యమో – నీకు లభించిన అదృష్టం లాంటి ఆనంద ప్రణయమో !

ఈ జన్మ లోనే, పదినిమిషాల దూరం లోనే, అందుబాటులో ఉన్న సుఖాలను సైతం అనుభవించే ధైర్యం లేక – వచ్చే జన్మ దాకా వాటిని వాయిదా వేస్తారు కొందరు అంబేదలు !

ఎన్నో పూజలు చేస్తారు అందుకోసం!

న క్షరతి, న సంచలతి, న వినశ్యతి – అంటూ ఏది కీర్తింప బడుతున్నదో, ఆ మహా పరా పదవిని ఎవరైనా అందుకోవలసింది ఈ జన్మ లోనే. అస్ఖలిత జ్ఞానమే అందుకు సాధనం.

జప తపో వ్రతాదు లన్నీ వచ్చే జన్మ కోసమే ! ఈ జన్మలో లభించని సుఖ సంతోష సౌభాగ్యాల కోసమే !

మీ దొడ్డమ్మ నిన్నే ఎందుకు ఆరాధించదో ?

నీ వెవరో నీవు తెలుసుకొని, నే నెవరో కూడా తెలుసుకొన్న ప్రజ్ఞాన పరమేశ్వరి వైన నిన్ను ?

ముక్కోటి దేవతలూ, ముగ్గురు మూర్తులూ కూడా ఆరాధించేది నిన్నే కద !

నీ ఆరాధనే విశ్వశ్రేయోరాధన ! దాని సాఫల్యమే కైవల్యం ! అదే నిన్ను జీర్ణించుకొన్న నేను ! ఆ నేనే పరమ త్రయీ రూప రాగరమ వైన నీవు!

సరే - కానీ !
ఆడుకో రాగ లాస్యవై !
పాడుకో రాగ లక్ష్మివై !
లయించుకో నన్ను నీలో రాగ వైశాఖివై !
రాగ పరమేశ్వరుణ్నే అవుతాను నేను ఇప్పుడే !

*చేసుకోవలె పూజ చేత పూలున్నపుడె,*
*పెంచుకోవలె సుఖము ప్రేమ దొరికిన కడనె,*
*ప్రణవ మొసగెడివాడె పరమేశ్వరుడు సుమా !*
*కలియవలె అతనిలో కనిపించినప్పుడే !*

*చూపులో చూపు, మనసున మనసు కలిసి న*
*ప్పుడె ఆత్మ ఆత్మలో పూర్ణైక్యమును చెందు !*
*హస్తగతమై యున్న ఆనంద లవముకై*
*వాయిదా ఎందుకో వచ్చు జన్మము దాక ?*

## 81

చక్కగా విరబారి, తుల్లంగా విరబూచి, కనులకు నిండై, మనస్సుకు పండువై, చిత్తానికి ఉత్తేజం కలిగించే రాగసరోవరవు నీవు !

సరోవరం కనిపించకుండా అంచులు మోసి విప్పారిన సహస్రదళ సువర్ణ కమలానివి నీవు !

ఒక చిన్న ముద్దును కాసారం లోకి విసరగా, దాని స్ఫురిత స్పందనకు పద్మం చలించగా పద్మం లోని మధుపాలు రేగి అమృత నాదంతో ఆశల్ని ఆక్రమించగా, ఏ తన్నాద సుధ కలశాన్ని ఒక్క గుటకతో ఖాళీ చేసి, పెదవులతో అంచుల్ని మూసి -

" చాలు చిట్టి పోతై అంచులు ! "

తన సమస్త శిశిర తమస్సునూ ఒక నల్ల కల్వగా జటలో ముడుచుకొని, మఘా సౌధాగ్రం నుంచి దూకి, నా ఒడిలో పడ్డ రాకా పూర్ణ రాగ శశివి నీవు !

సాహసోపేత సమ్య గభిసారంలో, ద్వారం దగ్గరి సింహంచే తిన్నదెబ్బలా, చెక్కిలిపై ఆ పుట్టుమచ్చ !

రసాల ఫలంపై కత్తి నాటొక చోట పడగా, రసం మరొక చోట చిప్పిలు తున్నదో అన్నట్టున్న కెమ్మోవి !

ఎంత నిండుగా ఉన్నై నవనీత కలశాలు !

ఎంత తియ్యగా ఉంది ద్రాక్షరసాస్వాదన !

" చాలు, చాలు పగిలిపోతై కలశాలు ! "

ఓహో, పాల సముద్రానివి నీవు !

అమృత భాండమే నీవు పద్మ చలించగా !

దానిపై మూతగా ఉంచిన సువర్ణ కమలమే నీ వదన కమలం !

కమలాసన నీవు ! కమలాలయవు నీవు !

సువర్ణ కమలంలో వికసిత నీలోత్పలాలు !

వాటిలో అమృత మధుపాలు ! వాటికి ముద్దులే మధువులు !

నా పెదవులకు పచ్చ కర్పూరం కాటుక చిమ చిమ !

పాల తరగల బుగ్గలపై కాటుక పెదవుల గిట్టలు

" చాలు, చాలు – కలగిపోతై తరగలు ! "

ఓహో ! నీ వదన పద్మం ఏణాంక బింబమే !

నా వక్షం నిండా నీ కేశ సంపద వికసించగా

నీ వదన సైకతం నా బంగారు లేళ్ళ గిట్టలతో చిందర వందర కాగా

మధుపాలు మూగ వోగా

మేరు గిరి శిఖరాలు మేఘ మృదులం కాగా

వీచిన తావి తుపానుల్లో, కురిసిన మధు వర్షాలలో, పద్మాకరమే కలిగి నలిగి పోగా

ఓహో ! ఆనందోత్సవ మహా వైభవం !

నా రాగ విపంచివి నీవు !

అమృత గానంలో పరవశిల్లిపోయి, అపూర్వ రాగసుధల్ని ఇంకా ఇంకా

ఊరించాలని - అతిలోక గాన లక్ష్మీ సౌందర్యంలో పరమ తారాతి తారాతిశయం దాకా ఇంకా ఇంకా మునిగి పోవాలని -

స్వర మూలాన్ని అదిమి, మరీ బిగించ బోతున్నప్పుడు -

" చాలు, చాలు, చాలు -- తెగిపోతై తీగలు ! "

ఓహో - రసాలినీ ! రాగ రసోజ్జ్వలినీ !

# 82

నిజానికి ఏ యుద్ధమూ ముగియదు - ఆగుతుం దంతే.

ఆ మధ్య విరామ కాలంలో ఏం చెయ్యాలి ?

భీముడేం చేశాడో చెప్పనా ?

మహా భారత యుద్ధం ముమ్మరంగా సాగుతోంది. జయాపజయాలు దైవాధీనాలుగా ఉన్నై. ఆ రాత్రి పాండవ శిబిరంలో శ్రీకృష్ణుడు ఛలోక్తులతో ఉత్సాహం కలిగిస్తున్నా డందరికీ.

" ఇంత బలమూ గుద్దుల వరకేనా, ముద్దులకు కూడ పనికొస్తుందా ? " అన్నాడు భీముడి భుజం తట్టి !

ఆరుబైట కూర్చున్నా రిద్దరూ.

ఒక పురుషుడు ఒక స్త్రీని విడవకుండా ఎంతసేపు రమించగలడు ?

ఒకే బిగిని ఎన్నిసార్లు భావప్రాప్తిని కలిగించ గలడు ? ఏక కాలంలో ఎంతమందితో రమించగలడు ?

ఊర్ధ్వ రేతస్కత, అస్ఖలిత బ్రహ్మచర్యం సాధ్యం ఒక్కశివుడికి మాత్ర మేనా ?

కృష్ణుడు కూడా అస్ఖలిత బ్రహ్మచారే ! ఇలాంటిప్రయోగాలకు అతడి కున్న అవకాశాలు పాపం భీముడి కెక్కడివి ?

ద్రౌపది విషయం వచ్చింది.

పగలంతా యుద్ధం, రాత్రంతా నిద్ర - ఇంతేనా భీముడు చేస్తున్న పని ? అర్ధరాత్రి దాటిన తర్వాత ఆమె ఏమి చేస్తూ ఉంటుందో చూశాడా ఎప్పుడైనా ?

చూడలేదు !

ఆ రాత్రి చూడమన్నాడు కృష్ణుడు.

అలానే చూశాడు భీముడు.

చెమట్లు పోసి, మతి చెదిరి, వచ్చి కృష్ణుడి కాళ్ళపై పడ్డాడు. అంతటి మహా బలశాలీ జావ అయిపోయాడు పాపం.

అభయం ఇమ్మని ప్రార్థించా డతడు కృష్ణుడ్ని. తమ వంశాన్ని కాపాడు మన్నాడు ఏడ్చాడు నిజంగా !

నవ్వాడు కృష్ణుడు
లేవదీసి కూర్చోబెట్టాడు
ఒళ్ళ నిమిరి సేద దేర్చాడు
కాఫీ ఇచ్చి స్వస్థ పరిచాడు.
నవ్వుతున్నావు కదూ నీవు కూడ ?

కాఫీ కాకపోతే - అలాంటిదే ఏదో - ఆ కాలంలో వాడుకలో ఉన్న ఒక మద్యం.

" ఇంతే నటోయ్, హిడింబా ప్రియా ? " అన్నాడు.

మరీ నవ్వాడు పగల బడి !

ఏదో జ్ఞాపకం వచ్చినట్టు, ఆగి, అన్నాడు "సరేగాని, ఇన్నేళ్ళుగా సంసారం చేస్తున్నావుకదా. రతిలో ఒక్కసారైనా ద్రౌపది చేత చాలు అనిపించావా ? "

ఏం ప్రశ్న ?

ఏమిటి జవాబు ?

జ్ఞాపకం లేదు భీముడికి ?

ఎన్నడూ అనలేదా ఆమె ఆ మాట ?

అంత చిన్న మాట ?

ఎంత చిత్రం !

కొందరు మగవా ళ్ళుంటారు. తమ తృప్తేకాని, ఆడదాని తృప్తి అక్కరలేదు వాళ్ళకు. ఒళ్ళో పెడుదునా, దళ్లో పెడుదునా అంటూ - తమ యావ కాస్తా తీరిపోగానే - లేచి దులుపుకు పోతారు !

తిండి ఆకలి ఒక్కళ్ళది. సెక్సు ఆకలి జంటది. ఇద్దరికీ సమానంగా తీరాలి అది. ఒకరి ఆకలిని రెండవ వారు తీర్చవలసి నట్టి దది. జంటలో ఏ ఒక్కరికి తృప్తి లేకపోయినా సెక్సు విఫలమైనట్టే ! ముందుగా స్త్రీ ఆకలి తీర్చి, తర్వాత తాను తీర్చుకోవాలి పురుషుడు.

ఇలాంటి నర్మమర్మ మర్యాదలు తెలియనివాడా భీముడు ?

వీణను పట్టిన తర్వాత - వేళ్ళు రక్తాలు చిందుతున్నా, నరాలు తెగిపోతున్నా, ప్రాణాలు ఎగిరి పోతున్నా - నాదలక్ష్మి నా దనిపించుకోకుండా విశ్రమించని వైణికుడు కాడా భీముడు ?

భార్య కాబట్టి నిర్లక్ష్యం చూపి ఉండవచ్చు.

చాలా - అని అడిగి ఉండక పోవచ్చు.

గంటల కొలది రమించినా, పదుల కొలది భావప్రాప్తులు పొందినా, చాలు అనని కామినులున్నా రెందరో ! వాళ్ళతో రతి పరమ రమణీయం ! అసలు- అదే పరమానంద పరమైశ్వర్యం అస్ఖలిత వీర్యుడైన పురుషుడికి ! శుక్ర ప్రాబల్యం గల అలాంటి పూర్ణసుందరి అయి ఉండవచ్చు ద్రౌపది !

సామాన్యంగా - ఆకలి తీరినా, వద్దనదు ప్రేమగల స్త్రీ ! కవ్విస్తూనే ఉంటుంది ప్రియుణ్ని ! స్త్రీ అంగ నిర్మాణం కూడ అందుకెంతో అనుకూలం. ఈ విషయంలో పురుషుడి కున్న పరిమితులు స్త్రీకి లేవు.

అందుకే పురుషుడి బాధ్యత అధికం రతిలో. ముందుగా స్త్రీని తృప్తి పరచకుండా తాను స్ఖలితుడైన పురుషుడు ఆ స్త్రీ మెప్పును పొందలేడు. పైగా, ఆమె ద్వేషానికి గురి అవుతాడు తరచు.

చాలు అన్న రెండక్షరాలను స్త్రీ నుంచి పొందిన మగవాడి కంటె కృతార్థుడు మరెవడు ?

అతడే శివుడంటే !

ఏది ఏమైనా -

జ్ఞాపకం లేదు భీముడికి.

ఆ యోచనే లే దతడి కంతవరకు !

" పోనీ, ఇప్పు డనిపించుకో ఆ మాట" అన్నాడు కృష్ణుడు. కొన్ని వాజీకర

ప్రక్రియలు, కామ కళా రహస్యాలు, చిట్కాలు ఏవో ఉపదేశించాడు. చాలు అనే వరకు వదల వద్దన్నాడు.

" తృప్తి పడి, చాలు అని, ఆ మైకంలో – వరం కోరుకో అంటుందామె. వంశాన్ని కాపాడు అని కోరుకో ! కనీసం మీ అయిదు గురి నైనా మిగల్చమను " అన్నాడు.

ఇంతకూ, ద్రౌపది ఏం చేసేది ప్రతి రాత్రీ ?

ఉభయ పక్షాలూ పోరాటం ఆపి, అలసి నిద్రపోయిన తర్వాత, అర్ధరాత్రి లేచి యుద్ధరంగానికి వెళ్ళేది. ఉగ్రకాళీ రూపం తాల్చేది. ఆ పగలంతా యుద్ధంలో మరణించిన లక్షలాది యోధుల, గజతురగాదుల కళేబరా లన్నింటినీ ఆరగించి వేసేది. యుద్ధభూమి నంతా నాలుకతో నాకేసేది. మళ్ళీ మామూలు మనిషై, తెల్లవారక ముందే ఇల్లు చేరుకొని, ఇంటి పనులు చూచుకొనేది !

యుద్ధ దేవత ద్రౌపది !

మహా శక్తి క్షేత్రం ఆమె !

ఆ రాత్రి భీముడు చూచిన భయంకర బీభత్స దృశ్యం అది !.

ఇప్పు డామెను సమీపించడానికే అతడికి గుండె చాలడం లేదు.

" ఆ యుద్ధం ముఖ్యం కాదు, ఈ యుద్ధంలో గెల్చిరా " అన్నాడు కృష్ణుడు.

తప్పదు కద !

వెళ్ళాడు –మెల్లగా !

గెల్చాడు – చిత్తుగా

వరమూ పొందాడు !

కాని – పాపం – ఈ రహస్యాన్ని భీముడికి చెప్పిన కృష్ణుణ్ని మాత్రం శపించి పారేసిం దా మంత్ర మహాశక్తి !

ఆ శాప ఫలమే పూరీ లోని జగన్నాధుడికి ఆ మొండితనం (ట)

రాగ మాఫీ !

ఈ కథ ఎక్కడిదో తెలీదు. మా అయ్య ఎప్పుడో, ఏ శిష్యుడి తోనో చెపుతుంటే విన్నాను నేను.

కామ విషయంలో ప్రతి కామినీ ఒక ద్రౌపదే.

కాని -

ప్రతి మగవాడూ భీముడూ కాడు !

ప్రతి బావా కృష్ణుడూ కాడు !

## 83

ముఖం కడుక్కోకుండానే పడుకొన్నాను నేను రాత్రి !

తెలుసా ఎందుకో ?

అవన్నీ నీ ముద్దులు !

ముఖం నిండా ముద్దులు పెట్టి, పెదవి కరిచి, రక్కున లేచి, చెక్కిలి మీటి, చేయి నొక్కి-

నే నింకా మైకం నుంచి తేరుకొంటూ ఉండగానే, చేతిని చేతి లోకి తీసుకొని, మన రెండు చేతుల దూరం దాకా కదలిపోయి, మునివేళ్ళ చివరిముద్దులు అనుమతించి, జాలిచూపులు చూచి, కంఠం రుద్ధం చేసుకొని.

" మళ్ళీ రేపు" అంటూ, అంతలోనే అదృశ్యమై పోయావు నీవు క్షణంలో క్షణ ప్రభలా !

ఎంత మత్తు ! ఎంత విభ్రాంతి !

శృంగార రస ప్రణీతం నా జీవితం !

అనురాగ రాగ పరిస్నపితం నా శరీరం !

నీ అధర సుధా మధురం నా వదనం !

ఎలా కడుక్కోను నీరసమైన వట్టి నీటితో ?

నిద్రే లేదు నాకు రాత్రంతా !

శ్రీవల్లి ఎంత మంచిది !

నా ఎదరే ఎన్ని ముద్దులు పెట్టుకొన్నావు నీ వామెను !

ఆడపడుచు సగంమగ డన్న సామెతకు నీవే నేమో తల్లివి !

ఆమెను నీ వలా ముద్దులు పెట్టుకొంటుంటే - నా బుగ్గలు కందిపోయి మండసాగినై కద !

అసూయను గెలవాలని లోకానికి బోధిస్తున్న నాకే ఎంత అసూయ !

ప్రేమించగల వాళ్ళూ, ప్రేమించదగిన వాళ్లూ ఎంతమంది లోకంలో ?

తాను ప్రేమించే వ్యక్తి ఒకరు, తనను ప్రేమించే వ్యక్తి ఒకరు - ఇద్దరు వ్యక్తులు లభిస్తే చాలదా జీవితానికి ?

ఆ ఇద్దరూ ఒకే వ్యక్తి అయితే, అంతకన్న మహాభాగ్యం మరేముంటుంది ? అలాంటి నీ ప్రేమను నాతో పంచుకోగలిగిన శ్రీవల్లి ఎంతటి అదృష్టవంతు రాలు !

నా నోట్లో కుక్కే అలవాటున, ఆమె నోట్లో కుక్కావు కదూ అపిలుపండు ముక్కలు ! ఉక్కిరి బిక్కిరై పోయిందామె, పాపం

నీవు తీసి బల్లపై విసిరిన కొత్త గాజుల్ని నేను తీసుకొని వేసుకో బోతుండగా–

" చీర కూడా " అన్న శ్రీవల్లి ఎంత చతుర ! ఎంత దివ్య !

"ఇంతలో అంత చనువే ! " అంటూ, నోరావులించావు నీవు !

ఎంతలో ?

సంవత్సరాల తరబడి పరిచయం కూడ స్నేహంగా పరిణమించదు కొందరి విషయంలో !

కొందరు చూపు లోనే ఆత్మీయులై పోతారు, ఎన్నో జన్మల సౌహార్ద సంపదతో !

శ్రీ వల్లి చనువు ఇప్పటిదేనా ? దాని వెనుక ఎన్ని జన్మల స్నేహం ఉన్నదో !

" అతి చనువు తిరస్కార హేతువు " అన్నది కదూ సీరి ఒకసారి ?

లోక వ్యవహారానికి సంబంధించిన సామెత అది. చనువిస్తే చంకెక్కే వాళ్ళు, అతి చనువిస్తే అనాదరించి అవమానిస్తారు.

ప్రేమకు చనువే ప్రాణం. అతి అయే కొలదీ ఆత్మానందాన్ని ప్రసాదిస్తుందది !

" పెట్టి పుట్టినవాళ్ళు మీరు " అంటూ వెళ్ళిపోయింది శ్రీవల్లి !

" పెట్టి - పుట్టిన " అంటూ, ఆ రెండు మాటలకూ అర్థాలు తియ్యసాగావు నీవు !

అన్ని ప్రవచనాలూ, సామెతలూ పరమసత్యాలు కానక్కర లేదు. కొన్ని అసలు సత్యాలే కావు కూడా. దేశ కాల పాత్రలను బట్టీ, వృత్తులను అనుసరించీ,

రాగద్వేషాలను పురస్కరించుకొనీ ఉపుడుతూ, చస్తూ ఉండే వ్యావహారిక నుడికారాలవి.

పరమ సత్యం ఒక్కటే – అది ప్రకృతి పురుష శృంగార క్రీడా స్వరూపం. దాని సాహితీ నిర్వచనమే పెట్టి పుట్టడం !

పూర్వ జన్మలో దానధర్మాలు చేసుకొంటే, ఈ జన్మలో భాగ్యశాలిగా పుడతాడు. పూర్వజన్మలో పుచ్చుకోవడమే కాని ఇతర్లకి ఇవ్వడ మనేది లేనివాడు, ఈ జన్మలో దరిద్రుడుగా పుడతాడు.

అదేగా పెట్టి పుట్టడం ?

భవం అనే బేంకులో అతడికున్న ప్రారబ్ధం అనే అకౌంటును బట్టి ఉంటుంది అతడి జీవిత గమనం ! ఒకడు ఎంత కష్టపడినా తిండి గడవదు. ఇంట్లో కూర్చుంటే వచ్చి పడుతుం దొకడికి డబ్బు. ఎంత డబ్బున్నా సుఖం ఉండదొకడికి. దుర్మార్గుడి ఇంట లక్ష్మి తాండవిస్తుంది. పరమ సాధువుకు ముష్టి మెతుకులు కూడ దొరకవు. ఇదంతా వాళ్ళ వాళ్ల బేంకు అకౌంట్ల మహాత్మ్యమే !

కొందరు ఎప్పుడూ ఏదో వేసుకొంటూనే ఉంటారు బేంకుల్లో. ఆనంద మధురంగా సాగిపోతూ ఉంటై వాళ్ళ జీవితాలు.

పురాకృత సుకృతంలో కోటీశ్వరులం మనం !

పెట్టి పుట్టిన వాళ్ళం !

" పెట్టి – పుట్టడం " అంటూ, ఉచ్చారణ చమత్కృతి ద్వారా నీవు కల్పించిన అశ్లీల ధ్వని – ఎంతటి వేదాంత విద్యా రహస్యిని !

పెట్టడం, పుట్టడం అనే రెండు క్రియలకూ కర్త ఒక్కడే !

తనను తాను పుట్టించుకొంటున్న వాడు పరమాత్మ ఒక్కడేగా !

పారం లేని పరమ కామన అతడిది !

నాకు నన్నే కనిఇచ్చే తల్లివి నీవు !

నీవు జగన్మాత వైనప్పుడే నేను జగత్పితను కాగలగడం !

మహా సృష్టులు జరిగేది మనోరమణం వల్లనే !

దాని స్వరూప లవలేశమే జీవుల కామోప భోగ భాగధేయం !

అదే నీ ముద్దు !

ఒకో ముద్దు ఒకో ఆనంద పద్దు !

ఎలా కడిగి వెయ్యగలను వీటిని అనంత విలయం లోకి ?

శివ సరస్వతుల నిత్య వసంత వన రతులె
ఈ అనర్గళ జగత్ శ్రేయాలు, ప్రేయాలు !
క్షణమైన వారు విశ్రమించి నిల్చుచో
ఆనంద లోకాలె అఖిల విలయాలు !

## 84

ఏమిటా పుస్తకం ?

మార్కెట్లోకి వచ్చే ప్రతి తెలుగు పుస్తకమూ కొంటావు నీవు !

నిన్ను చూశైనా ఎందుకు నేర్చుకోదో, ఈ చదువుకొన్న తెలుగులోకం !

కొనడం, చదవడం, ముఖ్యమైన మౌలిక రచనల్ని బీరువాలో పెట్టుకోవడం, తక్కిన వాటిని ఏ లైబ్రరీకో ఇచ్చివేయడం... ఎంత ఆదర్శప్రాయం నీ విద్యా జీవితం !

నీవు చదివిం దంతా నీవై వికసిస్తున్న దందుకే !

శ్రమించి సాధించుకొన్నదే నిజమైన విద్య.

కొందరుంటారు – కొందరేమిటి, ఎక్కువ మంది వాళ్ళే – వాళ్ళు అసలు పుస్తకాలే చదవరు. జీవిత క్షేత్రంలో అహర్నిశలూ ఏదో ఎడతెగని పనే వాళ్ళకు ! వాళ్ళ వల్ల ఏ బాధా లేదు మనకు.

వచ్చే బాధెల్లా కొనకుండా చదవా లనుకొనే వాళ్ళ నుంచే !

ఎక్కడ దొరుకుతై పుస్తకాలు తేరగా !

స్నేహితుల దగ్గర !

ఔను ! అంతే !

స్నేహితుడన్న వాడి దగ్గర, పుస్తకమన్నది కనిపిస్తే చాలు – చటుక్కున అడిగేసి, చేతినుంచి లాక్కుపోతారు. అతడింకా చదవకముందే.

అంతే – పుస్తకం ఇక రాదు.

ఆ తీసుకు పోయినవాడు కూడ చదవడు దాన్ని. మరెవడో పట్టుకుపోతా డక్కడ నుంచి. ఆ అక్కడి నుంచి అలా, అలా చేతులు మారి, మారి – చినిగి,

తునిగి, మసై, నుసై, అనాధప్రేతమై పోతుందది చివరికి - ఏ పేవుమెంటు మీదో !

ఇంతకూ దాన్ని పూరా చదివినవాడు, అనుభవించినవాడు ఏ ఒక్కడూ ఉండడు !

కోరి కొనుక్కొన్న వాడైతేగా, మరి ?

పుస్తకం, వనిత, విత్తం – మొత్తం మానవ జీవితం ఈ మూడే !

ఎవరికైనా సరే అమూల్యమైనట్టివి , ఎవరినైనా సరే ఆకర్షించగలట్టివి, ఎవరైనా సరే అనుభవించ గలట్టివి ఈ మూడూ !

మానవుడు అబద్దాలాడతాడు, వంచన చేస్తాడు , దారులు కొడతాడు , పీకలు నులుముతాడు , యుద్ధాలు చేస్తాడు , నెత్తురు తాగుతాడు – వీటి కోసం !

అందుకే –

స్నేహితులు వస్తున్నారంటే – చేతిలో పుస్తకాన్ని బల్లకింద దాచేయడం , హాలులోని ఆడవాళ్ళను అవతలికి పొమ్మనడం , లెక్క పెట్టుకొంటున్న డబ్బును జేబులోకి తోసెయ్యడం !

మానవుడు భయపడేది కొత్తవాడికి కాదు, పాతవాడికి ! శత్రువుకు కాదు, స్నేహితుడికి !

స్నేహితుడి లాలూచీ లేకుండా – శత్రువన్న వాడెవడూ ఏమీ చేయ్యలేడు ఎవరణ్ణీ !

ఎప్పుడూ , ఎవర్నీ పూర్తిగా నమ్మవ ద్దన్నది చాణక్య నీతి.

నీవూ అదే అంటావు !

" ఎప్పుడో , ఎందుకో , ఎవరో మన దగ్గరకు వస్తూనే ఉంటారు. ఏవో ప్రయోజనాలు దగ్గరకు చేరుస్తై రకరకాల మనుష్యుల్ని . అవి తీరి పోగానే దూరమై పోతారు వాళ్ళు . అందుకే ఎవళ్ళనీ , ఏ విషయాన్నీ హృదయం దాకా లోనికి రానివ్వ గూడదు " అంటావు నీవు . అలా రానివ్వడమే హేతువంటావు సమస్త దుః ఖాలకూ !

నిజమే కావచ్చు .

జీవితం ఒక రైలు ప్రయాణం .

పరిచయాలు , సాన్నిహిత్యాలు , స్నేహాలు , సుఖ దుఃఖ భాగస్వామ్యాలు – అన్నీ వచ్చే స్టేషను వరకే !

అక్కడ దిగే వాళ్ళెవరో ! ఎక్కే వాళ్ళెవరో !

ఆ దిగేవాళ్ళు తమవి విడిచిపెట్టీ పోవచ్చు , మనవి పట్టుకొనీ పోవచ్చు .

క్షణానికో నడక నడిచే జీవస్రవంతిలో – ఎప్పుడు ఎవరు ఎందుకు ఎలా దగ్గరికి వస్తారో , ఎలా దూరమై పోతారో ఎవరికీ తెలీదు .

నేటి మిత్రుడు రేపు శత్రువు కావచ్చు . నేటి శత్రువు రేపు స్నేహితుడు కావచ్చు . చెప్పలేం .

" ఎలాంటి స్నేహితుడి కైనా సరే , హృదయం విప్పి చూపవద్దు . ఎలాంటి శత్రువు నైనా సరే , హృదయం గాయపరచవద్దు " అంటావు నీవు .

జౌను ! అంతే !

పుస్తకం, వనిత, విత్తం– ఈ త్రిలోకాలకూ అధిష్ఠాన దేవీ మూర్తివి నీవు !

అట్టి నీ సౌందర్య పరమైశ్వర్యంతో ఆనంద మధురమూ, రాగభాను ప్రకాశమూ అయిన నా హృదయాన్ని ఇంకెవరికి చూపుతాను !

మనకు శత్రువులే లేరు.

ఉన్న మిత్రులంతా మనలాంటి వాళ్ళే !

" స్నేహితు లున్నారు జాగ్రత్త " అన్న సీరి హెచ్చరిక మనకు కాదు, ఆమెకే ! మన్మధ సూరిని పెళ్ళాడబోతున్న దామె !

ఇంతకూ ఆ పుస్తకం ఏమిటి ?

## 85

" తలంటి పోసుకొని –

" రోజంతా తీరిక లేని పనిలో, ఆమాటే మరచిపోయి –

" సాయంకాలం బాల్కనీ మీదకు పోయి, కురుల్ని విప్పుకొన్నాను తీరిక గా !

" జటలా అల్లుకొన్న రేలచెట్ల పూలరాశుల ఆవలిత ట్టున, సంధ్యాకాంత బిగి కౌగిలిలో కందిపోతున్న సూరన్న – తలెత్తి తొంగి చూశాడు నాకేసి – ఆ

పూలరాశుల సందుల్లో నుంచి కొంటెగా !

" జ్ఞాపకం వచ్చారు మీ రప్పుడు ! "

" జ్ఞాపకం రావడమంటే – సిగ్గేస్తుంది ! "

" ఎర్రటి ఆ సూరన్న ముఖం ఎలా ఉన్నదని –

" ఒకొక్క మానసిక స్థితిలో, ఒకొక్క ప్రకృతి దృశ్యం చూచినప్పుడు, ఒకొక్క మధుర సంగతి విన్నప్పుడు, మన సన్నివేశాలే జ్ఞాపకం వస్తై నాకు !

" ఏదో ఒక గాఢవాసన తగిలేవరకు మనకు ముక్కొకటున్నట్టే గుర్తుండదు గా ? ఏదో ఒక అపూర్వ సౌందర్యం కంటపడే వరకూ కన్ను సంగతి గూడ జ్ఞప్తిలో ఉండదు.

" క్షణానికో నూతనానుభవాన్ని సృష్టించుకొనే అభిరతీ నిరంతరులం మనం– అనుక్షణమూ ఆడుతూనే ఉంటాం ఒకరిలో ఒకరం – సూర్య చంద్ర ప్రాణ నాడుల్లా – తెలియకుండానే !

" ఒకొక్కప్పుడు మాత్రం, అన్నిటినీ మరిపించి, అత్యంత మధురమైన సన్నివేశమేదో మిమ్ము తెచ్చేస్తూ ఉంటుంది – వాస్తవంగా నా ముందుకు – సుషమ్నా పరమ శ్రీ వలె !

" ఆరబోసుకొన్న కురులు ఆకాశం నిండా కమ్ముకొని, సాయంకాలపు చల్లగాలితో చిరుమబ్బుల్లా ఆడుకొంటూ ఉండగా –

" అంత పెందలకడే చీకటి పడిందేమిటా – అనుకొన్నదట – ప్రక్క ఇంటి క్రింది భాగంలోకి క్రొత్తగా అద్దెకు వచ్చిన ఇల్లాలు !

" వీధి లోకి వచ్చి, పైకి చూచిందట అప్పుడు ! "

" సంధ్యాకాంత ఒడిలో సూరన్న – నా ఒడిలో మీరు – పైకొన్న ఈ భావనలో మైమరచి ఉన్నాను నేనప్పుడు !

" రాగవాసిష్ఠం లోని సంధ్యవు నీవేనా – ప్రశ్నించిం దామె ఎవర్నో !

" క్రిందికి చూశాను నేను. నాకేసే చూస్తున్నదామె కళ్ళప్పగించి !

" నిన్నేనే అడుగుతూంట– అన్నదామె – అలానే చూస్తూ !

" నన్నేనా ! ఏమో , నాకేం తెలుసు ?

" నేను కాదు, ఆ ప్రక్క వాటాలో కనుక్కోండి – అన్నాను నేను !

" పకాలున నవ్విం దామె !

" బహుశా, నీవే అయి ఉంటావు – అన్న దామె !

" ఆ విధంగా నవ్వులపాలై, ఇదేదో నాటకంగా ఉన్నదనుకొని, పుస్తకం కొనేసి, చదివేశాను పూర్తిగా !

" మీ రాగ సంధ్యను నేనేనా !

" నేను పుట్టక ముందే మీకు నే నెలా దొరికాను ?

" నన్ను సంధ్యగా పోల్చుకొన్న ఆ అమ్మాయి రాజరత్నం ఎంతటి సాహితీ కళా హృదయ ! "

## 86

కను లర మోడ్చి నీవు తమ
కమ్మన ఈశ్వరు గొల్చు వేళ, నే
నును భవ దంతరంగమున
నుండుచు హైమవతీ ధవున్ భజిం
తును ; భవు పాద పంకజ మ
ధూళిని నిండుగ గ్రోలి రమ్ము ! అ
క్కున నినుగొన్న వేళ రుచి
గొందును నీ పెదవిన్ తదర్థముల్ !

అనుకోకుండా అడిగిన వరం ఇది నిన్ను – ఆ సాయంకాలం !

అంజనేయుని కొండపై స్వామికి టెంకాయ కొట్టి – శివగిరి శిఖరంపై నందీశ్వరుని తోక దగ్గర కూర్చున్నాం మనం ఎప్పటిలాగే !

ఆ ఎత్తు నుంచి చూస్తే – భాగ్యనగరం యావత్తూ దీపాల పూల తోటలా కనిపిస్తున్నది చుట్టూ !

ఒక పూర్ణ పురుషుని హృదయాన్ని తనదిగా చేసుకొని, అతడే తానై భాసించి, తన పేర మహారాజ్య రాజధానినే నిర్మింపజేసుకొన్న భాగ్యమతీ దేవి ఎంత ధన్యురాలు !

సీత కంటె, రాధ కంటె, అనార్కలి కంటె, నూర్జహాను కంటె - మరెందరో చక్రవర్తుల పట్టపు రాణుల కంటె - పురుష ప్రేమను చివరి బొట్టు వరకు క్రోల గల్గిన అమృత మనస్క, ఆనంద దేవత, పరమ ప్రణయిని భాగ్యమతి !

భాగ్యమతి హైదరీబేగం అయి, భాగ్యనగరం హైదరాబాదు అయింది !

మతాలు ఎన్నైనా, మానవత ఒక్కటే !

భాగ్యమతి వలెనే అందాల రాశి భాగ్యనగరం !

నిరూపించి చూపుతున్నావు నీవు - అదిగో నౌబత్ పహాడా గోపురోద్యానం.

అదిగో ఫలక్‌నుమా రాజభవనం, అవిగో చార్‌మీనార్ శిఖరాలు - అంటూ !

ఈ దీపరాశికి పట్టిన దర్పణంలా ఉంది నభోరాశి !

ఏమీ చూడ్డం లేదు నేను - నిన్ను తప్ప !

చేతులెత్తి స్వామికి నీవు నమస్కరించినప్పటి నీ ఉజ్జ్వల రూపాన్నే చూస్తున్నాను నేను అప్పటి నుంచీ !

నీ హృదయం స్వామి పట్ల భక్తితో నిండిపోగా, నా హృదయం నీపట్ల ప్రపత్తితో నిండిపోయింది !

ఆకాశం ఎత్తున పెరిగాం మనం అంజనేయుని జవసత్త్వాలతో !

నేనే అంజనేయుణ్ణి !

మనిద్దరం ఒకరి కొకరం భక్తులం ! ఈ తారలు నీ కురుల లోని సన్నజాజి మొగ్గలు !

భూర్భువ స్సువరోష్లకాలు మూడూ అపాదమస్తకం మనమే !

ఈ విశ్వమే మన రథం !

నిశీధ జీవ ప్రపంచాన్ని ప్రత్యూషం వైపు నడిపించుక పోతున్న సరస్వతివి నీవు ! నిన్ననుసరించి వస్తున్న బ్రహ్మను నేను !

గుడిలోనూ, గుడిచుట్టూ - నీవే !

నీ వెనుక నేను !

నీవు తప్ప, నాకేం కనిపిస్తుందిక ?

ఏం ఉంది బైట –నీలో లేనిది, నీవు కానిది ?

నీ కంటె చూడదగిం దేముందీ నగరంలో, ఈ లోకంలో ?

నీటిలో చేపల్లా మెరిసినై నీ కళ్ళు !

ఎక్కడి నుంచో రైలు కూత !

రేపే నీ ప్రయాణం శ్రీ శైలానికి !

" ఏం తేను శ్రీశైలం నుంచి ? "

నీ ప్రశ్న, నా కోరిక, నీ అరమోడ్పు కన్నులు, వాటిపై నా పెదవులు – ఆ అందం జన్మ జన్మాల సుకృత ఫల రసానంద కందం కదా !

**అరమోడ్పు కనులలో అరుణార్క రశ్మిలో**

**రగిలి నీ పెదవులే రక్త పుష్పము లయ్యె !**

**తొలి వసంతపు సుధా కలశ కన్యక లివ్వి**

**నవరసము లూరనీ – నా పండ్ల తోటలో !**

# 87

రైల్లో వున్నావు నీవు. ఆ రైలు నా గుండెల్లోనే పరిగెడుతోంది – వెళ్ళొస్తా, మళ్ళొస్తా–వెళ్ళొస్తా–మళ్ళొస్తా – అంటూ !

ఇప్పుడు నా గుండెల్లో ఉంట నీవు ఒక్కతెవే కాదు. నీతో పాటు రైలు, దానిలోని జనం, వాళ్ళ సమస్త సంసార సాగరాలూ, వాటిని తరింపజేసే శ్రీశైల క్షేత్రం కూడ నా గుండెల్లోనే ఉన్నై ఇప్పుడు !

కొందరు ఎదుట ఉండీ, లేనట్టే. కొందరు ఎదుట లేక పోయినా, ఉన్నట్టే ! ఎవరో వస్తారు. ఏదో అడుగుతారు. ఏమో చెపుతారు. వెళ్ళిపోతారు.

కొంత మందితో కలిసి తిరుగుతాం. ఎన్నో వ్యవహారాలు చక్కబెడతాం కూడ. హోటళ్ళలో, రైళ్ళలో, సినిమాలలో, ఉద్యానాలలో, క్షేత్రాలలో, బీచిలో, బజారులో – ఎంతో మంది జనం మన చుట్టూ !

వాళ్ళంతా, అంతసేపూ, అన్ని వ్యవహారాలలోనూ ఎదుట ఉన్నా – లేనట్టే మనకు !

పైగా – మనస్సులోని ఎవరో ఒకరు అంతసేపూ, అన్ని వ్యవహారాలలోనూ మనతోనే ఉంటారు – ఆనందాన్నో, విషాదాన్నో పంచుకొంటూ !

భౌతిక జనం ఎదుట ఉన్నా – లేనట్టే ! మానసిక జనం ఎదుట లేకపోయినా –ఉన్నట్టే !

మరి –

మానసిక, హార్దిక, ఆత్మిక లోకా లన్నిటినీ ఆక్రమించుకో గల ప్రియురాలే ఉన్నప్పుడు – ఇక బాహ్యప్రపంచం ఎక్కడిది ?

ప్రియురాలుగా పుట్టగల అదృష్టం, ప్రియురాల్ని పొందగల అదృష్టం లోకంలో ఎంతమంది కుంటుంది ?

" ఈ నాటకంలో మీరంతా గెస్టు ఆర్టిస్టులు " అన్నావు కదూ మొన్న భూభారంతో ? ఒక్క మాటలో ఎంత చక్కగా కళ్ళకు కట్టించావు అతడి మొత్తం వ్యక్తిత్వాన్ని !

కొంత మంది బ్రతుకే అలాంటిది. ఎదటా ఉండరు. మనస్సులోనూ ఉండరు వాళ్ళు. సొంతం అనుకొనే దేమీ ఉండదు వాళ్ళకు. ఈ జగన్నాటకం లోకే గెస్టు ఆర్టిస్టులుగా వస్తారు, ఎవరికో అతిథులుగా ఉంటారు, ఎవరి పనో చేసి పెట్టి పోతారు – నిశ్చింతగానో, ఏడుస్తూనో !

రోడ్డు మధ్య ఆగిపోయిన కారును కాస్త ముందుకు నెట్టడానికి తలొక చెయ్యి వేసే యాదృచ్ఛిక పథికులు వాళ్ళు.

ఇందులో జడభరతుడి లాంటి నిస్సంగులూ ఉంటారు. దేవేంద్ర లాంటి బేఫికర్లూ ఉంటారు. భూభారం వంటి సినిక్కులూ ఉంటారు.

అయితే -

జీవితాన్ని, ప్రపంచాన్ని కూడ ద్వేషిస్తూ - ఏ సుఖమూ, ఏ సౌందర్యమూ లేకుండా - చస్తాం, చస్తాం అంటూనే - ఏళ్ళ కొలదీ ఏడుస్తూ బ్రతికే సినిక్కులే అర్థం కారు నాకు !

సమాజ వాతావరణం కలుషితం కావడానికి కారణం ఇలాంటి నిరాశావాదుల నిర్వేద నిశ్వాసాలే ఏమో !

తినడం, తాగడం, జెల్సా చెయ్యడం, షిగ్ర వీగడం, పోటీలు పడడం, పోరాటాలకు దిగడం, తమవంటి జీవుల్ని పుట్టించడం, చంపడం వంటి సాధారణ కార్యక్రమాన్ని నిర్వహించే జనమే అధికం ఈ జగన్నాటక రంగస్థలం నిండా !

అసలు ఈ జగత్తే ఒక రైలు.

అందులో ప్రాణబీజమై నీవు ఉన్నందు వల్లనే - అది నా గుండెల్లో పరిగెడుతోంది అనాహతంగా.

నా ఎదుట - ఉన్నట్టున్నా, లేని జగం !

నా లోన - లేనట్టున్నా, ఉన్న నీవు !

నేను తినేది, తాగేది - వినేది, కనేది - ఆశించేది, ఆలోచించేది - అనుభవించేది, ఆనందించేది - అంతా నీకోసమే. నాలోన, నా బైట కూడ ఉన్న నీకోసమే.

నీ ఆయుస్సు, నీ ఆరోగ్యం, నీ ఐశ్వర్యం, నీ సుఖం, నీ సంతోషం, నీ విజయం, నీ యౌవనం, నీ ప్రేమ, నీ ఆనందం - నీ జీవితాభ్యుదయ సర్వస్వం లోని ప్రతి కిరణమూ - నా నిత్యోపాసిత సరస్వతీ మహా మంత్రం లోని ప్రత్యక్షరం నుంచీ సముద్భూతం కావాలనేదే నా కోర్కె

నీవు పుట్టి ఉండకపోతే -

నా బ్రతుకే వ్యర్థమై పోయేది !

నా ఉనికే సంశయాస్పద మయేది !

**నీవు వికసించి నను వరించితివి కనుక**

**శివుడనై నేను, నిత్య మాధవుడ నైతి !**

# 88

సుఖదుఃఖాల అహోరాత్రులు లేవు నాకు నీ ప్రణయంలో.

సుఖదుఃఖాలు మనఃప్రవృత్తికి కుడి ఎడమలు.

కలిసే సాగుతై అవి రెండూ - జీవిత యాత్రలో సపరివారంగా.

ముందుకు సాగడమే జీవలక్షణ మైనప్పుడు -

వేసిన అడుగు సుఖం

తీసిన అడుగు దుఃఖం !

దుఃఖం నుంచి విముక్తి సుఖం, సుఖం నుంచి విముక్తి దుఃఖం.

ఒకదాని నుంచి ఒకటి విముక్తి పొందుతూ పోవడమే జీవిత పురోగమనం.

వేసిన అడుగు తీస్తూ, తీసిన అడుగు వేస్తూ పోతున్నది సర్వ సృష్టి !

సుఖదుఃఖాల ఈ నిరంతర సంఘర్షణమే - సృష్టి స్థితి లయాత్మకమైన ప్రకృతి ఇతివృత్తం.

ఒకే పరమ పదార్థపు రెండు పాదాలివి. ఇందులో ఏది కదిలినా రెండోది కూడ కదలవలసిందే. ఒకదాని నుంచి ఒకదానిని విముక్తి లేదెప్పుడూ. ఉంటే - అది అవి రెండూ అగినప్పుడే ! అప్పుడే సుఖదుఃఖాలు రెండూ ఒకేసారి విశ్రాంతి పొందడం ! అదే మోక్షం జీవుడికి.

మోక్షం పరమ సుస్థిర స్థితేనా ?

కాదు నా దృష్టిలో !

వర్షకణం పరమ సాగర సంగమాన్ని సాధించినా, తిరిగి ఆవిరి కాక తప్పదు కద ?

మోక్షం సాగరగతస్థితి ! సుఖదుఃఖ తీరద్వయం లేని దది.

నదీ సాగర సంగమం మోక్షం.

రెండు నదుల పరస్పర సంగమం ప్రణయం.

మోక్షం బ్రహ్మానందం

ప్రణయం బ్రహ్మానంద లవం.

ప్రణయం నిత్యచైతన్య ప్రవాహిని ! నవనవోన్మేష శాలిని ! ఇతోధిక సౌందర్య వికాసిని !

ఒకసారి సాగరంలో కలిస్తే - ఆ తర్వాత మరేం లేదు, తిరిగి ఆవిరి కావడం తప్ప !

అందుకే, మోక్షం కోరను నేను.

నేను కోరేది- మనిద్దరం కలిసి, పెనవేసుకొని వెల్లివిరుస్తూ, నిత్య నూతన నిరంతరంగా ప్రవహించడం !

అప్పుడు, సుఖదుఃఖాలనే శాశ్వతంగా కోరుకోవడ మవుతుందేమో !

సుఖ దుఃఖాలు మానసిక వికారాలు ! అవి ఎవరివి వారివేగా ఉండిపోయినై ఇతర్ల సుఖదుఃఖాలను పంచుకోవడం అంటే, వాళ్ళ పట్ల సహానుభూతిని ప్రకటించడం మాత్రమేగా ?

అందుకే -

మనస్సుకు ప్రాధాన్యం ఇవ్వలేదు నేను ఎన్నడూ !

సుఖం లేకపోవచ్చు.

దుఃఖాలు ముసురుకోవచ్చు.

చూచేవాళ్ళు, పలకరించేవాళ్ళు, సాయం చేసేవాళ్ళు, ఆదరించి అక్కున చేర్చుకొనేవాళ్ళు ఎవరూ లేక - చచ్చేటంత అనారోగ్యంతో, దిగులుతో - ఈ రసాలినీ లతాకుటీరంలో, ఏకాకిగా పడి ఉంటే ఉండవచ్చు.

చలించను నేను !

నేను ఆత్మను. నీతో కలిసి పరమాత్మను నేను. మనస్సు నా బంటు మాత్రం !

ఏ తుపానులైనా రెచ్చగొట్ట గలిగేది మీది అలలనే. ఏ తదంతఃపుర రత్నరాశిని కాదు !

ఆ రత్నరాశే నేను కద ?

సుఖదుఃఖాలు సమగతిలో నడిస్తే -అది ప్రగతి !

అందులో ఏ కాలు కుంటినా, అది వక్రగతే !

కోటీశ్వరుని జీవితగతీ వక్రమే, నిరుపేద బ్రతుకూ వక్రమే అందులో ఏ కాలు కుంటినా అది వక్రగతే ! చరిత్ర దృష్టి లో !

ధృతరాష్ట్రుడు సుఖభోగే. అయినా, మహాదుఃఖి !

సీత మహా దుఃఖిత. అయినా, మహా ఆనంద !

సుఖదుఃఖాలు మనస్సు వరకే. దాని పరిధిని దాటి బ్రతికే వాళ్ళకు నిత్యం ఆనంద కైవల్యమే !

నీ సంయోగం సుఖం, నీ వియోగం దుఃఖం. అయినా -సుఖదుఃఖాతీతుణ్ణెలా అయాను నేను ?

బ్రహ్మానంద లవ రసానంద సరస్వతివైన నీవు -

అపరోక్ష రాగవైశాఖివై నాలో, నాతో ఉండిపోవడం వల్ల !

## 89

నీవు నా దగ్గర లేకపోతే - నా మీద నాకే ఎంతో జాలి !

లోకమంతా కూడ నా మీద జాలి పడుతున్నంత దిగులుగా ఉంటుంది నాకు నీ వియోగంలో.

రేపు శివరాత్రి.

మీ దొడ్డమ్మతో నీవు శ్రీశైలంలో ఉన్నావు. ఏకాకిగా తిరుగుతున్నాను నేను ఈ పౌరోద్యానంలో - వృక్షలతాదులు, శుకభ్రమరాదులు చూపుతున్న అనంతమైన జాలి క్రింద క్రుంగిపోతూ !

జాలి !

జాలి అనగానే నాకు వాల్మీకి జ్ఞప్తికి వసాడు.

ఒక పక్షి మీద జాలిచే, ఒక మనిషినే చంపినవాడు వాల్మీకి !

ఆ పక్షి విలాపాన్ని మించి, విలపించి ఉంటుంది ఆ మనిషి యొక్క జంట !

గమనించిన వాళ్ళే లేరు నేటికీ !

ఒక ప్రాణిపై జాలి మరో ప్రాణిని చంపవచ్చునా ?

నిగ్రహానుగ్రహ సమర్థమైన వాక్కు వాల్మీకిది. పక్షి విలవిల తన్నుకోవడం చూచి, భరించలేక, అనాలోచితంగా అత డేదో అని ఉండవచ్చు. అది బాణంలా ఆ కిరాతకుడికి తగిలి ఉండవచ్చు. వాల్మీకి పశ్చాత్తాప పడవలసిన చర్య ఇది ! జాలికి నిదర్శన మెలా అయింది ?

అదలా ఉంచి -

వాల్మీకి ఆ వాక్కు లయబద్ధంగా వచ్చి ఉండవచ్చు. దానిని స్ఫూర్తిగా తీసుకొని, అదే మాదిరి వాక్కులలో అతడు రామాయణం వ్రాసి ఉండవచ్చు. అది అంతవరకే.

కాని -

శోకమే శ్లోక మయిందనీ, ఆ తొలి శ్లోకం లోనే రామాయణ కథ అంతా వ్యంజిత మయిందనీ పండితు లనడం ఎలా ఉచితం ?

శోకం ఎందుకు ? ఎవరిని గురించి ?

వేట కిరాతుని కులవృత్తి కాదా ?

తన కులవృత్తిని అనుసరించి పక్షిని కొట్టా డతడు. ఆ పక్షి ఏ పరిస్థితిలో ఉన్నదన్న ప్రశ్నే లే దక్కడ. అతడు వేటకు బైలుదేరాడు. పక్షులు కనపడినై. కొట్టాడు. అంతే.

మృగాన్ని చాటు నుంచి కొట్టవచ్చు నని వాలికి రామునిచే చెప్పించిన వాల్మీకి -కిరాతుడు పిట్టను కొట్టవచ్చు నన్న ధర్మాన్ని ఎందుకు ఎరగడు ?

ఒక పక్షి విలాపం కంటె ఒక మనిషి విలాపం గొప్పది కాదా ? ముని శాపానికి గురై నశించిన సంసారాన్ని తలచుకొని ఆ కిరాతుని జంట ఎంతగా తన్నుకొని విలపించిందో !

వాల్మీకి శోకిస్తే, నిజంగా శోకించ వలసింది ఇందుకు !

ఆ శ్లోకంలో రామాయణం ఏదీ ? ఆడపక్షి సీత, మగపక్షి రాముడూ అయితే -కిరాతుడు రావణు డెలా అవుతాడు ?

కిరాతుణ్ణి చంపుత మగపక్షి కాడుగా ?

ఏదో జరిగితే, దాని కేవో అర్థాలు కల్పిస్తారు పండితులు.

పక్షులు, కిరాతుడు, వాల్మీకి, శ్లోకం - ఇవన్నీ కేవలం కాకతాళీయాలు. ఒకదాని కొకటి సంబంధం లేనివి ! వాల్మీకి రామాయణ రచన మానవ మనో వికాస పరిణామంలో ఒక విప్లవలీలా విశేషం మాత్రమే !

అందుకే -

జాలికి పెద్ద ప్రాధాన్యం లేదు నా దృష్టిలో.

ఒకరిపై జాలిపడడం, మరొకరిపై కత్తి దుయ్యడమే.

దౌర్బల్యం ఎక్కడున్నదో, అక్కడ బాధ ఉన్నది. బాధ ఎక్కడ ఉన్నదో అక్కడ జాలి ఉన్నది. జాలిదౌర్బల్య సూచకం.

కనుక -

ఎవరి పట్లా జాలి చూపవద్దు.

నీ పట్ల ఎవరైనా జాలిచూపితే, సహించవద్దు.

జాలి పడబడడం కంటె మరొక దైన్యస్థితి లేదు మనిషికి !

విధి నిషేధాల పరిమితుల మధ్య, ఒక క్రమానికి కట్టుపడి, సాగిపోతున్న ప్రకృతి ఇతివృత్తంలో - ఎప్పుడు ఏది ఎందుకు జరుగుతుందో తెలియదు. తెలిసినా, తెలియక పోయినా ఫలితం ఒక్కటే !

తెలియకుండానే శివరాత్రి పూజాఫలాన్ని పొందిన ఒక బోయ కథ నీకు తెలిసిందే కదా !

కర్తవ్య నిర్వహణం ఒక్కటే మానవ ధర్మం.

లోకంలో మనం చూపవలసింది వివేకం. జాలి కాదు.

అయినా -

ఈ నా ఒంటరితనంపై నాకే ఎంత జాలి !

*అజరామ రమ్మైన ఆనంద కామనలొ*
*కరుణమే తొలివలపు కెరటాలు రేపినది !*
*వాలుగన్నులు తెరచి జాలిగా చూచినది !*
*చూపె తూపై శాంతి దీపమే ఆరినది !*

## 90

స్నేహితుడే శివుడు నాకు.

స్నేహితుణ్ణి తృప్తి పరిస్తే, శివుణ్ణి తృప్తి పరచినట్టే.

సమస్త ప్రపంచాన్నీ స్నేహంగా చూడగలగడమే శివపూజా పరాయణత.

డాక్టరు ఖాను విందుకు పిలిచాడు నన్ను, కొడుకు పెళ్ళిచేసుకొంటూ- శివరాత్రినాడు !

వెళ్ళడం ఎలా ?

మానడం ఎలా ?

వెళ్ళడమే సబబనిపించిందిద. వెళ్ళాను.

రకరకాల మిత్రులతో, విందులతో, వినోదాలతో బ్రహ్మాండంగా ఉంది కాలక్షేపం !

ఎంతో సంతోషించాడు ఖాను !

అయితే –

నా మనోవాక్శరీరాలు ఇక్కడ మేల్కొని ఉంటే – నా చిత్తం శ్రీశైలంలో మేల్కొని ఉంది ! త్రిశుద్ధిగా ఇక్కడ నేను విందు ఆరగిస్తూ ఉంటే – నా ఆత్మ మాత్రం చిత్తశుద్ధితో అక్కడ నిన్ను కలిసి ఉపవసిస్తూ ఉంది !

నేను ఊహించినట్టే నీవు –

పసుపు నీళ్ళలో స్నానం చేసి, పట్టుచీర కట్టుకొన్నావు నిండుగా !

జాజిపూలు పెట్టు కున్నావు పండువుగా !

జాబిల్లిని తురుముకొన్నావు చెండుగా !

జారు ముడి వైచుకొన్న కేశయూథం నుంచి, ఒక్కొక్క పువ్వే జారిపోతూ, అర్చిస్తోంది నీ పసుపు పారాణి అడుగుదామరల జాడలలో స్వయంభూత మవుతున్న భూలక్ష్మిని ! ఆ పూజలే ఆనవాలుగా నీ వెంట తిరుగుతూ, ఆ పువ్వుల స్థానే కొత్త మొగ్గలు తురుముతున్నాను నేను !

పాతాళ గంగ నుంచి నీవు పైకెక్కి వస్తూ ఉంటే – గంగామతల్లే భువనేశ్వరి అయి శివార్చనకు బైలు దేరిందన్నా రందరూ.

ప్రతి మెట్టూ ఒక మిన్నేరే ఐ మెరిసింది నీ పాదస్పర్శలో !

చుట్టు ప్రక్కల అడవుల్లోని సమస్తబిల్వ లై వృక్షాలు నతమస్తకా నై నీసి !

చుక్కలు బిలబిల వచ్చి వాలినై తుమ్మి పూల వర్ష అన్నట్టు నీ ముందు !

గంగను శిరసా వహించిన శివానీ వలె ఉన్నావు నీవు – తల నిండా ఆ తెల్లని పూల చిరుతావుల కెరటాలతో !

శివుని అర్చించే నిన్ను సమస్త విశ్వమూ అర్చించడంలో వింత ఏముంది కనుక ?

సానువులలోని రత్న కణాలపై ప్రతిఫలిస్తూ, తారా ప్రదీపాల నడుమ మెరిసిపోతూ, మల్లికార్జున స్వామిని అర్చిస్తున్న నీవు - నెల కొక సారి అమావాస్య కావడానికి కారణం ఇప్పుడు తెలిసిం దనిపిస్తున్నావు భక్తుల చేత !

పక్షం దినాలుగా చంద్రుడు ఊర్ధ్వ కళా పూర్ణు డవుతూ అవుతూ, పూర్తిగా ఒక రోజంతా త్రిపురసుందరీ పూర్ణదేవీ రూపంలో, శ్రీశైలంలో మహాదేవుని సన్నిధిలో గడుపుతాడనీ -

అప్పుడు ప్రపంచానికి అమావస్యగా, మహాదేవుని సన్నిధి పూర్ణ పూర్ణిమగా ప్రభాసిస్తుందనీ -

తరవాతి పక్షం రోజులూ పారవశ్యం నుంచి దిగిపోతూ, తాను పరిపూర్ణంగా గ్రోలిన ఆ పరమేశ్వరుని కరుణామృతాన్ని పూర్ణ చంద్రుడై ప్రపంచానికి పంచిపెడతాడనీ -

భక్తులు చెప్పుకోవడం విన్నాను నేను !

ఆ పూర్ణ చంద్రశ్రీవే - నీవు !

శివ సాన్నిధ్యంలో నీవు - ఎంతటి మహనీయ దివ్య దర్శనం అది !

ఆ మహాక్షేత్రంలో, అంతటి మహావైభవం మధ్య, శ్రీశైల రాజకన్యలా నీవు అలా వెలిగిపోతూ ఉంటే - నీ నీడలో మేడ కట్టుకొని, ఆ మేడ కడగదిలో నిన్నే ఆరాధించుకొంటూ ఉండిపోయాను నేను రాత్రంతా !

నీ నీడతో పాటు నీలో చేరిపోయాను నేను ప్రత్యూషంలో !

జగజ్జేగీయమానమైన, జగజ్జీవన లీలా ప్రవర్తకమైన సంధ్యా తాండవాన్ని చూస్తూ కూర్చుండి పోయాను నేను హృదయ కమలంలో !

కాంచన రత్న రాజీవ దివ్యాసనం పై శ్రీ గౌరి నుంచి -

సరస్వతి వీణ, బ్రహ్మ తాళం, విష్ణువు మృదంగం, ఇంద్రుడు వేణువు పట్టి సంగీతం సమకూర్చగా -

శ్రీ లక్ష్మి గొంతెత్తి భువన మోహనంగా పాడుతుండగా -

సప్త సముద్రాలూ, సమస్త లోకాలూ, ఆపాదమస్తకం హర్ష పులకితాలై అనునాట్యం చేస్తుండగా -

ఆనంద తాండవం చేస్తున్నాడు నటరాజు !

ఓహో ! ఉజ్జ్వల రస దర్శనం !

గౌరీ పూజ చేస్తున్నాడు శివుడు – సృష్టి స్థితి లయీ మోహనమైన అకాండ తాండవ విశ్వలీలా మహా కళతో !

వందనం చేస్తున్నాడు శివుడు – గాయత్రిగా కూర్చున్న గౌరికి, సంధ్యా సహితుడై !

అరమోడ్పు కన్నులతో, కేలుమోడ్పు శిరస్సున ధరించి, భక్తి పారవశ్యంలో మునిగి ఉన్న నీకు – అందిస్తున్నారు గౌరీ శంకరులు ఆశీస్సుల అమృత కలశాన్ని !

అందుకొని ఆస్వాదిస్తున్నావు నీవు !

తడిసి పోతున్నాను నేను !

నిండి పోయింది నీ హృదయం !

మునిగి పోయాను నేను !

ఓం నమశ్శివాయ !

*నమశ్శివాయ సాంబాయ*
*నటరాజాయ నమో నమః !*
*నమశ్శివాయ సూర్యాయ*
*గంగాధరాయ నమో నమః !*
*నమశ్శివాయ సోమాయ*
*మహాబీజాయ నమో నమః*
*నమశ్శివాయ భీమాయ*
*మృత్యుంజయాయ నమో నమః !*

## 91

"మైథునేన మహాయోగీ మమతుల్యో న సంశయః " అంటున్నాడు మహా శివుడు ! మైథునం వల్ల మహాయోగి తనంతటి వాడవుతాడట ! సంశయం ఏ మాత్రమూ లేదట !

మహాశివుడి కేం? పురుషోత్తముడు !

ఏ పురుషుడైనా పూర్ణ పురుష దశ వరకు మానవుడు. ఆ పైని పురుషోత్తముడు. అతడే భగవంతుడు.

భగవతి కలవాడు భగవంతుడు !

భగవతి నానారూప పూర్ణ ప్రకృతి !

సమస్త సౌందర్యాలూ ఆమెవే.

సమస్ర నామ మాత్రే కాదామె. ప్రపంచంలోని ప్రతి స్త్రీ నామమూ ఆమె పేరే !

అట్టి శ్రీ శక్తి, త్రిపురసుందరి, మహామాయ, మతంగిని – బైట, ప్రక్కన, లోన, చుట్టూ – క్షణాని కో రూపంలో భాసిస్తూ, తాదాత్మ్యంతో రమిస్తూ ఉన్న పరమశివుడు –అలా అనక, మరే మంటాడు ?

మైథునం తప్ప వేరే పనేమున్న దతడికి ?

ఒక్క క్షణం అది లేకపోతే – సర్వసృష్టీ, బ్రహ్మ విష్ణు మహేశ్వరులతో సహా, సర్వశూన్యమై పోదా ?

మైథునం అతడి గుణం, శీలం, రూపం.

అది అతడి విధి, కర్తవ్యం, ధర్మం.

అతడితో సమానం కావాలనుకొనే వా డెవడైనా ఉంటే – అట్టి వాడు నిత్య మైథున క్రియా ధర్మి కావలసిందే కదా ?

ఇందులో రహస్యం ఏముంది ?

సత్యాన్ని ఇంత అసందిగ్ధంగా చెప్పగలడు కనుకనే, మహాయోగులకే పరమ గురువు కాగలిగా డతడు !

మైథునం అంతటి మహా యజ్ఞం కనుకనే, దక్ష యజ్ఞంలో తనువు వీడి సతీదేవి కోసం అంత అల్లరి చేశాడతడు ! దిగంబరుడై, ఉన్మత్తుడై, అతడు ముని పల్లె లో తిరిగినప్పుడే కదా – మునికాంతల కామశక్తీ, మహామునుల నిగ్రహశక్తీ, అరుంధతి శీలశక్తీ లోకానికి వెల్లడి అవుత ? అమృతలింగం మనకు లభిస్త ?

కనిపించని ఆత్మాదుల కంటె, కనిపించే శరీరమే ఎంత ముఖ్యమో శివుని సతీవియోగ ఘట్టమే చెపుతున్నది వేనోళ్ళ !

శివు డంతటి వాడే ఉండలేడు శివ లేకుండా !

మహా కామిని శివ !

కామకళ, శృంగారకళ, జీవకళ ఆమె !

అత డెలా కోరితే అలా - ఆ రూపంలో, ఆ వైఖరిలో, ఆ పేరుతో అతణ్ణి రంజించే సౌందర్య లహరి ఆమె !

మందారం - మకరందం !

మేఘమాల - మెరుపుతీగ

కొండకొలను -సంజ కెంజాయ

కోకిల - గున్నమామిడి

చీకటి రేయి - వెన్నెల వాగు

మధుర ఝరి - మహా సముద్రం

" ఎందు కీ జాబితా ? ఆమె కానిదేదో చెప్పరాదా" అంటావు ?

అవును. నీకు జాబితా లంటే కిట్టవు.

ప్రపంచమే తానైన దేవి, ఏమి కాజాలదు ?

అలాంటి మహా మైథున పరమేశ్వరుడు - తనతో సమానులు కావాలనుకొనే వాళ్ళకు మైథునాన్ని ఒక అర్హతగా నిర్ణయించాడంటే - అందులో వింత ఏముంది ?

నవ్వుతున్నావు కదూ నీవు ?

నన్ను బాగా వాగనిచ్చి, చివరకు నేను చెప్పినదంతా తప్పనడం నీకు అలవాటై పోయింది !

" మరి - మహాయోగులు మైథునం చేసినట్టు లేదే ఎక్కడా " అంటావు కదూ !

ఎవరేమి చేశారో ఎవరు చూశారు ?

పైకి ముక్కు మూసుకు కూర్చుంటారు. లోపల అన్నీ చేస్తూనే ఉంటారు. పెద్ద మనుషులుగా చెలామణీ అయ్యే వాళ్ళంతా పరమ రహస్యాలు కలవాళ్ళే !

మేనకా విశ్వమిత్రం, అంబికా వేదవ్యాసం వంటి ఉదంతాలు లెక్కకు మించి లేవా మన పురాణాల నిండా ?

" అవన్నీ ప్రయోజనాత్మక సంయోగాలు. ఆనందాత్మక మైథునాలు కావు.

ఆత్మ తాదాత్మ్యం లేదు వాటిలో. బ్రహ్మానంద సబ్రహ్మచారులు కారు ఆ జంటలు "
అంటావు నీవు మళ్ళీ !

అవును. అదీ నిజమే.

అయితే - విను !

ఊర్వశి నీకు తెలుసుగా ?

సీరి కాదు. అసలు ఊర్వశి ?

నారాయణ మహర్షి తొడ లోని ఒక వెంట్రుక ముక్క ఆమె !

నర నారాయణుల తపస్సును భగ్నం చెయ్యడానికి ఇంద్రుడు రంభాదులను పంపగా - నారాయణ మహర్షి నవ్వి, తన తొడ లోని ఒక వెంట్రుకను పెరికి, వాళ్ళ ముందుకు విసరగా - అది వాళ్ళందరినీ మించిన సౌందర్యవతై వెలిసింది !

అదే ఊర్వశి ! ఊరుజ !

ఒక పరమయోగి వెంట్రుక !

అతడు తన ఒకొక్క వెంట్రుకతో ఒకొక్క భువన సుందరిని సృష్టించి ఉంటే - ఏమయేవి లోకాలు ?

అంతటి శక్తివంతులు మహర్షులూ, మహాయోగులూ.

వాళ్ళకు సామన్య స్త్రీ లెందుకు ?

ఊర్వశే వెంట్రుక ముక్క అయితే, సామాన్య స్త్రీ వట్టి గడ్డి పోచ కూడ కాదు కద !

అట్టి ఒక మహాయోగి మహాశివుడే కావాలను కొంటే - అతడు రమించ వలసింది ఊర్ధ్వశ్రీ అయిన ఒక్క మహాశక్తి తోనే !

మహాశక్తితో రమించినవాడే మహాశివుడు.

ప్రతి శరీరంలోను శివుడున్నాడు ఆత్మ రూపంలో.

సహస్రారపద్మం లోని తానే శివుణ్ణని తెలుసుకొన్న జీవుడు యోగి అవుతాడు. మూలాధారంలో తపస్సు చేసుకొంటున్న కుండలినీ కన్యను లేపుకు పోయి, ఆమెతో రమించిన మహాయోగి, మహాశివుడే అవుతాడు !

తానే శివుడు

తన శక్తే కుండలిని.

తన శక్తిని తనలోకి ఉపసంహరించుకోవడమే జీవబ్రహ్మైక్యం.

మహాయోగి మైధునంతో శివుడు.

నేను నీతో శివుణ్ణి !

*ఏ రూపమును లేని, ఏ కోర్కెయును లేని,*
*ఆనంద మహితమౌ ఆదర్శమునె నేను !*
*నను జూచు ప్రతి ముఖము నా ముఖమెనే, చెలీ !*

*చూచుకొని సుఖపడుట కే చెలియు లేకుంద*
*వట్టి అద్దము బ్రతుకు వ్యర్థమే కదటే ?*
*పరమ శూన్య దటంచు పాయకే నను, చెలీ !*
*నిను గూడి పరమ శివుడనె కానటే, చెలీ ?*

# ఫాల్గుని

ఒకేసారి చూశాను నేను నీ వెనుక ముందుల్ని !

ఎంత రమణీయం ఆ దృశ్యం !

ఎంత పుణ్యం చేసుకొన్నె నా కన్నులు !

చంద్ర, సూర్యులను ఒకే చేత బంతులాడగల పరమయోగి నా కంటె ఏం గొప్ప ?

అటు – శృంగార కళా మూర్ధస్థమై ఫాల్గునీ పూర్ణచంద్ర బింబం !

ఆ క్రింద – ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బు పడుతున్న ఉత్తర ఫల్గునీ తారాద్వయం ! హస్త కమల కలశుణ్ణై ఆ వెనుక నేను !

ఇటు – మాఘ కుహూ తమోరాశి స్వరాజ్యం నిర్మించుకొన్న పుష్కల కేశ శ్రీ ! భ్రమరాంబికా కరుణా కటాక్ష సహస్రాలు నా కోసం నిన్ను పొంది, భ్రామరీ స్నిగ్ధజీవ కాంతులతో వరదలై, హిమనీ జలపాతంలా నా వక్షం పై జాలువారుతున్న కైవల్య విక్షేపం !

ఇటు లేత సంపెంగ పూల తావులు, అటు నీ ఆనందలోల లోచన చంచరీక సరిగమలు, నా ప్రాణవాయువుల చుట్టూ దోబూచు లాడుతున్నె !

అటు పండు వెన్నెల, ఇటు చిమ్మ చీకటి –అటు పట్టపగలు, ఇటు బహుళ రాత్రి – అటు శ్రీగిరి, ఇటు శ్రీకాళహస్తి !

ఎర్ర నారింజ రంగు వెలుగు చూపులతో నా హృదయాన్ని రాగ రంజితం చూస్తూ, వెనుదిరిగి నిల్చిన కామ పూర్ణిమలా, ఎంత అలవోకగా అందించావు నాకు –నీ భుజం మీది నుంచి వెనక్కి దువ్వెన !

ఎన్ని అందాలతో మెరిసిపోయింది అద్దం !

ఈ అదృష్టం కోసమే ఏమో – అది నా దగ్గర ఇంతకాలం పడి ఉంట !

నీ కేశరాశిని ఎద మీద పరచుకొని, రెండు భుజాల మీదా చేతులు ఉంచి, శిరస్సుపై గడ్డం ఆన్చి, చూస్తున్నాను – నేను అలా వెనుక నుంచి నీ ముఖంలోకి !

అలా ఎంతసేపని ?

క్రమంగా నా పాణి పల్లవ వృంతంలో మర్యాదలు స్వీకరిస్తున్న నీ వదన కల్హారం నా పెదవుల వరకు వికసించడం –

జన్మ జన్మాలుగా నా కోసమే నింపి ఉంచబడ్డ అమృత కలశం అంచులు నా నోటికి అందడం –

పెచ్చిల్లిన తమకంతో కంపించిపోతూ, ఆ వేగం ముప్పిరిగొన, ఒకే ఒక గ్రుక్కెడు గ్రోలి, నేను ఉక్కిరి బిక్కిరై పోవడం –

అద్దం మనల్ని చూచి సిగ్గుపడి పోయి, ముఖాన్ని ముద్దుల్లో దాచుకోవడం–

ఎంత రమణీయం !

ఎంత అదృష్టవంతుణ్ణి నేను !

శ్రీ శైలం నుంచి తెచ్చిన శివచరణ సేవాప్రసాదం ఎంత మహనీయంగా ఉంది – నీ అధరామృతంతో కలిసి !

ఓహో –

రాగ సరస్వతీ !

రాగోదయ గీతీ !

## 93

" నే నెవరి కోసం ? మీ కోసమే కదా? " అంటావు నీవు.

అలా అంటూ, నీవు శశిలో శశబాల లా ఒడిలో ఒదిగినప్పుడు, చతుర్ముఖ బ్రహ్మనే అయిపోతాను నేను నీ ముఖంలో !

నేను ఊహించుకొన్ని రాగం, గీసుకొన్న బొమ్మ, మలచుకొన్న శిల్పం, పాడుకొన్న పాట, నిర్మించుకొన్న కావ్యం రాగ మోహన మనోరమంగా నా ఎదట సాక్షాత్కరించి, అంటున్నట్టే ఉంటుంది నా కా మాట !

రమణీయ రాగ రసాకృతి -నా అభ్యంతర సుందర కళా సరస్వతి - నా గుండె గుమ్మం తెరచుకొని, బైటికి వచ్చి, నా అంక వేదికపై కూర్చుని, ఆనంద చుంబనంలో తడిసి పోయిన చిరునవ్వుల్ని నా ముఖం మీద ఆరబోసుకొంటూ, సరస మాడుతున్నట్టు ఫీలవుతాను - నీ ప్రశ్ననూ, నిన్నూ చూస్తూ !

నేను కళా స్రష్టను

నీవు నా కళవు.

నీకు తండ్రిని, ప్రియుణ్ణి, కుమారుణ్ణి కూడ నేనే !

కళ కళ కోసమూ కాదు, లోకం కోసమూ కాదు.

కళ స్వయంభువు కాదు. సహజ సిద్ధం కాదు. తనను తానే తినేసుకొనే జీవ విశేషం కాదు. ఇతర్ల కోసం మార్కెట్లో పెట్టే మిఠాయి కూడ కాదు.

కళ కళ కోసమే అనే వాదం ఎంత అర్థరహితమో, కళ లోకం కోస మనే వాదం అంతే జీవరహితం !

కళ ఎవరి కోసమూ కాదు: అది ఏతత్కళాస్రష్ట కోసమే !

ఆత్మానందం కోసం, ఆత్మను వ్యక్తీకరించుకొంటూ, అపూర్వ సౌందర్యాన్ని సృష్టిస్తాడు కళాస్రష్ట.

ఎందుకు చేస్తా డతడు ఆ పని ?

చెయ్యకుండా ఉండలేడు కనుక !

బ్రహ్మ యొక్క ఆనంద కామనే కదా సృష్టికి మూలం ?

సృష్టి నిండా బ్రహ్మానందం కామరూపంలో ప్రవర్తిల్లడానికి అదే కదా హేతువు ? ఆనంద జన్మమైన ఆత్మ ఏతదాసేంద లవాన్నే ప్రాణాధికంగా కోరడంలో పాపం ఏముంది, మరి ?

ఆనంద ఫలం జీవసృష్టి; కనుక -

జీవేశ్వర సంయోగ సముద్భవ సుధారసం ఆనందం, కనుక -

స్వీయాత్మోపరతి నుంచి పుట్టిన అట్టి ఆనందం నుంచి చేస్తాడు సృష్టి - కవి, చిత్రశిల్పి, గాయకుడు - ఏ కళాబ్రహ్మ అయినా !

ఆనందకళ ఇంటి భోజనం

వ్యాపార కళ హోటలు భోజనం.

ఆనంద కళ విశ్వజనీనం, విశ్వజన భోజ్యం అవుతుంది. ఏతత్కళా స్రష్ట విశ్వానుభూతిపూర్ణుడై ఉన్నప్పుడు !

సార్వకాలిక, సార్వదైశిక, సార్వజనిక సహజానుభూతు లన్నీ హృద్గతమై ఉన్న స్రష్ట - ఆత్మానందం కోసం సృష్టించు కొన్న ఏ లవమైనా సరే - అది సర్వజనానందకరమే అవుతుంది.

**బ్రహ్మ చేసిన బొమ్మ, చిత్రముగ తిరిగి**
**బ్రహ్మనే బొమ్మ చేసిన పడక టిల్లు**
**ఈ ప్రపంచము ; ఇందులో నెవరు లేరు ;**
**సతము మన బొమ్మ బొరుసులే సందడించు !**

కళ తత్కళా స్రష్ట కోసం.

నీవు నా కోసం !

షోడశ కళా పరిపూర్ణ పూర్ణ సుధాకర సుందరివి నీవు.

ఆక్లీత నామితం - పరమ కల్యాణ కళా సామ్రాజ్య రాజ్యదవు నీవు.

నా ఆనంద యోగ రాగ కళా రమవు నీవు.

నీ ముఖ భూషణమే అహస్సు

నీ కేశ చాలనమే యామిని

నీ పాద కర్షణమే జగజ్జీవన కృషి.

అణువుగా నాలో గల విశ్వ సౌందర్యమే రసావిష్టమై రమ్యాకృతి తాల్చిన రాగ సరస్వతీ ! ఏమంటున్నావు ?

*" నే నెవర్ని ? మీరే కద ! "*
*ఎవరవో నీవు, నే నెవరనో జగతిలో !*
*తెలిసికొను టెందుకే త్రిజగన్మనోహరీ ?*
*ఒకరి ఆనందాగ్ని కొకర మింధన మంతె !*
*ఒకరి స్వారస్యాని కొకర మింద్రియ మంతె !*

*బ్రహ్మ సృష్టియె బ్రాహ్మి, భవుని శక్తె భవాని,*
*మధుభావ సుభగయే మాధవునిలో లక్ష్మి ;*
*నాలోని నీవే కద్ల నా కళా జగ మెల్ల ?*
*నీ లోని నేనె కద నీ జగత్మథ యెల్ల ?*

# 94

కనిపించి, కబుర్లు చెప్పి - చల్లగా వెళ్ళిపోయావు నీవు
హృదయం తేలిగ్గా ఉంది నాకు.
మనస్సు ఆహ్లాదం నుంచి తేరుకోలేదు
శరీరం నిండా ఏదో హాయి.

ఎంతో తృప్తిగా, వివశత్వంతో, పున్నమి ముఖం లోని నల్ల కల్వ వలె అరమోడ్పుగా చూస్తూ, విప్పారిన ముద్ద మందారం వలె చిరునవ్వులు చిందుతూ, ఒకడుగు ముందుకూ - ఒకడుగు వెనక్కూ వేస్తూ, గుండెల్లో గుచ్చుకు పోయిన మన్మథ బాణాన్ని మెల్లగా తీసినట్టు తీసుకొన్న నీ వీడ్కోలు - వాత్స్యాయనుడికి కూడ వైఖరీ బోధకమే కదా !

అందుకే అంత ఉల్లాసం నాలో !
బైలుదేరాను మధుశిల నుంచి
ఎటో, ఎక్కడికో, నిర్లక్ష్యంగా -
ఇప్పుడు సర్వాధికారాలూ కాళ్ళవి.

హృదయం, మనస్సు, ఆత్మ - మొత్తంగా నీతో, నీ కూడా వెళ్ళిపోగా - మిగిలిన శరీరానికి ఈ భూర్భువ ర్లోకాలలో కాళ్ళే బాధ్యత వహించినై.

నా కాళ్ళపై నాకు సంపూర్ణ విశ్వాసం ఉంది. అందాలకు, ఆనందాలకు మాత్రమే నడిపించుకు పోతై అవి నన్ను !

ఎక్కడ పుట్టాను !

ఎలాంటి నిప్పుల్ని, మంటల్ని, ముళ్ళని, మురికిని దాటుకొంటూ - ఎంత దూరం నడిచి వచ్చాను నేను ఇక్కడికి !

ఇక్కడ నీ సమక్షానికి !

ఈ పాటికి ఇల్లు చేరుకొని ఉంటావు నీవు.

పౌరోద్యానం చేరుకొన్నాను నేను.

ఉద్యానం నీకులా ఎంత దివ్యంగా ఉంది !

కారాకులు రాలిపోతున్నై, కొత్త చివుళ్ళు తొంగి చూస్తున్నై.

పూచేస్తున్నై కొన్ని చెట్లు.

ఫాల్గుణ పూర్ణిమే వసంతారంభం నిజానికి !

ఎంత మనోహరంగా ఉంది వాతావరణం !

కాసారాలు పొంగి ఉన్నై !

కలువలు కమ్మగా పాడుతున్నై - తుమ్మెద గొంతుకలతో.

కోకిల కింకా కబురంది నట్టు లేదు.

పచ్చికలో ఆడుకొంటున్నారు పిల్లలు - పువ్వులతో కలిసి.

పూచిన రేల చెట్లతో పందాలు కట్టి ఎగురుతున్నై - నైలాను చీరలు, వాయిలు పమిటలు, పతంగ బాలలు !

సీతాకోక చిలుకలు కామదేవుడికి కళ్ళద్దాలై, దారులు చూపు తున్నై - పూల కాంతల పరదాలలోకి !

రంగు రంగుల పూలు, రకరకాల పూల చెట్లు !

ఏ చెట్టు ప్రక్క నిలబడ్డా, నీ ప్రక్క నిలబడ్డట్టే ఉంది నాకు !

ఇక్కడ తిరుగుతుంటే, నీ ఒడిలో మసలుతున్నట్టుంది నిజంగా !

ఈ పొదలో కూర్చుంటే, నీ ఎదలో కూర్చున్నట్టుంది హాయిగా !

నీ అనురాగంలా ఈ సంధ్యారాగం !

రకరకాల పూల తావులతో రంగు రంగుల గాలి కెరటాలు !

మై మరపులా చీకటి !

నీ నల్ల పట్టు పమిటె క్రింద పరవశమైపోయి నప్పటి ఆనందం !

తన శరీరం తనకు బరు వనిపించడం వార్ధక్యం.

ఈ స్థితి వయస్సును బట్టి రావచ్చు. మనస్సును బట్టి రావచ్చు.

త్వరగా రావచ్చు. ఆలస్యంగా రావచ్చు.

అసలు రాకనే పోవచ్చు కొందరికి.

మన పురాణాల్లోనూ, హిమాలయాల్లోనూ మాత్రమే కాక - మన గ్రామాల్లో కూడ ఉన్నారు నేటికీ - ఎంతోమంది చిరంజీవులూ, నిత్య యౌవనులూ.

నూట పన్నెండు సంవత్సరాల వయస్సు గల మా బంధు వొకడు, పన్నెండు సంవత్సరాల వయస్సు గల నాతో సమానంగా పచ్చిక బీళ్ళలో పశువుల్ని కాచే వాడు !

వార్ధక్యానికీ, వయస్సుకూ సంబంధం లేదు.

రస లుబ్ధులకు వార్ధక్యం లేదు.

రసమే అమృతం.

నవ రసాలలో అది ఏ రసమైనా సరే - ఏదో ఒక రసంలో మగ్నులై, ఏదో ఒక తపస్సులో లగ్నులై, ఏకాగ్రతతో జీవితాన్ని అనుభవించే వాళ్లే అమృతం సేవించిన వాళ్ళు - జరామరణ రహితులైన ఋషులు !

అట్టి వాళ్ళు శతవృద్ధు లైనా, చచ్చేవరకూ యువకులే ! చచ్చినా, కీర్తి కాయులైన అమరులే !

కీర్తి లౌకికమే కానక్కరలేదు. లోకానికి రోజు కొక సుప్రభాతాన్ని ప్రసాదించే పారలౌకికం కూడ కావచ్చు అది.

" గొప్పవాడు చచ్చాడు. ఒక చుక్క నేలకు రాలింది. పేదవాడు చచ్చాడు. ఒక చుక్క నింగికి లేచింది " అన్నాడు విశ్వనాథ !

పరమాత్మ మనకిస్తున్న వరాలన్నీ దరిద్రుల సేవా జీవిత నిక్షేపం నుంచి కైకొన బడినవే కావచ్చు !

దరిద్రులు, పీడితులు, కార్మికులు, కర్షకులు లోకానికి తమ నెత్తురు ఇవ్వ వచ్చిన దేవతలూ -

లంచగొండులు, లక్ష్మీపుత్రులు, కల్తీ చేసేవాళ్ళు, అధికార దుర్మదాంధులు, దోపిడీగాండ్రు, లోకం నుంచి నెత్తురు పిండుకపోవడానికి వచ్చిన యమదూతలూ - కావచ్చు !

చెప్పలేం.

ఎవరు ఎవరో,వాళ్ళ వాళ్ళ నిజస్వరూపాలు తెలియ వచ్చేది అక్కడ. బుద్బుద ప్రాయమైన ఇక్కడ కాదు.

ఏది ఏమైనా –

రస లుబ్ధులకు వార్ధక్యం లేదు.

రసాస్వాదన నైరంతర్యమే నిరంతర యౌవన వైభవ భోగలీల !

మల్లెపువ్వు ముసలి దెన్నటికీ కాదు ! మామిడి పండుకు వార్ధక్యం లేదు.

స్త్రీ వర్గానికి నీవు వలె, రసవర్గానికి శృంగారం రాణి !

శృంగారమే రసం, రసమే శృంగారం

వీరం, కరుణం వగైరాలు రసాలు కావడానికి హేతువు – వాటికి శృంగారంతో కల బాంధవ్యమే !

నిరుద్ధ శృంగారం వీరం

భగ్న శృంగారం కరుణం.

రామాయణమే ఉదాహరణం ఇందుకు.

కవిత, గానం, నృత్యం, చిత్రకళ – ఇవన్నీ శృంగారానికి అలంబనాలు.

ఈ కళలలో పారం ముట్టిన తనస్వులు నిత్య యౌవనులే.

భూత భవిష్య న్నైరంతర్యాన్ని ఆత్మగతం చేసుకొన్ని సిద్ధులు ఈ రస లుబ్ధులు !

శృంగారమే యౌవన శ్రీ !

దాని ఆరాధనమే అజరామృత శ్రీ !

శృంగార రసోపాసకులకు మృత్యువే లేదు, ముసలితన మెక్కడిది ?

స్త్రీకి శరీరం, పురుషులకు మనస్సు – వార్ధక్యాన్ని సూచిస్తారయనేది సామాన్యుల విషయం లోనే !

నా వంటి రసోపాసకులు, నీ వంటి రాగరాగిణులు కాలాతీతులు.

మంచి చెడ్డలు, చీకటి వెలుగులు, సుఖ దుఃఖాలు, రాగద్వేషాలు, జీవన్మరణాలు కూడా లేని కాలాతీత పరాశక్తులం మనం.

రాగమే తప్పు, మనకు ద్వేషం లేదన్నాడు కదూ ప్రసాదరావు ?

అది అతడి సౌహార్దం.

నేను చతుష్షష్టినీ, నీవు కేవల అష్టాదశివీ కావచ్చు –

నీవు శత వృద్ధవూ, నేను కేవల బాలుణ్ణీ కావచ్చు !

ఏ జన్మలో, ఏ వయః పరిధిలో కలుసుకొంటామో మనం !

అయినా –

కలుసుకొని తీరతాం, గుర్తించుకొని తీరతాం – ఐక్యమై ఒకరిలో ఒకరం !

ఎవరూ నిరోధించలేరు మనల్ని !

అది దంపతులం మనం.

అద్యంత రహితమైన ఈ విశ్వలీల సమస్తమూ మన కామ కళా రాగ లీలే కద !

నీవు కృతయుగం నాటి ఆదిమహాలక్ష్మివీ, నేను కలియుగం లోని దరిద్రనారాయణరావునూ కావచ్చు గాక –

మన వయస్సుల లోని తేడా నాలుగు యుగాలే కావచ్చు గాక –

మనం ఒకరి నొకరం ప్రేమించు కొన్నప్పుడు – మనం వధూ వరులం.

వధూవరులు నిత్య యౌవనులు.

అవి అనంత రసానంద మహా పయోనిధిలో రెండు ఆత్మలు, రెండు హృదయాలు, రెండు ప్రేమ స్పందనలు, రెండు శరీరాల గుర్తే లేని రసబ్రహ్మలు !

రసబ్రహ్మ కాలాతీతం, దానికి వయసు లేదు.

అయితే –

వార్ధక్యం అనే పదానికి ఎనభై సంవత్సరాలు దాటిన వయస్సు అని అర్థం చెపుతున్నై మన నిఘంటువులు !

ఈనాడు మన దేశంలో – ప్రతివాడికీ, తన కంటె ఒక సంవత్సరం పెద్దవాడైన ప్రతివాడూ వృద్ధుడే కద ?

ఇరవై సంవత్సరాల వాడికి, ఇరవై ఒక్క సంవత్సరాల వాడు వృద్ధుడు !

ఎంత పతనమై పోయాడు మానవుడు - ముఖ్యంగా మన దేశంలో !

ఈ పతనానికి బాధ్యులు యువకులు కాదు - వాళ్ళ నైతిక నాయకులు !

మానవ ప్రవృత్తినీ, ప్రకృతి సర్వతోముఖ ప్రగతినీ నాశనం చేసిన వాళ్ళెవరో తెలుసా ?

ప్రవక్తలూ, నీతి బోధకులూ, సంఘ పెద్దలూను !

మనిషి కాలాతీతుడు !

అతడికి వయస్సు లేదు !

నీవే అది - ఎడమగా

నేనే అది - కుడిగా !

ఇద్దరం అదే - పరిపూర్ణ జీవితంగా !

*ఏనాటి కృష్ణుడో - ఏ నాటి రాధయో -*
*ఈ నాటికిని రసధ్యేయమే ఆ జంట !*

*అమృత యౌవన మొక్క ఆనందరస మేనె !*
*వసుధలో రసపిపాసకు లేదు మిమ్లాన !*

*నాకు నీవే రసము - నీకు నేనే రసము -*
*నిను నాతో, నను నీతో నింపుకోవే, చెలీ !*

## 96

వివాహం శిశిరం లాంటది స్త్రీకి !

కొందరికి వసంతం వస్తుంది ఆ తర్వాత. ఎక్కువ మందికి మాత్రం ఆ తర్వాత వచ్చేది విషమ హేమంతమే !

కోకిలలా పాడుకొంటూ, మయూరంలా ఆడుకొంటూ, లేడి పిల్లలా గంతులు వేస్తూ, ముద్దబంతి చెట్టులా ముద్దులు చిలుకుతూ - పదహారు ఇరవై ఏళ్ల పాటు పుట్టినింటిని నిత్యవసంతంగా కలకల్లాడించిన ముగ్ధ మనోహర మూర్తి - ఆ మూడు

ముళ్ళూ పడగానే, ముళ్ళ కంచెలో బందీ అయిపోతుం దొక్కసారిగా ! స్తంభించిపోతై ఆమె కళా సౌందర్యాలన్నీ ! మ్రోడులా నిలబడి పోతుందామె విభ్రాంతితో !

ఆ వివాహం వెనుక ఉన్నది అవ్యాజ ప్రణయమే అయితే, అనురాగంగా వికసించే సహజస్ఫూర్తి దానికుంటే, ఆ కట్టుకొన్నవాడు కళా ప్రియుడైతే, ఆమె బీజంలో ఉన్నది ఊర్వశీ శక్తే అయితే – అట్టి స్త్రీ జీవితం నవనవోన్మేష మధుమాసమే అవుతుంది ఆ తర్వాత.

తమ స్త్రీత్వాన్ని కాపాడుకొంటూ – జన్మత: తమకు లభించిన కళలను, అభిరుచులను, సౌందర్యాలను పోషించుకొంటూ – కృష్ణుణ్ణి రుక్మిణిలా, సత్యలా, జాంబవతిలా, నీలలా, తమ స్వభావాన్ని బట్టి భర్తను ఆరాధించుకొంటూ – తాము స్త్రీలుగా బ్రతుకుతూ, తమ భర్తలను పురుషులుగా బ్రతకనిచ్చే భార్యలు చాలమందే ఉన్నారు లోకంలో !

అదృష్టవతులు వాళ్ళు.

భర్త ఎదుట మరొక పురుషుడితో వాత్స్యాయనుడి కామసూత్రాలనే చర్చావిషయంగా ప్రతిపాదించింది ఉభయభారతి.

జనకుడి మహాసభలో, వేదాంత విద్యాగోష్ఠిలో యాజ్ఞవల్క్య మహర్షినే ఎదుర్కొన్నది గార్గి.

ధన ధాన్యాది ఐహిక సంపద లన్నిటినీ రోసి, బ్రహ్మవిద్యను కోరింది భర్త దగ్గర మైత్రేయి.

భర్త అలసట పొందితే, తానే నరకుడితో యుద్ధం చేసింది సత్య.

మగడు వదిలేస్తే , తానే బిడ్డల్ని పెంచి ప్రయోజకుల్ని చేసింది సీత .

పూర్వ భారతంలో ఇలాంటి మహితాత్మ లైన మహా మాతంగినులు లక్షలాది !

నేడూ ఉన్నారు అలాంటి మహా మహిళలు ఎందరెందరో.

వర జన్మలు వాళ్ళు.

వాళ్ళ నలా వదిలేద్దాం.

మరో రకం వాళ్ళు కూడ ఉన్నారు.

ప్రేమించి పెళ్ళి చేసుకొన్నది కమల సుందరి. ఆ తర్వాత తెలిసింది – అప్పటికే అతడికి మరొక భార్య ఉన్నదని !

మేఖల మంచి గాయని. తన గురువునే ప్రేమించిం దామె. వాళ్ళ నాన్న దృష్టిలో అతడు చెడ్డవాడు. ఒక మంచివాణ్ణి తెచ్చి పెళ్ళి చేశా డామెకు. ఆ మంచివాడికి అప్పటికే ఒక భార్య, ఇద్దరు ముగ్గురు ప్రియురాండ్రు !

ఎన్నో వేలు కట్నం పోసి, ఎంతో ఇదిగా పెళ్ళి చేశాడు వాళ్ళ నాన్న తారావతికి. ఇంటికే తెస్తా డతడు రోజుకొక వన్నెల విసనకర్రను !

ఇలా – ఎంద రెందరో !

అందరూ సుఖం గానే చేసుకొంటున్నారు కదా కాపురాలు ?

కారణం ?

సర్దుకుపోవడం !

రకరకాల సర్దుబాట్లతో కూడుకొన్నదే జీవితం.

ఇలాంటి సర్దుబాట్లు చేసుకోగలది ఒక్క స్త్రీ మాత్రమే.

కారణం ?

స్త్రీకి పురుషుడు ఒక్కడే కనుక !

స్త్రీకి శరీరమూ, మనస్సూ, హృదయమూ, ఆత్మా – సమస్తమూ ఏక ముఖమై ప్రగమిస్తుంది కనుక !

నిజమైన స్త్రీ – శరీరాన్ని ఒకడికీ, ఆత్మను మరొకడికీ ఇవ్వజాలదు కనుక !

చాలమంది మామూలు స్త్రీలకు శరీరాలే తప్ప, ప్రత్యేంగా ఆత్మ లుండవు. వాళ్ళు శరీరాలు కలిసిన చోటనే ఉండిపోతారు – ఎన్ని కష్టాలైనా ఓర్చుకొని.

కొద్దిమంది మానవతులకు ఆత్మలే కాని, శరీరాలు ప్రధానం కాదు. అట్టి వాళ్ళు ఆత్మలు కలిసిన చోటనే ఉండిపోతారు. అమరణ బ్రహ్మ చర్యం పాటించవలసి వచ్చినప్పటికీ లెక్కచెయ్యకుండా.

ఈ రెండు రకాల స్త్రీలూ గొప్పవాళ్ళే. శరీర ప్రాధాన్యం గల స్త్రీది లౌకికానందం. ఆత్మ ప్రాధాన్యం గల స్త్రీది బ్రహ్మానందం. ఒకటి అన్నం. రెండోది అమృతం.

శరీరాన్ని ఒకడికి, ఆత్మను మరొకడికి ఇవ్వవలసి రావడం కంటె మరో దౌర్భగ్యం లేదు స్త్రీకి. అట్టి స్త్రీ జీవితం ఒక నరకం.

మేఖల అలాంటి నిర్భాగ్యురాలు.

ఆమె ఆత్మ ప్రియుడి దగ్గర, శరీరం భర్త దగ్గర ఉంటున్నవి. ఒక మాదిరి పిచ్చిది ఇప్పుడామె. ధైర్యంగా తన ఆత్మేశ్వరుణ్ణి పొందలేక పోయింది. సహజ మూర్ఖత్వానికి ప్రతీక అయిన తండ్రిని ఎదిరించలేక పోయింది.

తాను విశ్వసించిన ధర్మం కోసం పోరాడి, చావో బ్రతుకో తేల్చుకొనే సాహసం ఉన్న వాళ్ళదే విజయలక్ష్మి. పిరికితనం అధః పతనమే.

నీ లేఖలు చింపేస్తే చింపేసిందిలే. ఏమీ అనకు ఆమెను.

తండ్రిని ధిక్కరించి, ఆత్మేశ్వరుడి కోసం త్యాగం చెయ్యగలిగి ఉండి ఉంటే - మేఖల నీ అంతటి సౌభాగ్యవలి అయి ఉండేదే.

ఇప్పుడు ఆమె ఆత్మికంగా ఒక పతిత !

ధైర్య సాహసాలు కల స్త్రీకి ప్రేమభగ్నత అనేది లేదు. ఆత్మను ఇచ్చుకొన్న చోటనే శరీరాన్ని కూడ ఇచ్చుకొని తరించగలదు ఆమె.

శరీరాన్ని ఇచ్చుకోలేక పోయినా, బాధ పడ దామె.

ఆత్మానందమే శాశ్వతానందం. అది లభించిన స్త్రీ, అట్టి ఆనందాన్ని చవిచూచిన స్త్రీ, శరీరాన్నే త్యాగం చేసి వెయ్యగలదు అందుకోసం.

సృష్టి స్థితి లయాలకు మూలభూతం శృంగారం.

శృంగారం రెండు భాగాలు. ఒకటి విప్రలంభం. రెండు సంభోగం.

విప్రలంభానికి లక్ష్యం సంభోగమే.

సంభోగ మంటే ఏమిటి ?

స్త్రీ పురుష లైంగిక మర్మాంగాల సంపూర్ణ సంగమ మేనా సంభోగ మంటే !

ఒక వలపు చూపు, ఒక తీయని ముద్దు, ఒక మెత్తని కౌగిలి, ఒక వెచ్చటి నిట్టూర్పు, ఒక చన్నుల స్పర్శ, ఒక పెదవుల పానం, ఒక మనోలాలన, ఒక ఆత్మస్పందన - వీటిలో ఏ ఒక్కటి లభించినా, అది సంపూర్ణ సంభోగమే. అట్టి ప్రేయసీ ప్రియులు శాశ్వతానంద రసబ్రహ్మలే.

ఈ రహస్యం తెలిసిన శ్రీలక్ష్మి వంటి ఆనందవతులు బహు కొద్దిమంది. తెలియని మేఖలలు అసంఖ్యాకం .

అసాధారణ పరిస్థితుల్ని ఎదుర్కోవలసి వచ్చే ఇలాంటి వాళ్ళను కూడ అలా ఉంచేద్దాం .

ఇక –

లోకం నిండా నిండి ఉన్న సామాన్య స్త్రీల జీవితాలే కడు దయనీయంగా తయారవుతై వివాహానంతరం !

పుట్టుకతో ఎంతటి మధుకలశంగా ఉంటుందో, అంతటి కఠిన శిలగా మారిపోతుం దామె భార్య కాగానే !

స్వేచ్ఛ పోతుంది. వీణ బూజు పడుతుంది. గజ్జెలు తుప్పు పడతై. గాత్రం పూడిపోతుంది . వ్యక్తిత్వం నశిస్తుంది . నిరాశ , నిస్పృహ కుడి ఎడమల నిలుస్తై పహరా జవానుల్లా !

ఒకో దురదృష్ట వంతురాలి విషయంలో పుష్పవతి కాగానే దాపురిస్తై ఈ దుఃఖాలన్నీ !

చదువు మూలబడుతుంది. జ్ఞానసూర్యుడు క్రుంకిపోయి, మరి ఉదయించడు ఆమె జీవితంలో . లోన వెలుగుండదు . బైటి వెలుగు అనుమతించబడదు . డబ్బిచ్చి తీయించి పారేస్తా రామెను – తలిదండ్రులు తమ ఇంటి నుంచి .

మూర్ఖుడైన తండ్రి కంటె క్రూరుడైన భర్తే మేలనిపిస్తుం దామెకు ఆ తర్వాత !

తండ్రి, అన్నలు, మగడు, మగని నేస్తాలు – అందరూ మహిషాసుర వంశ భూషణులే అయిన సందర్భంలో , ఆ స్త్రీ ఏం జేస్తుంది ?

స్త్రీగా చచ్చిపోయి, పిశాచిగా అవతరిస్తుంది !

ఆ మగడు ఒక పిశాచ రాజై ఉంటే – ఆమె జీవచ్ఛవంగా బ్రతికి, ఏడ్చే శక్తి లేక , నవ్వుతూ చచ్చిపోతుంది.

అతడిలో ఏ రకమైన బలహీనత , ఉన్నా, ఏ కొంచెం జాలి లాంటిది కనపడినా – ఇక ఆమెకు పట్ట పగ్గా లుండవు !

ఒక పెంపుడు జంతువుగా , బరువులు మోసే గాడిదగా , ఇల్లు కాపలా

కాసే కుక్కగా , డబ్బు సంపాదించి పెట్టే కిరాయి బండిగా - వాడుకొంటుందామె అట్టి భర్తను !

భార్య తోడిదే లోక మనుకొంటే - అట్టి భర్తకు సుఖం గానే గడిచిపోతుంది జీవితం.

కొంచెం వ్యక్తిత్వం ప్రదర్శించే గుణం ఉంటే - అట్టి భర్తకు కూడ పేకాట క్లబ్బులు, మంచి బార్లు, మెహిందీలు, నాటక సంస్థలు, ఆశ్రమాలు, మఠాలు ఎన్నో ఉన్నై ! తప్పితే - రైలు పట్టాలు, లోతైన చెరువులు, దీర్ఘ నిద్రా మాత్రలు వగైరా తక్కువేం కాదు !

తన కొక్కడికే ఏ దిక్కూ లేదంటాడు సదానంద !

తన భార్య ఏడ్చే ఏడ్పులు, తిట్టే తిట్లు, పెట్టే తిప్పలు –లోకంలో నభూతో నభవిష్యతి అని చెపుతూ, నిరానందమూర్తి సదానంద అంటాడు -

" నా భార్య పతివ్రత కాకపోవడం ఒక్కటే నాకు పట్టిన అదృష్టం. పతివ్రతే అయి ఉంటే - నే నీపాటికి కుక్క, పంది, గాడిద, దున్నపోతు వగైరా లక్షలాది హీనజన్మ లెన్నో ఎత్తేసి ఉండేవాణ్ణి " అని !

వికటం, వెటకారం, వైరవైఖరి - అంతేనట ఆమె బ్రతుకంతా. ఆమె నాలుక రేజరు బ్లేడట !

మరొక మగవాడితో సెక్సు సంబంధం లేక పోవడ మొక్కటే పతివ్రతా లక్షణ మనుకొనే ఇలాంటి మూర్ఖభార్యలే ఎక్కువ సమాజంలో. వీళ్ళే సమాజం లోని అన్ని దుఃఖాలకూ, దారిద్ర్యాలకూ హేతువులు కూడ.

" ఇలాంటి గయ్యాళి భార్యలు తాము ఎందుకూ పనికిరారు. తమను కట్టుకొన్న మగవాళ్ళను కూడ ఎందుకు పనికి రానివ్వరు " అంటాడు సదానంద !

నిజమే అనిపిస్తుంది - మన ఇరుగు పొరుగు సంసారాలను పరిశీలించి చూచినప్పుడు.

వ్యర్థమై పోతూ ఉంది ఎంతో ఎంతో పురుష శక్తి - ఈ పనికి మాలిన పెళ్ళాల చేతుల్లో పడి !

సహజ ధర్మం మీద నిషేధాలు విధించుకొని, సుఖ సంతోషాల దారుల్లో ముళ్ళ కంపలు పాతుకొని, పాప పుణ్యాలు కల్పించుకొని, అసూయా ద్వేషాలు

పెంచుకొని, అభ్యుదయాన్ని నిరోధించు కొంటున్నాడు నేటి మానవుడు !

భార్యగా చచ్చిపోవడ మేనా శక్తి స్వరూపిణి అయిన స్త్రీ ప్రారబ్ధం ?

భర్తగా చచ్చిపోవడ మేనా వీర్య వంతుడైన పురుషుని పరమార్థం ?

" ఈ జన్మ ఎంత త్వరలో అంతమైతే అంత అదృష్టవంతుణ్ణి " అన్నాడు సదానంద !

ఈ జన్మలో సాధించ లేనిది మరో జన్మలో సాధించగల మనుకోవడం వట్టి భ్రమ, ఆత్మవంచన.

నీ శక్తిని నీవు గుర్తించుకొని, నీ పురోగతికి అవసర మనుకొన్నప్పుడు, ఎవరి నైనా సరే వంచించు. పర్వాలేదు. కాని ఆత్మను మాత్రం వంచించుకోకు !

తాను పరమాత్మలో ఒక సూక్ష్మాంశంగా గుర్తించుకొన్న తక్షణం తీరగల ఒక కోరికను - వచ్చే జన్మ వరకూ వాయిదా వేసే సదానందను గురించి ఏ మనుకోవాలి ?

అలాంటి జడ పదార్థానికి ఏమి బోధించి ఏం లాభం ?

అతడు నీళ్ళ లోని ఒక వత్తి.

ఎలా వెలుగుతుం దది ?

ఎంత శ్రమపడి, అంత చీకటిగా మారిందో అతడి భార్య !

## 97

" ఏ జన్మలో ఏ జంటను విడదీశానో, ఈ జన్మలో నేనాశించిన వస్తువు నాకు లభించలేదు " అంటూ కళ్ళొత్తు కొంటున్న మంజీర -

ఆమె కళ్ళల్లోకి చూస్తున్న నీవు -

నీ కళ్ళల్లోకి చూస్తున్న నేను -

త్రైపాక్షిక చిత్రకళా సమావేశం కదూ అది !

పాపం, మంజీర !

కన్నీళ్ళతో కోరికల్ని పెంచుకొంటూ, చిరునవ్వుల్ని పూయించుకొంటూ, కళాకాంతుల్ని పండించు కొంటూ, బ్రతుకంతా ఎడారిలో వలె ఒంటరిగా గడపడం !

ఎంత దయనీయం ఆమె స్థితి !

ఎలా ఓదార్చగలం ఆమెను ?

ఏమున్నది పరిష్కార మార్గం ?

ఆ మాట తానే అన్నది !

ఒక వస్తువును కోరుతున్న దామె.

తన బ్రతుకంతా ఒక అంజలిగా ఘటించింది దాని కోసం.

సంగీతం, నృత్యం, సౌందర్యం, యౌవనం – తన కున్న సమస్తమూ అర్పించి వేసింది దాని పూజలో.

కాని –

ఆ వస్తువు తనకు లభించదు.

మరో వస్తువు తన కక్కర లేదు !

ఎవరి జీవిత మైనా దుఃఖానికీ, ఘర్షణకూ, వైఫల్యానికీ రంగస్థల మయిం దంటే – అందుకు హేతువు ఇలాంటి పరిస్థితే !

సకల కళా సరస్వతి కదా మంజీర ?

ఆమె కోరాలే కాని, లభించని దేముంటుంది ?

తిలోత్తమను మించిన అందం, రాజు కొక్కర్తే కూతురన్నంత వైభవం, చుట్టూ సినీ తారాగణం, పత్రికల నిండా ఫోటోలు, నిత్యం మన లాంటి అభినందకుల సాన్నిధ్యం !

ఇంత సందడి లోను, ఇంత నిత్యోత్సవం మధ్య – ఏమిటా ఏకాంత వాసం !

ఎందు కా నిరంతర నైరాశ్యం ?

" ఒక్క క్షణం పాటు మామూలు స్త్రీనై, స్త్రీ హృదయం విప్పుతున్నాను మీ ముందు ! ఈ సౌందర్యం, ఈ కళావిక్షేపం, ఈ అభినందన పరంపర, ఈ రసకజన సందోహం – ఇదంతా నా కెందుకు – నేను కోరింది దొరక నప్పుడు ? " అని ఆమె కళ్ళొత్తుకొంటూ ఉంటే –

ఇంతటి కళాలక్ష్మి శృంగార హృదయం లోనా అంతటి శూన్యం – అని విస్తు పోతాను నేను !

ఎంత క్రూరం ఈ సృష్టి వ్యవహారం !

మనిషికి ఎన్ని ఉన్నా, తనకు కావలసింది లేనప్పుడు, మరేమి ఉన్నట్లు ?

ఇంతకూ ఆ కావలసింది ఏదో ఒక అపూర్వ అమూల్య అసాధ్య వస్తువేమీ కాకపోవచ్చు. తన సమీపంలో ఉన్నదే కావచ్చు. లోక దృష్టిలో చాల చిన్నదే, ఒక తృణమే కావచ్చు. అయినా – అది తనకు కావలసి ఉండి, లభించ నప్పుడు, అంతకన్న బాధ మరేం ఉంటుంది ?

మరి ఎందుకు కోరింది అలాంటి లభించని వస్తువును ?

ఆమె కావాలని కోరిందా దాన్ని ?

కోరిక స్వయంభువు. సర్వస్వతంత్రం అది. కోరిక పుట్టడం ముందు. అది తీరేదో కాదో తెలియడం తర్వాత !

కోరికలు రక రకాలు.

అందులో అనేకం రొటీనువి. తీర్చుకోవడం కష్టం కానివి.

తీరక పోయినా బాధ లేనివి.

ఉచితంగా లభించేవి.

మార్కెట్లో వెలకు దొరికేవి.

హార్ది కమైన కామం తీరక పోతేనే ఆత్మహత్య చేసుకోవా లనిపిస్తుంది కదా !

హార్ది కమైన ప్రేమే లభించకపోతే ?

పాపం మంజీర !

ప్రేమను కోరిం దామె.

తన హృదయాన్ని ఐక్యం చేసుకోగల మరో హృదయాన్ని కోరిం దామె.

అదొక్కటీ లభ్యం కానప్పుడు – వసుధైక సామ్రాజ్య సింహాసనమే లభించినా, తన కెందు కది ?

*శత మోహములు, సహస్ర శ్రీలు, భోగాలు,*
*చేరి స్వర్గమె చరణ సేవ చేయును గాక !*
*తనను తనలో కలుపుకొను చెలియ లేకున్న,*
*ఏమి ఉన్నది ఎవరికేని ఈ బ్రతుకులో ?*

# 98

" ప్రేమ తీరని కోరిక ఎలా అవుద్ది ? "

ఆ రోజు నుంచీ, మళ్ళీ మళ్ళీ, అన్వేషిస్తూనే ఉన్నాను ఈ నీ ప్రశ్నకు తగు జబాబు కోసం.

ప్రేమ హృదయ సంబంధి కదా !

హృదయం వికసించి, ప్రేమ కోసం అన్వేషిస్తూ ఉన్నప్పుడు – అదెక్కడో కనిపించగానే, తనను తాను అర్పించేసుకోదా ఆ హృదయం ?

ఇదంతా అంతరాత్మ ప్రేరణతో జరిగేదే కద ? అంతరాత్మ అంటే పురాకృత కర్మఫల పరా రూపమే కద ?

అప్పుడు ఆ ప్రియతను లభించి తీరవలసిందే కద ?

మరి – లభించక పోతే ?

అందని చందమామ అయితే ?

మాడ్చి వేసే మార్తాండ బింబమైతే ?

స్వాధీనం కాని క్షణప్రభ అయితే ?

అమృతంలా ఆకర్షించి, హాలాహలంగా పొగలు క్రక్కితే ?

అప్పటికే మరొకరిదై ఉంటే ?

ఏమిటి చెయ్యడం ?

ప్రేమ జన్మాంతర సౌహార్ద ఫలితం కదా ? మరి దానికి ఆనందరసం ఎందుకు లభించడం లేదు తరచు ?

అంతరాత్మ పేరుతో మనస్సే కొన్ని కోతిచేష్టలు చెయ్యవచ్చు గాక ! అట్టి అపోహలు, భ్రాంతులు, పొరపాట్లు తాత్కాలికంగా బాధిస్తే బాధించవచ్చు గాక ! కాని – భగ్న హృదయతకు ఎందుకు దారితీస్తై అవి ?

మనస్సు చేసే కోతిచేష్టలు మోహానికి, కామానికి, సెక్సుకు సంబంధించి ఉండవచ్చునే తప్ప – ప్రేమకు, అనురాగానికి, ఆరాధనకు దరిదాపుల్లో కూడ ఉండవు.

ప్రేమకు ప్రేమ లభించి తీరవలసిందే.

ప్రేమ తీరని కోరిక కాదు ఎన్నిటకీ.

నీ ఉద్దేశమే రైటు.

అయితే - సాంఘిక విధినిషేధాల కారణం వల్ల, శారీరకంగా అది లభించక పోవచ్చు.

ఆత్మలు కలిసే ఉంటై.

శరీరాలు కలవక - ఏడుస్తై మనస్సులు !

ఆరాటం శరీరాలది - బాధ మనస్సులది.

అలాంటి దురదృష్టవంతురాలు మంజీర !

జీవిత యాత్రలో -ఒకే మజిలీలో ఉన్న ఆత్మలన్నీ ఒకే పక్వ దశలో ఉంటై రమారమి ! వాటన్నిటి మధ్యా సాదృశ్యం కనిపించ వచ్చు కొంత. అట్టి స్థితిలో - ఒకే వ్యక్తి అనేక మందిని, అనేక మంది ఒకే వ్యక్తిని ప్రేమించే అవకాశం ఉంది చాల !

సముద్రుడు ఎన్ని నదుల నైనా భరించగలడు.

నది ఒక్క పెద్ద వర్షాన్నే భరించలేక - పొంగి, కట్టలు త్రెంచుకొంటుంది కద ?

అందుకే - చాలమంది పురుషులు ఒకే స్త్రీని ప్రేమించినప్పుడు, వాళ్ళలో వాళ్ళు పోరాడుకొని, ఎవరో ఒక్కరే పొంద గలుగుతా రామెను !

చాల మంది స్త్రీలు ఒకే పురుషుణ్ణి ప్రేమించి నప్పుడు, అందరూ పొందగలుగుతా రతణ్ణి !

కాగా -

ప్రేమించిన వస్తువు లభించక పోవడ మనేది లేనేలేదు. స్త్రీకి !

మనం ప్రేమించిన వస్తువు తిరిగి మనల్ని ప్రేమించగల్గితే - అది మనకు లభించినట్టే !

శారీరక సంయోగానికీ, ప్రేమకూ సంబంధం లేదు.

సముద్రం వంటి ఒక పూర్ణ పురుషుణ్ణి ప్రేమించ గలిగిన స్త్రీ ఎలాంటిదైనా సరే ధన్యురాలే. ఆత్మయోగం సిద్ధించిన పిదప శరీర సంయోగానికి విలు వేమిటి ?

శరీరాలు సమాజానివి. ఆత్మలు మనవి. ఆత్మ సంయోగమే ఆనంద యోగం ?

మంజీర అనుకొంటుందీ - తాను ప్రేమించిన వ్యక్తి తనకు లభించలేదని !

లభించాడు ఆ వ్యక్తి ఆమెకు.

గుర్తించడం లే దామె !

హృదయ గత ప్రియుతముని నీడ కోసం బైటకు చేతులు చాస్తున్న ప్రాకృత ఆమె !

దొరకడం లేదని ఏడుస్తున్నది, పాపం !

ఏమిటి కర్తవ్యం ?

*ఆత్మ సంయోగమే ఆనందయోగమే,*
*అది లభించెను కదే హృదయ మిచ్చిన చోట !*
*పొంగ నేలను కనులు పుబ్బ చెరువుల వోలె ?*
*ఆత్మ రతి కంటె దేహాలింగనము ఘనమె ?*

## 99

ఆకులు కనపడకుండా పూచిన రసాల వల్లరిలా వస్తావు నీవు మత్తుగా పరిమళిస్తూ, మధురంగా పాడుకొంటూ !

వసంతం వచ్చేస్తుం దప్పుడు నీ రాకతో నా నరాల్లోకి - తొలకరితో పొలాల్లోకి నీరు వలె !

చిరునవ్వు ఉషఃకాంతి కాగా, ఉత్తర దక్షిణాలే నడిమింట కలుసుకొన్నట్టు రెండు చేతులు పైకి మోడ్చి, నీవు చేసే నమస్కారంలోని ఆ విలాస లాస్యభంగిమ -

ఉషోబాల వక్షం మీది నీలివోణీ జారిపోగా, పొడుపు గుబ్బలి గబ్బి గుబ్బలు సిగ్గతో ఎర్రబడగా, నీ మెయినిండా చెలరేగిన ఆ పుల కాంకుర పద్మ కళికలు -

ఎదురుగ్గా కూర్చొని, పాణి పల్లవాలలో ముఖపద్మాన్ని ధరించి, స్వీకరించు

మనే నీ ఆ కనత్కజ్జల చంచరీక వయస్యలు -

నన్ను సాక్షాత్తు సూర్యుణ్ణే చేస్తె ప్రతిరోజూ !

జీవిత మంతా, జన్మలన్నీ ఇలానే సాగిపోతే !

మోక్షం ఇంత కంటె రమణీయమా ?

చుక్కలు కూడ లేని ఒక ఎడతెగని అమావాస్యే కద మోక్షం ? మెలకువ లేని ఒక గాఢ సుషుప్తి కద అది !

నీ సుందర తనూ స్పర్శా సుఖం తెలియని మత్తు - అది మోక్షమే అవనీ -నా కెందుకు ?

అనంత శూన్య నిరంతరమైన అమావాస్య కంటె, హానివృద్ధులు కల కృష్ణ శుక్ల పక్షాలే ఇష్టం నాకు - అవి ఎన్ని సార్లైనా రానీ, పోనీ !

అమావాస్య తరువాత చంద్రకళ వలె, మృత్యువు తర్వాత జీవకళ అంకురించి తీరవలసిందే ! లేకపోతే, అర్థంలేదు మృత్యువుకు !

ఒక జన్మలో ఏదైనా విఫలమైతే, మరుజన్మలో అది సఫల మవుతుందన్న గేరంటీ లేదు. కాని -

ఒక జన్మలో ఏదైనా ముగియక పోతే, అది దానంతట అదే కొనసాగి, ముందుకు పోతుంది మరుజన్మలో.

మనం ఏ జన్మ లోనూ విఫలమైనవాళ్ళం కాం. ప్రతి జన్మ లోనూ వైశాఖీ వసంతులమే ! రాగ రమా రాజేశ్వరులమే !

అనంత కాలంగా పయనిస్తూనే ఉన్నాం మనం ఇలా !

ఏకానందం నుంచి రెండు అనురాగ కిరణాలుగా విడిపోయిన ఆ తొలిక్షణమే మన ప్రణయ లతాంకురానికి ఆవాప మహోదయం !

ఆ క్షణం నుంచీ వస్తున్నాం మనం వికసించుకొంటూ !

ఒక్కనాటితో వచ్చినవి కావు - ఇన్ని రంగులు, ఇన్ని రమ్యతలు, ఇంత సౌరభం, ఇంత మాధుర్యం !

ఆనంద స్రవంతిలో, అవశత్వంతో, జంటగా పయనిస్తూ - ఏదో ఒక స్పందనలో, ఒక స్పర్శలో, ఒక జాగృతిలో ఒకరి నొకరం చూచుకొంటాం తల లెత్తి-

ఓహో, మనం – అనుకొంటాం అప్పుడు !

మనం !

అవ్యక్తం నుంచి వ్యక్తమైన మనం !

మనిద్దరం !

ఎంత మధురం ఈ భావన !

శృంగారం , సౌందర్యం , ఆనందం – మళ్ళీ పారవశ్యం !

అంతే ఎప్పుడూ !

కాలమే అమృత ఝరి మనకు.

అమృతం ఎంత త్రాగాలి ?

త్రాగించి , త్రాగి , మై మరచిపోతావు నీవు !

క్షణాలై పోతై యుగాలు !

జీవితం , సుఖం , సృష్టి – సమస్తమూ సాపేక్షమే.

మళ్ళా నీవు మరునాడు కనిపించే దాకా – ఈ లోపల – ఎన్ని యుగాలు, ఎన్ని విలయాలు , ఎన్ని అవతారాలు , ఎంత తపన , ఎంత గ్రంథం !

*ప్రతి క్షణము ఒక సృష్టి , ప్రతి క్షణము ఒక లయము ,*
*క్షణము క్షణముకు నడుమ సందులే మనుగడలు !*
*క్షణములను పట్టి బుడగల వోలె చిదపనా ?*
*సందులను విరియించి స్వర్గాలె నిలపనా ?*

## 100

నిశాకాంత నిద్రపోబోతూ, పంకా వేసుకొన్నదో ఏమో – చల్లని పిల్లగాలులు ఆడుకొంటున్నై అలవోకగా !

చిరుమబ్బులు కదులుతున్నై ముంగురుల వలె !

వెన్నెల సబ్బు నురగతో చక్కగా స్నానం చేసి, కురులార బోసుకొన్న యామినీదేవి – వాటిని ముడుచుకొని జారుముడి వేసుకొన్నది మెల్లగా.

జాబిల్లికి అవలిప్రక్క పట్టిన తేనెపట్టులా ఉన్న దది.

కొన్ని తేనెటీగలు ఎగురుతూ ఇవతలికి కూడ వస్తున్నై చికుర సుందరంగా !

పూర్వ దిక్కామిని ఆవులించి లేచింది నీ వలె !

రాత్రంతా విరహాగ్నిలో తపించిపోయిన నీ వదనంలా ఉంది అరుణోదయం !

నీవు మాటి మాటికీ మునివ్రేళ్ళతో పైకి త్రోసివేస్తున్న ముంగురులే - అరుణబింబం పైకి వస్తూ పోతూ ఉన్న ఆ చిరుమబ్బులు !

రెప్పలెత్తి చూచినై నీ కళ్ళు !

కళ్ళెత్తి చూచినై పద్మాలు !

నీ చూపుల్లా ఎగసినై మధుపాలు

వెన్నెలకు జడిసి, రాత్రంతా దాక్కొన్న విషమ వియోగ దుఃఖ శకలాలవి !

మబ్బుల పైకి దాడి కదిలిన శిలీముఖాలే అవి !

నీ నుదుటి రేఖల్లోని కుంకుమ బొట్టులా ఉంది సూర్యబింబం !

అక్కడ శ్రీ ధామంలో నీ వలె, ఇక్కడ రసాలినిలో రాత్రంతా వేగివచ్చిన నా తాగుబోతు కళ్ళు –

చూస్తున్నై ఈ వినోదమంతా నీ చెక్కుటద్దాలలో నుంచి !

చేస్తున్నై అమృత పానం నీ వక్షో మేరు శిఖరాలపై వ్రాలి – దేవతల వలె !

చకోర రాత్రి అది మనకు !

చక్రవాక రాగరంజిత శంఖం నీ కంఠం – ఆహ్వానిస్తున్నది నన్ను !

*కృష్ణా !*

*కృష్ణా !*

*ముజ్జగాలు మోహించగ !*

*మురళిని వాయించరా !*

నీకులా ఎంత మనోమోహనంగా ఉన్నది ఫాల్గున ప్రభాతం !

ఈ పద్మాకర తీరంలో, ఈ మధుశిలపై నిలబడి, ఆరాధిస్తున్నాను నేను నీ పూర్ణ సౌందర్య మధూదయ శ్రీధామ వైభవాన్ని !

మధూద యానంద రాగ సుప్రభాతం నీవు !

ఇప్పుడు నీలోనే నే నున్నది !

**మోవికి నను క్రోవి చేసి**

**మోహనముగ వాయించర !**

**ఛిదురమైన కళ గళమున**

**మధురమైన చాలురా !**

# 101

నాది స్వార్థమే !

అయితే – స్వార్థం లేని దెవరికి ?

విత్తనం మొలకెత్తి నప్పటి నుంచీ,దాని వేళ్లు నేలనూ, ఆకులు గాలినీ గాలించి – ఆహారాన్ని సేకరించుకోవడం స్వార్థమే కాదా ?

మానవుడు తనకు కావలసిన దాన్ని చిన్నప్పుడు ఏడ్చీ, పెద్దప్పుడు పోటీపడీ సాధించుకోవడం కూడ స్వార్థమే మరి.

ఎవరి ఆనందఫలం గానో అభివ్యక్త మవుతుంది జీవి. తన ఆనందం కోసమే బ్రతుకుతుం దది. ఆ ఆనంద ఫలాన్ని లోకంలో వదలిపోతుంది తిరిగి !

ఆ ఫలం యొక్క భవిష్యత్తు కోసం ఎంత జాగ్రత్త ! ఎన్ని లక్షల ప్రతులు ! ఎన్ని కోట్ల బీజాలు !

చిన్న బీజంలో ఎంతటి మహాశక్తి !

వృక్షంతో పాటు దాని పువ్వులు, పండ్లు, వాటికోసం వచ్చే అళులు, పిట్టలు, దాని నీడను చేరే పాంథులు, పశువులు వగైరా మొత్తం దాని. జీవిత చరిత్ర అంతా ఆ బీజం లోనే లేదా ?

మితిమీరిన జాగ్రత్త !

లక్ష బీజాలు వ్యర్థమై పోయినా, ఒక్కటైనా నిలుస్తుందనే ఆశే మూలం ఈ జాగ్రత్త అంతటికీ !

ఎంత వేస్టుకు, ఎంత రద్దుకు సిద్ధపడి నిల్పుకొంటున్నది ప్రకృతి తనను తాను !

ప్రకృతి లోని ప్రతి జీవీ ఒక నియంత.

తనవాళ్ళ నెందరి నైనా బలిపెట్టి, పరాయివాళ్ళ నెందరి నైనా మట్టుపెట్టి, తన జాతిని రక్షించుకొనే నియంతే - ప్రకృతి లోని ప్రతి జీవీ !

తాను కేంద్రం.

తన చుట్టూ కల సృష్టి సమస్తమూ తన కోసం !

తత్ త్వమ్ అసి- అన్నది అన్ని జీవులకూ వర్తించేదే.

అహం బ్రహ్మాస్మి - అని ప్రతి జీవీ అనుకొంటుంది తనకు తెలీకుండానే !

మనిషి బిడ్డకు తాను మనిషి ననే జ్ఞానం ప్రత్యేకంగా ఎలా అక్కర లేదో, పుల్లిపిల్లకు తాను పులి ననే జ్ఞానం అలానే అక్కర లేదు !

తానేమిటో తన పుట్టుక తోనే తెలుసు ప్రతి జీవికీ !తానే పరబ్రహ్మ యొక్క ప్రధానాంశ, ప్రతినిధి అనే అహంకారం తోనే పెరుగుతుంది - ప్రవర్తిస్తుంది - అది !

అలా ప్రవర్తించకపోతే, అది సహజసిద్ధమైన జీవే కాదు.

జీవిత సంఘర్షణలో తానే గెలవా లన్న పట్టుదల, తెగింపు అందుకే దానికి !

మనిషి కంటికి అరటిపండు ఎంతో, పెద్దపులి కంటికి మనిషీ అంతే !

తన కోసం సృష్టించబడ్డ ఆహారం ! అంతే !

జీవితానికి పర్యాయపదం స్వార్థం. స్వార్థం లేకపోతే సృష్టి లేదు. జీవితం లేదు. అభ్యుదయం లేదు.

మానవుడి విషయంలో - మెదడు వికసించి, స్వార్థం వెర్రి తలలు వేసి, మొత్తం సృష్టే నశించిపోయే ప్రమాదం ఏర్పడి నప్పుడు పుట్టుకొచ్చింది - ఆత్మవత్సర్వ భూతాని - ధర్మసూత్రం !

కట్టు తప్పిన మానవ స్వార్థానికి కళ్ళెం వెయ్యడం వరకే ఆ సూత్రం ప్రయోజనం.

దురుపయోగ పరచబడిం దది ఆ తర్వాత.

అంతటితో ఆగిపోయింది ప్రకృతీ వికాసం.

శాంతి ఎందుకోసం ?

జీవిత లక్ష్యం ఏమిటి ?

ప్రకృతి కేది పరమార్థం ?

రామాయణ కాలం నుంచి, మొన్నటి నానావతి కేసు వరకు, మానవ ప్రకృతిని పరిశీలించి చూస్తే - సాధించబడ్డ పురోగమనం ఎంత ?

ఇన్ని వేల సంవత్సరాల లోను - సమాజం యొక్క గాని, వ్యక్తి యొక్క గాని నైతిక స్థాయి పెరిగిందా ? కామ క్రోధాదులలో మార్పు ఏ మాత్రమైన వచ్చిందా ?

సత్యానికి కృతయుగంలో ఒకడూ, పితృవాక్య పరిపాలనకు త్రేతా యుగంలో ఒకడూ తప్ప, మనకు వేరే ఉదాహరణలు ఉన్నవా ?

మానవుడు స్వార్థాని కొక చెడ్డ అర్థాన్ని కల్పించుకొని, తన ఆత్మకు తానే కళ్ళెం తగిలించుకొన్న రామాయణ కాలం నాడే ఆగిపోయింది మానవ పురో గమనం !

గిడసబారి పోయింది సృష్టి !

ఎండిపోయింది భావలత !

అందుకే - వాల్మీకి రామాయణం నకళ్ళకు నేటికీ ఈ గిరాకీ !

ఎన్నో వేల సంవత్సరాల క్రితం వాల్మీకి ఒక బొమ్మ వ్రాసి పెడితే - అదే ఈ నాటికీ లక్ష్యం మనిషికి ! ఇంకెక్కటి ప్రగతి ? ఇంకెక్కడి వికసన ?

బహుశా - ఈ జాడ్యం నుంచి బైటపడడానికి ఇప్పుడు మానవుడు పడుతున్న గిజగిజే నేటి మోడర్న్ ఆర్టు !

సృష్టి పునరుజ్జీవం పొంది, పురోగమించా లంటే -పోనివ్వాలి ఆత్మను యధేచ్ఛగా !

విదలించి వెయ్యాలి గతాన్ని

స్వేచ్ఛగా రూపొందాలి భవిష్యత్తు

ధైర్యం లేదు మానవుడికి !

శాంతిని కోరేవాడు చచ్చిన వాడితో సమానం.

మానవ ప్రసక్తే లేకుండా, మానవ బుద్ధికే అందకుండా, భవిష్యత్తు యధేచ్ఛగా రూపొందితే ఎలా ఉంటుందో !

హఠాత్తుగా నీవు నాలో ప్రవేశించినంత ఉత్తేజకంగా ఉంటుందా ?

నాది స్వార్థమే

పరమ స్వార్థం నాది.

అది నీవే కద !

నా సమస్త త్యాగమూ నీ కోసమే కద !

*త్యాగ మన నేమిటే ? భోగ మన నేమిటే ?*
*పరమభోగమె త్యాగ ఫలమౌను కాదటే ?*
*నా కున్న స్వార్థ మీ లోకాన కలదటే ?*
*స్వార్థపరులకు నేనె స్వామి నౌదును కదే !*

# 102

*నా తెలుగు జాతికే జాతీయ తరువువే,*
*లోకానికే నీవు ఏకైక రస రమవు !*
*చూపవే నా తెలుగు శోభ జగముల కెల్ల !*
*ఓ ఆమ్రవల్లరీ ! ఓ రసాలేశ్వరీ !*

*పాడునే పికము నీ ప్రాణబీజము లేక ?*
*సాగునే జగము నీ శక్తి చక్రము లేక ?*
*సకల సౌందర్య కీలక రసమవే నీవు !*
*ఓ చూతవల్లరీ ! నా సాహితీ ఝరీ !*

*నీ రూపు, నీ ఏపు, నీ చూపు, నీ కాపు ?*
*కామధేనువు చేపె ! కల్యాణముల ప్రాపె !*
*నీ పుష్ప ఫల రసోన్మీలనమె నా బ్రాహ్మి !*
*ఓ సురభి వల్లరీ ! శ్రీసౌధ శేఖరీ !*

విరియబూచిన సహకార వల్లరీ !

తెలుగు జీవిత విక్షేప వైఖరీ !

నిన్ను మించిన సౌందర్య లక్ష్మి ఎక్కడుందీ లోకంలో ?

నీ వయో లీలే వసంత హేల !

నీ వసంత హేలే నా జీవిత ఖేల !

ఒక్క నీవే సఖివి కాగలవు నా వైశాఖికి !

ఎవరా పిల్ల - అంటున్నావా ?

*మామిడి పూల వాసనల*
*మత్తున, నూతన పర్ణశాలలో*
*మై మరపొంది, జీవితపు*
*మాధురులన్ కలలందె కాంచుచున్,*
*కోమలి ! ఈ వసంతమును*
*గుత్తుకు గైకొనియుంటి ; నా హృదా*
*రామము చాల రమ్య మగు,*
*రమ్యోక సా, రిటు తొంగిచూడుమా !*

అంటూ - ఎవర్ని ఆ బాల్యంగా గొంతెత్తి పిలుస్తూ వస్తున్నానో - ఆ రాగ రమే వైశాఖి !

అదిగో, ఆమె వస్తున్నది, చూడు !

ఉగాది కదా నేడు ?

ఆమె వస్తున్నదన్న వార్తకే, ఆమె సాన్నిహిత్య భావనకే, రస ప్లావితమై పోతున్నది - నా హృదయంలా, ఈ ప్రకృతి అంతా !

ఇది కదా రస మంటే !

విభావాదులతో కూడిన స్థాయీభావమే రసమన్నారు లాక్షణికులు.

అలానే అనుకోనీ వాళ్ళను !

ఏది రసం ?

ఆమెను చూచినప్పటి నా కన్నుల లోని అరుణోదయం - రసం.

ఆమెను పల్కరించి నప్పటి నా కంఠంలోని స్వరలహరి - రసం.

ఆమె కబుర్లు విన్నప్పటి నా శ్రుతుల లోని సామగానం – రసం.

ఆమెను స్పృశించినప్పటి నా నరాల లోని విద్యుత్తు – రసం.

ఆమె అధర బింబం లోని అమృతమే – రసం

ఆమె పారవశ్యం లోని పరమానందమే – రసం.

ఈ రసం–

అనంతకోటి ఆనంద జన్మల సుకృత ఫలాల సమ్యక్సార మధుర సుధా రసమే !

అలా చూడు !

ఆమ్ల కటు కషాయ తిక్త లావణ్య రస రుచులతో – ఇక్షు నింబ చూతాది రసాధిదేవతలు – తమ తమ ఆత్మ రస కలశాలతో ఆ మాధుర్య రస రాశిని ఎలా సేవిస్తున్నారో, చూడు !

రుచి గల రసాలు ఆరే.

అవన్నీ శృంగార మాధుర్యానికి ఆశ్రితాలే !

శృంగార కళే రాగవైశాఖి !

ఆమె కేంద్రంగా , ఈ సకల రస ప్రకృతీ వసంత బృందనాట్యం చేస్తున్నది , చూడు !

రాత్రి కనిపించని చంద్రబింబం ఈ ఉదయం ఈ ఉద్యానంలో ఉదయించినట్టు లేదూ ఆమె !

షోడశ కళా ప్రపూర్ణ అయిన నవయౌవన నిత్యషోడశి , నిరంతర మధుర వసంత , నితాంత సుందర శివానందలహరి – ఆమె .

ఆమె ముఖంలో చిరుచెమటలా మిలమిల లాడుతున్న ఆ వెన్నెలే – రసం !

నింపుకో దాన్ని హృదయం నిండా !

సార్థకం చేసుకో నీ రసాలాఖ్యను !

ఇవిగో – నా చెలి వస్తున్న జాడలు !

**నను చూచి నెమలి పిం**

*ఛము విప్పి నర్తించు !*

*వనములో నిను చూచి*

*వచ్చినది కాబోలునే , చెలీ !*

*నను చేరి పికము కం*

*ఠము దిద్దుకొనె సాగె !*

*వనములో నీ పాట*

*వినివచ్చె కాబోలునే , చెలీ !*

*నను పట్టి మలయ పవ*

*నము కౌగిటను గ్రుచ్చు !*

*వనములో నిను గొల్చి*

*వచ్చినది కాబోలునే , చెలీ !*

ఇదిగో . నా చెలీ !

వసంత విస్రంభణశీల అయిన ప్రకృతి సుభగంకృత అయి , సహస్ర వైహారికి సౌదర్య సఖీ పరిసేవిత అయి కొలిచిరాగా –

అభిగామిక సంఉదర కళా మోమనంగా విజయంచేస్తూ –

దేవీ ! అబ్బ – ఎంత బాగున్నావు !

*ఆపాదమస్తకము ఆనంద కళలతో*

*నా దేవి నిత్యసుందర షోడశీ దేవి !*

*సర్వాంగపూజా ప్రసాద మాధవి దేవి !*

*తరుణజీవన నిరంతర రసైందవి దేవి !*

# చైత్రి

ఇదిగో – ఇదీ వసంతం !

మిట్ట మధ్యాహ్నం

మామిడి నీడలో

చుట్టూ పనసలు , జీడిమామిళ్ళు , కొబ్బరితోపులు , వేపలు , రావి చెట్లు , వటవృక్షాలు

దగ్గరలో వైనతేయం –

ఊమ్మని వీచింది గాలి !

జల జల రాలినై ఆకులు !

గిర గిర తిరిగింది సుడిగాలి – ఆటవిక నర్తకిలా – రాలిన ఆకుల్ని మెలకు చుట్ట బెట్టుకొంటూ , దూళినీ దుమ్మునూ రేపి మైపూత గావించుకొంటూ !

కళ్ళు మూసుకొన్నాం మనం

చీర మార్చుకొన్నది ప్రకృతి !

గుప్పున కొట్టింది పరిమళం !

ప్రాణం లేచి వచ్చింది మనకు !

ఎండుటాకుల్నీ , ధూళినీ మోసుకొని , కారెండలోపడి , పోతోంది సుడిగాలిలా – శిశిరం – చెట్ల వెంటూ , పుట్ల వెంటా !

దాన్ని వెంటపడి తరుముతున్న పసిరిమొగ్గల పురిటి పరిమళం , వేడిగా నిట్టూర్చుతూ , ఆమోదంగా ఆగింది మన దగ్గర !

రాలిపోయిన కారాకుల కుదుళ్ళలో నుంచి - నిక్కి చూస్తున్నె క్రొంజివుళ్ళు ఎఱ్ఱని బోసి నవ్వులతో .

పొదలలో గువ్వలు , గోరింకలు , దొంకదూరు పిట్టలు , పిచికలు , పికిలింకలు -

చెట్లలో చిలుకలు , కోకిలలు , కాకులు , చెముడుకాకులు , వడ్రంగులు , నెమలి పిట్టలు -

నీడలో మనం !

గాలి తిరిగింది !

మిట్ట మధ్యాహ్నపు ఎండలో , చెమటలో నానిపోతూ , ఉస్సురుమంటున్న ప్రకృతి - పైట తీసి వేసుకొన్నది - దక్షిణపు గాలికి !

కో - అన్నది కోకిల !

అదిగో - అన్నది నెమలి !

చూశా అన్నది చిలుక !

పోయా వాలిం దది - ముసుగులో పరువుకు వచ్చిన సువర్ణ రేఖల గుత్తైపై !

కొరుక్కొన్నది వగరు చిగు రొకదాన్ని కోకిల !

తుమ్మెదలై రేగినై నా చూపుల నీ చుట్టూ !

తామరపూల తోటవు నీవు !

ఓహో -

ముంజెలు

ఎలనీరు

ఒలిచిన పంపరసనస తొనలు

పాలకొబ్బరి మీగడ

వెన్న ముద్దలు

వాటి కొసలపై ఎర్ర ద్రాక్షలు !

మల్లెపూల చెండ్లు

వాటినుంచి తీయమామిడి రసం !

వయ్యారపు వాగులు

వాటి గట్ల వెంట అరటి , పసుపు , పోక , తమలపాకుల తోటలు !

మెడ దిగువ మెరిసే నున్నని బంగారు తిన్నెలు

వాటి కాటుకమొనలపై నా వ్రేళ్ళ కనుపాపల సరిగమలు

వాటికి నీ గొంతుకలోని కోయిల వలపుల కువకువలు !

ఎంతలో ఎంత లీల !

నీవే వసంతం !

అచ్చం నీకులా – ఇదీ వసంతం !

రెండు మాసాల పాటు ప్రతి క్షణమూ వసంతమే అయినా – ఏదో ఒకొక్క నిమిషం ప్రత్యేకంగా తట్టి చూపుతుంది – ఎత్తి చూపుతుంది – పట్టి ఇస్తుంది. ఇదిగో వసంత మంటూ , అతిలోక రహశ్శోభను !

అదే నీ దివ్యదర్శనం !

నీవు మొదటిసారి ముద్దిచ్చిన ఆ క్షణమే వసంతోదయం నాకు .

ఆ ముద్దే మజ్జగాలకూ నన్ను ప్రణయ సమ్రాట్టును చేసిన అమృతశ్రీ !

అప్పటినుండి ప్రతి ఓణమూ వసంతమే మనకు .

హార్దికమైన ఆ అమృత శ్రీవసంతం మన సొంతం , శాశ్వతం .

ఈ నెటి వసంతం కేవల కాలికం . అందరికీ చెందిన సంతలాంటి దిది . ఎవరికి కావలసిన సుఖ సంతోషాలను వారు సేకరించి పెట్టుకొంటా రీ సంతలో – వారి వారి శక్తిని బట్టి – ఏడాదికి సరిపడేదంతగా !

సంవత్సరానికి సరిపడే చివుళ్ళు , పువ్వులు , తేనెలు , పండ్లు – సమస్త సంభారాన్నీ ఇప్పుడే నిల్వచేసి పెట్టుకొంటుంది ప్రకృతి !

మన కే మిస్తుంది ఈ బాహ్యవసంతం ?

మన వసంతం మనలోనే ఉంది కద !

హృదయ వసంతం అదృష్ట లబ్ధం !

అది వెకరికి , ఎప్పుడు లభిస్తుందో తెలియదు .

బాహ్య ప్రకృతితో , ఋతువులతో , వయస్సులతో , రూప గుణాదుల తో , ప్రయత్నాలతో , ప్రార్థనలతో ప్రమేయమే లేదు దానికి .

ముందుకు సాగవలసిందే జీవి అది లభించే వరకు !

గమ్యం చేరేదాకా – మధ్య మజిలీ లన్నీ తాత్కాలికాలే !

తనది ఆ గమ్యం . తన సొంతం . అదే తన వ్యక్తిత్వం .

ఎవరి గమ్యం కలిసిందే ముద్దు .

ఆత్మ దాకా అతుక్కుపోయిన రెండు పెదవుల ఎర్రముద్దే జీవేశ్వర పరిచుంబన పరమ రస స్థితి !

ఆ ఎరుపే వసంతం !

ఇటు నుంచి నేను , అటు నుంచి నీవు – చేస్తూ వస్తున్న ఎంతో యాత్రకు క్షేత్రం ఈ వసంతమే !

బాహ్య ప్రకృతితో, ఋతువులతో, వయస్సులతో, రూపగుణాదులతో, ప్రయత్నాలతో, ప్రార్థనలతో ప్రమేయమే లేదు దానికి.

ముందుకు సాగవలసిందే జీవి అది లభించే వరకు !

గమ్యం చేరేదాకా – మధ్య మజిలీ లన్నీ తాత్కాలికాలే !

తనది ఆ గమ్యం. తన సొంతం. అదే తన వ్యక్తిత్వం.

ఎవరి గమ్యం వారిది.

ఇద్దరి గమ్యం కలిసిందే ముద్దు.

ఆత్య దాకా అతుక్కుపోయిన రెండు పెదవుల ఎర్రముద్దే జీవేశ్వర పరిచుంబన పరమ రస స్థితి !

ఆ ఎరుపే వసంతం !

ఇటు నుంచి నేను, అటు నుంచి నీవు – చేస్తూ వస్తున్న ఎంతో యాత్రకు క్షేత్రం ఈ వసంతమే !

ఇదే జీవిత గమ్యం
ఇదే జీవిత విజయం
ఇదే మనం !
ఇదే త్రిగాదేవి శోభన శోభా శ్రీ మందిరం !
ఉదయ చంద్ర పూర్ణ బింబం
ఉదయ భాను బాల బింబం
రెండూ రెండు వెన్నెల వెన్న ముద్దలు !
ఎంత పరమ రుచిరంగా ఉన్నై ఇవి !

వీటి ఈ నడుమ లోయలో –మెత్తని, నున్నని, గుండ్రని ఈ గిరుల వంపుల్లో, నీడల్లో – అంచులను రాసుకొంటూ, అలలతో గిరి మొనలను దువ్వుకొంటూ – ఉప్పొంగి ప్రవహిస్తున్న యౌవనధార !

ఎంత దివ్యంగా ఉన్న దిది !

ఈ అమృత ధారా ప్రవాహంలో – రేబవళ్ళ జంట రేకల కెందామర పూదొన్నెలో, సంధ్యారాగంలా పొంగులు వారే సౌందర్య మధువును ఆస్వాదిస్తూ – ఇటు ఈ చరణ పద్మాకరం నుంచి, ఇటు ఈ మానస కాసారం దాకా, నిరంతరం విహరించగల ఈ సోహం చక్రవర్తిత్వం !

ఎంతటి అమృత పదవి నా కిది !

ఓహో – ఇదీ వసంతం !

*నీ సహస్రదళ మనఃపద్మం నిండా పరమమధువు,*
*నా పెదవుల సంపుటి నిండా ఆనందమధువు,*
*ఈ పరమానంద మధుసంధానమే వసంతం !*
*ఇదే మనకు నిత్యజీవన శ్రీమంతం !*

## 104

" ఇక్కడి నుంచి – అక్కడి వరకు – ప్రతి రుచినీ, ప్రతి కళనూ, ప్రతి వంపునూ, ప్రతి అణువునూ అనుభవించాలి నేను.

" ఆ అనుభవమే పూజాద్రవ్య సర్వస్వంగా, అర్చించాలి సరస్వతిని నేను నిరంతరంగా.

" ఆనందంతో లేచి, మైమరచి, లాస్యం చెయ్యా లామె – వీణాతంత్రులే రంగస్థలంగా, వివిధ రాగాలే గజ్జెల మువ్వలుగా !

" అప్పు డామె పాదపద్మాలలో మనిద్దరం – రాగ లవాలమై–రజో లేశాలమై, కింకిణీ స్వనాలమై – స్వరలహరీ భ్రమరాలమై – శ్రుతి రహస్యాల అంతఃపురాల వెన్నెల పరదాల – "

ఎంత గమ్మత్తు చేశావు, హఠాత్తుగా – నేనలా చెప్పుకు పోతూ, పై మూర్ధం నుంచి నీ నాభిదేశం చేరగానే !

" అంతే ! అంతవరకే నేను ! ఆ క్రింద మరేం లేదు ! " అని నీ వన్నప్పుడు – తెల్లబోయిన నన్ను చూచి, ఎంత నవ్వింది చంద్రుడి ఒడిలోని ఆ చిత్ర !

లోకోత్తర ప్రణయానంద సుధాపరిస్నపిత అవుతూ కూడ, నిత్య కన్యగా అందరి పూజలూ అందుకొంటున్న చిత్ర !

ఇది కదా పూర్ణ ప్రణయ రహస్యం !
పూర్ణచంద్రుని ఒడిలో అక్కడ ఆమె
నా ఒడిలో ఇక్కడ నీవు !
మీ ఇద్దరిదీ ఒకే ఆత్మ !
వెన్నలా కరిగి, వెన్నెలగా విరిసే అనురాగ చైత్రి అది రాగవైశాఖి ఇది !
చైత్రీ సఖం నీ శ్రీముఖం !
నా నిగ్రహాని కది అగ్నిపరీక్షే అయిందా క్షణం !
తెల్లబోయి తేరుకొన్న నాకు, అప్పు డనిపించింది – నీవన్నది నిజమే అని !

నాకు ఆత్మ ప్రీతికరమైన పరమ సౌందర్య మంతా – మాయ చాటున పరమాత్మ వలె – నీ పమిటె చాటునే నా కోసం ఉప్పొంగి ఉండగా, అది నాకు కరతల నవనీతఫల సుభగమై ఉండగా, తదమృతఫల మాధుర్యం అధరామృత మాధుర్యాన్ని మించి నన్ను ఆమ్రేశ్వరుణ్ణే చేస్తుండగా – ఇంకా ఏముంది నేను కోరేది ?

తాకదగిన, చూడదగిన, వినదగిన, మననం చేయదగిన, ఆరాధించదగిన పరమసుందర శివాద్వైత మంతా, కైలాసగిరి శిఖర స్థాయిలో, ఆవిష్కృతమై ఉంది కద – నా ఎదుట, నన్ను అదుముకొని !

జ్యోతిర్మయాలైన నీ కందొవలు

చంద్ర శీతలమైన నీ మనస్సు

వాగ్దేవికీ, శ్రీలక్ష్మికీ ఏకాసన మహనీయమైన నీ వదన పద్మం

అమృత కలశం అంచులే అయిన నీ పెదవులు

దిగ్దిగంత ప్రాభవాలకు ప్రతినిధులైన నీ శ్రీశ్రుతులు

పంచబాణ పరశ్శతాలను ఒకేసారి ఎక్కుపెట్టి ఉంచిన నీ భ్రూకుటి

అష్టమీందు సమైందవీ ప్రాభవమైన నీ నుదురు

ఉద్రిక్త వాతపోతాలచే బెదరగొట్టబడ్డ నీలిమబ్బు తునకల వటి ముంగురులు

ప్రాణ ప్రియా కాంతిమ యాంతః పురానికి చీకటి తలుపుల్లాంటి నీ కాటుక కనురెప్పలు

సూర్యచంద్రులు గతిక్రమాన్ని నియమిస్తూ, జన్మజన్మాల వాసనా విక్రీడితమై ఉన్న నీ నాసాగ్రం

నల్లని తుమ్మెదలు - కాళి గౌరి కావడం కోసం వలె - తపస్సు చేసి, వరప్రసాదలై- ఆపాదమస్తకం, నా ప్రతి అణువులోను, చిప్పిలుతున్న ప్రణయ మధువును పీల్చుకొంటున్నవో అన్నట్టున్న నీ నిశిత కుందరదన సేనా పంక్తులు

తార వెనుక దాగిన బుధుని భయానకం వంటి నీ కేశ విక్షేపం

సమస్త శృంగార సాహితీ రసధ్వనిని ఒక్క కూజితంలో ఒత్తగల నీ రాగరంజిత కంబుకంఠం

మేరుగిరి శిఖరాలే, పూర్ణచంద్ర బింబాలే అసూయ పడగల నీ పాలిండ్ల బంగరు బల్బులు

రెండు బంగారు కొండల మబ్బు శిఖరాల నుంచి దిగి, సువర్ణ సానుస్నిగ్ధ రుచులతో మిలమిల లాడుతూ, ఆ లోయలో ఏకమై, మహార్ణవ ముఖంగా క్రిందికి ప్రవహిస్తున్న నీ నూగారు

పేటిత కేళీ విహార కేంద్రమైన నీ నాభిదేశం

ముద్దులు, ముఖభూషలు, చాలనలు, చంద్రవంకలు, వషట్కృతి, పంచాంగుళం, ప్రాణం, హృదయం, నాడి, స్పందనం -

ఓహో !

పరమానంద పరాదేవతే నిజస్వరూపం తో సాక్షాత్కరించింది కదా -

ఒక్క నీ చిరునవ్వు పమిటెలో తళుక్కుమని !

ఇంకేం కావాలి నాకు ఇంతకంటె ?

ఇప్పటి కింతే చాలు - అర్చించనీ నన్ను - కామకళ అక్కను, శృంగార కళను !

విహరించనీ నన్ను - ఈ రసానంద రసాల వనసీమలో, ఇచ్ఛానుసారం !

ఉండనీ నన్ను ఇలానే - ఈ ఆనంద సాగర తీరంలో

గవ్వలు, పగడాలు, ముత్యాలు, ముత్యపు చిప్పలు ఏరుకొంటూ - ఇసకతో ఈప్సా సౌధాలు కట్టుకొంటూ - తరంగాలకు తాళం వేస్తూ ఆడుకొంటూ, పాడుకొంటూ !

గ్రోలనీ నన్ను - ఈ పూదేనెలను, ఈ ఫలరసాలను !

మైమరచి పోతానేమో నేను !

మైమరిచి పోతే, దూకుతానేమో సాగర తరంగాల మోహన ఆకర్షణల లోకి !

ఈదలేక పోతానేమో, దూకితే !

మునిగి పోతానేమో పూర్తిగా వివశుణ్ణయి !

ఇం కేం మిగులుతా నప్పుడు ?

మిగలకుండా - ఎలా అనుభవించగలను ఈ నీ సౌందర్యాన్ని అంతా ?

నిజానికి, ఇదే నీవు !

ఇంతవరకే నీవు !

ఆ క్రింద మరేముంది ప్రత్యేకత - సృష్టి యొక్క సాధారణ పరిపాలనా కేంద్రం తప్ప !

నీవు, నేను అనే వ్యక్తిత్వం కేవలం ముఖం వరకే !

అదే స్వర్లోకం !

ఆ దిగువ భువర్లోకం మన రాధామాధవ విహార సుందర క్షేత్రం !

ఆ క్రింది భూలోకం అంతా వట్టి ప్రజాస్వామికం ! వోటు పత్రాలన్నీ ఒకే రూపం ! తేడా ఏమీ లే దక్కడ !

చాలు నాకు ఇంతవరకు !

నా ధ్యేయం వోటు కాదు – వ్యోమప్రాభవ విజయ ప్రభ !

సంగీత సాహిత్య కళా కలశాలైన ఈ చైత్రీ వైశాఖీ పూర్ణబింబ ప్రియలు – శృంగార సుధా కామకళా కలశాలు – చాలు నాకు తరించడానికి !

ఓహో, దేవీ ! రాగవచ్ఛవీ !

నీ వన్నది సత్యం !

నీ క్రీడ సత్యస్య సత్యం ?

*కుసుమ భరిత వనాలు, కోయిలలు, తుమ్మెదలు,*
*పద్మములు, తేనె దొప్పలు, రసాల ఫలాలు*
*ఆనంద రస మింతకన్న నేమిటె ? చెలీ !*
*నీ కన్న ఆనంద నిలయ మేమిటె ? చెలీ !*

## 105

హిమనీ శీతల పానీయ మందిరంనుంచి తెప్పించుకొన్న ద్రాక్షరసం నీ అధర సుధారసంతో కలిసి , ఎంత మధురంగా ఉంది !

నీ వదన చంద్రకలశం నుంచి , అమృతంవలె , రసాన్ని పీలుస్తున్నాను నేను – ఇవతలి నుంచి స్ఫురిత స్వరంతో !

అవతలినుంచి నీవూ అంతే !

నీవు , నేను – కలశం నిండా బుద్బుదాలను సృష్టిస్తూ , గ్రోలుతున్నాం కొరినొకరం – రెండు గొట్టాలతో , చెరొకవైపు నుంచీ !

ఎన్ని బుద్బుదాలు !

క్షణభంగురాలా అవి ?

ఒకటి పోతే మరొకటి !

అదే రసం, అదే స్వభావం పునప్పునహా !

నిరంతరం ఈ సృష్టి !

ఆనంద క్రీడ ఇది మనకు !

అలా ఎంత సేపు ?

కలశంలో రసం ఉన్నంతసేపే ఈ సహస్రాధిక రస జగత్తుల రాసలీలలు !

అంతేనా ?

రసం ఉన్నంతసేపే మనం కూడ !

ఎంత అందంగా ఉన్నై బుడగలు నక్షత్రగోళాల్లా !

రసం అయిపోతే -దానితో ఈ విశ్వలీలే కాదు, మనం కూడ ఆఖరు !

నన్ను నీవూ, నిన్ను నేనూ ఆస్వాదించేస్తే - ఇంకేం ఉంటుంది మిగిలి?

ఆపుదామా ఇక ?

శాంకరీ శంకర విశ్వక్రీడా శాంబరిలా ఉన్న దది !

అనుభవించవద్దా దీన్ని మనం సంపూర్ణంగా ?

మిగుల్చుకోవద్దా మనల్ని మనం మరొక ఘడియ దాకా ? మరొక ఋతువు దాకా ? మరొక యుగం దాకా ?

అనుక్షణం ఇలానే ఒకరి నొకరం గ్రోలుకొంటూ , మళ్ళీ ఎప్పటిలాగే నిండుగా మనల&ఇన మనం మిగుల్చుకొంటూ , నడిపించలేమా ఆద్యంత రహితంగా ఈ ఆనంద రాగలీలను ?

ఓహో ! తరగడం లేదీ కలశం !

ఎవరు నింపుతున్నారో దీన్ని మళ్ళీ మళ్ళీ !

మన ఇద్దర్నీ ఇలా చేరదీసిన ఎవరో - మళ్ళీ మళ్ళీ నింపు తున్నారు మన కలశాన్ని !

మనల్ని మనం మరొక ఘడియ దాకా ? మరొక ఋతువు దాకా? మరొక యుగం దాకా ?

అనుక్షణం ఇలానే ఒకరి నొకరం గ్రోలుకొంటూ, మళ్ళీ ఎప్పటిలాగే నిండుగా మనల్ని మనం మిగుల్చుకొంటూ, నడిపించలేమా ఆద్యంత రహితంగా ఈ ఆనంద రాగలీలను ?

ఓహో ! తరగడం లేదీ కలశం !

ఎవరు నింపుతున్నారో దీన్ని మళ్ళీ మళ్ళీ !

మన ఇద్దర్నీ ఇలా చేరదీసిన ఎవరో - మళ్ళీ మళ్ళీ నింపుతున్నారు మన కలశాన్ని !

అవును !

నన్ను నీవూ, నిన్ను నేనూ అస్వాదించే స్తే - నేను నీవూ, నీవు నేనూ అవుతామే కాని - ఆఖరెలా అవుతాం ?

మనం ఆఖరు కాం ఎన్నటికీ !

ఈ పాత్ర అక్షరం, అక్షయం !

మనం శివసరస్వతులం !

ఈ కలశం అక్షయం

రసం అక్షరం !

మనం అక్షయ రమ్యాక్షర రాగ రసాస్వాదన పరాత్పరులం !

గొట్టాలా ఇవి ?

రసవాహిను లివి !

పెదవులా ఇవి ?

నిత్యజీవన సుధాపూర్ణ సంపుటీ సమైశ్వర్యా లివి !

*పెదవి గల అక్షరము లన్నీ*
*అక్షరము లే నటే ?*
*ప్రేమ అను రెండక్షరములే*
*అక్షరము లౌ కదే !*
*అక్షరము లన్నంతనే అవి*
*అక్షరము లౌనటే ?*
*ప్రేమ అను రెండక్షరములే*
*అమృత పాత్రలు కదే !*
*అమృత పాత్రము లన్నియును శివ*
*సరస్వతు లౌ నటే ?*
*ప్రేమ అను రెండక్షరములే*
*నీవు నేనును కదే !*

# 106

" అంత కందిపోయేటట్టా కరిపించుకొంటారు పెదవుల్ని – అన్నది వర్ష!

" ద్రాక్షరసం గుజ్జు అంటుకొన్నదంటే – నమ్మలే దది !

" నా పెదవుల్నీ, బుగ్గల్నీ, వాటినీ చూస్తూ కూర్చుంటుంది ఎప్పుడూ.

" ఎంత బాగున్నై – అన్నది మీ ఆర్ద్రారోహిణుల్ని చూచి !

చివర చెరొక ద్రాక్షపండూ గుచ్చిన రెండు వెన్నముద్ద లట అవి !

" పైట సర్దుకొన్నాను వెంటనే సిగ్గేసి !

" ఎందుకా గులాబీల జంటను మరీ ఎరుపెక్కించుకొంటావ్ ? నీ కేనా ఉంట మహా ? నాకూ ఉన్నై ! అన్నది ఈసుగా !

" లేవని నే నన్నానా ఏమిటి ?

" పోనీ, నీకే ఉన్నైలే, దాచుకో – అంటూ, తానే నా పైట సర్దబోయి, నొక్కి – లేత ముంజెలు కదే – అన్నది !

" మీకంటే అన్యాయంగా ఉంది దాని ప్రవర్తన. మీ అమృత కలశాలకు మీరు పెట్టుకొన్న పేర్లన్నీ ఆమె కెలా తెలుసో ! నన్ను ప్రేమిస్తున్నదట అది !

" ప్రేమ దాహంతో కుతకుత లాడిపోతున్నట్టు కనిపిస్తుంది. తనను తానే గట్టిగా అదుముకొని, గిల్లుకొని ఏడుస్తుంది. అంతలోనే నవ్వుతూ, నాపై పడి, కౌగిలించుకొని, బుగ్గలు కరుస్తుంది !

" ఆయ నేం జేశారే – అంటుంది !

" ఎంత సిగ్గు లేనిది !

" శారీరక వాంఛలు తీరక, కామోద్వేగం చల్లారక, ఇలా పిచ్చిదైపోతున్నదో ఏమో !

" అసూయ కూడ ఉన్నట్టుంది.

" ఎంతో కాలంగా పరిచయమై ఉన్న తనను విడిచి, లోగడనే పరిచయమైన నన్ను మీరు ప్రేమించడం, బహుశా, ఆమె హృదయాన్ని గాయపరచి ఉండవచ్చు. అందుకే నన్ను ఇలా పీడించడానికి పూనుకొని ఉండవచ్చు కూడ !

" మీ శృంగార చేష్టలకు ఆనవాళ్ళని తాననుకొనే గుర్తులు ఎక్కడ కనిపిస్తే అక్కడ – తాకి చూస్తుంది, నాకి చూస్తుంది, ఉమ్మేతుంది తూతూ అంటూ !

" మండిపోతుంది నాకు ఒళ్ళు.

" పోనీ, ఆమె కోర్కె ఏదో కాస్త తీర్చి పారెయ్యగూడదా మీరు ?

" మిమ్మల్ని ఇంత పిచ్చిగా కోరుతున్న స్త్రీ, కోర్కె తీరకుండానే చచ్చిపోతే, పిశాచమై పీడిస్తుందో ఏమో ఆ తర్వాత !

" కోర్కె కలగనే కూడదు. కలిగితే, అది తీరవలసిందే. తీరని కోర్కె బలి కోరుతుందిట ఉభయత్రా !

" స్త్రీ కోరితే, ఆ కోర్కెను తీర్చని మగవాడికి సద్గతి లేదన్నారు ఋషులు.

" ఋషుల్ని మనం కాదంటాం గాని – నేడు రోదసీ నౌకల్ని నిర్మిస్తున్న ఇంజనీర్లు లక్షమంది కంటె, ఆనాడు ఒక్క నారదుణ్ణి ఊహించిన ఋషే గొప్పవాడు నా దృష్టిలో !

" ఈ సృష్టి కుటుంబంలో సైంటిస్టు వంటలవాడు. ఋషి వ్యవసాయదారు. రాజు భోక్త !

" అయితే – ప్రియురాలి కుండవలసిన మధుర గుణాలేమీ లేవు వర్షకు !

" కళ్ళల్లో కామబాణా లున్నై. శరీరం చెరకు విల్లులా వంగుతుంది. నైలాను బుట్టలలో ఆపిలు పళ్ళు పరువుకు వచ్చే ఉన్నై. చాలు యువతికి, కాని –

" వాటిని పోషించుకుంటూ, మార్దవ మాధుర్యాలను తదనుగుణంగా పెంచుకొంటూ ఉండాలి జాగ్రత్తగా! ఆ పని చెయ్య దామె.

" ఏవో ఒకటి రెండు పై అందాలు చాలవు స్త్రీకి. పరిచయం స్నేహంగా, స్నేహం ప్రేమగా, ప్రేమ ఆరాధనగా వికసించేటట్టు చేసుకోవాలి తపస్సు ద్వారా !

" ప్రేమ లభించిన చోటనే తాదాత్మ్యం పొందాలి స్త్రీ. అదే ఆమెకు దేవీ పీఠం.

" పురుషుడు ప్రేమించేది అందం చూచి కాదు. అనురాగం అనుభవించి !

" అసలు – పురుషుడు ప్రేమించడం ఏమిటి ? పురుషుడు ప్రేమించడు. పురుషుడి ప్రేమ కామప్రధానం. బ్రహ్మ కామనే సృష్టికి మూలం. అదే పురుషుడికి వచ్చిన వారసత్వం. ప్రేమ, కామం – ఈ రెండూ కలిసిందే పురుష తత్వం. ప్రేమ లేని కామం ఉండవచ్చు ప్రాథమికులలో. అట్టి వాళ్ళే మెజారిటీ కూడ ! కాని కామం లేని ప్రేమ ఉండదు ఎంతటి పూర్ణ పురుషుడి కైనా !

" స్త్రీ అందుకు విరుద్ధం. స్త్రీ ప్రేమిస్తుంది.

" పురుషుడిలో ఉన్నవి రెండు తత్వాలు – ప్రేమ, కామం,

" స్త్రీలో ఉన్నది ఒకే తత్వం – ప్రేమ !

" స్త్రీ లోని ప్రేమ పురుషుడి లోని ప్రేమతో కలిస్తే – అది ఆనంద పరమావధి అయిన తాదాత్మ్య శ్రేయో అమృత పదవే.

" స్త్రీ లోని ప్రేమ పురుషుడి లోని కామంతో కలిస్తే – అది పురుషుణ్ణి పందిగా మార్చి, స్త్రీని బెజవాడ మురికికాల్వగా కంపెత్తిస్తుంది !

" తాను పతనం కాకుండా రక్షించుకోవలసిన బాధ్యత స్త్రీది. పురుషుడికి పతనం అనేదే లేదు.

" అందుకు స్త్రీ ప్రేమించాలి. తన ప్రేమను అందుకొన్న పురుష ప్రేమకే ఆత్మార్పణ చేసుకోవాలి.

" అందుకు – తపస్సు చెయ్యాలి స్త్రీ !

" తపస్సు చెయ్యాలి స్త్రీ. హైమవతి చెయ్యలేదా భీమేశ్వరుడి కోసం ? రమ చెయ్యలేదా శ్రీరాముడి కోసం ? తమస్సు లేని స్త్రీ సామాన్యుడికి భార్య కాగలదే కాని – ఒక పూర్ణ పురుషుడి ప్రియురాలు కాజాలదు.

" ఒక్క మగవాణ్ణి కూడ ఆకర్షించి ఆకట్టుకోలేని స్త్రీలున్నారు. తమ అపజయాలకు కారణాలను సైతం వెతుక్కోరు వాళ్ళు. దిద్దుకోరు తమ లోపాలను, మనస్సులను, ఆత్మలను.

" అందం, అభిజాత్యం, విద్య, ధనం వంటి వ్యర్థ ప్రతిష్ఠలను చూచుకొని గర్వపడే స్త్రీకి జీవితంలో లభించేది స్వకుచ మర్దన సుఖం ఒక్కటే !

" ఆరాధించగల స్త్రీయే ఆరాధ్యదేవత కాగలది.

" అవివాహితుడో, అందగాడో, అవిటివాడో – ఎవడో ఒక్క పురుషుడైనా అనురక్తుడై ఆరాధించగల్గితే – అట్టి స్త్రీ కంటె ధన్యురాలు మరెవరు ?

ప్రియురాల్ని ఉంపుడుకత్తెగా నిరసిస్తూ, గయ్యాళిని భార్యగా గౌరవించేది –వలపు విలువలు తెలియని ఇక్కడి లోకమే ! ఈ లోకానికి శరీరాలే కదా ముఖ్యం ? శరీరాలు ఎంత కాలం ఉంటై ?

" ఆత్మే ప్రధానమైన ఆధ్యాత్మిక లోకంలో – ఎన్ని ఆత్మలైనా కలిసిపోవచ్చు ఒక దానితో ఒకటి అనురాగ బలంతో.

" మీ సిద్ధాంతాలు నాకూ ఒంటబట్టినట్టున్నై ! ఏదో వ్రాసేస్తున్నాను తీరికగా ! మంజీర వచ్చి వెళ్ళిందిలే నిన్న.

" ఆత్మ, అనురాగం వంటివి అర్థం కావు వర్షకు. పిచ్చి కామం దానిది. వట్టి శరీరం, దాని నిండా తాపం.

" నాలుక బ్లేడు. స్వభావం నల్లి. మాటి మాటికీ మూతి ముడుస్తుంది కదా ! అప్పు డనిపిస్తుంది నాకు – గత జన్మలో అది ఏదో ఒక ఎలుక బోనులో చిక్కుకొన్న చుంచు అయి ఉంటుందని !

" అద్దంలో అయినా చూచుకోదో ఏమిటో !

" నాకూ ఉన్నై ఎన్నో లోపాలు. మరి దిద్దుకోవడం లేదా ముఖాన్నీ, మనస్సునూ కూడా – మీలో చూచుకొని ?

" నేర్చుకోదు వర్ష.

" అసూయ వల్ల ఏం లాభం ?

" ఎవరైనా ఇద్దరు స్త్రీ పురుషులు చనువుగా ఉన్నట్టు కనిపించినా – ప్రేమతో పల్కరించుకొన్నా – ఒకరి దగ్గర ఉన్న విద్యను ఒకరు గ్రహించే ఉబలాటంతో పరస్పరం సన్నిహితులైనా కూడ ఓర్చుకోలే దామె. అలాంటి పరిచయాలకు అపార్థాలు కల్పిస్తూ, ప్రచారాలు చేస్తుంది. ఆకాశరామన్న ఉత్తరాలు వ్రాస్తుంది – వాళ్ళ వాళ్ళ పెద్దలకు !

" తాను పెట్టిన నిప్పుకు ఆయా జీవితాలు, సంసారాలు అంటుకుపోతుంటే – తృప్తిగా నిట్టూర్చే ఈ పైశాచిక మనస్తత్వానికి ఏమిటి కారణం ?

" భగ్న ప్రేమ ?

" ప్రేమ భగ్నం ఎప్పు డవుతుంది ?

" ప్రేమించడం చేత కానప్పుడు, ప్రేమలో స్వార్థం ఉన్నప్పుడు. కేవల శరీర కామాన్ని ప్రేమ అనుకొన్నప్పుడు. ప్రేమ కోసం త్యాగం చెయ్యలే నప్పుడు. తాను ప్రేమిస్తున్న వ్యక్తి తిరిగి తనను ప్రేమించా లనుకొన్నప్పుడు !

" నాకు లేనిది మరొకళ్ళకు మాత్రం ఎందుకుండాలి – అనేది ఆశ్లేషయ్య మనస్తత్వం. ఈ రకమైన కుళ్ళు వల్ల చెడేది ఆ కుళ్ళు కలవాళ్ళే !

" అలా చెడింది వర్ష !

" తాను ప్రేమించిందట ! అవతలి వ్యక్తి తిరిగి తనను ప్రేమించలేదట ! అందుకని తాను ద్వేషిస్తుందట !

" అతిథి స్వీకరించనంత మాత్రం చేతనే విషంగా మారిపోయేది నిజంగా అమృతమేనా ?

" ఎవరూ వాడనంత మాత్రం చేత, గుర్తించనంత మాత్రం చేత మాణిక్యం మసిబొగ్గైపోతుందా ? వేలకొలది సంవత్సరాలు భూగర్భంలో కూరుకుపోయి ఉన్నా – రత్నం రత్నమే కదా ? నల్లి నెత్తురుపూత పెదవుల చివర, పొదరు చెంపలపై, చెవి రింగులలో ఎంత మిడిసిపడుతున్నా – నకిలీ రాళ్ళు నకిలీ రాళ్ళే కావా ?

" ఒకసారి ప్రేమిస్తే – ఆ ప్రేమ అమృత దివ్యమూ, ఆనంద పరమమూ అయితే – దానికి భగ్నత అనేదే లేదు కద ?

" ఏదైనా ఒక కాంతి ఆరిపోవచ్చునే కాని, చీకటిగా ఎలా మారిపో గలదు ?

" కాంతులకే అధికాంతి ప్రేమ. ఆరడం అనేదే లేదు దానికి !

" అర్థం కాదు వర్షకు !

" ప్రేమ పరమానంద కైవల్య పదవి అనీ, పెళ్ళి కేవలం సాంఘిక తంతు అనీ – ప్రేమ శివసరస్వతీ పరమాద్వైతమనీ, పెళ్ళి వట్టి బ్రతుకుతెరువు కాంట్రాక్టు అనీ – ప్రేమకూ, పెళ్ళికీ సంబంధమే లేదనీ – ఎరగదు ఆమె !

" తాను ప్రేమిస్తే చాలు. అదే తనకు ఆనంద లబ్ధి ! పరమామృత సిద్ధి !

" రాత్రికి సుఖంగా, ప్రశాంతంగా విశ్రమించే దెక్కడో నిశ్చయంగా, స్వయంగా తెలిసిన వ్యక్తి, పగలంతా ఎన్ని కష్టాల కైనా ఓర్చి, ఎలా శ్రమపడ గలడో – తన ప్రణయాత్మకు పరమ విశ్రాంతి ఏదో గుర్తించుకొని, ఏ తదానందానుభూతిని అపరోక్షంగా పొంది ఉన్న వ్యక్తి కూడ –జీవిత మంతా ఎన్ని పోటీ పోరాటాల కైనా రొమ్ము ఒడ్డి, అలా విజయోన్నత పరా శిఖరాన్ని అధిరోహించగలడు !

" నీవు ప్రేమించిన ఆత్మే నీ పరమాత్మ. అది నిన్ను స్వీకరిస్తే చాలు. అదే నీ సౌభాగ్యానికి పరమైశ్వర్యం – అంటారు మీరు.

" పరమ స్థితిని అందుకోవడానికి ఆమె ఇంకా ఎన్ని జన్మలు ఎత్తవలసి ఉన్నదో ! "

*ప్రేమ భావము లేక, ప్రేమించగా లేక,*
*నిను ఎవరొ వంచించి రని ఏద్వ ఫల మేమి ?*
*ప్రేమించగల దివ్య హృదయమే నీ కున్న*
*శివుడె నీ చరణాబ్జ సేవకుం డగు కదే !*

# 107

" ఛ :ఛ ! అందరి మీదా పడింది ! "

" ఏమిటది ? "

" ముద్దు ! "

" నీ ముద్దుతో ముక్తులైన ఆ ధన్యాత్ము లెవరు ?

పత్రిక లాక్కొన్నాను నీ చేతిలో నుంచి !

ఎంత రసవత్తర సన్నివేశం అది !

ముఖం చేతులలో దాచుకొని, వ్రేళ్ళ సందుల్లోంచి చూస్తున్న నీవు – కేవల జ్యోతిరాత్మ కనికట్టులా కనిపించావు నా కప్పుడు !

ఎన్ని జన్మల తపఃఫలాల రసకవితలో ఆ చూపులు !

పత్రిక వదిలేసి, నిన్నే చూస్తున్నాను నేను !

ఓహో ! ఆ లజ్జామోహన ముగ్ధ సౌందర్య !

సాధారణ వస్తువే, రోజూ చూస్తున్నదే, తిరస్కార సీమ దాకా అతిపరిచయ మైనట్టిదే – జిగేలు మంటుంది ఏదో ఒక క్షణంలో, ఏదో ఒక దివ్య సౌందర్య లవంతో !

అదే దాని నిజరూపం !

ఆత్మోజ్జ్వల్యమే సౌందర్యం.

అదే సరస్వతి !

ఆ క్షణంలో, ఆ సౌందర్యంతో, దాన్ని పట్టుకోగలవాడే నిజమైన కళా బ్రహ్మ !

అతడే శివుడు.

ఈ శివసరస్వతీ సమద్వైత సౌందర్యమే రసబ్రహ్మ !

అలా ఎంతసేపు ఉన్నామో మనం – క్రియా శూన్యులమై – వట్టి ఆనంద శూన్యంగా !

అలానే సశరీర శూన్య పరిపూర్ణ తత్వమై పోయేవాళ్ళం మనం అకాల కాలాతీత పరాస్థితిలో – మిత్ర బృందంతో అప్పుడు మన బాపురెడ్డి వచ్చి ఉండక పోతే !

వేదకాలంలో, పరమ మాదిగ కూడ వేద విభజన చేయగల్గిన దివ్యయుగంలో, మనిషి మనీషిగా – ఋషిగా – దేవుడుగా బ్రతకగల్గిన ఆ ఎప్పుడో, సాధ్యమై ఉండి ఉండవచ్చు నన్న సమాధి – శిలా ఘటిత అర్ధనారీశ్వర దివ్య శిల్పం వలె తన కళ్ళ బడగానే, తన కళ్ళను తానే నమ్మలేక, తానూ ఒక శిల్పమూర్తి అయినాడు కద బాపురెడ్డి !

విశ్వం లోని సమస్త హృదయాలను రామాఫలాల వలె గ్రోలి, సీతాఫలాల శైతల్యం సంతరించుకొని, మహాస్రష్ట నిర్మించిన సహృదయతే బాపురెడ్డి. అమృత భావుకుడు, ఆనంద కవి, ఆత్మీయ మూర్తి అతడు !

పేపరు చూశాం.

అబ్బ ! పేపర్లో పడిందే ఫోటో !

కవి సమ్మేళనం ఫోటో అది. చాల రోజుల క్రితంది.

మంత్రిగారు అధ్యక్షులు కనుక పడిందది పేపర్లో !

ఏవో రాజకీయాలకు, ప్రమాదాలకు, యుద్ధాలకు సంబంధించిన వార్తలు, ఫోటోలు తప్ప – సంగీత సాహిత్యాలకు చెందిన వేవీ పత్రికలలో పడవు సాధారణంగా.

ఏ మంత్రిగారో వస్తే తప్ప – సాహిత్య సభలకు పత్రికా విలేఖర్లే రారు. వచ్చినా, వార్తలు పంపరు. పంపినా, అక్కడుండే మహాశయులు వెయ్యరు. వేసినా, ఏ మూలో ఒక రెండంగుళాలు !

తక్కిన పంద్రెండు పేజీల పత్రిక అంతా, పెద్ద పెద్ద శీర్షికలతో రాజకీయాలు - రాజకీయాలు - రాజకీయాలు !

రాజకీయం తప్ప, జీవితమే లే దీనాడు ఈ దేశంలో !

ఒక రాజకీయ పార్టీ వలంటీరు పాటి కూడ చెయ్యడు - ఈనాడు ఈ దేశంలో - ఏ మహాకవీ !

ఎవరికి కావాలి కళా, కవిత్వమూ ?

కావలసింది కూడు !

దానికి ఆధారం రాజకీయం !

కూడు, గుడ్డ, వసతి, సుఖం, వినోదం, స్త్రీ, అధికారం, గౌరవం, పదవి - అన్నీ కూడ మార్కెట్లో దొరుకుతై వెలకు.

ఉండవలసింది డబ్బొక్కటే. దానికి మూలం వ్యాపారం. వ్యాపారానికి కీలకం రాజకీయం.

మెదడూ, శక్తీ కూడ మార్కెట్లో దొరుకుతున్నై కద !

హృదయాన్ని చంపుకొని, రౌడీగా మారి, కుట్రలు చెయ్యగల్గితే - ఏ వోటరైనా సరే, డిక్టేటరే కావచ్చు !

అతడి కనుసన్నల్లో మెలుగుతై, ఆడతై, పాడతై - కళలూ, కవిత్వాలూ, సంగీతాలూ, స్వారస్యాలూ - బట్ట విప్పుకొని !

ఏడుస్తోంది సరస్వతి !

హృదయం ఏదీ కరగడానికి ?

ఆనాడు ఒక్క రాజుకే భయపడేవాళ్ళు అందరూ.

ఈనాడు ప్రతి ఒక్కడికీ భయపడుతున్నాడు ప్రతి ఒక్కడూ !

మనిషి మెషీనుగా మారిపోతున్న కాలం ఇది.

మెషీను తుప్పుగా, తుప్పు ద్రవ్యంగా, ద్రవ్యం శూన్యంగా మారిపోయిన తర్వాత -మళ్ళీ సర్వం పరబ్రహ్మే కద ?

అటుకేసే - అక్కడకే - ఈ పరుగులు !

ఏది ఏమైనా - ఫోటో పడింది పత్రికలో !

మంత్రిగారి ప్రక్కగా ఉన్నందువల్ల కాబోలు, నా బొమ్మ మరి కొంచెం బాగా పడింది.

కాసేపు ఏవో కబుర్లు చెప్పుకొని, వెళ్ళిపోయారు బాపురెడ్డీ, వాళ్ళూ !

అయితే –

దేవీ !

ఎదుట సాక్షాత్కరించి నేను ఉండగా – ఫోటోలోని నా బొమ్మనా ముద్దు పెట్టుకొంటావు ?

*" తుడిచేశాగా ? అది అందరిమీదా పడింది ! "*
*" ఆ అందరూ నా కంటె గొప్ప కవులే లే ! "*
*ఎర్ర కల్వలై పోయినై నీ కళ్ళు !*
*కందిపోయినై నా బుగ్గలు !*

*కను ముక్కు తీ రొకటె కాదు చక్కదనమ్ము,*
*ఆత్మఔజ్జ్వల్యమే అమృత సౌందర్యమౌ !*
*బొమ్మ బంగరుదైన బొమ్మేనె, ఒ చెలీ !*
*పువ్వు తృణము దైయెన పువ్వేనె, నా చెలీ !*

## 108

*కొబ్బరి కాయలున్, పసుపు*
*కుంకుమలున్, పువులున్, ఫలమ్ములున్,*
*దబ్బులు రెండు పుచ్చుకొని –*
*దాగులుపడ్డ మనః పటమ్ములన్*
*సబ్బున గుంజి పెట్టు మని*
*స్వామిని చేరిరి మానవాళి ! ఆ*
*గబ్బుకు గబ్బిదమ్ములె క*
*కావికలై గుడి వీడి పారగా !*

గుడి నిండా, గుడి చుట్టూ – జనం ! జనం ! జనం !

ఈ అందరూ ఆస్తికులేనా !

మౌళి ఒక్కడేనా నాస్తికుడు !

ఎందుకు అతడిపై నీ కంత కోపం !

ఆలోచించి చూడు కొంచెం.

దైవం లేదంటూ, ఉన్నది మనం మాత్రమే అంటూ, తమ ప్రవర్తనకు తామే బాధ్యత వహిస్తూ, జీవించే నాస్తికులు ఒక ప్రక్క-

ముక్తి కోసము కీలు మాడ్చె నొకడు ;

కూలీల నేడ్పించి, కోటికి పడగెత్తి,

ఈ రెండు పక్షాలలోను సమాజానికి ఎక్కువ అపకారు లెవరో చెప్పగలవా నీవు ?

అద్వైత పద్ధతిలో దైవస్వరూపం ఏమిటి ? శుద్ధ నిర్గుణ పరిపూర్ణ బ్రహ్మను లేదంటే ఏం ?

మనిషి ప్రవర్తనే కదా ప్రధానం సంఘానికి ?

మానవసేవే మాధవసేవ అని పైకి మాత్రం చెపుతూ, మానవులందరి చేత సొంత సేవ చేయించుకొనే ఆస్తికుల కంటె – మనస్ఫూర్తిగా బాధ్యతతో మానవులుగా బ్రతికే నాస్తికులే మంచి వాళ్ళు కారా ?

అందరూ నీకు లాగే వచ్చా రనుకొంటున్నావా గుడికి ? ఆ పూజలు చేస్తున్న ఆస్తికుల మనస్సులలోకి ఒకసారి తొంగిచూడు !

*తన దొంగతనము పారిన ఒక్క టెంకాయ*
*కొట్టుదునని మ్రొక్కుకొనియె నొకడు ;*
*వెలదికై హితునికి విషమిచ్చి, దొసగు నీ*
*పైటకు తుడువగా వచ్చె నొకడు ;*
*రోజెల్ల దొంగ తరాజుతో ప్రజ దోచి,*
*ముక్తి కోసము కేలు మోడ్చె నొకడు;*
*కూలీల నేడ్పించి, కోటికి పడగెత్తి,*
*అరణాకు కైవల్య మడుగు నొకడు ;*

సంఘ జీవఘ్నమైన దుష్కార్య మెంతో
చేసి, గడియించుకొన్న అశేష కిల్బి
షమును నీ కొక్క పువ్వు లంచముగ నొసగి
కడిగి వేయించుకొన వచ్చె ఘను డొకండు !

దైవం లంచగొండి కాదని - పొగడ్తలకు ఉబ్బిపోయే అల్పుడు కాదని - ఒక్క కొబ్బరికాయకే మురిసిపోయి, కల్తీనేయి అమ్మిన పాపాన్ని తుడిచివేసే టంతటి దుష్టుడు కాదని - ఈ పరమ భక్తు లెప్పటికైనా గుర్తించగలరా ?

నారాయణా అని తన కొడుకును పిల్చుకొన్నంత మాత్రాన, ఒక మహా పాపి వైకుంఠానికి వెళ్ళాడట !

పరలోక మందున్న దేవుణ్ణి ఒకసారి స్మరిస్తే చాలు, టన్నుల కొలదీ పేరుకొని ఉన్న పాపపంకం మొత్తాన్ని అతడే మోసుకు పోతాడట !

పాపుల వ్రాతలి వన్నీ - నా ఉద్దేశంలో ! కేవలం వాళ్ళ పేరాస లివి !

మానవ సమాజాన్ని నాశనం చేసిం దిలాంటి వ్రాతలే !

ఏ మత గ్రంథాన్నై నాతెరిచి చూడు !

దైవం ఎక్కడో మరో లోకంలో ఉంటాడు. మహా భోగభాగ్యాల నడుమ- ఒక సంస్థానాధీశ్వరుడిలా, ఒక బడా నవాబులా - సుఖిస్తూ ఉంటాడు. పదవిలో ఉన్న ఒక లంచగొండివలె - క్రూరు డతడు. ఆశ్రిత పక్షపాతి కూడ. చెప్పుడు మాటలు వింటాడు బాగా. ప్రపంచంలో ఎక్కడ ఏమి జరుగుతున్నదో, ఎవడో ఒక నారదుడు చెప్పేవరకూ, తెలియ దతడికి. చుట్టూ నిత్యం ఋషుల పొగడ్తలు, దేవతల భజనలు, మానవుల దానోహాలు ! వట్టి మూర్ఖుడు - కాముకుడు - దగాకోరు - దగుల్బాజీ !

అతణ్ణే నమ్ముకొని ఉన్న వాళ్ళకి మాత్రం ఇస్తూ ఉంటాడట కోరితే - వరాలూ, కోరకపోతే - మోక్షాలూ !

దైవాన్ని ఇంత నీచంగా - ఒక గ్రామ రౌడీ వలె - రూపొందించి, అసాధ్యమైన నీతులు కొన్ని సృష్టించి, అభ్యుదయ నిరోధకమైన దాసానుదాస్యాన్ని ప్రచారం చేసి, మూఢాచారాలను ఆచరణలోకి తెచ్చి, మానవుణ్ణి నాశనం చేశారు అజ్ఞానులు, స్వార్థపరులు, పాపులు !

రకరకాల గుడులు, మందిరాలు, మశీదులు, కోట్ల కొలది దేవతలు,వాళ్ళతో వాళ్ళకి విరోధాలు, భక్తుల కోసం పోటీలు, నైతిక వైరుధ్యాలు, ఆచార మౌఢ్యాలు, అడ్డపట్టీలు, నిలువుబొట్లు, దారంపోగులు, పిలక టోపిలు, మతాలు, మతా రాజకీయాలు, ప్రచారాలు, కుట్రలు !

ఏమిటి ఇదంతా ?

ఏమిటి చెయ్యడం మానవుడు ?

దేన్ని నమ్మడం ?

ఏ దిక్కుగా పోవడం ?

ఏది తరణోపాయం ?

ఎక్కడ వెలుగు ?

అంధకార బంధురమైన ఈ గహనంలో, నరక భయాలను రెచ్చగొట్టి, స్వర్గసోపానాలకు మార్గం చూపుతా మంటూ, స్వార్థ ప్రభువులు అందినంతవరకు దోచుకొంటున్నారు ప్రజల్ని !

ఈ ఆస్తిక కల్లోలాన్ని భరించుకోలేని వివేకి – నాస్తికుడు కావడంలో వింత ఏముంది ?

ఆస్తికులంటే ఎంత అసహ్యామో, నాస్తికులంటే అంత జాలి నాకు.

దైవానికి నాస్తికు డున్నంత దగ్గరగా ఆస్తికుడు లేడు నిజంగా.

అయితే – ఆ విషయం తెలియదు నాస్తికుడికి. అర్ష వేదాంత చింతనను అవగాహన చేసుకోలే దతడు. అదే అతడి బలహీనత. అందుకే అతడంటే నాకు జాలి !

నీవే దైవం – అంటున్నది మన వేదాంతం.

మతం లోని దేవుడు మగవాడు. అలాంటి వా డెక్కడా లేడు.

వేదాంతం లోని దైవం ఒక శుద్ధ చైతన్య శక్తి. అది సర్వత్రా ఉంది.

దైవం వేరు, మతం వేరు.

మానవుడి కడుపు లోని ఒక నులిపురుగుకు మానవ స్వరూపం ఎలా అగమ్య గోచరమో, విశ్వగర్భం లోని మానవుడికి విశ్వేశ్వర స్వరూపం అలానే అందరానిది !

ప్రభుత్వం వలెనే పరబ్రహ్మ కూడ ఇదీ అని ఖచ్చితంగా ఎక్కడా లేదు. అంతటా ఉంది.

ఎవరు ఎప్పుడు ఎందుకు ఏ రూపంలో కోరితే, వారికి అప్పుడు అందుకు ఆ రూపంలో ప్రత్యక్ష మవుతుంది ప్రభుత్వం - పోలీసుగా, డాక్టరుగా, న్యాయమూర్తిగా, ఇంజనీరుగా, మంత్రిగా, గవర్నరుగా !

ప్రతి ఉద్యోగీ ప్రభుత్వమే. ఏ ఒక్క ఉద్యోగి ప్రభుత్వం కాదు.

సహజంగా ప్రతి ఉద్యోగిదీ ప్రభుత్వదృష్టే - స్వార్థం, బంధు పక్షపాతం, కులతత్వం, లంచగొండితనం వంటివి అతణ్ని నాశనం చెయ్యనంత వరకు !

ప్రభుత్వంలో ఉద్యోగి వంటివాడే పరబ్రహ్మలో జీవుడు !

మానవుడి మెదడు ఏ మాత్రం ?

ఒక గుప్పెడు !

అది సాధించగల విజ్ఞానం ఎంత మాత్రం ?

ఎందుకు మరి ఈ అహంకారం మనిషికి ?

దీపకాంతి నైశిత్యమూ, పరిధీ పెరిగే కొలదీ - దాని వెనుక గల చీకటి యొక్క గాఢతా, వైశాల్యమూ కూడ పెరుగుతై !

చీకటి కణానికి సూర్యుణ్ణి చూపడం ఎలా ?

తలవెంట్రుకకు తలోదరి పూర్ణదర్శనం సాధ్యమా ?

సూర్య చంద్ర బింబాలే త్రిపుర సుందరి పాదుక లంటే - ఈ భూలోకం ఆమె పాదరేణువు కూడ కాదు కదా ?

మహద్రూపాన్ని మనసా వహించి, అణురూపాన్ని అలంకరించి చూస్తే -

నీవే ఆమె !

నీవే ఆ దైవం !

ఈ ప్రవచనం అర్థమైనవాడు వేదాంతి. అర్థం కానివాడు నాస్తికుడు. అర్థం కానివ్వనివాడు మత పెద్ద. ఈ గోలంతా మన కెందుకులే అనుకొనే వాళ్ళే ఈ ఆస్తికజనం అంతా !

జిజ్ఞాస కలవాడు మౌళి.

అన్వేషించనీ అతణ్ణి ఇంకా, ఇంకా !

అన్వేషణ, అభిజ్ఞ, పరిశోధన, పరమజ్ఞత లేకనే – లోకోత్తర మహానీయమైన మన ఆర్ష విజ్ఞానం పెంటలపాలై కుములుతున్నది ఈనాడు !

కళ్ళు తెరచి చూడు !

దైవం ఉంది.

మనం ఉండడమే దైవం ఉండడానికి నిదర్శనం.

మనమే ఆ దైవం !

**తమములో దాగి కాన్పించ దంతె కాని,**
**లేని దన్నది విశ్వాస లే దొకింత !**
**కాంతి కిరణమ్మునకు వాడి కలుగు కొలది**
**చీకటుల లోతులోతులు చించగల్గు !**

# 109

" ఇంత పచ్చిగానా వ్రాసుకొంటారు లేఖలు ? " అన్నది కదూ వర్ష ?

" ఏం లాభం వీటివల్ల ? " అని కూడా అడిగిందామె !

" మధ్యలో బోరు కొట్టే ఈ చర్చ లేమిటి ? " అంటూ చుంచుమూతి కూడ పెట్టింది కద ?

అంతే కావాలిలే నీకు !

దానిపై, ఒక ఉపన్యాసమే దంచా వనుకో ! అర్థమయిందా ఆమెకు ? నీ వెంత కష్టపడి దంచినా, నీ దంపుడు బియ్యం మిల్లు బియ్యానికి అలవాటుపడ్డ ఆ నవనాగరిక నిత్యరోగిష్ఠికి నచ్చుతవా ? రుచిస్తవా ? జీర్ణమవుతవా ?

ఆమె సంస్కారం ఎంత ? ఆమె మెదడు బల్బుకు గల వోల్టేజి శక్తి ఎంత ? ఆ మాత్రపు వెలుగుకు అందగల్గిన ఆవరణం ఎంత? గుడ్డి కంటికి గోలోక సౌందర్యాన్ని చూపాలని ఎందుకు ప్రయత్నిస్తున్నావు నీవు ?

డబ్బు, పదవి, ప్రచారం, ప్రాభవం – ఇవి నాలుగూ నాలుగు దిక్కులు జీవితానికి !

ఏ రంగంలోనైనా సరే – సంస్థలోనైనా సరే – ఈ దిక్కుల్ని పాలించే దిక్పాలకులు, వాళ్ళ బంధుమిత్రులు, ఆ వాళ్ళ దాసులు, దాసానుదాసులు –

ప్రతిభావంతు లెవరూ ఆ చుట్టుప్రక్కలకు చేరకుండా జాగ్రత్త పడుతూ - తామే జిగేలుమంటూ, వెలుగుతూ ఉంటారు మతాబాల్లా !

మతాబా బ్రతు కెంత ?

దాన్ని చూచి చంద్రుడో, సూర్యుడో అని ఎందుకు భ్రమ పడతావు నీవు ?

అట్టి మతాబాల నెరసుల్లో ఒక నెరసు వర్ష !

జిగేలుమంటుంది. ఓహో - అనిపించుకొంటుంది. ఆరిపోతుంది ఆ మరుక్షణం. ఆ తర్వాత వట్టి చీకటి.

వర్షకు నీ విచ్చిన జవాబులు మాత్రం బలే బాగున్నై.

నన్ను అందుకొన్నావు నీవు. నాలో ఐక్యం కావడానికి అవసరమైన స్థాయి సిద్ధించింది నీ ఆత్మకు. గురువునే పాలించగల శిష్యురాలవు. ఈశ్వరుణ్ణే భిక్షుణ్ణి చేయగల భువనేశ్వరివి అయినావు నీ విప్పుడు !

ఈ నీ మహాదైశ్వర్య సిద్ధిని సాధించడం కోసమే - పరమేశ్వరుడనైన నా ప్రక్క పరమేశ్వరిగా నిన్ను ప్రతిష్ఠించడం కోసమే రజస్తమస్సులను నీ నుంచి తొలగించి, శుద్ధ సత్త్వ చైతన్య రాగ కళగా నిన్ను రూపించడం కోసమే - ఇన్ని లేఖలు వ్రాశాను నీకు ! ఇన్ని చర్చలు చేశాను నీతో ! ఇంత జీవితం సృష్టించాను నీ కోసం !

నేను శుద్ధ సత్వ పరమేశ్వరుణ్ణి.

నాది అనంత పిపాస !

నీవు శుద్ధ చైతన్య పరమేశ్వరివి !

నీది నిరంతర దిత్స !

ఓహో - వైశాఖీ ! రాగ రమా !

నా అమృతానంద సాహితీ !

నా ఆనంద సుందర సంగీతీ !

ఎలాంటి పరిస్థితిలో అయినా సరే -

ఇద్దరం మనం !

ఒక్కరం మనం !

ఒకే ఒక ఆనందం మనం !

ఇద్దరమే !
మన మిద్దరమే !
సంయోగమొ, వియోగమో
సంతోషము, విరహ వ్యథొ,
బ్రతు కేమైనను గాని !
మనసు కున్న స్వేచ్ఛారతి
తనువుకు లేకున్న గాని,
తనువు కున్న పొలిమేరలు
దాటరాని వైన గాని !
విరహాగ్నులలో తనువులు
కరిగి బూదియే యైనను,
మన బూదియె విబూదిగా
మహియే శైవము కాగా !
మన మనసులు జోడుకట్టి
మబ్బులు మెరపులు కాగా,
మన ఆత్మలు కలిసిపోయి
మధురామృతమే కాగా !

## 110

నీ ఆత్మ స్రవంతి నా ఆత్మ మహాపయోనిధిలో ఐక్యమై పోయిందన్న ఆనందంలో - మైమరచిపోయి, యోగనిద్ర లోకి జారిపోయిన నన్ను, ఎంత చక్కగా మేల్కొల్పావు నీవు - చరణ సేవా వ్యాజ ప్రణయ స్పర్శా పరమకర్తవ్య భూపాల రాగ రాగిణీ రమా మూర్తివై !

భూపాల రాగమా అది ?

నేను మేల్కొనే వరకూ అదే ! మేల్కొన్న తర్వాత, కామ వర్ధని అది ! ఆ తర్వాత ఆనంద రంజని అది !

అసమాప్తం కదూ నా గత లేఖ ?

ఎందుకు చూపావు మన లేఖల్ని వర్షకు ?

ఒళ్ళంతా అసూయ కదా ఆమెకు ?

ఆత్మ తెలీదు కదా ఆమెకు ?

మేఖల ఏం చేసింది ?

ఎందుకు నేర్చుకోవు గుణపాఠాలను అనుభవం నుంచి ?

" మీరు నేర్చుకొంటున్నారా ? " అంటావు కదా నీవు ?

నిజమే. నేనే కాదు, లోకమే నేర్చుకోవడం లేదు అనుభవం నుంచి ఏమీ!

"పెళ్ళాడి నరకం అనుభవిస్తున్నాను నేను. పెళ్ళాడవద్దురా, ప్రియ కుమారా ! "అని తండ్రి కొడుక్కి చెపితే – ఏమంటా డతడు ?

" నేను కూడ చూస్తాను ఆ నరకం ఎలాంటిదో ! " అనడా ?

అలానే – ప్రతి జీవీ !

అనుభవమే జీవితం.

దాని మంచి చెడ్డలే స్వర్గ నరకాలు.

ఎవరి అనుభవం వారిదే. ఎవరూ నేర్చుకోరు ఎవరినుంచీ !

మన అనుభవం మనది

వర్ష కెలా రుచిస్తుం దది ?

అత్యంత సూక్ష్మమైన ఆనందాలు పూర్తిగా వ్యక్తిగత మైనట్టివి.

ప్రేమ, శృంగారం, సౌందర్యం, రతి, మధుపానం, భోజనం, నిద్ర – వంటివి ఎవరివి వారివే ! వాటిని వాస్తవంగా అనుభవిస్తున్న వాళ్ళకు ఎంత మనోమోహన మధురాలో – తదితరులకు అంత జుగుప్సాకరాలు, అసూయాజనకాలు, ప్రాణాంతకాలు అవి !

నీవు త్రాగుతున్న అమృత రుచి నీ ప్రక్కనున్న వర్ష కెలా తెలుస్తుంది ?

ఒకరి ఆహారం మరొకరికి పుష్టిని ఇవ్వదు. ఒకరి నిద్ర మరొకరికి విశ్రాంతిని ఇవ్వదు. ఒకరి ప్రేమలేఖ మరొకరికి పారవశ్యం కలిగించదు.

అట్టి వైయక్తిక సుఖభోగాలను రహస్యంగా అనుభవించా లనడం అందుకే ! ఇతరుల కంట పడగూడదు ఆ అనుభవం ! పడితే, కలిగేది వైరస్యమూ, వైరమూ, ఆపదా మాత్రమే !

మన ఈ ప్రేమలేఖలను చూచి వర్ష సంతోషిస్తుం దనుకొన్నావా ?

ఏడుస్తుంది !

అన్ని రంగాల లోనూ ఉన్నారు ఇలాంటి ఏడ్చేవాళ్ళు ఈనాడు.

ఎదటివాడు చేసిన పని ఎంత బాగున్నదని లోపల అనుకొంటాడో – అంత బిగ్గరగా అరుస్తాడు – అది బాగుండ లేదని !

అంతకంటె ఘనుడు మరొకడున్నాడు సాహిత్య రంగంలో. ప్రతిభను పూర్తిగా ఇగ్నోరు చేస్తా డతడు. చెత్త పుస్తకంపై పది పేజీలు రివ్యూ వ్రాస్తాడు – అది ఎలా చెత్తో నిరూపిస్తూ ! మంచి పుస్తకం పేరైనా ఎత్తడు ! ఎత్తితే, ఆ మంచి పుస్తకం వ్రాసినవాడు గొప్పవాడై పోవచ్చు ! అలాంటి ప్రమాదాన్ని భరించుకోలేడు – ముఖ్యంగా మన తెలుగువాడు !

"ప్రతిభ లేనివాణ్ణి ప్రోత్సహించు. అతడు నీకు దాసుడై ఉంటాడు. ప్రతిభ కలవాణ్ణి అణిచివెయ్యి. లేకపోతే, ఇతడు నీ పెత్తనానికే ఎసరు పెడతాడు " అనేదే కదా నీతి నేడు ?

అదే కదా – ఒక నిత్యనూతన మహా ప్రవాహం కావలసిన మానవతను అరికట్టి, మురికిగుంటగా మార్చిన మహా మారి ?

అశక్తి, అసూయ, ద్వేషం, కుళ్ళుబోతుతనం, ఏడ్పు, అపకృతి – ఇదీ ఏ దౌర్భాగ్యుల కైనా అధఃపతనపు క్రమావస్థ !

మంజీరను గురించి ఈ మధ్య జరుగుతున్న దుష్ప్రచారం – వస్తున్న ఆకాశరామన్న ఉత్తరాలు – చూస్తున్నావు కదా ?

ఆమెను కామించి, వెంటపడి, వేధించి, తన్నులు తిని, పగ బట్టిన దుష్టులు తింటున్న గడ్డే కదా అది ?

కళా సరస్వతి పట్ల కామదృష్టి ఏమిటో వీళ్ళకు !

కామధేనువును కోసుకు తినజూచే పచ్చి కసాయి మనస్తత్వం అది !

మనతో ఆమెకు గల స్నేహానుబంధాన్ని త్రెంచివేయడానికి ఎంత కుట్ర జరుగుతున్నదో చూడు !

అవ్యాజమైన అనురాగబంధం జీవేశ్వర సంబంధమే. వాస్తవ నగ్నసత్యాలే త్రెంచలేవు దాన్ని. అసత్య దుష్ట కూట ప్రచారాలా త్రెంచగలవి ?

మంజీర నాన్న మేఖల నాన్న వంటి మూర్ఖుడు కాదు.

కుమార్తె హృదయంలోని స్వయంభూత జ్ఞానజ్యోతిని ఆర్పివేసి, తన వంశానుగత మౌఢ్యాంధకారంతో ఆమెకు ముసుగు తగిలించిన దురహంకారి మేఖల నాన్న. దాని ఫలితంగా ఆమె దివ్య వ్యక్తిత్వం చీకటిలో చీకటైపోయింది !

తానే తన పుత్రిక అన్న జ్ఞానంతో – తన జన్మాంతర తపస్సులన్నీ క్షాళితమైపోయి, శుద్ధ సత్వ చైతన్యంతో తానే ఆమెగా ప్రకాశిస్తున్నానన్న ఆనందంలో – ఆమెకు సంపూర్ణ స్వేచ్ఛను ఇచ్చి – ఆమె తరణంలో తానూ తరించిన జ్ఞాని మంజీర నాన్న ! దాని ఫలితంగా ఈమె రాగకళా రసబ్రహ్మ అయింది ! తన కాంతితో లోకాన్నే ఉద్ధరించ గలిగింది !

ఒకో ఆకాశరామన్న ఉత్తరానికి ఒకో నరకం సృష్టించాడు మేఖల నాన్న ; అతడి తర్వాత – ఆమెకు కట్టుకొన్న మంచివాడైన భర్త !

అలాంటి ఉత్తరాలన్నిటికీ నిప్పు ముట్టించి – ఆ మంటలలో – వాటికి కారకులైన ఆ ఆకాశరామన్నలకు దహన సంస్కారాలు జరిపి పారేశాడు మంజీర నాన్న !

అసూయ ఎంతటి క్రూర స్వరూపం తాల్చగలదో, ఎన్ని అమృత కలశాలలో విషం క్రక్కగలదో, దాని విషానికి మూర్ఖులు ఎలా నశించిపోగలరో, జ్ఞానులు ఎలా తట్టుకొని బ్రతకగలరో – ఈ చరిత్రలు రెండూ నిదర్శనాలు. ఇవి నీకు తెలిసినవే కద ?

అశక్తి !

అసూయ !

పగ !

మనిషిని స్వర్గం నుంచి నరకానికి త్రోసివేయగల కాలసర్పాలు ఈ మూడూ !

ఏది ఏమైనా –

ఈ విషయంలో రహస్యంగా కుట్రలు జరిపే ఆశ్లేషయ్య లాంటి పాముల కంటే –

బహిరంగంగా విమర్శించిన వర్షే వేయి రెట్లు కపటం లేనిది ! అందుకైనా మెచ్చుకోవాలి మనం ఆమెను !

పచ్చి శృంగార మేదో, పరమ శృంగార మేదో తెలియని రసహీన ఆమె.

పచ్చిదో, ఎండుదో - శృంగారం శృంగారమే. సమస్త సృష్టికీ ప్రాణం అదే !

మతాలను, నీతి శతకాలను, ఆయుధాలను, విద్యలను సమస్త మానవ వ్యాపారాలనూ తుడిచి పారేసి చూడు ! ప్రపంచాని కేమీ కాదు. మానవుడు బ్రతికే ఉంటాడు.

వాటన్నిటినీ ఉంచి, శృంగారాన్ని ఒక్క క్షణం పాటు లేకుండా చెయ్యి ! ఏ ముంటుంది మిగిలి ?

కాగా శృంగారమే లోకం. లోకమే శృంగారం.

జీవితంలో ఓడిపోయిన సినిక్కులు, ఎండిపోయిన వృద్ధులు, మొగ్గదొడగని మోడులు, నీడ ఎరుగని ఎడారులు, వెలుగు చూడని పాడు బావులు ఏమన్నా - ఏం చేసినా - ఎలా ఏడ్చినా -

శృంగారం ఒక్కటే రసం, ప్రాణం, ఆత్మ - జగత్తుకు.

సృజన శక్తి కలది పచ్చి శృంగారమే. అది అందని జంబుకాలకు అది పులుపే మరి !

మానవుడు పడే పాట్లన్నిటికీ ప్రయోజనం ఏమిటి ?

బ్రతకడం.

బ్రతుక్కు ప్రయోజనం ఏమిటి ?

మోక్షమా ? మోటారు కారా ?

సృష్టి స్థితి లయాత్మక విశ్వలీల శృంగారం

పారమాత్మిక శృంగారం భక్తి

ఆత్మిక శృంగారం రసం

శారీరక శృంగారం భోగం !

ఇందులో ఒకటి పవిత్రమూ, ఒకటి అపవిత్రమూ కావు.

ఆత్మ ఎంత పవిత్రమో, ఆత్మకు మందిరమైన శరీరమూ అంతే పవిత్రం.

శృంగారాన్ని అసభ్య మంటూ నిషేధించేవాళ్ళు - ఆత్మస్వరూపం తెలియని వట్టి అజ్ఞానులు.;- ఆస్థానమే !

*ఆనంద రస కలశివే నీవు, ఓ చెలీ !*

*అనవరత విశ్వచేతన వీవె నే, చెలీ !*

సాహితీ రాగదేవతవు కదా నీవు ?

విమర్శలు ఎప్పుడూ ఉండేవే

లెక్క చెయ్యవద్దు వాటిని.

ఏడ్చేవాళ్ళను ఏడ్పిస్తూ ఉండడం, నవ్వే వాళ్ళను నవ్విస్తూ ఉండడం సరదా ఈ లోకానికి.

లోకువ ఇవ్వవద్దు లోకానికి.

బలహీనులు పరువుగా బ్రతకలేరు.

ఆత్మబలం కలవాళ్ళదే ఆనంద సామ్రాజ్యం.

*నవ్వుకొలదిగ జగము నవ్వించు చుండు*

*ఏడ్పుకొలదిగ జగము ఏడ్పించు చుండు*

*మ్రొక్కు కొలదిగ జగము ఎక్కి త్రొక్కుచు నుండు*

*తన్ను కొలదిగ జగము దాసోహ మను చుండు !*

# 111

శ్రీకాళహస్తి జ్ఞాన ప్రసూనాంబ

ద్రాక్షారామ భీమేశ్వరుడు.

ఈ ఇద్దరికీ ఏమిటి సంబంధం ?

ఆమె శివ, ఇతడు శివుడు కారా ?

ఈ ఇద్దరూ ఒకటే కారా ?

ఈ మాట అంటే – అక్కడ అమృత లింగేశ్వరుడికీ, ఇక్కడ మాణిక్యాంబకూ కోపం రాదా ?

ఎందుకు రాదు ?

ఎందుకు వస్తుంది ?

ఇదొక మహా సమస్య.

సింహాచలం, అన్నవరం, ద్రాక్షారామం, బెజవాడ, మంగళగిరి, శ్రీశైలం, శ్రీకాళ హస్తి, తిరుపతి, వేములవాడ, యాదగిరి – ఇలా ఒక్క మన ఆంధ్రదేశం లోనే ఉన్నై వేలకొలది పుణ్యక్షేత్రాలు.

ఈ క్షేత్రా లన్నిటా ఉండేది ఒకే దేవీ దేవ ద్వయం.

ఒకే ఒక అర్ధనారీశ్వర మూర్తి.

అయితే క్షేత్రాని కో పేరుతో, పేరు కో గుణంతో, గుణాని కో శక్తితో ఇంత మంది దైవ మూర్తులు ఎలా వచ్చినట్టు ?

ప్రశ్నలోనే ఉంది జవాబు !

శిల్పిని బట్టి శిల్పం
శిల్పాన్ని బట్టి శక్తి
శక్తిని బట్టి క్షేత్రం
క్షేత్రాన్ని బట్టి ఫలం
ఫలాన్ని బట్టి రసం
రసాన్ని బట్టి ఆనందం
ఆనందాన్ని బట్టి శిల్పి !

ఈ పరిణామ వృత్తం అంతటికీ మూల భూతం ఒకే ఒక బిందువే అయినప్పటికీ – ఏ తదంతర్గత బీజ కళా ప్రవృత్తులు అసంఖ్యాకం కనుక, అసంఖ్యాకంగా వెలిశారు దేవతలు – వివిధ రూపాలతో, వివిధ తత్వాలతో, వివిధ నామాలతో.

ఒకో బిందువుకు ఒకో క్షేత్రం.

ఒకో క్షేత్రంలో ఒకో జంట.

ఆ జంటలో – ఒకచోట శ్రీశైలంలో వలె పురుషశక్తి ప్రసన్నుడై ఉండవచ్చు. మరోచోట బెజవాడలో వలె స్త్రీ శక్తి ప్రసన్నురాలై ఉండవచ్చు. అయినా – జంటగా ఉండడం మాత్రం తప్పదు సర్వత్రా.

జంట కలిసి ఉన్నప్పటిదే శక్తి.

జంట విడిపోతే, మిగిలేది వట్టి శూన్యం మాత్రం.

బిందువే క్షేత్రం –

బిందు శక్తే క్షేత్ర శక్తి.

ఏ తచ్ఛక్తికి కీలకం బీజం

బీజం అక్షరం

అక్షరమే మంత్రం

అది యంత్ర నిబద్ధం.

ఏత న్నిబద్ధ పరమ లవమే ఆ తత్ క్షేత్ర పీఠస్థ దేవీ దేవ మహా మహిమ !

ఈ అనం తానంద మహార్ణవంలో ఎన్ని బిందువులు ! ఎన్ని బీజాలు ! ఎన్ని శక్తులు !

అందుకే –

క్షేత్రాలు అనంతం

దైవ శక్తులు అసంఖ్యాకం !

అందుకే –

ప్రతి క్షేత్రమూ మనదే

ప్రతి శక్తీ మనమే !

అయినా – వ్యక్తిత్వాలు వేరు, గుణాలు వేరు, మనస్తత్వాలు వేరు, శక్తులు వేరు, రూపాలు వేరు, నామాలు వేరు – అందుకే.

ఇప్పుడు, ఈ తాత్విక సూత్రాన్ని ప్రకృతికీ, విశ్వానికీ, భూలోకానికీ, మానవ సమాజానికీ వర్తింపజేసి చూడు !

ఒకో బిందువు ఒకో క్షేత్రం

ఒకో క్షేత్రం ఒకో దేశం !

ఆ క్షేత్రస్థ దైవం ఆ దేశపు ప్రజ – ఆ జాతి.

ఒకో జాతికి ఒకో వ్యక్తిత్వం, ఒకో గుణం, ఒకో మనస్తత్వం, ఒకో రూపం, ఒకో నామం, ఒకో శక్తి !

అన్ని బిందువులూ ఒకే సాంబశివునివి.

అన్ని దేశాలూ ఒకే మానవ జాతివి !

అయితే –

దేని ప్రత్యేకత దానిది
దేని ప్రగతి పథం దానిది
దేని కర్తవ్యం దానిది.

ప్రతి బీజం వలెనే ప్రతి బిందువు, ప్రతి బిందువు వలెనే ప్రతి జాతి, ప్రతి దేశం - తమ తమ ప్రత్యేక శక్తుల్ని వికసింప జేసుకోవలసిందే. ప్రతి మానవ ముకుళమూ వికసించ వలసిందే, లక్ష్య ధర్మాన్ని బట్టి ఫలించ వలసిందే.

ప్రపంచం లోని మానవ జాతులన్నీ ఒక తోట లోని పుష్పఫలాలే.
దవనం, మరువం, మారేడు, జమ్మి
కొత్తిమిరి, కరివేపాకు, పుదీనా
మల్లె, గులాబి, బంతి, కలువ, కమలం, చంపకం, మొగలి
బీర, పొట్ల, గుమ్మడి, బెండ
గన్నేరు, జాజి, తుమ్మి, కడిమి, నాగమల్లి,
మామిడి, దానిమ్మ

ఇవన్నీ ఒక తోటలోవే అయినా - వాటికి ఆ యా ప్రత్యేకతలు లేకపోతే - వాటి ఉనికే వ్యర్థం అయిపోతుంది కదా !

ప్రపంచంలో -

ప్రతి మానవుడూ స్వేచ్ఛగా, స్వస్వభా వానుగుణంగా వికసించ వలసిందే.

ప్రతి జాతీ స్వేచ్ఛగా, స్వ సంప్రదాయానుగుణంగా ఫలించ వలసిందే.

ప్రతి దేశం - తోటలో తీగ, చెట్టు, పిట్ట, సరోవరం, తోట మొత్తం సౌందర్యానికి వలె - సృష్టి సాముదాయక మహాసిద్ధికి దోహదం చేయవలసిందే !

కుటుంబం లోని సభ్యుడు, సమాజంలోని వ్యక్తుడు, దేశంలోని పౌరుడు, ప్రపంచంలోని మానవుడు - ఒక్కడే !

ప్రపంచమే ఒక కుటుంబం అయితే -
అందులో సభ్యులే ప్రతి దేశమూ, ప్రతి జాతీ !
వ్యక్తి కానీ - జాతి కానీ -

వ్యక్తిగతమైన ఆత్మ వికాసంతో సామూహికమై మానవ వికాసానికి తోడ్పడ వలసిందే.

ఈ సార్వజనిక వికాస పరమ ప్రణాళికలో - ఏ వ్యక్తీ అలక్ష్యం చెయ్యబడ గూడదు. ఏ జాతీ ఉపేక్షించబడ గూడదు. ఏ దేశమూ మడిగట్టుకు కూర్చో గూడదు.

వ్యక్తుల వికాసమే జాతి

జాతుల వికాసమే వసుధ

వసుధైక సామ్రాజ్యమే మానవలోక పరిపూర్ణ ఫలం.

దేశాలే క్షేత్రాలు మనకు.

జాతులే శరీరాలు మనకు.

క్షేత్రానికొక పేరుతో, గుణంతో, రూపంతో వేంచేసి ఉంటాం మనం ప్రతి క్షేత్రం లోనూ.

అలానే -

ప్రతి క్షేత్రమూ మనలో ప్రతిష్ఠితమై ఉంది అనేక రూపాలలో.

ఎప్పుడు ఏ శక్తి అవసరమైతే, అప్పుడు ఆ శక్తి విజృంభిస్తుంది మనలో. అప్పుడు ఆ క్షేత్రమే ఆవిర్భవిస్తుంది మన నుంచి.

ప్రతి దేశమూ, ప్రతి, జాతీ, ప్రతి వ్యక్తీ మనమే అయినా - ప్రతి దేశానికీ వెళుతూ, ప్రతి జాతినీ పలకరిస్తూ, ప్రతి వ్యక్తితోనూ స్నేహం చేస్తూ మనం ఎలా వ్యవహరిస్తున్నామో-

అలానే -

ప్రతి క్షేత్రమూ, ప్రతి క్షేత్ర అధిదైవమూ, ప్రతి దైవశక్తీ, మనమే అయినా - ప్రతి క్షేత్రాన్నీ దర్శిస్తూ, ప్రతి దైవాన్నీ పూజిస్తూ, ప్రతి శక్తినీ ఆస్వాదిస్తూ ఆనందిస్తాం మనం.

క్షేత్ర - క్షేత్రజ్ఞ భేదం ఉన్నంత వరకు ఈ క్షేత్రారాధన తప్పదు మనకు.

మనం అంటే మన శరీరాలు కాదుగా ?

అయినా -

శరీరాలు లేకుండా మనం లేముగా !

అ శరీర బ్రహ్మకు ఆనంద రుచి తెలిసేది శరీరం ద్వారానే.

మానవులు రెండు వర్గాలు -

ఇహలోక సౌఖ్యం కోరే వారు

పరలోక సౌఖ్యం కోరే వారు !

ఇహ సౌఖ్యం కోసం పర సౌఖ్యాన్ని వదులుకొనే మనస్తత్వం కొందరిది. రాజకీయ, సాంఘిక, మత, వ్యాపార రంగాలకు చెందిన అనేకులు ఈ మనస్తత్వానికి చెందిన వాళ్ళే.

పరం కోసం ఇహాన్ని త్యాగం చేసుకొనే మనస్తత్వం మరి కొందరిది. కవులు, కళామనస్వులు, పండితులు, వేదాంతులు, సన్యాసులు, యోగులు, రైతులు, కూలీలు చేరవచ్చు ఇందులో.

ఈ రెండు మనస్తత్వాలకు అతీతులం మనం.

క్షేత్రమూ మనమే. శక్తీ మనమే.

ఇహమూ మనమే. పరమూ మనమే.

శరీరమూ మనమే. ఆత్మా మనమే.

మన శరీరాల సంయోగం ఒక అగ్ని. అది ఆనంద వాహనం. సశరీర సంపూర్ణంగా మనల్ని ఆనంద గా మార్చి, మహా మహస్సుకు ఉషస్సుగా ప్రతిష్ఠిస్తుం దది మనల్ని.

కామ శక్తే ప్రేమ శక్తి. ప్రేమ శక్తే ఆత్మ శక్తి. ఆత్మ శక్తే ఏ రంగంలో నైనా సరే, దిగ్విజయాన్ని సాధించ గలది.

వాల్మీకి, కృష్ణుడు, వ్యాసుడు, బుద్ధుడు, శంకరుడు, క్రెస్తు, వివేకానందుడు, గాంధీ, మీరాబాయి, కన్యకాపరమేశ్వరి, ఝాన్సీ లక్ష్మి, పొట్టి శ్రీరాములు, దుర్గాబాయి, అంబేద్కరు – వంటి వారి శక్తి అంతా ఎక్కడిది ? బ్రహ్మ కామన నుంచి అవతరించిన మహా కామనే కాదా ?

ఆత్మశక్తితో ఏ రంగంలో విజృంభింపజేస్తే, ఆ రంగాన్ని దేదీప్యమానం చెయ్యగల దివ్యశక్తి కలది కామన.

అట్టి మహా కామనకు ఉపాధి శరీరమే కాదా !

సాధారణ వ్యక్తిలో అది వట్టి కామం.

పశుప్రాయునిలో అది వ్యర్థ కామం. అడవిలో కాసిన వెన్నెల వలె, బూడిదలో పోసిన పన్నీరు వలె – ఉప్పు పత్రలో కురిసిన వర్షం వలె దుష్టకామం వ్యర్థం.

మహితాత్మునిలో అది విష్ణువు చేతి సుదర్శనం. శివుని చేతి పినాకం. బ్రహ్మ చేతి సరస్వతి.

నా చేతి నీవు !

ఏది ఏమైనా –

దర్శించుకోవాలి మనం పుణ్యక్షేత్రాలను ! అర్పించుకోవాలి మనం మనలే! స్పర్శించుకోవాలి మనల్ని మనమే ! ఐక్యమైపోవాలి మనం మనలోనే !

" క్షేత్రమూ, దైవమూ, శక్తీ మనమే అయినప్పుడు – అవన్నీ మనలోనే ఉన్నప్పుడు – ఎందుకు పడాలి ఈ గోలంతా మనం ? " అంటావు నీవు.

నేను – నేను కల్పించుకొన్న నీవు –

ఈ ఉభయ శక్తుల సంయోగ వియోగాలే కదా – వెలుగు నీడల, సుఖదుఃఖాల, జననమరణాల ద్వైధీ లీలా విశిష్టమైన ఈ ఎల్ల సృష్టీ ?

ఈ ద్వైతంలో –

వాతావరణంలోకి బొగ్గుపులుసు గాలిని వదలి, దాన్ని కలుషితం చేసే జంగమవర్గం ఒకటి ఉన్నప్పుడు – ప్రాణవాయువును వదలి, దాన్ని పరిశుభ్రపరిచే స్థావర వర్గం మరొకటి లేదా ?

ప్రజ్ఞాన చైతన్యం లోకి అనుక్షణం ప్రవేశిస్తున్న దురాలోచనలు, దుర్భాషా నినాదాలు, దుష్క్రియా దుర్వాసనలు ఎప్పటి కప్పుడు నిర్మూలించబడవలసి ఉంది కద ?

అట్టి విశ్వశౌచ కార్యక్రమం లోని అంశాలే సర్వ శ్రేయోభిలాషతో చేయబడే ప్రార్థనలు, పూజలు, యాగాలు, యోగాలు, తపస్సులు !

విశ్వాన్ని పాలించే పరమ భగవచ్ఛక్తికి సహాయక దోహద క్రియలే ఇవన్నీ.

ఇవన్నీ మన సంకల్ప శక్తులే. కేవలం మనమే.

జ్ఞాన ప్రసూనాంబవూ, మాణిక్యాంబవూ, భ్రమరాంబవూ నీవే అయినప్పుడు శ్రీ కాళహస్తీశ్వరుణ్ణీ, భీమేశ్వరుణ్ణీ, మల్లికార్జునుణ్ణీ నేనే అవుతాను సాక్షాత్తు.

నీవు అలా కాకపోతే –

నేను ఇలా కాను !

నీవు నా శిల్పానివే అయినా - ప్రదర్శనలో ఉన్నదానవు నీవే కనుక, నీ విలువే నా విలువ !

నీవు నా నీడవే అయినా - నీడలో విశ్రమిస్తున్న లోకానికి నీవే ఆనంద దైవానివి ! ప్రత్యక్షంగా భరించజాలదు అది నన్ను !

అందుకే -

దేవీ !

నన్ను తెలుసుకొని, నిన్ను నీవు తెలుసుకోవడం కోసమే ఈ యాత్రలు ! ఈ దేశాటన ! ఈ క్షేత్రదర్శనం ! ఈ పూజలు ! ఈ భక్తి !

స్త్రీని పురుషుడు, పురుషుణ్ణి స్త్రీ - ఆనంద సుందరంగా అనుభవించడం ఒక కళ !

అదే పరమ కళ !

ఈ కళాదర్శనమే భగవద్దర్శనం !

ఈ పరమ సుందర దర్శనయాత్రే జీవితం - మనవంటి పూర్ణ జీవ జీవనీ శివ సరస్వతులకు !

రా ! -

పోదాం !

అటు - రాగ వైశాఖిగా !

ఇటు - రాగ లక్ష్మిగా !

నడుమ - విశ్వైక జీవన రాగమూర్తినైన నేను - నిత్యాభ్యుదయ సమున్నొత్న వసంత వైభవంతో అభిరమిస్తుండగా -

రా - పోదాం -

ఈ సమస్త క్షేత్రాల లోనూ మనమే ఉంటూ !

ఈ క్షేత్రా లన్నిటినీ మనలోనే నిలుపుకొంటూ !

*మన బ్రతుకె క్షేత్రము, మన వపువె ఆలయము,*
*మన ఇచ్ఛయే శక్తి, మనమె దైవము, కనుక -*
*విశ్వ సారథ్యమ్ము విడువగూడదె, చెలీ !*
*నిత్య యాత్రావిధిని నిలుపగూడదె, చెలీ !*

# 112

శరీరాల ప్రమేయమే వద్దన్నావు -

స్పర్శామాత్రం లోనే తన్మయమై పోతున్నావు !

ఏదో అనుకొంటాం గాని - శరీరాల ప్రమేయం లేకుండా ఏముంది లోకంలో ?

శరీర సుఖానుభూతి కోసమే కాదా, అశరీరి అయిన పరమాత్మ ఆత్మ రూపంలో సశరీరి కావడం ?

ఆత్మలు కలిసిన రెండు శరీరాల కలయిక కంటె మరేముంది పరమానందం?

ప్రపంచం లోని సమస్త రస భావ సౌందర్యాలను ఒక్కచోట రాశి పోసి, ఆ రాశిని సమస్త సుఖశాంతి సౌభాగ్యాలతోను అలంకరించి, ఒకప్రక్క ఉంచి - రెండోప్రక్క ఒక స్త్రీని ఉంచి - ఏదో ఒక్కదాన్ని ఎంచుకోమంటే, పురుషు డెవడైనా సరే, స్త్రీనే ఎంచుకొంటాడు సహజంగా !

సౌహార్దం, సౌమనస్యం, సౌందర్యం, సౌభాగ్యం ! సౌశీల్యం, సౌబల్యం, సౌఖ్యం - ఇదీ సౌశ్రీ దేవి దివ్యస్వరూపం !

ఈ సౌవర్గ సంపద లన్నింటికీ స్త్రీయే పాదు. స్త్రీ లేకుండా ఆనందం లేదు పురుషుడికి.

అలానే స్త్రీకి జీవరసం పురుషుడు.

ఆనంద రస శోభాసుందరాలైన రెండు శరీరాలు - ఒకదాని కొకటి పరమానంద పారమ్యాలు.

ఆత్మ పొందే అనుభవా లన్నిటికీ శరీరమే నిలయం కద !

ముఖ్యంగా స్త్రీకి - మనస్సు, హృదయం, ఆత్మ అన్నీ ఒక్క శరీరమే కద !

అందుకే, శరీరంపై ఒక చిన్న ప్రేమ స్పర్శ తగలగానే - హృదయవీణను శృతి చేస్తుంది ఆమె ఆత్మ కల్యాణీ రాగానికి !

శరీర స్పర్శే ఆత్మ స్పర్శ. శరీర తృప్తే ఆత్మానందం. దాన్ని ప్రసాదించిన పురుషుడే పరమాత్మ. అతడిలోనే ఆమె ఐక్యమై పోతుంది శాశ్వతంగా.

ప్రేమ సిద్ధే మోక్షసిద్ధి స్త్రీకి.

తాను ప్రేమించిన పురుషుడు తిరిగి తనను ప్రేమించడమే ప్రేమ సిద్ధి. శరీర సంబంధం ఉండ నవసరం లేదు అందుకు. ఉంటే, జీవితానందం కూడ లభిస్తుంది - ఆత్మానందంతో పాటు.

తనను ప్రేమించే ఒక పురుషుడికి ఆత్మార్పణ చేసుకొన్న ? నీవు ఎంతటి పరాత్పర తరవు !

అసలు స్త్రీ సృష్టే పరమ సుకుమార సుందరం.

ఆమె పుట్టుక తోనే అగ్ని ! స్వచ్ఛమూ, సుందరమూ, పవిత్రమూ అయిన జ్వాల ! మాలిన్యాలు, దోషాలు, పాపాలు ఏవీ అంటవు దాన్ని !

స్త్రీ చిత్తం చంచలం - అన్నవాడు వట్టి అప్రయోజకుడు. అప్రయోజకులే అధిక సంఖ్యలో ఉన్న సమాజం, స్వార్థ బుద్ధితో అవమానించింది స్త్రీని అనేక విధాలుగా !

స్వార్థం, చాంచల్యం, దురాక్రమణ వంటి తన దుష్ట గుణాలకు స్త్రీని బలి చేసి, వదిలేసి, ఆ గుణాలన్నీ ఆమెకు అంటగట్టి, ఆమెను కులట అంటాడు పురుషుడు !

సుకుమార కుసుమం స్త్రీ !

దాన్ని ఎవడో ఒక క్రూరుడు త్రుంచి, ఆఘ్రాణించి, నలిపి పారవేస్తే - ఆ పాపం అతడిదా ? ఆమెదా ?

అమెదే అంటా డతడు !

నోరెత్తే శక్తి లే దామెకు !

పాప మనేదే ఉంటే - దాన్ని సృష్టించిన వాడూ, పోషిస్తున్న వాడూ పురుషుడే.

స్త్రీ పురుష సంబంధమే పాపమైతే, ఈ లోకమే ఒక పాపపు ముద్ద కదా ? దాన్ని భరించ వలసిన వాడు దానికి కారకుడైన పురుషుడే కదా ?

సృష్టి స్థితి లయాత్మక ప్రకృతిమూర్తి స్త్రీ !

**ఒకో స్త్రీ ఒకో మధు కలశం !**
**ఒకో కలశంలో ఒకో ఆనంద సుధ !**
**ఒకో స్త్రీ ఒకో సౌందర్య వీణ !**

**ఒకో వీణపై ఒకో ఆనందరాగం !**

**ఒకో స్త్రీ ఒకో చంద్రకళా జ్వాల !**

**ఒకో జ్వాలలో ఒకో ఆనంద పరమ విభూతి !**

**స్త్రీ అమృత కలశం, జీవన వీణ, వహ్నిజ్వాల.**

సహజంగా స్త్రీయే అంతటి దివ్యమూర్తి అయినప్పుడు దివ్య శృంగార కళామూర్తివి నీవు సాక్షాత్తు త్రిశక్తి రూప అమృత తత్త్వ ఆనంద చేతనవే కావా ?

అతిలోక సుందర మాధుర్యాల నన్నిటినీ నీ శరీరంలోకి ప్రవహింప జేసుకొని, నా కర్పించే రాగ ఝరిని నీవు !

నీవు నాలోకి ప్రవేశించిన ఆ నీ తొలిచూపు ! ఆ నీ తొలి స్పర్శ ! ఆ నీ తొలి కౌగిలి ! ఆ నీ తొలి ముద్దు !

అది అమృత కలశం !

అవి సుధా పూర్ణిమలు !

అది మధులీలా పీయూష కమలిని !

స శరీర ఆనంద సమద్వైత్వం అది !

ఎంతటి అదృష్ట భాగధేయం మనది !

నీవు పుట్టి ఉండకపోతే ?

పుట్టినా – నాకు లభించి ఉండకపోతే ?

సాధ్యమా అది ?

పూర్ణిమ నాడు చంద్రుడు ఉదయించక పోతే ? ఉదయించినా వెన్నెల కాయకపోతే ?

నీవు పుట్టడం, నాకు లభించడం – యాదృచ్ఛికాలు కావు ఇవి !

నాకు శరీరం – ఏర్పడ్డప్పుడు, నీకు శరీరం ఏర్పడక తప్పదు – పరస్పర దర్శనం కోసం, స్పర్శా సుఖం కోసం, సంయోగ మాధుర్యం కోసం, ఆత్మాభిరత పరమానందం కోసం !

అందుకే–

శరీరాలే మనం, మనమే శరీరాలు,

మనకూ, మన శరీరాలకూ అభేదం !

అందుకే -

మన శరీరాల పరస్పర దర్శనం లో ఇంతటి ఆనందం ! వాటి స్పర్శనలో ఇంతటి రసానందం ! వాటి సంయోగంలో ఇంతటి బ్రహ్మానందం !

# 113

" ఏ మివ్వను మీకు ?

" మీ కివ్వని దింకా ఏముంది నా దగ్గర మిగిలి ?

" మనసు, హృదయం, ఆత్మ - ఏమీ లేవు నాకు మీనుంచి విడిగా !

" శరీరం ఉంది - అక్షయ సుధాపాత్రం వలె మిగిలి - అనుక్షణం మీ ఇచ్ఛకు పూర్ణార్పణం అవుతూనే !

" మీరు పొందాలనుకొన్న ఆనందం ఏదైనా, ఇంకా నాలో మిగిలి ఉన్నదని మీ రనుకొంటే - పూర్తిగా పొందండి దాన్ని ఇప్పుడే !

" విడిపోతున్నాం మనం - మళ్లీ కలుసుకొంటా మనే ఆశతో, సంకల్పంతో, ప్రతిజ్ఞతో !

" మనం ఒకే ఒక శివాద్వైత పరబ్రహ్మ అయినా - శరీరాలు ఉన్నంత వరకు, విశిష్టాద్వైత ప్రేయసీ ప్రియులమే, శివసరస్వతులమే, బ్రహ్మానంద సబ్రహ్మచారులమే కదా మనం ?

" మిము తొలిసారి చూచిన ఆ క్షణమే నేను మీరైపోయి, మీలో లయమైపోయాను నేను పరిపూర్ణంగా !

" నేను అనేదే లేదు నా కిప్పుడు.

" స్త్రీ జీవితానికి ఏది పరమార్థమో, పరమగమ్యమో, పరమసిద్ధో దాన్ని చేరిన నేను - కేవల శుద్ధ నిర్గుణతత్వ పరిపూర్ణమైన అర్ధ నారీశ్వర శక్తినే అయిపోయాను కదా ?

" నేను అనేది ఏదైనా ఇంకా మిగిలి ఉంటే - ఈ అనంత విశ్వ విశ్వాంతర ప్రకృతి కంతా అధిష్ఠాన దేవత నైన నాలో - పొందండి దాన్ని ! పొంది, తన్మయులు కండి ! తన్మయులై, త్వమేవాహంగా ఉప రతి పొందండి నాలో !

" నాలో తప్ప, ఉపరతి పొందనివ్వను మిమ్ము ! మీరే విశ్రమిస్తే - సర్వం శూన్యమే కద !"

వైశాఖీ !

దైనందిన జీవిత వైరస్యాలతో సతమతమవుతున్న నీవేనా వ్రాస్త ఈ లేఖ?

నేను ఆపుకోలేని సుఖదుఃఖాలు చెప్పుకొనే కొద్దిమంది మిత్రులలో ఏ ముసలయ్యో, ఏ బాలకృష్ణో, ఏ రాజో, ఏ విశ్వమో, ఏ రాజరత్నమో, ఏ కుసుమో–

ఎవరైనా – ఈ లేఖను చూస్తే – ఏమంటారు వాళ్ళు ?

ఈ లేఖ నీది కాదంటారు.

నేనే సృష్టించా నంటారు !

నన్ను పూర్తిగా నమ్మే మిత్రులు కనుక – నేను నమ్మబల్కిన తక్షణం మూర్ఛపోతారు – నా ఒడిలోకే ఒరిగి !

శాంతించు ! శాంతించు !

నా ఒడిలోకి మరొకళ్ళు ఒరగడం అసలే కిట్టదు కద నీకు !

అవును !

నీవు పరిపూర్ణ ప్రకృతివి !

నేను పరిపూర్ణ పురుషుణ్ణి !

సమస్త సృష్టీ మన అధీనం లోదే. మనల్ని అతిక్రమించిన దేదీ లేదు ఎక్కడా, ఎప్పుడూ !

ఉన్న దొక్కటే – నేను !

నాతో పాటు – నీవు !

సరే. కాని –

నీవు మిగుల్చుకొన్న దేం లేదు. నిజమే. కాని–

నేను పొందవలసిందంతా మిగిలే లేదా ఇంకా నీలో ?

నీ లోని ఆనందం అక్షయం !

నా లోని పిపాస అనంతం !

క్రోలనీ నిన్ను కలకాలం !

ఏమైనా – మానవులం కదా ?

సర్వ స్వతంత్రులం కాం మనం !

విధిని కాదనలేం ఏమైనా !

తలుపు చప్పుడు ?

పని మనిషి కావచ్చు.

ప్రయాణం సంగతి మరిచే పోయాను !

వెళ్ళాలని లేదు నాకు.

నీతో ఇలా - ముఖంలో ముఖం, కంటిలో కన్ను, నోటిలో నోరు, రొమ్ములో రొమ్ము, నడుంలో నడుం, తొడలో తొడ, అడుగులో అడుగు - ఇలా - అతుక్కుపోయి, ఒకటైపోయి, ఆనందంగా కరిగిపోయి, అభిజ్ఞా రాగరేఖలమై విశ్వాంతరాళం నిండా విహరిస్తూ - ఇలా నీతో ఉండిపోవాలని ఉంది నాకు శాశ్వతంగా !

అలవాటైపోయిన ఈ చికుర సుందర నిశీథాలు, ఈ నీలోత్పలాలు, ఈ కెందమ్మి మొగ్గలు, ఈ కమలాకర తీరాలు, ఈ గాన రస స్రవంతులు - ఈ అమృతభాండాన్నే విడిచి ఒక్క క్షణమైనా బ్రతకగలనా నేను ?

కాని -

వెళ్ళకపోతే ఎలా ?

ఎంత అస్వతంత్రుడు మానవుడు !

క్షణిక సుఖాల చక్కెర పూతలతో విషాద విష గుళికల్ని మ్రింగుతూ, గత మాధుర్యాల్ని నెమరుకు తెచ్చుకొంటూ, పునస్సమాగ మాకాంక్షల బలంతో ముందుకు సాగవలసిందే !

కామ్య బలం కంటె, కర్తవ్యబలమే కఠినతనం కదా !

సరే !

వైశాఖ పూర్ణిమకు ముందే వచ్చేస్తావు కదూ తిరుకొండకు ?

నీ కన్న ముందే చేరుకొంటాను అక్కడికి నేను !

శుక్ల సప్తమి నాటికే అక్కడికి నీవు రాగల్గితే - గంగాభవాని సంపూర్ణ దర్శనం చేసుకోవచ్చు విష్ణుపథంలో !

అడుగులలో అట్టడుగున పుట్టి, ఎన్నో అవస్థలకు లోనై, అన్ని ఒడిదుడుకులూ గడిచి, శివునికే శిరోధార్య ఆర్య కాగలిగిన మహా మహితాత్మురాలు గంగ !

అదే మన గోదావరి గంగ !

గోదావరీ తీరస్థ దుగ్ధమధు భూముల్ని - ఆకాశదర్పణంలో దుగ్ధాబ్ధి సుందరంగా దర్శించ వచ్చు మనం ఆనాడు !

గోలోక సుర గంగె, భూలోక వరగంగ !
గోగంగ - భూగంగ - గోదావరీ గంగె !
అమృత సుక్షేత్ర అది ఆనంద దుగ్ధ్యయే !
అనుభవింతము రమ్ము ఆకాశ లక్ష్మిలో !

# 114

"వెళ్ళొస్తా, మళ్ళొస్తా ! వెళ్ళొస్తా, మళ్ళొస్తా !" అంటూ బైలుదేరింది రైలు ఎంతో బరువుగా.

ఎన్ని వేల మందికి చపుతున్నదో అది ఆ వీడ్కోలు !

ప్లాటు ఫారం నిండా విరిసినై సజల నేత్రాలు ! రెపరెపలలాడుతున్నై హృదయాలు జేలు రుమాళ్ళ వలె !

"వెళ్ళొస్తా, మళ్ళొస్తా, వెళ్ళొస్తా, మళ్ళొస్తా !" వీడ్కోలు చెపుతున్నది నీకు నా హృదయం !

ఆ నేత్రాలన్నీ నీవే ! ఆ హృదయాలన్నీ నీవే ! ప్లాటుఫారం నిండా నీ వొక్కర్తవే నిలబడిపోయి ఉన్నావు - మూగవోయిన కరుణ దేవతలా !

నిన్ను విడిచిపెట్టి వెళ్ళిపోతున్నాను నేను.

రైలుపెట్టె గుమ్మంలో నేను, ప్లాటుఫారం అంచున నీవు - నిలబడే ఉన్నాం !

అయినా, విడిపోతున్నాం, దూరమైపోతున్నాం మనం ఒకరి కొకరం అనంత వేగంతో !

కనిపించడం లేదు నీవు !

నిన్ను విడిచి ఉండలేని నా చూపులు నీతోనే ఉండిపోయినవో ఏమో - కన్నీళ్ళు తప్ప కనీనికలు లే విప్పుడు నా కళ్ళల్లో !

వెళ్ళి పోతున్నది నేను !

ఉండిపోతున్నది నీవు !

నా దుఃఖం కంటె నీ దుఃఖమే ఎన్నో రెట్లు అధికం !

కొత్త పరిసరాలు నాకు నిన్ను మరిపిస్తై ! పాత పరిసరాలు నీకు నన్ను జ్ఞాపకం తెచ్చి ఏడ్పిస్తై !

రైలు వేగం హెచ్చింది.

విశ్వ చైతన్య కేంద్రాన్ని విడిచిపెట్టి పోతున్న భూగోళంలా ఉన్న దిది !

ఒకొక్క పెట్టె ఒకొక్క దేశం. ఒకొక్క స్టేషను ఒకొక్క జన్మ.

శత శతాధిక జనతా గర్భిణి ఈ రైలు !

అపారమైన విశ్వాన్ని మోసుకుపోతున్న కాలం, అసంఖ్యాకులైన జీవరాశుల్ని మోసుకుపోతున్న భూగోళం, అనుల్లంఘనీయమైన కర్తవ్యాలను మోసుకపోతున్న రైలు, అనంతమైన విరహ వ్యధను మోసుకపోతున్న నా హృదయం – ఆక్రోశిస్తున్నై ఒకే తాళగతిలో, "వెళ్ళొస్తా, మళ్ళొస్తా" అంటూ !

జీవన గీతం ఇది !

కలగర్భపు అహోరాత్రుల నుంచి, క్రిక్కిరిసిన రైలు పెట్టెల నుంచి, విరహార్తాలైన = ప్రేమ గుండెల నుంచి – అనాదిగా, అనంతత్వపు ఆవధులు పొర్లి, అనునిత్యం వినవస్తున్న విశ్వజీవన గీతం ఇది !

వెళ్లొస్తా నన్న మాటలో ఎంత దుఃఖాంధకారం గూడు కట్టుకొన్నదో, మళ్ళొస్తా నన్న మాటలో అంత ఆశా ప్రభాతం ప్రాణ బీజమై ఉన్నది !

కాలం, భూగోళం, రైలు, నేను !

సాగిపోతున్నాం మేం – బరువుగా, వేడి నిట్టూర్పులతో, ఒకే మనస్థితిలో – గతానికి వీడ్కోలిస్తూ, వర్తమానానికి వాగ్దానం చేస్తూ !

ఇంకా అక్కడే నిలబడి చూస్తూ ఉండి ఉంటావు నీవు – భీమేశ్వరి రాగంలో, కామేశ్వరి తాళంతో, ఏతత్ జీవన మహాగీతం పాడుకొంటూ !

వెళ్ళొస్తా !

వెళ్ళొస్తా ! మళ్ళొస్తా !

**తిరుగు లేని బాధ్యతలకు**
**శిరము వంచి వెళ్ళొస్తా!**
**బడలిన నా తనువును నీ**
**ఒడిని జేర్చ మళ్ళొస్తా !**

**కరుణ లేని కాలముపై**
**కత్తి దూసి వెళ్ళొస్తా !**

అహితమైన దెల్ల గెలిచి
అమృతముతో మళ్ళొస్తా !
మరుపు లేని నీ పూజలో
మల్లె ఉంచి వెళ్ళొస్తా !
ఆరని విరహాశ్రువులకు
అవధు లెరిగి మళ్ళొస్తా !

## 115

వికసించడానికి మొగ్గ ఎంత వేగిరపడుతుందో, వికసించిన పువ్వు మళ్ళీ మొగ్గగా వెనక్కి తగ్గడానికి అంత ఆరాటపడుతుంది !

కాని – ఎలా సాధ్యం ?

మన ఈ మహాసృష్టికి వెనకడుగే లేదు కద !

పోనీ – మొగ్గ మొగ్గగానే ఉండిపోగూడదా ?

అయితే – అందువల్ల ఏం ప్రయోజనం ?

మొగ్గ వికసించవలసిందే.

మల్లె మొగ్గ కూడ వికసించవలసిందే – తీగనో, ఏ తీగబోణి సిగలోనో !

వికసించడం ఎంత అందం !

ఆ అందం చుట్టూ ఎంత ఆకర్షణ ! ఎంత ఆరాధన ! ఎంత ఆనందం !

అందుకే – వికసించడం కోసం అంత తహ తహ !

తన చుట్టూ ఎన్ని వలపు చూపులు ! చూపు తుమ్మెదలు ! తుమ్మెద పాటలు !

పాటలాధరల నిత్య సాంగత్య లీలలు ! లీలా మారుత డోలలు !

తాను ఆకర్షణకు కేంద్రం కావడం ! ఆరాధనకు దేవత కావడం ! ఆనందానికి నిలయం కావడం !

ఎంత అదృష్టం !

ఎంత సంతృప్తి !

క్షణ మాత్రమైతే నేం ! చాలదా జీవితానికి ?

చాలు అనిపిస్తుంది తొలిసారి

కావా లనిపిస్తుంది మరొకసారి.

కాని –

మరొకసారికి ప్రొవిజను లేదు ప్రకృతిలో !

ఎంత అన్యాయం !

మొగ్గ వికసించేది ఒకేసారి.

అన్ని అందాలు, అంత తపస్సు ఆ ఒక్కసారి కోసమే !

ఆ తర్వాతది బైటికి దారి !

లోనికి – బైటికి – గుమ్మాలు వేరు వేరు.

వచ్చిన గుమ్మానికి తిరిగి వెళ్ళే వీలే లేదు.

అదొక పెద్ద క్యూ !

ఒక మహా ప్రవాహం !

ఇటు ప్రవేశించి, అటు నిష్క్రమించ వలసిందే.

పోనీ – ప్రవేశ నిష్క్రమణల మధ్య, ఈ మధుర జీవిత మందిరంలో, ఇష్టం వచ్చినంత కాలం గడపవచ్చునా ?

అదీ వీల్లేదే !

ప్రవేశపత్రంపై టైం వేసి ఉంటుంది. ఆ టైంలోనే తీర్చుకోవాలి అన్ని సరదాలూ, ముచ్చటలూ, కోరికలూ, విధులూ !

క్షణమైనా వృథా చెయ్యకుండా గడుపుకొంటే – అన్ని కర్తవ్యాలూ నెరవేర్చుకోవచ్చు, అన్ని ఆనందాలూ పొందవచ్చు, అమృతత్వం కూడ సాధించవచ్చు ఆ ఇచ్చిన టైంలో !

కాని –

ప్రథమానుభవ పారవశ్యం నుంచి తేరుకొనే టప్పటికే తెల్లవారి పోతున్నది బ్రతుకు –ఎన్నో కల్పపూలకు !

ప్రవేశించి, ఆ రద్దీకి తట్టుకొని, గోలకు ఆగి, కంఠం శ్రుతి చేసుకొని, పైకి చూచేటప్పటికే నిష్క్రమణ ద్వారం కనిపిస్తున్నది – ఎన్నో బాల కోయిలలకు !

చేసేది లేక కొందరు, ఉక్కిరిబిక్కిరై కొందరు, అర్థం కాక కొందరు, అనుభవయోగ్యత లేక కొందరు, ఆ ఒక్క మ్రొక్కు తీర్చేసుకొని విద్యార్థుల వలె !

ఇక –

ఎంత అనుభవించినా తనివితీరని మనలాంటి వాళ్ళకు ఈ టైం ఎలా సరిపోతుంది ?

నిల్చి చూడలేం.

మళ్ళీ అదే అనుభవించలేం.

ఒక్క అడుగు వెనక్కి వెయ్యలేం !

ఎంత క్రూరం ఈ ప్రకృతి శాసనం !

మనం మళ్ళీ మొగ్గలం కావాలంటే – వాడి రాలిపో వలసిందే ! నిష్క్రమించి ప్రవేశించ వలసిందే ! మళ్ళీ అంతా కొత్తగా ప్రారంభించ వలసిందే !

గతం గుర్తుండదు ! అనుభవం ఉపయోగించదు ! బ్రతుకంతా తిరిగి చరిత్ర చర్వణం !

ఈ పుష్ప జీవితాలను, ఆనందరాగప్రమత్తత కోసం వికసింపజేసుకొన్న మనం, అప్రమత్తుల మెలా కాగలం ?

ఎందుకో ఈ కాల నియమాలూ, పరిమితులూ, హద్దులూ !

# వైశాఖి

*ఇది వైకుంఠము వెంకటేశ్వరుడు ల*
*క్ష్మీశుండు కొల్వుండుటన్ !*
*ఇది కైలాసము, మల్లికార్జునుడు అ*
*ద్రీశుండు చెల్వొందుటన్ !*
*ఇది బ్రహ్మోర్వి, సరస్వతీ చరణ పం*
*కే జాతమై యుండుటన్*
*ఇది మా ఆంధ్రము ; నీకు పీఠము ; త్రిశ*
*క్తీ ! పూజ గైకో గదే !*

త్రిమూర్తులకూ, వారి దేవేరులకూ, వారి పరివారమైన ముక్కోటి దేవతలకూ నిలయమైన విశ్వకేంద్రం ఆంధ్రం !

సింహాచలం, సత్యనారాయణగిరి, ఇంద్రకీలాద్రి , శ్రీశైలం, శేషాద్రి – పూర్వగిరి పంక్తుల నిండా ఎన్ని క్షేత్రాలు ! ఎన్ని సౌందర్యాలు ! ఎంత ఔజ్జ్వల్యం ! ఎంత ఆనందోపరతి !

విశ్వ సౌందర్య కేంద్రం ఆంధ్రమైతే, కేంద్రంలో పరమ సౌందర్య విక్షేపం శ్రీ వేంకటాద్రి !

ఒక మహాశక్తి క్షేత్రం ఇది !

ఈ మహా సౌందర్యాన్ని దర్శించడానికి ఒళ్ళంతా కళ్ళు చేసుకొని, ఆనంద రవశ్యంతో ఆహ్వానించాను జగదంబను – తొలిసారి నేను తిరుపతి కొండ లెక్కినప్పుడు – నా పరమ విభూతిలో పాలుపంచుకోవడం కోసం !

*విశ్వ సృష్టికే మూలశక్తి దేవి !*

*ఆంధ్రాధిష్ఠాన పరవశ్రీ ఆమె !*

***శేషగిరి నుండి సింహాద్రి శిఖరమునకు***
***కల్పమంజరు లూయెల కట్టి, తెలుగు***
***కడలి తరగల చెలులు రంగార నిన్ను***
***మించుల యెడంద లడర ఊగించ గలరు !***

అంటూ అంజలి ఘటించి పలికాను స్వాగతం.

తెలుగు వెంకన్నను మించిన భాగ్యశాలి, మహిమాన్వితుడు, కారుణ్యమూర్తి, రసాధిపతి లోకంలో మరొక రెవ రున్నారు ?

తనలో వెలసిన శ్రీస్వామిని పులకిత గాత్రంతో, రెండు చేతులతోనూ పైకెత్తి, దేవతలకు చూపుతున్న ఈ ధాత్రీదేవి సాక్షాత్తు యశోదా దేవే !

ఆ రెండు చేతులే సూర్యచంద్రులు. ఏడుకొండలే సప్తలోకాలు, సప్త కమలాలు ! ఆ చివర పద్మంలోని పద్మావతీ యుతుడైన శక్తి స్వరూపుడే శ్రీ వేంకటేశ్వరుడు.

ఈ ఏడుకొండల్ని ఏడు స్వరాలకు శృతి చేసి, విశ్వగానమే చెయ్యాలి నేను – నీ హృదయ వీణపై !

***ఏడు కొండల శిఖరాల కెదిగి, దివికి***
***ఓసరిల్లి, పిల్లనగ్రోవి నూదుకొనెడు***
***తెలుగు వెంకన్న నీ కాలిధేయ మొసగ***
***చూచెదవు గాని ! అచ్చ యశోద సుతుడె !***

బెల్లించాను జగజ్జననిని !

ఆ సౌందర్య మహార్ణవంలో నేనొక అలనై, ఆ సంగీత మహా సామంలో

నేనొక ఉద్గీథనై, ఆ ఆనంద మహాయోగంలో వట్టి శూన్యమాత్రుణ్ణై – నేనే తిరుమలనై శిరస్సున ధరించాను స్వామిని ఆనాడు !

అప్పుడు నీ వెక్కడున్నావో !

ఆనందచేతనవై, నాదబ్రాహ్మివై, అభిజ్ఞా చిత్తవై, కసుమ సౌరభ శరీరవై – నా చుట్టూ, నన్ను అలముకొనే ఉండి ఉన్నా వేమో !

నీ అనురాగాన్ని మన్నించి జగదంబే నిన్ను నా కిచ్చిందేమో !

రాగలక్ష్మి, రాగజ్యోతి, రాగప్రభ, రాగవైశాఖి, రాగరేఖ, రాగరమ – ఓహో !

ఇప్పుడు, ఈ గిరిక్షేత్ర సౌందర్యంలో మునిగి, ఈ స్వామి సన్నిధిలో పరవశిల్లి, ఊహలు అందక, మాటలు రాక, కాలం నడవక, ఏదో వ్రాసి, ఎలాగో ముగిస్తున్నాను ఈ లేఖ !

వస్తున్నావు కద ? ఇక్కడే చదువుకొందువు గాని దీన్ని !

ఆనాడు ఆదిశక్తిని ప్రార్థించాను. ఈ నాడు అదే గొంతుతో పిలుస్తున్నాను నిన్ను – ఈ మహా సౌందర్య సుధాస్వాదనలె నాతో పాలుపంచుకోమని !

*రమ్ము, దేవి ! ఈ గిరి మానసమ్ము లందు*
*మాధవుని దివ్య పాద పద్మాలు కలవు !*
*ప్రేమ సుందరములు, మాధురి ము లివ్వి !*
*రమ్ము, నా జంట తేటివై రమ్ము, దేవి !*

## 117

" పానకంలో పుడకల్లా ఈ బిచ్చగాళ్ళేమిటి, గురో ? " అన్నాడు సాంబశివ.

సాహితీ భారతంలో సాంబశివ ఒక మహారథుడు. అట్టి వాడికే చికాకు కలిగించిన రాక్షసులు ఈ భిక్షకులు !

నిర్మలమైన మనస్సుతో, భగవద్ధ్యానం చేసుకొంటూ, దేవాలయానికి పోతూ ఉంటే – దారికి రెండు ప్రక్కలా బారులు తీరి ఉండే బిచ్చగాళ్ళు, చేసే గోల, చూపే దౌర్జన్యం, పెట్టే శాపనార్థాలు ఎంత దుర్భరం !

ఈ కుంటి, గుడ్డి, అవిటి, మూగి, సోమారి, రోగిష్ఠి దౌర్భాగ్యు లంతా ఏ యే కర్మలు చేసుకొని అనుభవిస్తున్నారో ఈ బాధ లన్నీ !

ఇప్పుడు – ఈ విధంగా – పుణ్యక్షేత్రాలలో చేరి, యాత్రికుల్ని పీడించడం, ప్రశాంతతను పాడు చెయ్యడం, దానం చెయ్యలేని పేదలను తిట్టడం వంటి ఘోరాలకు పాల్పడడం వల్ల – ఇంకా ఎలాంటి దీనజన్మలు దాపురిస్తాయో కదా వీళ్ళకు ముందు ముందు !

ఈ బిచ్చగాళ్ళ కంటె పేదలైన వాళ్ళెందరు లేరు ఈ యాత్రికులలో ?

చొక్కాలున్నా వాటికి జేబులు లేనివాళ్ళు, జేబులున్నా వాటిలో డబ్బులు లేని వాళ్ళు, డబ్బులున్నా అవి తిరిగి ఇల్లు చేరేదాకా చాలని వాళ్ళు లక్షల కొలదీ ఉన్నారీ యాత్రికులలో ! ఏదో భక్తితో బాధతో ప్రశాంతి కోసం దైవదర్శనానికి వస్తే – ఇక్కడ ఈ పీడ ఏమిటి ?

ఈగలు, దోమలు, మిడతలు, ఎలకలు, రకరకాల తెగుళ్లు – ఈ జాబితాలో చేర్చబడవలసిన వీళ్లు ఎందుకిలా వదలబడ్డారో స్వేచ్ఛగా సమాజం మీదకూ, క్షేత్రాల మీదకూ !

తన గుమ్మం ముందు ఇంత కుళ్ళును పెట్టుకొని, ఆ భగవంతుడైనా ఎలా ఉండగలుగుతున్నాడో విశ్రాంతిగా !

" ఈ గుడుల్లో ఇంకా దేవుళ్ళున్నా రనేనా, గురో ?" అన్నాడు సాంబశివ – బిచ్చగాళ్ళ వ్యూహం నుంచి బైటపడడానికి యత్నిస్తూ !

డబ్బు ల్లేవు !

ఉన్నా వీళ్ల కెందు కివ్వాలి ?

మరి – భగవంతుడే బిచ్చగాడి వేషంలో వస్తేనో ?

అది అతడి కర్మ !

తన సృష్టి రాజ్యంలోని ప్రతి ఒక్కడికీ – తిండి, బట్ట, కొంప – ముఖ్యంగా ఈ మూడింటినీ ఉచితంగా చేకూర్చవలసిన ప్రాథమిక బాధ్యత భగవంతుడిపై లేదా?

మన అందరి దగ్గర నుంచీ భక్తి, ధ్యానం, ప్రార్థన, పూజ, వ్రతం, తపం, యజ్ఞం. యోగం, నైవేద్యం వంటి అమూల్య దివ్య సంపత్తిని రాజధనంగా వసూలు చేసుకొంటున్న భగవంతుడు - ఒక పేద యాత్రికుడి ముందు బిచ్చగాడై చేయి చాపితే, అది అతడి కర్మగాక మరేమిటి ?

బిచ్చమెత్తుకొనేవాడు ఎవర్నీ బాగుచెయ్యలేడు

ఏడ్చేవాడు సంతోష పెట్టలేడు ఎవర్నీ.

అంతా తనకే కావా లనుకొనేవాడు ఇతర్లకు ఇవ్వలేడు ఏమీ.

ఇచ్చే గుణం లేనివాడు ఈశ్వరు డెలా అవుతాడు ?

ఇలాంటి వాళ్ల ఆత్మలు వికసించవు. ఆత్మవికాసం లేకుండా ఉత్తమ జన్మలు లభించవు.

జీవన నైరంతర్యం, జన్మాంతర పౌనఃపున్యం - అహో రాత్ర సమాశ్లిష్ట మహాకాలం వలె - సత్యస్య సత్యంగా పేర్కొంటున్నాను కదూ పదే పదే ?

ప్రకృతి విజ్ఞాన ప్రమత్తులైన ఆధునికులకు ఇది మూఢ విశ్వాసంగా కనిపిస్తుం దేమో !

కాని - అది పరమ సత్యమే.

అభిజ్ఞ లేని అణువును విశ్లేషించిన ఒక మహా సైంటిస్టు కంటె, అతడి మేధస్సునే విశ్లేషించగలిగిన ఒక వైదిక మహర్షి గొప్పవాడు నా దృష్టిలో.

అణు శక్తి కంటె ఆత్మశక్తి గొప్పది.

సుఖంగా బ్రతకడానికి మాత్రమే పనికి

సైన్సు. ఆత్మ అందదదానికి.

ఆత్మ అందే దొక ఆత్మకే !

కాగా -

సోదా కోసమైనా సరే, సరదా కోసపమైనా సరే, ఆకలితోనైనా సరే,ఆపదలోనైనా సరే - బిచ్చగాడు కాగూడదు భగవంతుడైనా.

ఆదిభిక్షువును అపార్థం చేసుకొన్న జాతి మనది.

అడుక్కుతినడాన్ని ఆధిక్యతగా భావించడం అల్పత్వం.

అన్నదానం మానవతకే అవమానకరం.

అందరికీ సమనంగా లభించవలసి ఉన్న అన్నాన్ని ఎవడో ఒకడు చేజిక్కించుకొని, ఏడాది పొడుగునా ఆ అందరి కడుపులూ మాడ్చి, ఏదో ఒక పండగరోజున అన్నదానం పేరుతో ఇన్ని చారు మెతుకులు పడేసి, దానిద్వారా కీర్తినీ,పదవినీ, పుణ్యాన్నీ, స్వర్గాన్నీ కొట్టేస్తా మనకోవడం కంటె మోసం, పాపం ఇంకేదీ ఉండదు.

అన్నదానం చేసేవాడెంత వంచకుడో, దాన్ని స్వీకరించేవాడు అంత పతితుడు.

అదేదైనా కానీ – దానం మానవత్వం కాదు నా దృష్టిలో.

బలివంటి బలాఢ్యుల పైచేయి సంప్రదాయం ఓడించబడి, వామనుల క్రిందిచేయి ధర్మానికి పట్టాభిషేకం జరిగినవాడే పతనం ప్రారంభమయింది మన ఆర్ష జాతికి !

ఆనాటినుంచీ, అన్ని కాలాలలోను, అన్ని రంగాలలోను కూడ అదే ముష్టి బ్రతు కైపోయింది మనకు ఈనాటి దాకా !

మనిషిగా బ్రతకలేనివాడు, ఎందుకు చావడు ?

చావడానికి ధైర్యం లేనివాడికి బ్రతికే హక్కు ఎక్కడిది ?

బిచ్చగాళ్ళకూ, పంటలకుపట్టే తెగుళ్ళకూ తేడా ఏమిటి ?

అహింస, జీవకారుణ్యం, అన్నదానం, శాంతి – ఈ రకం నినాదాలకూ, ఉద్యమాలకూ వెనుక ఉన్నట్టిది ఎంతటి భయంకర రక్తదాహమో, పచ్చి మోసమో, నపుంసక తత్వమో ఊహింలేవు నీవు!

దానం చేసి, దానంద్వారా గ్రహీత ఆత్మకు చంపేస్తున్నాడు దాత !

అతడి ఆత్మను శాశ్వతదాస్యంలో ఉంచేస్తున్నాడు కూడ !

ముఖ్యంగా నేటి ప్రజాస్వామ్య యుగంలో – మానవుడి ప్రగతికి దాత ఎంత శత్రువో, దాన గ్రహీత అంత చీడ !

సర్వ ప్రపంచమూ గ్రహాంతర యాత్రలకు పోతుంటే – మనం తిరుపతి యాత్రకుకూడ స్తిమితంగా పోలేకున్నాం !

స్వామిదర్శనం చేసుకొని, కాంటీనులో ఇంత తిని, ప్రొద్దు పోయి వచ్చి, సత్రంలో పడుకొంటే – ముట్టడించిపై మమ్ము కోటాను కోట్ల నల్లులు, పగబట్టిన బిచ్చగాళ్ల రాక్షసాత్మల వలె !

## 118

ఎవరు ?

నీవు !

నీవే ?

కన్నుల వెన్నెల ! పెదవుల రుచి ! గుండె గుబులు ! కౌగిటి సుఖం !

అవును – నీవే !

కాని –

ఒక్క స్వర్గంలో మాత్రమే లభించే ఈ అధరామృత రుచి రసబ్రహ్మకు నిత్యవయస్యగా మాత్రమే కనిపించే ఈ ప్రణయ స్పందన – జీవేశ్వర సమైక్యంలె మాత్రమే సిద్ధించే ఈ స్పర్శాసుఖ సమాధి –

ఎక్కడివి ఇవన్నీ ?

ఇవన్నీ నీవే !

నమ్మకపోవచ్చు సామాన్యలోకం

లోకం ఎప్పుడూ కూపస్థ మండూకం !

లోకపు సరాసరి మెదడు జీరోబల్బు

అది నిత్యం వెలుగుతూనే ఉంటుంది

ఖర్చుమాత్రం కాదు కరెంటు !

క్షణంలె లక్షల కరెంటు కాలిపోయే విద్యుల్లతను చూచి, అసూయ పడుతుందది ! అది దాని ఖర్మ !

వచ్చేశావు నీవు – అంతే చాలు నాకు !

ఇచ్చేసుకొన్నావు నిన్ను నీవు - విలయ బ్రహ్మనై పోయాను నేను ఏతదానంద రసోల్బణంలో !

నీవు నాకు అందీ అందని అందంగా ఉన్నంతసేపే ఈ సృష్టికి మనుగడ!

నీవు లేని స్థితి శూన్యం !

నీవు నాలో ఐక్యమైపోయిన స్థితి విలయం !

పరిస్థితిలో , స్వభావంల&ఓ - వాస్తవానికి రెండూ ఒకటే !

నీవు లేనిది ఆది.

నీవు నాలో కలిసిపోయినది అంతం.

ఈ రెండూ లేని ఆద్యంతరహిత స్థితి కదా నా నిరంతర ఆనంద జీవన రతి?

నీవు లేని దెప్పుడు ?

నిరంతర సుందర సదానంద రతివి నీవు నాకు !

నీవు నన్ను పైకొనని దెప్పుడు ?

అజేయ శివానంద మన్మధమూర్తిని నేను నీకు !

ఇలానే ఉందాం మనం - లోకోత్తర సదాసుందర శివానంద సత్య ప్రణయ ప్రతీకలమై !

స్నానం చేసిరా - ప్రయాణం చేసి వచ్చావు !

రుద్దనా సబ్బు ?

"ముద్దులేదా, సబ్బు దేనికి ?"

ఔను !

మాయామోహిత మత్తుణ్ణి నేను !

ఒక్క ముద్దుతో ముల్లోకాలకూ మోక్షం ఇవ్వగల నేను ఈ స్నానాల గదిలో, నీ ముందు వట్టి సబ్బు బొమ్మను !

"బొమ్మ కాదు, బ్రహ్మ !'

ఏదో ఒకటి - నీ చరణ సేవలో !

రాగ సరస్వతీ చరణ సేవ !

వైశాఖీ పాద పూజ !

అర్ధనారీశ్వర వ్రతం !

సింధు స్నాన పుణ్యోత్సవం !

రాధాకృష్ణ పూర్ణ పూర్ణిమా దివ్యామృత రసాస్వాదనం !

ఇన్ని ఐశ్వర్యాలు ఒక్క స్నానాల గదిలో !

ఎంత ఉన్మత్త మోహనంగా ఉంది – ఈ మహా వైశాఖీ ప్రణయ వ్రతం !

ఎంత బ్రహ్మానంద సుందరంగా ఉంది – ఈ బ్రాహ్మీ పాద పద్మాలయ సేవా రాగలయ !

ఎంత – చంద్ర సూర్య సమున్మీలిత సచ్చిదానంద రాగలహరీ పరాం –

*జగములో వికసించు సౌందర్యముల కెల్ల*
*స్నానాల గదియె ఉద్యాన పద్మాకరము !*
*పద్మమకళికల మీద ప్రణయోదయ కరాలు !*
*ఉదయేందు కలశిలో ఉజ్జ్వలానందాలు !*

## 119

**ఏవో పుణ్యము, లేవొ ప్రేములు, రుచుల్,**
**ఏవో రసశ్రేయముల్,**
**ఈ వైశాఖిట మూర్తిదాల్చి, నను తే**
**ల్చెన్ పూర్ణ రాగాబ్ధిలో !**
**ఈ వాసంత రమా సమస్తమును నా**
**దే ఇంక ! కాలోత్తర**
**శ్రీ వాల్లభ్యము నాకు దక్కినదిపో,**
**జీవేశ్వ రావాస్యమై !**

మహా వైశాఖీ వ్రత ఫలంగా నాకు లభించిన మహా వాల్లభ్యపదవి నీవు !

వ్యాస పూర్ణిమ, బుద్ధ పూర్ణిమ, అమృత పూర్ణిమ, అన్నమాచార్య పూర్ణిమ, సంనద్గోరీ పూర్ణిమ, సింధుస్నాన పుణ్యపూర్ణిమ, అర్ధ నారీశ్వర పూర్ణిమ, అంకుర పూర్ణిమ, రాధా పూర్ణిమ – ఇలా జీవిత సమస్త వ్యాపారాలకు బీజావాప మనోజ్ఞమైన

ఈ మహా వైశాఖ పూర్ణిమ – ఈ మన రాగోదయ సముత్సవ సుధా పూర్ణ కుంభానికి విజయానంద రస పతాకగా నేడు ఆనందరాగ పూర్ణిమ అయింది !

లోకోత్తర సుందరమైన వైశాఖ పూర్ణిమ నా కోసం వైశాఖిగా ఇలా అవతరించగా, ఇక అక్కడ ఏముంది – రాగ పూర్ణిమ కాక !

అట్టి రాగ పూర్ణిమా పరిపూర్ణి సుధాకం బింబాన్ని మన నాల్గు పెదవులతోను అందుకొని – ఎంత మధురంగా నిర్వహించాం – పూర్ణి మాసీ సమస్తాశీర్వ్రత రాశీకృత సమీప్సిత వరవిధుల్ని – పగలంతా !

ఎంత వియోగవ్యధ తర్వాత,ఎంత నిరీక్షణ తర్వాత, ఎంత నైరాశ్యం తర్వాత – లభించింది నా యోగానికి ఈ ఆనంద సిద్ధి !

గడిచిపోతున్న అంధకారం అంతా భూగర్భంలోది ! పడుతున్న శ్రమావేదని అంతా భువ రంతరంలోది ! వాటితో మనకేం పని – స్వర్లోక సుఖం అంతా మందార దామంగా మనల్ని సన్మానిస్తున్నప్పుడు ?

ఎంత సేపటినుంచి కూర్చున్నానో నీకోసం ఎదురు చూస్తూ ఈ ఆరో కొండ శిఖరంపై !

ఈ కొండ పేరేమిటో !

పేర్లతో మనకేం పని !

ఆజ్ఞాపద్మాలయ ఎవరో కూర్చోపెట్టింది ఇక్కడ !

కూర్చున్నాను నీ కోసం – అస్థిమిత వహ్నిజ్వాల వలె, శయనాగారం గుమ్మంలో అర్ధరాత్రి ఎదురుచూచే విధ్యుక్త వినూత్న వరుడి వలె !

ముగియలేదా ఇంకా నీ అలంకరణం !

వైహారికమా ?

అభిగామికమా ?

ఉభయమా ?

ఎందుకో ఇంకా ఈ లోకాచార ప్రవృత్తి !

నీ రత్న కమలాలూ, వజ్రహారాలూ, మణి ముక్కరలూ, చీనిచీనాంబరాలూ, కనక కాంచీ వలగ్నాలూ, నటత్ రణత్ మహత్ మంజీర కింకిణీ నిస్స్వనాలూ 6 ఎందుకు ఇవన్నీ నాకు ?

అలంకారాలు శరీరంవరకే !

నిరలంకృత నగ్న నిశ్రేయస పరిభూతే పరమ రసానుభూతి !

నీవు వచ్చేవరకే నేను !

నీవు వచ్చిన తర్వాత మనం !

మనం అంటే ఈ లోకాలోక సమస్తమూ !

మనం అంటే భగవంతుడు !

అదే శ్రీ వేంకటేశ్వర మహాశక్తి ! అదే ఆనంద బ్రహ్మ !

ఆ మహాయోగ రాగవిభూతి కోసమే కూర్చున్నాను నేను ఇక్కడ ఎదురు చూస్తూ !

తెల్ల త్రాచు పిల్ల ల్లాంటి సెలయేళ్లు !

ఏ నాగినీదేవికి చెలికత్తెలో అవి ! నీ నిట్టూర్పుల్లా బుసలు కొట్టుకుంటూ వస్తున్నె దిగి.

ఇంకా రాలేదేం నీవు !

చంద్రుడూ రాలేదు ?

ఎంత మంది తారలనైనా సరే, వలీల్లెపువ్వుల్లా త్రుంచి, సలిపి పారవేయగల కఠినుడు చంద్రుడు. అడ్డగించి ఉండడు కదా నిన్ను దారిలో !

ఎందుకు వస్తాయో ఇలాంటి కుశ్శంకలు మానవుడికి!

ప్రకృతి గుణాలలో స్వార్థం, సంఘర్షణ ఉన్నంతకాలం మానవ మనస్సు చుట్టూ తాను పహరా కాచుకోవడం తప్పదేమో !

తారలు, మల్లెపూలు, కలువలు చంద్రుడిపట్ల సౌమనస్యం కలవి. వాటి ధ్యేయం అతడి కరాలలో నలిగి పోవడమే.

పరాయత్తు చిత్తను ఎంతటి రాక్షసుడైనా ఏమీ చెయ్యలేదు.

అసలు నీవే వైశాఖీ పూర్ణచంద్ర దేవతవు కదా!

అదిగో నీవు !

పూర్ణ సుధాకర బింబాన్నే జటలో ముడుచుకోగల నీ సుందర వదనార విందం – అదిగో, దూరంలో !

కాని –

అంత దూరమా !

వెన్నెల పట్టుచీర కట్టుకొని, కొండమలుపు దాటి వచ్చేస్తున్నా వనుకొన్నాను కాని -

మేఘాన్ని చీల్చుకొని బైటపడ్డ చంద్రబింబ మది !

మనిద్దరం కలిసి ఉదయిస్తున్న వైశాఖీ పూర్ణచంద్రుణ్ణి చూద్దామనుకొన్నామే!

అందుకే కదా ఈ కొండలకు వచ్చాం మనం !

అందుకే కదా ఈ శిఖరస్థాయిలో కూర్చున్నాను నేను!

నే నొక్కణ్ణే చూచేశానే చంద్ర బింబాన్ని నీ వనుకొని !

ఎక్కడి వీ కలువ పువ్వులు నా కన్నులపై !

ఓహో, ఆనంద పరిమళాలు !

"మీరు చూచింది నన్నే! చంద్ర బింబం ఒక అద్దం. అందులో ఒకరి నొకరం చూచుకొన్నాం. ఇప్పుడింద్దరం కలసి, దాన్ని చూద్దాం !".

నీవేనా ?

కుముద వనమై వికసించావు నా చుట్టూ ! కౌముదివై కరగించావు నన్ను రాగరసంగా ! మెరిసి పోయావు నీవు దానిలో పరం జ్యోతివై !

# 120

*ఎంత సేపు మనగల మిట*
*ఈ శిఖర స్థాయిని ?*
*ఈ రస రుచులకు అందని*
*ఈ అమృత నిశీధిని ?*
*అనురాగము అలలు మీటి,*
*ఆనందము తారదాటి,*
*మన్ను మిన్ను నేకతాళ*
*మై - మై మరపించి వేయ ?*

ప్రజ్ఞాన ఘనాభానయై
ప్రళయమైన పరమములో,
రాగ పూర్ణ పద్మముపై
రాధా మాదశ కళతో ?

పరమ కైవల్యా పదవి ఇది. రాధా మాధవ శివ సరస్వతీ ద్వంద్వాతీత పరాశక్తి క్షేత్రం ఇది. ఆనంద రసాత్మ ఇది. ఇంత వరకే మనం. ఇక లేం ఆ పైని !

ఉండలేం ఇక్కడ మనం – ఈ శిఖరాగ్రంపై. ఈ పరాపర ద్వార సూత్రం మీద ఎంతోసేపు !

ఇటో, అటో దిగిపోక తప్పదు !
వెలుగు – చీకటి !
చైతన్యం – శూన్యం !
రాగబ్రహ్మ – పరబ్రహ్మ !
ప్రవృత్తి – నివృత్తి
సమస్తం మనమే అయిన క్షణం ఒక్కటి చాలు మనకు !
అంతకు మించి – వద్దు !

ప్రవృత్తి మనది. రాగరంజితం అది. శాశ్వతీకరించుకొందాం దాన్ని ఆనంద మందిరంగా !

శివ శాంకరీ శాంబరీ !
బ్రహ్మానంద కాదంబరీ !

నా చుట్టు నీవు జ్యోత్స్నారాగ లక్ష్మివే !
నీ నిండ నేను చాంద్రీ శుక్ల పూర్ణునే !
నీ చుట్టు, నీ నిండ నేనేనె, ఓ చెలీ!
నే గ్రోలు మధు వెల్ల నీవేనె, నా చెలీ !

# 121

నిలబడ్డాం క్యూలో ధర్మదర్శనం కోసం !

నీ చేతిలో రెండు వెండి గుండెలు, నా చేతిలో ఒక నివేదన పొట్లం.

ఎప్పుడో గుండె బెదిరినప్పుడు - వెండిగుండె ఇస్తా నన్న మ్రొక్కు ఉంది నీకు స్వామికి.

నాకు ఏ మ్రొక్కూ లేదు.

దేవానికి లంచమిచ్చో, ప్రతిఫల మిచ్చో, వాగ్దాన మిచ్చో, పొగడ్తలతో ఉబ్బించో - అతడిచేత పని చెయ్యించుకోవ సం కిట్టదు నాకు.

ఏ గుడికైనా వెళ్ళినప్పుడు, న మనస్సులో ఏ కోరికా ఉండదు. విశ్వశ్రేయోరూపం తాల్చి, నిరామయంగా, శూన్య శుభ్రంగా ఉంటుందప్పుడు నా హృదయ స్థితి.

నేను దైవ దర్శనానికి వెళ్ళడం అతడి నుంచి ఏదైనా తెచ్చుకోవడానికి కాదు, నా కున్న దేదైనా అతడికి ఇచ్చి రావడానికి !

తాను ప్రేమించాలి

తాను ఇవ్వాలి.

ఈ రెండు గుణాలు చంద్రసూర్యులవలె కలిసినట్టిదే మహాయోగం. మహాయోగే మహేశ్వరుడు !

విశ్వశ్రేయో నిర్వహణలో క్షణక్షణం శక్తిని కోల్పోతూ ఉండే దైవానికి, తపస్సు ద్వారా తన ఆత్మశక్తిని అందించగల స్థితి ప్రజ్ఞుడే నిజమైన మానవుడు.

విశ్వశ్రేయమే నా వాంఛ.

అందులోనే ఉన్నై మన అందరి శ్రేయాలూ.

అంత మాత్రం చేత నిన్ను అక్షేపిస్తున్నానని కాదు.

సుఖాల కంటే దుఃఖాలే ఎక్కువగా కనిపించే జీవిత యాత్రలో ఆపద మ్రొక్కులు తప్పవు.

ఇచ్చేవా డుంటే, అడిగే వాళ్ళు లక్షలు !

తీరని కోరిక లుంటై ప్రతి మనిషికీ,

కోరికలు తీర్చేదేవుడు శ్రీ వేంకటేశ్వరుడు.

పరమ పదాన్యత పారం ముట్టిన మహాశక్తి క్షేత్రం ఇది.

అందుకే ఇన్ని మ్రొక్కులు. ఇంత భక్తి, ఇంత సేవ, ఇంత క్యూ !

క్యూ సాగుతున్నది ముందుకు.

నాగరికతా, ప్రకృతి విజ్ఞానమూ ఎంత పెరిగినా మానవుడు నిస్సహాయుడే. ఏదో పరమ శక్తి చేతిలో కీలుబొమ్మే !

సర్వాంతర్యామి అయిన ఆ శక్తి ఒకొకప్పుడు, ఒకొక చోట, ఒకొక రూపంలో కేంద్రీకృతం కావచ్చు – దావాగ్నివలె, వాయు గుండం వలె, సూర్యచంద్రుల వలె, నీవలె !

అట్టి కేంద్రం మంచిదీ కావచ్చు. చెడ్డదీ కావచ్చు.

మంచి చెడ్డలు వైయక్తిక దృక్పథాల తోడివి.

సుఖేచ్ఛా కేంద్రం వేంకటాద్రి.

సాగడం లేదు క్యూ !

ఏమిటి ?

నీ వెండి గుండెలు చూచికాదు నేను నవ్వుత.

నీవి రాతిగుండెలని ఎందుకంటాను?

బెదరిన గుండె ఒకటి కద ?

మరి – రెండెందుకో !

నీది బంగారుగుండె ! దాని బాగుకోసం వెండిగుండెనా ఇస్తావు ?

ఈ భావం నా మొఖంపైకి ప్రాకగానే, నీవు నా గుండెలలోకి చూచినప్పుడు, నీ పెదవులపై జిగేలుమన్న వెల్తురులో – మొత్తం క్యూ అంతా విరగబడి చూచింది నీ వంక !

భగ్గున వెలిగిన దీపంచుట్టూ అసంఖ్యాకంగా మూగిన ఆ చిరుతుమ్మెదలను చూచి – నేనే బెదిరాను కించిత్తు !

చిరుసిగ్గుతో దీపం మరింత మనోహరతను సంతరించుకొని, దీప లక్ష్మి అయింది కదా !

కదల్లేక కదులుతున్నది క్యూ !

ఇదొక మహా క్యూ !

రకరకాల మనుష్యులు, రకరకాల మనస్తత్వాలు, రకరకాల బాధలు, రకరకాల మ్రొక్కులు ! నివేదనలు !

యాత్రికులు - విలాస యాత్రికులు !

కొండపై ఒక్కరోజు గడపడంకోసం, స్వామిని ఒక్కక్షణం దర్శించడం కోసం. జీవిత శిఖరీభూతమైన ఏ తదానందానుభూతిని ఒక్కసారి పొందడం కోసం దూరదూరాలనుంచి, కాలకాలాలు ప్రయాణంచేసి వస్తారు - రకరకాల మానవులు!

ఒక్క పదినిమిషాల పనికోసం పదేళ్లైనా - పది జన్మలైనా పయనించవలసి ఉండవచ్చు జీవుడు ! పని అన్నప్పుడు చేసితీరక తప్పదు - ఎప్పుడో ఒకప్పుడు !

అందుకే - బద్ధకించగూడదు మనం.

ఆ మహాయోగ రాగ విభూతి కోసమే కూర్చున్నాను నేను ఇక్కడ ఎదురు చూస్తు!

తెల్ల త్రాచు పిల్ల ల్లాంటి సెలయేళ్ళు!

ఏ నాగినీదేవికి చెలికత్తెలో అవి ! నీ నిట్టూర్పుల్లా బుసలు కొట్టుకొంటూ వస్తున్నై దిగి !

ఇంకారాలేదు నీవు !

చంద్రుడూ రాలేదు ?

ఎంత మంది తారలనైనా సరే, మల్లెపువ్వుల్లా త్రుంచి, నలిపి పారవేయగల కఠినడు చంద్రుడు. అడ్డంగించి ఉండడు కదా నిన్ను దారిలో !

ఎందుకు వస్తాయో ఇలాంటి కుశ్శంకలు మానవుడికి !

ప్రకృతి గుణాలలో స్వార్థం, సంఘర్షణ ఉన్నంతకాలం మానవ మనస్సు తన చుట్టూ తాను పహరా కాచుకోవడం తప్పదేమో !

తారలు, మల్లెపూలు, కలువలు చంద్రుడిపట్ల సౌమనస్యం కలవి. వాటి ధ్యేయం అతడి కరాలలో నలిగి పోవడమే.

పరాయత్త చిత్తను ఎంతటి రాక్షసుడైనా ఏమీ చెయ్యలేడు.

అసలు నీవే వైశాఖీ పూర్ణచంద్ర దేవతవు కదా !

అదిగో నీవు !

పూర్ణ సుధాకర బింబాన్నే జటలో ముడుచుకోగల నీ సుందర వదనారవిందం – అదిగో, దూరంలో !

కాని –

అంత దూరమా !

వెన్నెల పట్టుచీర కట్టుకొని, కొండమలుపు దాటి వచ్చేస్తున్నా వనుకొన్నాను కాని –

మేఘాన్ని చీల్చుకొని బైటపడ్డ చంద్ర బింబ మది !

మనిద్దరం కలిసి ఉదయిస్తున్న వైశాఖీ పూర్ణచంద్రుణ్ణి చూద్దామనుకొన్నామే!

అందుకే కదా ఈ కొండలకు వచ్చాం మనం !

అందుకే కదా ఈ శిఖరస్థాయిలో కూర్చున్నాను నేను !

నే నొక్కణ్ణే చూచేశానే చంద్ర బింబాన్ని నీ వనుకొని !

ఎక్కడి వీ కలువ పువ్వులు నా కన్నులపై !

ఓహో, ఆనంద పరిమళాలు !

" మీరు చూచింది నన్నే ! చంద్ర బింబం ఒక అద్దం. అందులో ఒకరి నొకరం చూచుకొన్నాం. ఇప్పుడిద్దరం కలసి, దాన్ని చూద్దాం !"

నీవేనా ?

కుముద వనమై వికసించావు నా చుట్టూ ! కౌముదువై కరగించావు నన్ను రాగరసంగా ! మెరసి పోయావు నీవు దానిలో పరం జ్యోతివై !

## 120

***ఎంత సేపు మనగల మిట***
***ఈ శిఖర స్థాయిని ?***
***ఈ రస రుచులకు అందని***
***ఈ అమృత నిశీథిని ?***

*అనురాగము అలలు మీటి,*
*ఆనందము తారదాటి,*
*మన్ను మిన్ను నేగతాళ*
*మై - మై మరపించి వేయ ?*
*ప్రజ్ఞాన ఘనాభానయె*
*ప్రళయమైన వరమములో,*
*రాగ పూర్ణ పద్మముపై*
*రాధా మాధవ కళతో ?*

పరమ కైవల్య పదవి ఇది. రాధా మాధవ శివ సరస్వతీ ద్వంద్వాతీత పరాశక్తి క్షేత్రం ఇది. ఆనంది రసాత్మ ఇది. ఇంత వరకే మనం. ఇక లేం ఆ పైని!

ఉండలేం ఇక్కడ మనం - ఈ శిఖరాగ్రంపై, ఈ పరాపర ద్వార సూత్రం మీద.ఎంతోసేపు !

ఇటో, అటో దిగిపోక తప్పదు !

వెలుగు - చీకటి !

చైతన్యం - శూన్యం !

రాగబ్రహ్మ - పరబ్రహ్మ !

ప్రవృత్తి - నివృత్తి

సమస్తం మనమే అయిన క్షణం ఒక్కటి చాలు మనకు !

అంతకు మించి - వద్దు !

ప్రవృత్తి మనది. రాగరంజితం అది. శాశ్వతీకరించుకొందాం దాన్ని ఆనంద మందిరంగా !

శివ శాంకరీ శాంబరీ !

బ్రహ్మానంది కాదంబరీ !

*నా చుట్టు నీవు జ్యోత్స్నారాగ లక్ష్మివే !*
*నీ నిండ నేను చాంద్రీ శుక్ల పూర్ణనే !*
*నీ చుట్టు, నీ నిండ నేనేనె, ఓ చెలీ !*
*నే గ్రోలు మధు వెల్ల నీవేనె, నా చెలీ !*

# 121

నిలబడ్డాం క్యూలో ధర్మదర్శనం కోసం !

నీ చేతిలో రెండు వెండి గండెలు, నా చేతిలో ఒక నివేదన పొట్లం.

ఎప్పుడో గండె బెదిరినప్పుడు - వెండిగుండె ఇస్తా నన్న మ్రొక్కు ఉంది నీకు స్వామికి.

నాకు ఏ మ్రొక్కూలేదు.

దైవానికి లంచమిచ్చో, ప్రతిఫల మిచ్చో, వాగ్దానమిచ్చో, పొగడ్తలతో ఉబ్బించో - అతడిచేత పని చెయ్యించుకోవడం కిట్టదు నాకు.

ఏ గుడికైనా వెళ్ళినప్పుడు, నా మనస్సులో ఏ కోరితా ఉండదు. విశ్వశ్రేయోరూపం తాల్చి, నిరామయంగా, శూన్య శుభ్రంగా ఉంటుందప్పుడు నా హృదయ స్థితి.

నేను దైవ దర్శనానికి వెళ్ళడం అతడి నుంచి ఏదైనా తెచ్చుకోవడానికి కాదు, నా కున్న దేదైనా అతడికి ఇచ్చి రావడానికి!

తాను ప్రేమించాలి

తాను ఇవ్వాలి.

ఈ రెండు గుణాలు చంద్రసూర్యులవలే కలిసిమట్టిదే మహాయోగం. మహాయోగే మహేశ్వరుడు !

విశ్వశ్రేయో నిర్వహణలో క్షణక్షణం శక్తిని కోల్పోతూ ఉండే దైవానికి, తపస్సు ద్వారా తన ఆత్మశక్తిని అందించగల స్థిత ప్రజ్ఞుడే నిజమైన మానవుడు.

విశ్వశ్రేయమే నా వాంఛ.

అందులోనే ఉన్నై మన అందరి శ్రేయాలూ.

అంత మాత్రం చేత నిన్ను ఆక్షేపిస్తున్నానని కాదు.

సుఖాల కంటె దుఃఖాలే ఎక్కువగా కనిపించే జీవిత యాత్రలో ఆపద మ్రొక్కులు తప్పవు.

ఇచ్చేవాడుంటే, అడిగే వాళ్ళు లక్షలు !

తీరని కోరికలుంటై ప్రతి మనిషికీ,

కోరికలు తీర్చేదేవుడు శ్రీ వేంకటేశ్వరుడు.

పరమ పదాన్యత పారం ముట్టిన మహాశక్తి క్షేత్రం ఇది.

అందుకే ఇన్ని మ్రొక్కులు, ఇంత భక్తి, ఇంత సేవ, ఇంత క్యూ !

క్యూ సాగుతున్నది ముందుకు.

నాగరికతా, ప్రకృతి విజ్ఞానమూ ఎంత పెరిగినా మానవుడు నిస్సహాయుడే. ఏదో పరమ శక్తి చేతిలో కీలుబొమ్మే !

సర్వాంతర్యామి అయిన ఆ శక్తి ఒకొక్కప్పుడు, ఒకొక చోట, ఒకొక రూపంలో కేంద్రీకృతం కావచ్చు – దావాగ్నివలె, వాయు గుండంవలె, సూర్యచంద్రులవలె, నీ వలె !

అట్టి కేంద్రం మంచిదీ కావచ్చు. చెడ్డదీ కావచ్చు.

మంచి చెడ్డలు వైయక్తిక దృక్పథాల తోడివి.

సుఖేచ్ఛా కేంద్రం వేంకటాద్రి.

సాగడం లేదు క్యూ !

ఏమిటి ?

నీ వెండి గండెలు చూచికాదు నేను నవ్వుత.

నీవి రాతిగుండెలని ఎందుకంటాను?

బెదరిన గుండె ఒక్కటి కద?

మరి – రెండెందుకో !

నీది బంగారుగండె ! దాని బాగుకోసం వెండిగండెనా ఇస్తావు ?

ఈ భావం నా మొఖంపైకి ప్రాకగానే నీవు నా గుండెలలోకి చూచినప్పుడు నీపెదవులపై జిగేలుమన్న వెల్తురులో – మొత్తం క్యూ అంతా విరగబడి చూచింది నీ వంక !

భగ్గున వెలిగిన దీపంచుట్టూ అసంఖ్యాక మూగిన ఆ చిరుతుమ్మెదలను చూచి – నేనే బెదిరాను కించిత్తు !

చిరుసిగ్గుతో దీపం మరింత మనోహరతను సంతరించుకొని, దీప లక్ష్మి అయింది కద !

కదల్లేక కదులుతున్నది క్యూ !

ఇదొక మహా క్యూ !

రకరకాల మనుష్యులు, రకరకాల మనస్తత్వాలు, రకరకాల బాధలు, రకరకాల మ్రొక్కులు ! నివేదనలు !

యాత్రికులు - విలాస యాత్రికులు !

కొండపై ఒక్కరోజు గడపడం కోసం, స్వామిని ఒక్కక్షణం దర్శించడం కోసం. జీవిత శిఖరీభూతమైన ఏ తదానందానుభూతిని ఒక్కసారి పొందడం కోసం దూరదూరాలనుంచి, కాలకాలాలు ప్రయాణంచేసి వస్తారు - రకరకాల మానవులు!

ఒక్క పదినిమిషాల పనికోసం పదేళ్ళైనా - పది జన్మలైనా పయనించవలసి ఉండవచ్చు జీవుడు ! పని అన్నప్పుడు చేసితీరక తప్పదు - ఎప్పుడో ఒకప్పుడు !

అందుకే - బద్ధకించగూడదు మనం.

ఒక్కలిప్త బద్ధకిస్తే, ఒకజన్మే వెనకబడిపోవచ్చు - ఆద్యంత రహితమైన ఈ మహా క్యూలో ! ఒక్కక్షణం ఏమరిస్తే, ఒక జీవితం జీవితమే నాశనమైపోవచ్చు - ఈ జగద్వేగంలో !

అప్పుడు - దైవాన్నీ, కర్మనూ, చుట్టుప్రక్కల వాళ్ళనూ, ఎంత తిట్టుకొన్నా - ఉండదు లాభం.

తొందర దేనికి ?

సాగనీ క్యూను !

ఆగుతూ, సాగుతూ ఉన్న ఈ క్యూ - కెరటాలు వేస్తున్న మహా గోదావరిలా ఉన్నదా ? పూర్ణిమనాటి సముద్వేల సముద్రంలా ఉన్నదా? రమాకృష్ణులను ఉయ్యాల లూపుతున్న శేషుని శ్వాసా విన్యాసంలా ఉన్నదా ? చూడు ఇటూ, అటూ !

ఓహో ! కోతి !

క్యూ పొడుగునా కోతులు !

ఒక పెద్ద కోతి శ్రీ కృష్ణ పరమాత్మలా విహరిస్తున్నది - ఆడ కోతుల గుంపులో!

ప్రతి ఆడకోతి నతశిరస్క అవుతూవుంది - ప్రియుడు దగ్గరకు రాగానే ! సాష్టాంగపడుతూ ఉంది - అతడి ముందు !

అట్టి ప్రతి ప్రియురాలినీ జబ్బలు పట్టుకొని లేవదీసి, రెండు బుగ్గలూ ముద్దాడి, మన్నిస్తూ ఉన్నాడు ఆ మర్కట మహా రసికుడు !

రాసలీలా రహస్యాన్ని చూపుతున్నాడు భగవంతుడు భక్తులకు !

స్త్రీకి భర్తే గురువు, భర్తే భగవంతుడు !

భర్త అంటే – తాను తన మనస్సును, హృదయాన్ని, ఆత్మను, తన సమస్తాన్నీ ఎవరికి సమర్పించుకొన్నదో – ఆ ప్రియుడు !

అతడే ఆమె ఆత్మ స్రవంతికి ఆనందార్ణవం ! అదే ఆమెకు మోక్షం !

ఏ జీవుడికైనా, ఏదో ఒక్క పురుషుణ్ణి ప్రేమించగల ప్రేయసిగా పుట్టినప్పుడే, మోక్షం సులభమేమో !

ఆ పురుషుడు కృష్ణుడైతే ఆమే రాధ. శివుడైతే సరస్వతి. సముద్రుడైతే మహానది. చెరువైతే పిల్లకాలువ. ఒంటరిగా ఒక చినుకు !

జాత్యహంకారాలు, కుటుంబ గౌరవాలు, ఆస్తిహక్కులు, శారీరక నిర్బంధాలు, వైవాహిక విధినిషేధాలు – ఇవన్నీ కేవల లైకికాలు ! పెళ్ళి పేరుతో శరీరం ఒక మగవాడి ఆధీనంలో ఉన్నా, ఆమె ఆత్మ నిరంతరం ఎవడితో రమిస్తూ ఉన్నదో – అతడే ఆమె భర్త ! అతడే ఆమెకు గురువూ, భగవంతుడూ, మోక్షస్థానమూ, ఆనంద నిధీ !

అట్టి పురుషుడు ఆనంద మహాసముద్రమే అయినప్పుడు – అనంత కోటి జీవ నదీనద సుందరీమణులు అతడిలో లయమైపోవచ్చు కదా?

"పురుషుడు ప్రేమించడు –" అన్నావు కదూ నీవు ?

స్త్రీ ప్రేమిస్తుంది.

పురుషుడు ప్రేమను స్వీకరిస్తాడు

ప్రేమించడం ఆత్మగుణం.

ప్రేమను స్వీకరించడం పరమాత్మగుణం ఈ రెండూ జరిగిందే జీవబ్రహ్మైకం.

తన సంతానంలో ప్రతి ఒక్కళ్ళనీ తండ్రి ప్రత్యేకంగా ఎలా ప్రేమించగలడో, తనలోకి చేరే ప్రతి ప్రవాహాన్ని సముద్రుడు తన తరంగ హస్తాలతో ప్రత్యేకంగా ఎలా స్వీకరించగలడో, అలానే – పరమాత్మ తనలో ఐక్యం చేసుకోగలడు – ప్రేమోద్వేగంతో చేరే ప్రతి ఆత్మనూ ప్రత్యేక ప్రత్యేకంగా !

ప్రేమించాలి.

ప్రేమించడమే మోక్షం.

స్త్రీకి మోక్షం సులభం !

పురుషుడు మోక్షం పొందాలంటే - ప్రతి జీవి ప్రేమనూ స్వీకరించి, అట్టి ప్రతి ఆత్మనూ తనలో ఐక్యం చేసుకోగల ప్రేమ సముద్రుడు కావాలి.

స్త్రీ పురుష ప్రేమాతీతుడైన అమృత స్వరూపుడే పురుషోత్తముడు.

అతడే కృష్ణుడు !

ఏ రూపంలో అయినా ఉండవచ్చు అతడు.

అతడి లీలే రాసలీల

అదే విశ్వజీవన హేల !

ఈ విధంగా -

క్యూ వెలుపలి కోతుల్ని, క్యూలోని మనుషుల్ని చూచుకొంటూ, ఈ రీతి మౌనచర్చల్ని చేసుకొంటూ, ఒకర్నొకరం ఆస్వాదించుకొంటూ, మనం -

నిజంగా - ఇప్పుడు ఈ చర్చలన్నీ మనం ఎలా చేసుకొంటున్నాం ?

లేఖల ద్వారా కాదు. మాటల ద్వారా కాదు. అభినయం ద్వారా కాదు

ఈ అన్నిదశలూ దాటిపోయిన ఆత్మస్థాయి మనదిప్పుడు.

మన మనస్సులే మనం ఇప్పుడు !

అటు నీ ఆత్మకూ, ఇటు నా ఆత్మకూ మధ్య మనోద్వారం తెరువ బడిందిప్పుడు.

నా లోని విద్య నీకూ, నీలోని వివేకం నాకూ -

నా లోని ఔజ్జ్వల్యం నీకూ, నీ లోని అనురాగం నాకూ -

నాలోని సత్యం నీకూ, నీలోని సౌందర్యం నాకూ -

నాలోని అమృతం నీకూ, నీలోని ఆనందం నాకూ -

ప్రవహిస్తున్నై ఇప్పుడు మనోవాహనలై, నిత్యం నిరవరోధంగా !

ఇదే పరమ గురు పారమ్య పదవి !

నేనే నీకు పరమ గురువును.

నీవు నాకు పరమ గురువువు.

ఇంద్రియాతీత పరమస్థాయిలో రమిస్తున్నె మన మనస్సులు, ఉపరమిస్తున్నె మన ఆత్మలు, విశ్వైక పాలన నిర్వహిస్తున్నాం మనం ఒక్కటిగా !

అభేదానంద మూర్తి మనది !

అందుకే –

మాటలు, చూపులు, స్పర్శలు - ఏవీ అక్కర లేకుండానే మాట్లాడేసుకొంటున్నాం – చూచేసుకొంటున్నాం – అనుభవించేసుకొంటున్నాం మనం పరస్పరం!

పరస్పరమే కాదు -

మొత్తం విశ్వమే మనమై విహరిస్తున్నాం !

కోతిలో కూడ కృష్ణుడు కనిపించిందందుకే !

విగ్రహారాధన మూర్ఖత్వ మన్నవాళ్ళు ఎంత మూర్ఖులు !

"శరీరమే విగ్రహం. ఆత్మే శక్తి. శరీరారాధనే ఆత్మేపరతి. ఉపనుషన్మధువిధి. ఇది లభించేది రాగ రసాత్మలకే యోగ యోషాత్మలకే.

ఓహో – ఎంత బాగా చెప్పావు !

ఎక్కడున్నాం మనం ఇప్పుడు ?

అమ్మో - గుంజారు నా చేతిని ఎవరో ! చినిగింది నివేదన పొట్లం ! చెల్లాచెదరైనై అందులోని పటికబెల్లం పలుకులు, కొబ్బరిముక్కలు, జీడిపప్పులు, ఖర్జూరపు పండ్ల చెక్కులు, ద్రాక్షపండ్లు –

పారిపోయింది – దొరికినన్ని ఎత్తుకొని – ఎవరు ?

కోతి !

కొంటె కృష్ణుడు !

అమ్మో - అంటూ బెదిరి నా అక్కున గ్రుచ్చుకొన్న నిన్ను చూచి, పండ్లికిలించిం దది !

పకాలు మన్నది క్యూ అంతా !

మన ఈ అనుకోని ఆలింగన సుఖం చూచి ఏద్చుకొన్న వాళ్ళూ ఉన్నారు. ఆ క్యూలో ! భగవంతుని ఇచ్చకు ఎవరేడ్చి ఏం చెయ్యగలరు ?

సుఖంలో అనేక భోగాలున్నై, అనేక సంతోషాలున్నై, అనేక వినోదాలున్నై. అవన్నీ సుఖంలో అంతర్భాగాలు మాత్రమే.

పరస్పరం ప్రేమించుకొని, కామించుకొని, విరహతప్తులైన ఇద్దరు స్త్రీ పురుషుల శరీర సంయోగమే సుఖం.

శరీర సంయోగం ఆత్మ సంయోగంలో పర్యవసించడమే పరమ సుఖం.

శాశ్వతమైన పరమ సుఖమే ఆనందం.

ఆనందమే బ్రహ్మ.

స్త్రీ పురుష ఆత్మ సంయోగమే బ్రహ్మానందానికి ఏకైక మార్గం. ఆ మార్గం సంప్రయోగం గుండా పోవచ్చు. యోగం గుండా పోవచ్చు.

బ్రహ్మ ఆనంద కామనే జీవబిందువు. జీవ ఆనందకామనే తిరిగి బ్రహ్మ.

స్త్రీ పురుష సంయోగాన్ని పాపమన్నవాళ్ళే సృష్టించి పెట్టారు నరకాన్ని!

పాపం, వాళ్ళకు జీవేశ్వర నిజతత్వం తెలీదు.

సృష్టి చరాచర వర్గంలో ఎక్కడా కూడ స్త్రీకి ఆర్థిక పారతంత్ర్యం లేదు - ఒక్క మానవ వర్గంలో తప్ప ! స్త్రీ తిండికోసం పురుషుడిపై ఆధారపడి బ్రతకవలసిన దుర్గతి ఒక్క మానవ వర్గానికే పరిమితం.

ఆర్థిక దాస్యమే అన్ని దాస్యాలకూ మూలం.

స్త్రీ ఆనంద నిలయం

పురుషుడు రసబిందువు.

సమాన ప్రతిపత్తితో రసానందం అనుభవించి, బ్రహ్మానుభూతిని పొందవలసిన ఈ సౌందర్యలవాల నడుమ - బానిస, యజమాని తారతమ్యం ఎప్పుడు తలెత్తిందో ఏమో - అప్పటినుంచే పతనమై పోయింది మానవ సంఘం, పాపపుణ్య స్వర్గనరక దుర్వికల్ప కశ్మలం లోకి !

చంద్రుడు స్త్రీ

సూర్యుడు పురుషుడు.

సృష్టి స్థితులకు ఈ ఇద్దరూ సమాన ప్రాణభూతులే. నాడీ రూపంలో సమానంగానే నడుస్తారు ఇర్వురిలోనూ !

ప్రకృతిలో లేని ఈ తేడా మనుష్యుల్లోకి ఎలా వచ్చిందో !

ఈ కోతుల్ని చూసైనా గ్రహించ రేం మానవులు పరతత్వాన్ని ?

చూస్తున్నావు కదూ ఆ మర్కట మహా రసికుని రాసలీల?

అదంతా వ్యభిచారం అంటుంది మూర్ఖ లోకం.

రాజు చేస్తే శృంగారమూ, రజకుడు చేస్తే వ్యభిచారమూనా ?

కామ క్రీడ వ్యభిచారం కాదు,

సుఖానందానికి మార్గం అది !

ఆనంద బ్రహ్మకు ద్వారం అది!

అదిగో – ఆలయ ద్వారం !

దొడ్డి దారిని వచ్చి, ఎక్కువ డబ్బు చెల్లించి, ప్రత్యేక దర్శనం చేసుకుపోతున్నారు పలుకుబడి గల భాగ్యవంతులు !

అధికారపదవుల్లో ఉన్నవారికి ఆ డబ్బుఖర్చు కూడా లేదు !

పురాకృత పుణ్యులు వాళ్ళు !

సాలోక్య సామీప్యాలే కాదు, నిత్య సాన్నిధ్యం – సాయుజ్యం కూడ ప్రత్యేకంగా లభిస్తే అందులో మరి అదృష్టవంతులకు!

క్యూలో నిలబడవలసిన అవసరం లేదు వాళ్ళకు !

సామాన్యులకే ఈ క్యూ !

ముందో, వెనుకో – ధనంతోనో, ధర్మంగానో – దర్శనం తప్పదు ప్రతి వ్యక్తికి !

అప్పుడు – స్వామి ముందు – అందరూ ఒక్కటే – ఒకే పరమ ప్రపత్తి !

ధనమో, సుకృత ధనమో ఉంటే – ఈ క్యూ బాధే ఉండదు ఎవరికీ !

భగవంతుడే వెతుక్కొంటూ వస్తాడప్పుడు – అలాంటి ధన్యాత్మ కోసం !

గుమ్మం దాటు తున్నాం !

కూసం విడిచిన మహాసర్పంలా కదిలి వస్తున్నది క్యూ !

గోవింద నామమంత్రంతో ఎంత సత్వ సంపన్నమై ఉన్నదిది !

మెట్టెక్కుతున్నాం ! ఇదే చివరి మెట్టు !

నా ముందు నీవు !

నా ఒడిలో నడుస్తున్నావు నీవు !

నా వీపున వెన్న ముద్దల ఎర్రద్రాక్షల చక్కిలిగిలి !

ఎలా వచ్చావు నీవు నా వెనక్కి ?

ముందూ నీవే ! వెనకా నీవే !

ఓహో ఎంత చిత్రం !

ఈ క్యూ అంతా మనమే ! మనిద్దరమే !

నేనూ - నా ముందూ, నా వెనకా, అనేక రూపాలలో నీవూ !

వేరు వేరు పనులకోసం వేరు వేరు రూపాలు ధరించిన నీవే ఈ జనం అంతా ! ఈ క్యూ అంతా! అనంత రూపంతో కొనసాగుతున్న నా ఆత్మే ఈ క్యూ !

దీని ఆది అనంతంలో ! అంతం శ్రీ స్వామిలో !

ఈ క్యూ అంతా స్వామి కొక పూలదండ !

ఓహో - విశ్వరాగ దర్శనం !

విశ్వేశ్వర సాన్నిధ్యం !

ఆనంద తమస్సు !

అనురాగ జ్యోత్స్న !

అనిర్వచనీయ మహనీయ పరిమళం !

నా రాగ పరిమళవు నీవు !

ప్రాణమయం ఈ సమస్తం !

అదిగో - స్వామి !

ఆనంద కంఠారావాలు !

ఆహ్లాద ఘంటానాదాలు !

ఓహో - పరిపూర్ణ పరంజ్యోతి !

ఓహో - పరాపర పరమ విభూతి !

దివ్యసుందర శివంకర మూర్తి !

సర్వమంగళ మాంగల్య మూర్తి !

శ్రీ వేంకటేశ్వర స్వామి !

ఓం శ్రీ వేంకటేశ్వరాయ నమః

ఓం శ్రీ రమాపతయే నమః

ఎవరు నీవు !

ఎవరు నేను !

ఇద్దరం ఒక్కటే !

ఏకైక స్వామి !

*ఎవ్వరో నీవు ! నే నెవ్వరో ఈ పూజ !*
*పూజలో ప్రతి జీవి పూజా కుసుమ మేనె !*
*జాతి, కాలము, తోట నంగతే లే దిందు !*
*నర్వ లోకులు ఒకే స్వామి ! లోక స్వామి !*

*నీ రూపమే కదా శ్రీ రూప మగు నాకు !*
*శ్రీ రూపమే కదా శ్రీ వేంకట స్వామి !*
*ఆ బాల్యమైన నా ఆరాధనమే స్వామి !*
*అను రూపమైన నీ ఆత్మమధువే స్వామి !*

# 122

బైలు దేరింది బస్సు పాపనాశ క్షేత్రానికి !

క్యూ నుంచి ఉద్ధరించబడడం ఒక వేంకటేశ్వర మహాత్మ్యం కాగా – బస్సు బైలుదేరుతూనే ఏదో అద్వితీయ సౌందర్య మహార్ణవంలో పడి, మత్స్యకాంతలా దూసుకు పోవడం మరొక అలౌకిక ఆనందానుభూతి !

అద్భుతావహ చిత్తంతో విద్యుద్దీపాలై వెలిగినై మన శరీరంలోని ప్రతి పులకా, ప్రతి అణువూ – ఆ వైష్ణవ మాయా విభూతిలో !

క్యూలో నిలబడితే, మూడో రోజుకు గాని దొరికేటట్టు లేదు బస్సు.

ఆ సాయంకాలం వెళ్ళకపోతే, మరి ఇక వెళ్ళలేని పరిస్థితి మనది.

నా పలుకుబడీ, నీ శక్తీ – అన్నీ వ్యర్థమై పోయిన తర్వాత – ప్రయారిటీ టిక్కెట్లు దొరికే అవకాశం శూన్యమై పోయిన తార్వాత – శూన్య ముఖాలతో, శూన్య మనస్కులై నిలబడి ఉన్నాం మనం అక్కడ – వచ్చే పోయే బస్సుల్నీ, యాత్రికుల్నీ శూన్యంగా చూస్తూ !

నిస్సహాయత మూర్తి దాల్చిన రెండు ప్రతిమలం మనం.

నోరు పెగలని, కాలు కదలని స్వప్నోద్వేగ స్థితిలో ఉన్నాం మనం అప్పుడు!

ఒకరు ముఖం ఒకరు చూచుకొంటున్నాం ! కనపడడం లేదు అవి స్పష్టంగా - కన్నీటి తెరల వెనుక నుంచి !

ఎవరు - చేయి - నా భుజంపై ?

వెనక్కి తిరిగి చూశాను నేను !

తిరు నామం ! చిరు నవ్వు !

"పాపనాశం వత్తురా ?" అన్న ప్రశ్న !

ఎవరో - ఈ సనాతన తమిళ శతవృద్ధు !

"మాకు రెండు టిక్కెట్లు ఎక్కువ ఉన్నై, రండి ఇదే బస్సు !"

అప్పుడే వచ్చి ఆగిన బస్సులోకి దారితీశాడతడు - ఒక పదిమంది వరకూ కల తన కుటుంబంతో !

ఎంత ముద్దు చేశారు ఆ కుటుంబంలోని స్త్రీలంతా నిన్ను ! ముఖ్యంగా ఆ ఇద్దరు వృద్ధమాతలూ !

మీ దొడ్డమ్మలా ఉన్న ఆమె మరీను !

మనతో మీ దొడ్డమ్మ ఉంటే ఎంత బాగుండును !

ఇంతకూ - ఎవరు వీళ్ళు ?

ఏమిటి ఈ అకారణ కరుణా సుధావృష్టి !

ఈ ప్రశ్నకు జవాబు కేవల కైవల్య సమ్యగానంద బాష్పపయః పారావార పారమ్యమే ! శ్రీ వేంకటేశ్వర మహాత్మ్యమే!

శ్రీ వల్లి అన్నట్టు - పెట్టి పుట్టిన వాళ్ళం మనం.

ఎప్పుడో, ఎవరికో, ప్రతిఫలాపేక్ష లేకుండా చేలిన ఏదో సహాయం - ఇప్పుడు, ఇలా మనకు అవసరానికి తోడ్పడు తున్నదేమో !

పుణ్యం ఒక బేంకునోటు. అది చేయలేని పని అంటూ ఏదీ లేదూ.

అదే అదృష్టం !

అదే దైవం ! భగవంతుడు !

ఎంత వాస్తవం భగవంతుని సాన్నిధ్యం !

శివుణ్ణి, కేశవుణ్ణి, చతుర్ముఖుణ్ణి నేనే అన్న అహంకారం తప్ప మరేదీ లేని నేను - శుద్ధ నిర్గుణ తత్త్వమైన అచల పరిపూర్ణ బ్రహ్మను ఉన్నదన్నా, లేదన్నా ఒక్కటే అనే నేను - నీతో కలిసి, మహతో మహీయంగా, మహేశ్వరుడనై ఆనందిస్తున్న నేను - ఒక్క క్షణంలో అణోరణీయ పరమాణువు నై పోయాను, ఆ శతవృద్ధు పాదరేణువునై పోయాను ఆ క్షణంలో, ఆ మాయా వరణంలో !

పూర్ణపురుష విశిష్టాద్వైతం, పురుషోత్తమ పూర్ణ ద్వైతం సిద్ధించిన నేను - నీ కోసం ద్వైతంగా, అనంతానంతంగా, శివసరస్వతీ యోగంగా జీవించదలచిన నేను - తుడుచుకొన్నాను కళ్ళు నీ పమిటె చెరగుతో !

ఎక్కడున్నాం మనం ?

పరమ సౌందర్య పారావారంలో !

ఎంత పుణ్యం చేసుకొంటే లభిస్తుంది పరమానుభూతి !

విశ్వ సౌందర్య సౌభాగ్యమంతా ఏకముఖమై, స్వర్ణదీ తరంగ తుషార పరిస్నపితమై, సంజకెంజాయ చీరను కట్టుకొంటూ, అర్ధనగ్నంగా ఆవిష్కృత మయిందిక్కడ -

ఉదయం స్నానాలగది గుమ్మంలో నా ముందు నీవలె !

పోల్చుకొంటున్నాను నేను !

"ఎందుకలా చూస్తారు - కొత్త మనిషిని చూచినట్టు ?"

- సిగ్గుతో కప్పేసుకొన్నావు నీవు ఒళ్ళంతా !

ఎప్పుడూ కొత్తదానవే నీవు నాకు!

నిత్య నూతనం నీ సౌందర్యం - అరుణోదయంవలె, సాయం సంధ్యవలె, వెన్నెల రాత్రి వలె !

క్షణానికో అందం నికసిస్తుంది. రాగం వినిపిస్తుంది. లావణ్యం తరంగిత మవుతుంది. ప్రణయం గుబాళిస్తుంది - నీ తనులత నుంచి, ఈ పర్వత సాను విపిన సీమంతంలో నుంచి వలె !

నవనవోన్మేష నిరంతరం నీ ఆత్మ కమలం.

నీ దర్శనమే విశ్వరూప దర్శనం నాకు. నిన్ను చూడక మరి చూచేదెవర్ని? స్వామిలో కూడా నేను చూచిందెవర్ని ?

ఝుమ్ముమంటూ ముసురుకొంటున్నై తుమ్మెదల గుంపులు - ఏవో నీలంపూల చెట్ల నవమంజరులపై ! వాటి సువాసనలు సరసాలాడుకొంటున్నై రేగిన నీ చికుర శోభలతో !

చెట్లు కావవి ! ఋతుమతులైన ఉర్వశులు ! విశ్వ ప్రేయసులు !

పేర్లు తెలియని రకరకాల, రంగు రంగుల అందాల పూల రాశులు - బస్సులోని దేశ విదేశాల సుందరీ సమనస్విసుల వలె !

ఇరు ప్రక్కలా కీకారణ్యాలు, లోయలు, ఉన్నత గిరి శిఖరాలు, అగాధాలు, వాగులు !

చెందొవ మొగ్గలు, కేందామర తేనె దొన్నెలు, రంభ లాంటి లతా నికుంజాలు, తిలోత్తమల లాంటి నెమళ్ళు, వీణల లాంటి పిట్టలు !

పాడుకొంటూ రివ్వున పోతున్న రెండు బంగారు గువ్వలు వచ్చి పడినై నీ ఒడిలో - బస్సు కిటికీలో నుంచి !

కువకువ లాడిపోయినై అవి - నీ పమిటెలో తమ చిన్నారి ప్రతిబింబాలను చూచుకొని !

ఉద్వుగ్నంగా ఉంది ప్రకృతి !

దూసుకు పోతున్నది బస్సు -

బాణంలా కొండశిఖరం మీదికి ! క్షణంలో పిడుగులా పాతాళపు లోతుల్లోకి!

ఎంత వేగం ! ఎంత ఆ వేగం ! ఎన్ని గతుకులు ! ఎన్ని కుదుపులు ! ఎన్ని మెలికలు ! ఎంత ఒరకం ! అనుక్షణం ఎంత ఆందోళన !

ఊగిపోయాం మనం !

తూగు టూయెలలా పోతున్నది బస్సు - కొండ నుంచి కొండకు, తారాపథం నుంచి తారాపథానికి!

స్వర్లోకపు అంచులు తాకుతున్నాం మనం!

ఆకాశగంగా శీతల సుధాశీకరాలు ! కనక కమల పరీమళాలు నందన మందార మధు తుషార సుషమలు !

భవర్లోకం వట్టి బయలు !

భూలోక జ్ఞానమే లేదు మనకు !

పుష్పకంలో విహరిస్తున్నాం మనం ! దివ్య విన్యాసాలు పోతున్నాం మనం! ఓహో – లోకోత్తర మహనీయ మధురానుభూతి!

వైకుంఠపు తోటమాలు లెవరో విద్యుల్లతల్ని తువ్వుకుపోగా, పెకలించి వేయబడ్డ ఎర్రమన్ను అడవి – ఈ సంధ్యారక్త పశ్చిమ దిశా క్షేత్రం !

పడిపోతున్నది బస్సు అంత ఎత్తునుంచీ – కొండవాగులా కాదు, అశనిపిండంలా కాదు, ఉల్కాపాతంలా కాదు, మరెలానూ కాదు –

ఓహో –

వట్టి డ్రైవరు కాదితడు ! మహా విశ్వకేంద్రంలో స్టీరింగు దగ్గర కూర్చున్న పరమ చేతనా ప్రచోదకు డితడు !

ఓహో – చోదన కళా లాఘవం !

ప్రసవించేసింది బస్సు జనాన్ని –

విశ్వంలోని సమస్త నాగులూ వాగులుగా ప్రవహించి వచ్చి, కలిసిన వేయి పడగల ఆదిశేషుడి లాంటి ఒక మహా నిర్ఝరి ఒడ్డున !

క్షేత్రం – ఇంకా రెండు ఫర్లాంగులు!

## 123

ఆ రేగిన – ఆ కట్టు – ఆ బొట్టు – ఆ ఒయ్యారం !

ఆ రేగిన జుత్తు, చెరగిన కాటుక, కరిగిన తిలకం !

అచ్చం ఎంకిలా ఉన్నావు కదూ ?

చంకలో తట్టో, కడవో ఒకటి తక్కువ !

ఆ లోపం కూడ తీరింది – పూజా ద్రవ్యాల తట్ట చంకకు రాగానే !

అన్నట్టు – ఎంకి పాత్ర నటించావు కదూ చిన్నప్పుడు ?

ఏదీ, పాడు –

" ఎన్నాళ్లు మనకోలె ఈ సుఖము లంటి "

నిజంగానే కంట తడిపెడుతున్నావేమిటి ?

ఎంకిపాటల కవి నండూరి ఎంత ధన్యుడు !

"నాజూకు లేదురా నండూరి సుబ్బిగా " అంటూ వృద్ధచాందస ప్రభువులు ఎంత ఆక్షేపించినా, ఆధునిక తెలుగు సాహితీ క్షేత్రంలో అతడొక్కడే కవి నా దృష్టిలో.

నాజూకు లేదట !

తెల్ల చక్కెర కేళీల్లాంటి ఎంకి పాటల్లోకంటె, నల్లకంకర రాళ్ళలాంటి పద్యకావ్యాల్లో ఉంది నాజూకు ?

కవి ప్రకృతి

పండితుడు వికృతి.

పండితులు, ప్రవక్తలు, సంఘ పెద్దలు, నైతికాచార్యులు అందరూ, కవి కష్టించి వేసిన రహదారుల్లో పోతూ – కవి చెమటోడ్చి నాటిన తోటల ఫలసాయం అనుభవిస్తూ – పై పెచ్చు అతణ్ణి ప్రతి చిన్న విషయానికీ తిట్టి పోసుకొనే అల్లులు.

ఈ అల్లులకు అసలు కవి అందదు.

హృదయంపై అధికారం ఉన్నవాడు నండూరి. హృద్వీణను ఖంగున మీటగలడతడు – ఏ రాగానికైనా సరే మేళవించి – బసవరాజు అప్పారావు వలె!

శ్లేషలు, సర్కసుఫీట్లు, సమాసాలు, శబ్దబంధాలు, నీతి బోధనలు, నినాదాలు ఆడంబరంగా ప్రదర్శిస్తూ – కేవల పాండిత్య ప్రకర్షకోసం ఉద్గంథాలు వ్రాసే రింగుమాస్టర్లతో మండిపోతున్న తెలుగు సాహితీ క్షేత్రంపై చల్లని చంద్రోదయంలా వెలిశాడతడు!

ఎంకి పాటల నిండా ఉన్నది మానవ మగ్న హృదయం.

హృదయమే రసబ్రహ్మ.

అదే కవిత .

స్థాన విశేష మాత్రంచేత ప్రచార మయేది కవిత కాదు, తైరు !

గుండె భోజనశాల

మెదడు పాఠశాల.

సాహిత్యాది కళలు ఆత్మను పోషించేవి.

పాండిత్యాది విద్యలు, రాజకీయాది వ్యాపారాలు జీవితాన్ని నడిపించేవి.

హృదయ పద్మకళికను వికసింపజేసి, అచ్చటి పద్మాసనను సాక్షాత్కరింప జేసేది కవిత ! దాన్న సాధించిన రసదార్శనికుడు నండూరి !

ఏ పాటో, పద్యమో పాడుకొంటున్నప్పుడు ఆ వ్యక్తి ఏ తద్భావం తానే అయిపోగలిగినపుడే - దాని ఉద్దేశం నెరవేరినట్టు!

రస స్నానం చేసిన ఆత్మే పరమాత్మ.

ఎంకిలా ఉన్నావంటే - ఎంకివే అయిపోయావు నీవు ?

ఎందుకు ఆ కంట తడి ?

నిజంగా -

మనకీ సుఖం ఎన్నాళ్ళు !

ఎంత బాధాకరం ఈ తలంపు !

ఎంత పెద్ద వేదాంతాన్ని అయినా ఇతర్లకు బోధించవచ్చు. తాను స్వయంగా ఎంతటి అపరోక్ష సాక్షాత్కారం పొందిన వాడైనా అయి ఉండవచ్చు. తానే పరమాత్మగా పర్యవసించిన రాజయోగే కావచ్చు. కాని -

శరీరం కలవాడికి, శరీరసుఖం ఎరిగిన వాడికి - అది ఎప్పటికైనా పోక తప్పదన్న భావం మనస్సులో మెరిసినప్పుడెల్లా, చిందాకాశం మేఘావృతం కాక తప్పదు!

అందుకు కారణం అవతలి తీరం గోచరించక పోవడమే ! శరీరం పోతే, దానితో సమస్తమూ పోతూ ఉన్నట్టు కనిపించడమే!

సుఖదుఃఖాలకు అతీతమైన ఆత్మాద్వైతాన్ని మనం సంపాదించి పెట్టుకొన్న దందుకే కదా ?

మన అందం ఆత్మగతం

మన ఆనందం శాశ్వతం

మన ప్రణయం అమృతం.

అక్కరలేదు మనకు కంట తడి.

జల్లుపడ్డ పద్మాల మీది సూర్య కిరణాల వలె - ఎంత సుకుమారంగా నవ్వుతున్నై నీ చూపులు !

## 124

"మైలపడే దేవుడు మాలిన్యం నుంచి మానవుల్ని ఎలా ఉద్ధరించగలడు?" ఒక వృద్ధ యాత్రికుడంటున్నాడొక యువతితో - మనముందు నడుస్తూ ! ఆమె సిగ్గు పడింది.

'మన దేవుళ్ళందరూ భార్యలు కలవాళ్ళే ! వాళ్ళకు మాత్రం ఈ బాధలు ఉండవా? పర్వాలేదులే !" నవ్వుతూ అన్నాడు ప్రక్కనున్న యువకుడు.

"నీ వాక్కక్తవే అంతటి భగవంతుణ్ణి మైలపరచి,శక్తిహీనుణ్ణి చెయ్యగలిగితే - ఇక అతణ్ణేందుకు ఆరాధించడం ? నిన్నే పూజించవచ్చుగా ?" మరొక జాణ హేళన!

జాలిపడ్డావు నీవు ఆ యువతిని చూచి.

బహిష్టు ఎంత తుంటరి ! సరిగ్గా యాత్రాసమయంలో వస్తుందది !

ఉద్రిక్త మనస్కత కావచ్చు అందుకు కారణం.

" భగవంతుడు కేమీ పర్వాలేదు. కాని - క్షేత్రంలో ఉండేది నియంత్రిత మంత్రశక్తి కదా ! దానికి కొన్ని విధి నిషేధాలుండవా?"

ఈ మాటలు నీవు నాతోనే అన్నా - నీ వంకే చూశారు ఆ గుంపంతా !

మాలిన్యాలు, మలిన వాసనలు, దురితాలు, దురాలోచనలు వాతావరణాన్ని కలుషితం చేస్తై. మనం మామూలుగా దైనందిన జీవితంలో పాటించేపాటి శౌచ నియమాల నైనా క్షేత్రాలలోపాటించకపోతే - అది అధర్మమే కదా?

ఏ మాలిన్య హేతువుచే ఏ యంత్రం వికటిస్తుందో, ఏ మంత్రం బెడిసికొడుతుందో

కొంచెం దూరంగా ఉండడమే మంచి దన్న నీ సలహాను ఆమోదించా రందరూ !

దుర్గమారణ్య పర్యాలింగిత పర్వత వలయం మధ్య - ఇంకా క్రిందికి మెట్లు !

ఇంతవరకు బాహ్యవీణ - ఇక అంతర్వీణ కావచ్చు !

నా రాగవీణవు నీవు !

లోకంలోని ప్రకృతి సౌందర్యం అంతా నీ గాన కచేరీతో వసంతోత్సవం చేసుకొంటున్నదో !

కొండమ్మ పెళ్ళికో, గంగమ్మ సమర్తకో వచ్చిన త్రిలోక సుందరులంతా నీ అమృత గానంలో పడి, వెళ్ళిపోవడమే మరిచిపోయి నదీ వృక్షలతా శకుంతాది సుందర మూర్తులై, ఇక్కడే శాశ్వతంగా ఉండిపోయారో ఏమో !

"మనం కూడ ఇక్కడే ఉండిపోతే !" ఇద్దరం ఒకేసారి అన్నాం కూడా ఈ మాట - పైకి !

పళ్ళికిలించి, దూకిందొక బాలెంత కోతి, నీ చంకలోని తట్ట పైకి !

ఇక్కడి కోతులు దేవాంతకలు !

కోతినుంచే మనిషి పుట్టివుంటాడన్నయోచన - విజ్ఞాని డార్విను‌కు - బహుశా, ఇక్కడి కోతుల్ని చూచిన తర్వాతనే కలిగి ఉండవచ్చు !

దారిపొడుగునా కోతులు !

మురమురాలు, బఠానీలు సెనగలు !

బండలు, వాటికి చక్కిలిగింతలు పెడుతున్న చిరువాగులు - వాటి గాజుల గలగలలు, కిలకిలలు, జలజలలు !

చుట్టూ గుబాళిస్తున్న సౌందర్యాన్నిచూచుకొంటూ, మధువనంలో చేరిన వానర సేనవలె చెట్లలో ఉన్మత్తలై సంచరిస్తున్న కోతులకు బెదురుతూ, బండలను దాటుతూ, వాగులలో కాళ్ళు తడుపుకొంటూ, మోకాళ్ళ ఎగువకు ఎగదోసిన ఎర్రపట్టు జరీచీరతో, ఆనందోత్సాహంలో వెలిగిపోతున్న నీవు - సాక్షాత్తు లక్ష్మీదేవిలా ఉన్నావు - వసంత సంధ్యారాగ రంజితవై !

యాత్రికులంతా నిన్ను ఆరాధిస్తున్నారు - కళ్ళల్లో కర్పూర దీపాలు వెలిగించుకొని !

వాగులు దాటినప్పుడెల్లా, నీవు కాళ్ళతో నీళ్ళు ఎగజిమ్మినప్పుడెల్లా – అలక్త మంజిష్ఠం అవుతూ ఉన్నవి సంధ్యాకాంత చూపూలు !

*అదిగో ప్రణవ నాదం !*

*అదిగో పాపనాశ జలపాతం !*

*అపర గంగా భవాని సాక్షాత్కారం !*

*అతిలోక సౌందర్యానికి పరమ క్షేత్రం !*

జలధార క్రింద అంబు కణాల్లా యాత్రిక జనం !

దర్శన మాత్రం చేతనే సమస్త పాపాలూ పోతై. ఇక స్పర్శనమే లభిస్తే ఎంత సుకృతం !

ఈ యాత్రికులంతా ఎంత అదృష్టవంతులో !

కేవలం నగ్న సౌందర్యంలో, నగ్న పావిత్ర్యంలో, నగ్నా నందంలో మునిగి తేలుతున్న దివ్యాత్మలు వీళ్ళు !

ఎలాంటి పాప పంకిలమైనా పోతుంది ఈ క్షేత్ర స్పర్శకు ! ఏ పంకిలమూ లేని మనవంటి వాళ్ళకు అమృత పదవే ఈ జలస్పర్శ !

ఆకాశం ఎత్తునుంచి, శివుని జటాజూటం నుంచి వలె, క్రిందికి దూకుతున్న ఆ అమృత గంగలో జలక మాడడం – ఓహో, ఎంత బాగుంది !

సమస్త విశ్వమూ ఒక అంజలి – ఈ అమృత ప్రాసాద నిత్యధార క్రింద!

కొండమ్మ చెల్లెలు గంగమ్మ !

మహాశక్తులు ఇద్దరూ !

సర్వ శక్తి నాథుడు మహేశ్వరుడు !

విశ్వరూపిణి – విశ్వజనని – కొండమ్మ ! ఆమె నుంచి అభివ్యక్తమవుతున్న విశ్వ జీవనధార గంగమ్మ ! ఈమె నుంచి పరివ్యాప్తమవుతున్న విశ్వకాంతి ధార సరస్వతి !

ఈ విశ్వేశ్వర త్రిశక్తీ రూప పరమేశ్వరిని ఒడిలో, తలలో, ఎదలో చాలించి, లాలించి, పాలిస్తూ – పరమేశ్వరుడు చేస్తున్న సుందర లీలా తాండవం – ఎంత కళా విభూతిని ప్రదర్శిస్తున్న దిక్కడ !

క్షేత్రలక్ష్మి గంగకు దీపం వెలిగించి, కొబ్బరికాయ కొట్టి, హారతి ఇచ్చి, కుంకుమ ధరించి, ప్రసాదం స్వీకరించి, అంజలి ఘటించాం మనం తాదాత్మ్యంతో-

*సృష్టిలో గల విష వహ్ని శిఖల నెల్ల*
*తానె తాల్చియు, అమృత శీతలుడు శివుడు !*
*ఏత దద్భుత లీలకు హేతు వీవు !*
*శివ శిఖాలంబినీ ! నమస్కృతులు నీకు !*

# 125

*బయలుదేరుదమా ?*
*ప్రణయ కళా రమా !*

*అరుణోదయ నర్తన శివ*
*చరణ కమల మధువు గ్రోలి,*
*తాండవ నటరాజ శిఖా*
*తరుణేందు కళను గోరి !*

*పాపనాశమును గొలిచి*
*పైనము సాగించెదమా ?*
*పరిధి లేని విశ్వమునకు*
*పరమకేంద్ర మవుదామా ?*
*ఎచ్చట వెన్నెల కలదో,*
*ఎచ్చట చీకటె లేదో,*
*ఎచ్చట మన మిద్దరమే*
*ముచ్చట ముద్దో - అచటికి !*

*ప్రతి పువ్వున వాసించుచు,*
*ప్రతి పెదవిని వికసించుచు,*

*ప్రతి గుండెను మ్రోయించుచు,*
*ప్రతి పాటయు మనమే యై !*

**అంతులేని అభిరతితో,**
**అమృత రాగ భోగముతో,**
**కామ కళా పరమాత్మను**
**కలకాలము పాలింతమ !**

నిర్గుణ పరమాత్మ మనకెందుకు ?

ప్రణయ శృంగార కామ కళా త్రిశక్తి రూప రాగ రస రమణీయ మూర్తి ఈ విశ్వం !

ఈ విశ్వమే మనం
నీవు – నేను
ఒకే ఇద్దరం !
ఒకే రాగం !
ఒకే తానం !
ఒకే పల్లవి !
ఒక అమృత మధువు !

**మధు వయస్సుల నిండ, మధు మనస్సుల నిండ,**
**మధు జీవి తానంద మధుర  పాత్రల నిండ,**
**రాగ మధువై సదా రమియింతమే, చెలీ !**
**నిత్య మధు లోకాలు నిర్మింతమే, చెలీ !**